www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



10

మన అమ్మాయిలు 'బంగారం'

ఆసియా చాంపియన్‌షిప్‌లో స్వర్ణ చరిత్ర

మెరిసిన పీవీ సింధు, అన్‌మోల్, గాయత్రి జంట



ఇదీ.. గెలుపంటే!

యశస్వి డబుల్ ధమాకా.. జడేజా 5 వికెట్లు

434 పరుగులతో భారత్ రికార్డు విజయం

ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో 2-1తో ఆధిక్యం

సోమవారం | 19-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 305 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: దశమి ఉ. 8.51 తదుపరి ఏకాదశి; నక్షత్రం: మృగశిర ఉ. 10.34 తదుపరి ఆర్ద్ర; వర్జ్యం: రా. 7.33-9.15; దుర్ముహూర్తం: మ. 12.53-1.39, మ. 3.11-3.57; అమృతఘడియలు: రా. 1.32-3.15; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.44; సూర్యాస్తమయం: 6.15 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

● కన్నెత్తి చూడని కంపెనీలు

'మొత్తం ఆరు శాఖలు.. 18 రంగాలు.. 386 ఒప్పందాలు.. రూ.13.11 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు.. 6 లక్షల ఉద్యోగాల కల్పన.. దేశంలోనే ఏపీ కీలకంగా మారబోతోంది' -గతేడాది మార్చిలో విశాఖ సదస్సులో సీఎం జగన్ ఎంతో గొప్పగా చెప్పిన మాటలు ఇవీ. దాదాపు ఏడాది అవుతున్నా ఆయన చెప్పినట్టుగా ఆ లక్షల కోట్ల పెట్టుబడులు రాలేదు. లక్షలాది ఉద్యోగాలూ ఇవ్వలేదు. ఎంవోయూలు చేసుకున్న కంపెనీలు ఇటువైపు కన్నెత్తి చూడటం లేదు.

● సర్కారు గొప్పలు ఇవీ

'2019 జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు పరిశ్రమల శాఖ మొత్తం 99 ఎంవోయూలు చేసుకుంది. వాటి ద్వారా రాష్ట్రానికి రూ.3,38,054 కోట్ల పెట్టుబడులు వస్తాయి. 2,29,259 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి'.. జగన్ సర్కారు చెప్పిన మాట ఇది.

● వాస్తవం ఇదీ

'పరిశ్రమల శాఖ చేసుకున్న 99 ఎంవోయూలలో 18 ఒప్పందాలే అమలయ్యాయి. రూ.5,710 కోట్ల పెట్టుబడులు రాగా 9,158 మందికి ఉపాధి లభించింది'.. ఆర్టీఐ దరఖాస్తుకు స్వయంగా రాష్ట్ర ప్రభుత్వమే ఇచ్చిన సమాచారం ఇది. జగన్ కారణంగా రాష్ట్రం నుంచి తరలిపోయిన కంపెనీలు, పెట్టుబడులతో పోలిస్తే... ఇవి చాలా చాలా తక్కువ.

● ఆ ఒప్పందాలపై గప్‌చుప్


రాష్ట్ర పరిశ్రమల శాఖ చేసుకున్న ఒప్పందాల వివరాలు మినహా ఇతర శాఖలు చేసుకున్న ఎంవోయూలలో ఎన్ని అమలయ్యాయి? ఎన్ని పెట్టుబడులు వచ్చాయి? ఎంతమందికి ఉపాధి కల్పించారు? వంటి విషయాలను వెల్లడించేందుకు ప్రభుత్వం నిరాకరించింది. మరి లక్షల కోట్లు పెట్టుబడులు, లక్షల ఉద్యోగాల కల్పన మాట ఏంటో?

కంపెనీలపై కట్టు కథలు!

సమాచార హక్కు చట్టం సాక్షిగా జగన్ సర్కారు నిజస్వరూపం బట్టబయలు

లక్షల కోట్ల పెట్టుబడులు, ఉద్యోగాలూ ఉత్తుత్తే

- 386 ఎంవోయూలు, 13 లక్షల కోట్ల పెట్టుబడులు,
- 6.07 లక్షల మందికి ఉపాధి కల్పనంటూ డబ్బా
- ఒక్క పరిశ్రమల శాఖే 99 ఎంవోయూలు
- 3,38,054 కోట్ల పెట్టుబడులు, 2,29,259 ఉద్యోగాలట
- రాష్ట్రం వైపు కన్నెత్తి కూడా చూడని కంపెనీలు
- ప్రభుత్వ విధానాలతో విసిగిపోయి వెనక్కి
- పరిశ్రమల శాఖలో 18 ఎంవోయూలే అమలు
- పెట్టుబడులు 5,710 కోట్లు.. ఉద్యోగాలు 9,158
- ఆర్టీఐ దరఖాస్తుకు ప్రభుత్వం చెప్పిన మాట ఇది
- ఇతర శాఖల ఎంవోయూలపై గప్‌చుప్
- అయినా జగన్ పదే పదే అవే అబద్ధాలు



ఆంధ్రజ్యోతి పరిశీలన

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'రాష్ట్రానికి కొత్తగా రూ.లక్షల కోట్లు పెట్టుబడులు తెచ్చాం.. నిరుద్యోగాన్ని తరిమేశాం.. ఉపాధి అవకాశాలు పెంచేశాం..' అంటూ ఇన్నాళ్లూ ఊదరగొడుతున్న ముఖ్యమంత్రి జగన్ నిజస్వరూపం బట్టబయలైంది. ఆయన చెబుతున్న మాటలన్నీ అబద్ధాలేనని సమాచార హక్కు చట్టం సాక్షిగా తేలిపోయింది. పారిశ్రామిక పెట్టుబడులపై చెబుతున్నవన్నీ కట్టుకథలేనని స్వయంగా రాష్ట్ర ప్రభుత్వమే ఒప్పుకొంది. పారిశ్రామిక పురోగతిపై జగన్ సొంత రోత పత్రికలో రాసిన రాతలన్నీ ఒట్టివేనని తేలిపోయింది. జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి.. అంటే 2019 జూన్ 1 నుంచి ఈ ఏడాది జనవరి వరకు ఆయన చెప్పినట్టుగా లక్షల కోట్లు పెట్టుబడులు రాలేదు. లక్షల మందికి ఉపాధి అవకాశాలూ దక్కలేదు. అంతా సొంత డబ్బా! ఉత్తుత్తి హడావుడే! ఎంవోయూలపై జగన్ మాటలే కోటలు దాటాయి కానీ వాటి అమలు మాత్రం అరచేయి దాటలేదు. కుదుర్చుకున్న ఎంవోయూలకు, అమలైన తీరుకు అసలు పొంతనే లేదు. గత టీడీపీ ప్రభుత్వంలో ఎంవోయూలు చేసుకున్న కంపెనీలతోనే జగన్ సర్కారు మళ్లీ మళ్లీ ఒప్పందాలు చేసుకుంది. అయినా ఈ ప్రభుత్వ విధానాలతో విసిగిపోయి చాలా కంపెనీలు రాష్ట్రం వైపు కన్నెత్తి చూడటం లేదు. ఒప్పందాలు చేసుకున్న కంపెనీలు చాలా వరకు వెనక్కి వెళ్లిపోయాయి. ఇదివరకే రాష్ట్రంలో యూనిట్లు నడుపుతున్నవి.. ప్రభుత్వ పెద్దల ఒత్తిళ్లతో విశాఖ సదస్సులో ఒప్పందాలు చేసుకున్న

మిగతా 3వ పేజీలో...

ప్రపంచ దేశాలకూ తెలుసు!



మళ్లీ మనమే అధికారంలోకి వస్తాం

- అందుకే ఆయా దేశాలకు రావాలని పిలుపు
- బీజేపీ జాతీయ సదస్సులో ప్రధాని మోదీ
- 100 రోజులు అత్యంత కీలకమని వెల్లడి
- ప్రతి ఓటరునూ కలవాలని శ్రేణులకు పిలుపు
- మళ్లీ అధికారం అనుభవించాలని లేదు
- కానీ, నేనింట్లో కూర్చుంటే ప్రజలకు ఇళ్లెలా?
- కాంగ్రెస్ నుంచి అందర్నీ కాపాడాలి: మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): "ప్రపంచ దేశాలకు కూడా తెలుసు.. మోదీ మరోసారి అధికారంలోకి వస్తారని. ఈ ఏడాది సెప్టెంబరు వరకు మా దేశానికి రావాలంటే.. మా దేశానికి రావాలని ప్రపంచ దేశాలు కోరుతున్నాయి. దీనర్థం.. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని వారు అచంచల విశ్వాసంతో ఉండబట్టే. అధికారం కోసం నేను మూడోసారి రావాలని కోరుకోవడం లేదు. దేశం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం కోసమే కోరుకుంటున్నా. ఛత్రపతి శివాజీ మహరాజ్ మాదిరిగా అవిశ్రాంతంగా పనిచేయాలని భావిస్తున్నా" అని ప్రధాని

మిగతా 2వ పేజీలో...

నడ్డా పదవీ కాలం జూన్ వరకు పొడిగింపు

దీనికేనా సిద్ధం?

'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకల దాడి

'సిద్ధం' సభ వేదికగా దిగజారిన జగన్ రాజకీయం







- రాప్తాడు 'సిద్ధం' సభలో చెలరేగిన వైసీపీ మూకలు
- 'నువ్వు ఆంధ్రజ్యోతా' అని ఆరాతీసి మరీ హంతక దాడి
- ఫొటోలు తీసేవారిని ఆపి పత్రిక పేరు అడిగి..
- ఐడెంటిటీ కార్డు చూపాలంటూ దౌర్జన్యం
- ప్రతివారినీ 'నువ్వు ఆంధ్రజ్యోతా' అని అడిగిన వైనం
- 'ఆంధ్రజ్యోతి' అని తెలియగానే పిడిగుద్దులు, కర్రలతో దాడి
- అరకిలోమీటరు వరకు కొట్టుకుంటూ వెళ్లిన మూక
- సొమ్మసిల్లినా వదల్లేదు.. సీఐపైనా దాడికి ప్రయత్నం

అనంతపురం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): 'సిద్ధం' అంటూ ప్రకటనలు చేస్తున్న సీఎం జగన్ అసలు నైజం మరోసారి బయటపడింది. ప్రశ్నిస్తే కేసులు.. ఎదురుతిరిగితే దాడులు.. అన్నట్టు సాగుతున్న జగన్ మార్కు రాజకీయం మరింతగా దిగజారింది. రాప్తాడులో జగన్ సభను కవర్ చేయడానికి వెళ్లిన 'ఆంధ్రజ్యోతి' అనంతపురం స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై పెనుదాడి జరిగింది. ఆదివారం

మిగతా 12వ పేజీలో...

1. 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేస్తున్న వైసీపీ మూకలు
2. కాళ్లతో తంతూ, కర్రతో విరుచుకు పడుతున్న దృశ్యం
3. శ్రీకృష్ణ ఒంటిపై గాయాలు

రాష్ట్రంలో జరిగిన అక్రమాల్లో ఇది మహా దోపిడీ. పట్టపగ్గాలు లేకుండా దోచేసుకున్న ఇసుక దోపిడీ. జగన్ సర్కారు పర్యవేక్షణలో అడ్డూఅదుపూ లేకుండా సాగిన దోపిడీ. ఎస్‌ఈఐఏఏ నివేదికతో ఈ గుట్టు రట్టయింది.

గత ఏడాది మార్చి 23నే 110 బీ2 కేటగిరీ ఇసుక రీచ్‌ల పర్యావరణ అనుమతులు రద్దయ్యాయి. కొత్తగా అనుమతులు ఇవ్వలేదు. అయినా యథేచ్ఛగా ఇసుకను కొల్లగొడుతున్నారు. కళ్ల ముందే ఇసుక తరలిపోతున్నా గనుల శాఖ అధికారులు కళ్లు, చెవులు మూసుకున్నారు. ఏ వ్యవస్థలు కూడా దోపిడీని అడ్డుకోవడం లేదు. ఏడాదిగా 20 మిలియన్ టన్నుల ఇసుకను అక్రమంగా తరలించినట్టు అంచనా!

సర్కారీ పర్యవేక్షణలో ఇసుక మహాదోపిడీ



- ఏడాదిగా యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు
- ఎస్ఈఐఏఏ నివేదికతో గుట్టురట్టు
- ఎన్జీటీ ఆదేశాలతో గతేడాది మార్చిలోనే
- 110 బీ2 కేటగిరీ రీచ్‌లలో ఈసీలు రద్దు
- నేటికీ మంజూరు కాని అనుమతులు
- అయినా నిర్భీతిగా ఇసుక తవ్వకాలు
- ఇంతకుముందు జేపీ పేరిట దోపిడీ
- రెండున్నర నెలలుగా 18 జిల్లాల్లో ప్రతిమ
- 8 జిల్లాల్లో జీసీకేసీ ఇసుక మైనింగ్
- ఏడాదిగా 20 మిలియన్ టన్నుల దోపిడీ?
- బీ1 కేటగిరీలో ఈసీలున్నవి 41 రీచ్‌లకే
- అక్కడా సర్వం నిబంధనలకు విరుద్ధంగానే


(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర పర్యావరణ ప్రభావ అంచనా సంస్థ (ఎస్ఈఐఏఏ) తాజాగా జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ)కి ఇచ్చిన నివేదిక సాక్షిగా ఇసుక దోపిడీ గుట్టు రట్టయింది. రాష్ట్రంలో లక్షల టన్నుల ఇసుకను తవ్వి తరలించిన బీ2 కేటగిరీ (సెమీ మెకనైజ్డ్) రీచ్‌లకు గత ఏడాది మార్చి 23నే పర్యావరణ అనుమతులు రద్దయ్యాయని, ఈ ఏడాదిలో ఇప్పటి వరకు కొత్తగా ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని ఎస్ఈఐఏఏ ఈ నెల 13వ తేదీన ఎన్జీటీకి

మిగతా 11వ పేజీలో...

జగన్.. దమ్ముంటే చర్చకు రా!

ఏ అంశంపైనైనా బహిరంగ చర్చకు రెడీ: బాబు



బూటకపు ప్రసంగాలు, తప్పుడు ప్రచారాలు కాదు.. దమ్ముంటే నాతో బహిరంగ చర్చకు జగన్ సిద్ధమా..? ఏ అంశం మీదైనా, ఎక్కడైనా, ఏ రోజైనా చర్చకు నేను సిద్ధమే.
- చంద్రబాబు

- ఎవరి పాలన స్వర్ణయుగం.. ఎవరిది రాతియుగమో తేలుద్దామా?
- 'సిద్ధం' సభలకు వందల కోట్ల ఖర్చు
- బూటకపు ప్రసంగాలు, తప్పుడు ప్రచారాలు
- నిస్పృహతోనే మీడియాపై దాడులు 11
- ఇదే జగన్‌కు రాజకీయంగా చివరి చాన్స్
- ఫ్యాన్‌ను మడత పెట్టడానికి జనం సిద్ధం
- టీడీపీ అధినేత చంద్రబాబు స్పష్టీకరణ



జగన్ అక్రమాస్తులు జప్తు చేస్తాం!

తిన్నదంతా కక్కిస్తాం: లోకేశ్



విశాఖ సౌత్ శంఖారావం సభలో లోకేశ్ ప్రసంగిస్తుండగా చేతులెత్తి మహిళల సంఘీభావం

- ఈ సీఎం పాపాలపుట్ట, అబద్ధాలకోరు.. సొంతంగా పేపర్, టీవీ లేవంట! 12
- ఇవి ప్రజాధనంతో తెచ్చినవే.. లక్ష కోట్లు లూటీ చేసి భారతీ సిమెంట్స్ ఏర్పాటు
- బెంగళూరు, హైదరాబాద్, తాడేపల్లి ప్యాలెస్‌లూ అవినీతి పునాదులపై కట్టినవే
- ఉత్తరాంధ్రను బొత్స, వైవీ, సాయిరెడ్డి కుటుంబాలకు సీఎం రాసిచ్చేశాడు
- టీడీపీ వస్తే పథకాలు రద్దంటూ తప్పుడు ప్రచారం.. వైసీపీ వచ్చాకే 100 స్కీంలు రద్దు
- జాబ్స్ కేపిటల్‌ను గంజాయి రాజధానిగా చేశారు.. లక్షల కుటుంబాలు నాశనం
- మేమొస్తే హైదరాబాద్‌కు దీటుగా విశాఖ అభివృద్ధి.. శంఖారావం సభల్లో లోకేశ్ హామీ

ఉత్తమ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్!

- ప్రజాదరణలో ఒడిసా సీఎం టాప్ 2
- రెండో స్థానంలో యోగి ఆదిత్యనాథ్
- ఆ తర్వాత హిమంత బిశ్వ, భూపేంద్ర
- ఐదో స్థానంలో త్రిపుర ముఖ్యమంత్రి
- 'ఇండియా టుడే' సర్వేలో వెల్లడి

అంతరిక్షంలోకి అణ్వాయుధం!

- రష్యా సరికొత్త వ్యూహం.. కక్ష్యలోకి పంపి అవసరమైనప్పుడు ప్రయోగం
- అణుశక్తే ఇంధనంగా రాడార్ జామర్లు.. పేల్చితే ఐఎస్ఎస్ కూడా ధ్వంసమే
- శత్రుదేశ ఉపగ్రహాల సమూహాన్ని ఒకేసారి ఎదుర్కొనే మిలిటరీ వ్యూహం
- అమెరికా ఎంపీ వెల్లడి.. ఉక్రెయిన్‌కు సాయం కోసం అమెరికా కుట్ర: రష్యా



అగ్రరాజ్యాలు అమెరికా-రష్యా మధ్య ప్రచ్ఛన్నయుద్ధాన్ని ప్రపంచం కొన్ని దశాబ్దాలపాటు ఊపిరి బిగబట్టుకొని చూసింది. అయితే, సోవియట్ రష్యా ముక్కలు చెక్కలై ప్రపంచ రాజకీయాల్లో తన ప్రాభవాన్ని కోల్పోయిన తర్వాత ప్రచ్ఛన్నయుద్ధం అనే మాట పాతబడిపోయింది. అయినప్పటికీ, ఆయుధాల రేసులో రష్యా వెనకబడిపోలేదని, అమెరికాకు ఇప్పటికీ ఝలక్ ఇచ్చే స్థాయిలోనే ఉందని తాజాగా మరోసారి రుజువైంది. అంతరిక్షంలోకి రష్యా ఏకంగా ఓ అణ్వాయుధాన్నే పంపించాలని చూస్తోందంటూ అమెరికా నిఘావిభాగం కమిటీ (మన పార్లమెంటరీ స్థాయీసంఘం వంటిది) చైర్మన్, ప్రతిపక్ష రిపబ్లికన్ పార్టీ ఎంపీ మైక్ టర్నర్ వెల్లడించటం ఆ దేశంలోనేగాక ప్రపంచవ్యాప్తంగా సంచలనంగా మారింది. దీనిపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. 2

నవీన్ పట్నాయక్ పాపులర్ సీఎం!

» రెండో స్థానంలో యోగి.. 'ఇండియా టుడే' సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: ఒడిసా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ దేశంలోనే అత్యుత్తమ సీఎంగా ఖ్యాతి సంపాదించారు. ప్రజాదరణ రేటింగ్‌లో ఆయన ఏకంగా 52.7 శాతం సాధించారు. 51.3 శాతం ప్రజాదరణతో యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ రెండో స్థానంలో నిలిచినట్లు తాజా 'ఇండియా టుడే' మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వేలో తేలింది. తర్వాతి ర్యాంకుల్లో అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ(48.6%-3), గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ (42.6%), త్రిపుర సీఎం మాణిక్ సాహా (41.4%) ఉన్నారు. బిజూ జనతాదళ్ అధినేత కూడా అయిన నవీన్.. ఒడిసాకు 22 ఏళ్లుగా అప్రతిహతంగా సీఎంగా కొనసాగుతున్నారు. ఇక సాహా కూడా ప్రగతిశీలకుడిగా పేరుపొందారు. తలంకిత భావం, నిరాడంబరత, ఆయన సారథ్యంలో సాధించిన రాష్ట్రాభివృద్ధి ఆయనపై అభిమానం పెరగడానికి కారణాలని సర్వే పేర్కొంది. 'సాహా చాలా నిజాయితీపరుడు. క్షేత్ర స్థాయిలో పనిచేస్తారు. ఏ సమస్య ఏర్పడినా పరిష్కరించడానికి సిద్ధంగా ఉంటారు' అని త్రిపురలో ఓ స్థానిక దుకాణందారు తెలిపారు.

బీజేపీలో చేరను, కాంగ్రెస్‌తో సంబంధాల్లేవు.!

» కర్ణాటక మాజీమంత్రి గాలి జనార్దనరెడ్డి



బెంగళూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో ఒంటరిగానే ఉంటానని, మళ్లీ బీజేపీలో చేరబోనని కర్ణాటక రాష్ట్రం కొప్పళ జిల్లా గంగావతి ఎమ్మెల్యే, మాజీమంత్రి గాలి జనార్దనరెడ్డి స్పష్టం చేశారు. కొప్పళలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్‌లో చేరడమనేది కలలో కూడా జరగదన్నారు. కాంగ్రెస్‌తో సంబంధాలు ఎప్పటికీ ఉండవన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలన అద్భుతమని కొనియాడారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గాలి జనార్దనరెడ్డి మరోసారి బీజేపీలోకి చేరుతారనే ప్రచారం ఇటీవల జోరుగా సాగింది. సీఎం సిద్దరామయ్య శుక్రవారం బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా బీజేపీ, జేడీఎస్ బాయ్‌కాట్ చేసినా జనార్దనరెడ్డి సభలోనే ఉన్నారు. తర్వాత సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి శివకుమార్‌తో కలిసి ఫొటోలు దిగారు. దీంతో ఆయన కాంగ్రెస్ వైపు వెళ్తారనే ప్రచారం సాగింది. ఈ నేపథ్యంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తమ కేఆర్‌పీపీని ఏ రాజకీయ పార్టీలోనూ విలీనం చేసేది లేదని స్పష్టంచేశారు. రాజ్యసభ ఎన్నికల్లో మద్దతు కోసం తనను ఎవరూ సంప్రదించలేదన్నారు. శివకుమార్ 20 ఏళ్లుగా స్నేహితుడనీ, రాజకీయాలకు, స్నేహానికి సంబంధం లేదన్నారు.

పంజాబ్‌లో ఎవరికి వారే.. ఒంటరి పోరే..!

» కాంగ్రెస్, ఆప్ మధ్య అవగాహనా ఒప్పందం: కేజ్రీవాల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: పంజాబ్‌లో ఎవరికివారుగా సొంతగా పోటీచేయాలని కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) పరస్పర అవగాహనతో నిర్ణయం తీసుకున్నట్లు ఆప్ అధినేత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ వెల్లడించారు. ఢిల్లీలో ఆ పార్టీతో సీట్ల సర్దుబాటు చర్చలు తుది దశలో ఉన్నాయన్నారు. ఆయన ఆదివారమిక్కడ ప్రముఖ న్యాయవాది, కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ మను సింఘ్వీ నివాసానికి భోజనానికి వెళ్లారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. పంజాబ్‌లో ఉభయ పార్టీల నడుమ ఎలాంటి శత్రుత్వమూ లేదన్నారు. ఢిల్లీలో పొత్తు పెట్టుకోకుంటే బీజేపీ ఏడు ఎంపీ స్థానాల్లోనూ విజయం సాధిస్తుందని చెప్పారు. గత ఎన్నికల్లోనే గాక 2014లోనూ ఆ పార్టీ ఏడింటినీ గెలుచుకున్న సంగతి తెలిసిందే.

ఝార్ఖండ్‌లో కులగణనకు నిర్ణయం

రాంచీ, ఫిబ్రవరి 18: ఝార్ఖండ్‌లో కులగణన జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. ఈ విషయమై ప్రామాణిక నిర్వహణ విధానం (స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్-ఎస్‌ఓపీ) ముసాయిదాను రూపొందించాలని సీఎం చంపయ్ సోరేన్ రాష్ట్ర సిబ్బంది వ్యవహారాల శాఖను ఆదేశించారు. ఎంత ఎక్కువ జనాభా ఉంటే అంత ఎక్కువ వాటాకు రంగం సిద్ధమవుతోందంటూ ఎక్స్‌లో ఆయన ట్వీట్ చేశారు. పొరుగున ఉన్న బిహార్ తరహాలోనే ఇక్కడా కులాల జనాభా లెక్కల సేకరణ జరగనుందని ముఖ్యమంత్రికి ప్రిన్సిపల్ కార్యదర్శిగా వ్యవహరిస్తున్న వినయ్ కుమార్ చౌబే ఆదివారం వెల్లడించారు.

ఒకే ఎన్‌క్లోజర్‌లో అక్బర్, సీత పేరున్న సింహాలు

» వీహెచ్‌పీ అభ్యంతరం.. సింహాల పేర్లు మార్చాలని డిమాండ్

కోల్‌కతా, ఫిబ్రవరి 18: పశ్చిమ బెంగాల్‌లోని సిలిగురి సఫారీ పార్కులో సీత అని పేరున్న ఆడ సింహాన్ని, అక్బర్ అని పేరున్న మగ సింహాన్ని ఒకే ఎన్‌క్లోజర్‌లో పెట్టడంపై విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇది తమ మత విశ్వాసాలను దెబ్బతీయడమేనని ఆరోపించింది. వెంటనే ఆ సింహాల పేర్లను మార్చాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు కలకత్తా హైకోర్టు పరిధిలోని జల్‌పాయ్‌గురి సర్క్యూట్ బెంచ్‌లో పిటిషన్ దాఖలు చేసింది. బెంగాల్ అటవీశాఖ అధికారులను, బెంగాల్ సఫారీ పార్కు డైరెక్టరును ప్రతివాదులుగా చేర్చింది. ఈ పిటిషన్‌పై కోర్టు 20న విచారణ జరపనుంది. సఫారీలో ఉన్న ఆడ సింహం(సీత) తన భాగస్వామి కోసం ఎదురుచూస్తోందంటూ అంతకుముందు స్థానిక బెంగాలీ పత్రికలో వచ్చిన వార్తపైనా వీహెచ్‌పీ అభ్యంతరం తెలిపింది. దీనిపై బెంగాల్ అటవీ శాఖ అధికారులు స్పందిస్తూ ఈ రెండు సింహాలను ఈ నెల 13న త్రిపురలోని సెపాహిజాల జంతువుల పార్కు నుంచి తీసుకొచ్చామని చెప్పారు. తాము వాటికి ఆ పేర్లు పెట్టలేదని, అప్పటికే వాటికి ఆ పేర్లు ఉన్నాయని తెలిపారు. అయితే, ఆ పేర్లను పశ్చిమ బెంగాల్ రాష్ట్ర అటవీశాఖ అధికారులే పెట్టారని వీహెచ్‌పీ ఆరోపించింది.

ఉత్తరాదిలో గాలి నాణ్యత భేష్

దక్షిణాదిలో పెరిగిన కాలుష్యం

» గతేడాది శీతాకాలంలో అరుదైన ట్రిపుల్-డిప్ లా నినా ప్రభావమే కారణం

» తాజా అధ్యయనంలో పరిశోధకుల వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: వాతావరణ మార్పుల కారణంగా విస్తరించిన అరుదైన ట్రిపుల్-డిప్ లా నినా పరిస్థితుల వల్ల 2022-23 శీతాకాలంలో ఉత్తర భారతంలో గాలి నాణ్యత మెరుగుపడింది. కానీ.. తీర ప్రాంతం వెంబడి ఉన్న దక్షిణ భారతంలో మాత్రం కాలుష్య స్థాయిల పెరుగుదల నమోదైన విచిత్ర పరిస్థితి నెలకొందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. వరుసగా మూడు సంవత్సరాలు (2020-23) లా-నినా పరిస్థితులు అరుదైన ట్రిపుల్-డిప్ పరిస్థితికి కారణంకాగా.. ఇది ప్రపంచవ్యాప్తంగా సముద్రం, వాతావరణంపై విస్తృత ప్రభావం చూపిందని ఈ అధ్యయనంలో గుర్తించారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ చైర్ ప్రొఫెసర్ గుర్ఫాన్ బేగ్ నేతృత్వంలోని శాస్త్రవేత్తల బృందం చేపట్టిన ఈ అధ్యయనం.. స్థానిక ఉద్గారాలతోపాటు, వేగంగా చోటుచేసుకుంటున్న వాతావరణ మార్పులు గాలి నాణ్యతను ప్రభావితం చేసిన వాటిలో ముఖ్యమైన అంశాలని స్పష్టం చేసింది. ఎల్సీవర్ జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం ప్రకారం.. 2022-23 శీతాకాలంలో ఉత్తరాదిలోని ఘజియాబాద్‌లో గాలి కాలుష్యంలో 33 శాతం తగ్గుదల కనిపించింది. రోహ్‌తక్ (30 శాతం), నోయిడా (28 శాతం) ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ఎప్పుడూ గాలి కాలుష్యంతో ఇబ్బంది పడే దేశరాజధాని ఢిల్లీలో కూడా 10 శాతం మెరుగుదల కనిపించింది. కానీ, దీనికి విరుద్ధంగా.. తీరం వెంబడి ఉన్న ప్రాంతాల్లో కాలుష్యం విపరీతంగా పెరిగిపోయింది. ముఖ్యంగా ముంబైలో వాయుకాలుష్యం 30 శాతం పెరిగింది. కోయంబత్తూరు (28 శాతం), బెంగళూరు (20 శాతం), చెన్నై (12 శాతం) ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. "2022-23 శీతాకాలంలో అసాధారణమైన ట్రిపుల్-డిప్ లా నినా ఈవెంట్ కలిసొచ్చింది. 21వ శతాబ్దంలో ఇలాంటి పరిస్థితి ఏర్పడడం ఇదే తొలిసారి. వాతావరణ మార్పుల ప్రభావంతో ఏర్పడిన ఈ పరిస్థితి గాలుల సరళిని ప్రభావితం చేసింది" అని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటరాలజీ వాతావరణ శాస్త్రవేత్త ఆర్‌హెచ్ కృపాలానీ పేర్కొన్నారు. అయితే దీనికి విరుద్ధంగా తీరం వెంబడి నగరాల్లో.. కాలుష్యాన్ని పెంచిందని, దీంతో గాలి నాణ్యత గణనీయంగా క్షీణించిందని ఆయన చెప్పారు.

ప్రపంచ దేశాలకూ తెలుసు

(మొదటి పేజీ తరువాయి)

నరేంద్ర మోదీ అన్నారు. ప్రపంచంలోని ప్రతిదేశం భారత్‌తో లోతైన సంబంధాలను కలిగి ఉండాలని చెబుతోందన్నారు. భారత దేశం అభివృద్ధి చెందిన దేశంగా ఆవిర్భవించడానికి బీజేపీ మూడోసారి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. "అభివృద్ధి చెందిన భారతదేశం కలను సాకారం చేసుకునేందుకు వచ్చే ఐదేళ్లు అత్యంత కీలకం. దీనిలో తొలి అడుగు.. బీజేపీ భారీ మెజారిటీతో తిరిగి అధికారంలోకి రావడమే. ఎన్డీయే కూటమి 400లకు పైగా స్థానాల్లో విజయం దక్కించుకుంటుందనే వాదన బలంగా వినిపిస్తోంది. దీనిని నిజం చేసేందుకు బీజేపీ 370 స్థానాలను దక్కించుకోవాల్సిన అవసరం ఉంది" అని అన్నారు. ఈ దేశాన్ని భారీ కుంభకోణాల నుంచి, ఉగ్రవాద దాడుల నుంచి బయట పడేసేందుకు, మధ్యతరగతి ప్రజలు, పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఎంతో కష్టించామని తెలిపారు. ఢిల్లీలోని భారత మండపం వేదికగా శనివారం ప్రారంభమైన బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశం ఆదివారం ముగిసింది. ముగింపు సమావేశంలో మోదీ మాట్లాడుతూ..పార్టీ నేతలకు లక్ష్యాన్ని నిర్దేశించారు. ఎన్నికల వ్యూహాన్ని ఆవిష్కరించారు. "వచ్చే 100 రోజులు అత్యంత కీలకం. ప్రతి ఓటరును కలవాలి. ముఖ్యంగా కొత్త వారికి చేరువ కావాలి. ప్రతి లబ్ధిదారుని ఇంటి గడప తొక్కాలి. ప్రతి ఒక్కరి విశ్వాసాన్నీ చూరగొనాలి" అని దిశానిర్దేశం చేశారు. అదేసమయంలో తనకు మూడోసారి కూడా అధికారం అనుభవించాలనే తాపత్రయం లేదన్నారు. కానీ, ఈ దేశం కోసమే తను ప్రయత్నం చేస్తున్నట్టు తెలిపారు. "నేను నా ఇంటి గురించి ఆలోచిస్తే.. ఇంట్లోనే కూర్చుంటే.. ఈ దేశ ప్రజలకు ఇళ్ల నిర్మాణం ఎలా సాకారమవుతుంది? ఈ పదేళ్ల మచ్చలేని పాలనలో 25 కోట్ల మంది ప్రజలను పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చాం. ఓ సీనియర్ నేత నాకు సలహా ఇచ్చారు.. మీరు ప్రధానిగా చేశారు, ముఖ్యమంత్రిగా చేశారు. ఇక, విశ్రాంతి తీసుకోవచ్చుకదా! అన్నారు. కానీ, నేను 'రాష్ట్రనీతి' కోసం పనిచేస్తున్నాను. 'రాజనీతి' కోసం కాదని చెప్పా" అని మోదీ పేర్కొన్నారు.

కాంగ్రెస్‌పై విసుర్లు..

ప్రధాని మోదీ తన ప్రసంగంలో ప్రతిపక్ష కాంగ్రెస్‌పై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. "నేను ఎవరి మాదిరిగానో.. వ్యక్తిగత సంపద పోగేసుకునేందుకు, సొంత శ్రేయస్సు, ఆనందం కోసం మూడోసారి బీజేపీ అధికారంలోకి రావాలని కోరుకోవడం లేదు. ఈ దేశం కోసం, సమస్యల పరిష్కారం కోసమే కోరుకుంటున్నా. నేను ఏం చేసినా.. దేశ ప్రజలకు అంకితమిస్తున్నా. ప్రజల కలలను నెరవేర్చడమే నా లక్ష్యం" అని వ్యాఖ్యానించారు. తప్పుడు ఆరోపణలు, అనుమానాలతో కాంగ్రెస్ రాజకీయం చేస్తోందని దుయ్యబట్టారు. "ఆ పార్టీ రెండుగా చీలిపోయింది. ఒక గ్రూపు మోదీని తిట్టడమే పనిగా పెట్టుకుంది. ఇంకోటి వ్యక్తిగత దాడులు చేయొద్దని సూక్తులు చెబుతోంది" అని మోదీ అన్నారు. దేశంలోని ప్రతి వ్యక్తినీ, ప్రతి చిన్నారినీ రక్షించాల్సిన కర్తవ్యం బీజేపీ కార్యకర్తలపై ఉందని నొక్కి చెప్పారు. అవినీతికి కాంగ్రెస్ తల్లిలాంటిదని విమర్శించారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే దేశ భవిష్యత్తుకు పూడ్చలేని నష్టమని ప్రధాని పేర్కొన్నారు.



ప్రధాని మోదీని సన్మానిస్తున్న కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, గడ్కరీ తదితరులు

కొత్త ఓటరును వదలొద్దు!

పార్లమెంటు ఎన్నికల వ్యూహాన్ని చెబుతూ.. బీజేపీ కార్యకర్తలు ఇంటింటికీ తిరగాలని, ముఖ్యంగా కొత్త ఓటర్లను ఏ ఒక్కరినీ వదిలి పెట్టొద్దని మోదీ సూచించారు. "ప్రతి ఒక్క ఓటరును కలవండి. మోదీ మీకు శుభాకాంక్షలు తెలిపారని చెప్పండి. పదేళ్లలో ఏం చేశామో వివరించండి. వచ్చే ఐదేళ్లలో ఏం చేయబోతున్నామో కూడా చెప్పండి. అదేవిధంగా ఇప్పటి వరకు మనతో లేనివారిని(మైనారిటీలు) కూడా కలుపుకోండి" అని దిశానిర్దేశం చేశారు. ఈ పదేళ్లలో అనేక సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నామని, కొన్ని దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న అనేక సమస్యలకు పరిష్కారం చూపించామని అన్నారు. వీటిలో అయోధ్య రామమందిరం, ఆర్టికల్ 370 రద్దు, కర్తార్‌పూర్ సాహిబ్ కారిడార్ ప్రారంభం, నూతన విద్యా విధానం సహా అనేకం ఉన్నాయన్నారు. కాగా, ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా త్వరలోనే భారత్ అవతరిస్తుందని మోదీ తెలిపారు. 'అది మోదీ గ్యారంటీ' అని పునరుద్ఘాటించారు. ఈశాన్య రాష్ట్రాలను విస్మరించారన్న ప్రతిపక్షాల విమర్శలను మోదీ ఖండించారు.

యూపీఏ పాలనపై శ్వేత పత్రం

కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ సర్కారు పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమైందని బీజేపీ ఆరోపించింది. పదేళ్ల యూపీఏ హయాంలో ఆర్థిక అవకతవకలు అనేకం జరిగాయని పేర్కొంది. ఈ మేరకు బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో ఆదివారం విడుదల చేసిన శ్వేతపత్రంలో వివరించింది. యూపీఏ ప్రభుత్వ పాలనపై మోదీ సర్కారు ఇటీవల పార్లమెంటులో కూడా శ్వేతపత్రం విడుదల చేసిన సంగతి తెలిసిందే. 2004-2014 మధ్య జరిగిన ఆర్థిక అవకతవకలను తాజా శ్వేతపత్రంలో వివరించారు. "2014లో బ్యాంకింగ్ సంక్షోభం కారణంగా భారీ నష్టం జరిగింది. మార్చి 2004 నాటికి ప్రభుత్వ రంగ బ్యాంకుల స్థూల అడ్వాన్సులు రూ.6.6 లక్షల కోట్లుగా ఉండగా.. మార్చి 2012 నాటికి ఇది రూ.39 లక్షల కోట్లకు చేరింది. 2013లో అమెరికా డాలర్ వేగంగా వృద్ధి చెందగా.. యూపీఏ సర్కారు ఆర్థిక సుస్థిరత విషయంలో రాజీ పడింది. ఫలితంగా 2013లో మన కరెన్సీ విలువ పడిపోయింది" అని శ్వేతపత్రంలో వెల్లడించింది. యూపీఏ హయాంలో 14 కీలక శాఖల్లో రూ.94,060 కోట్ల బడ్జెట్ కేటాయింపులను ఖర్చు చేయలేదని తెలిపింది.

అది వారసత్వ పార్టీల అహంకార కూటమి

» ఇండియా కూటమిపై అమిత్ షా ఫైర్.. 'నేషన్ ఫస్ట్' ఎన్డీఏ విధానమని వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి అవినీతి, బంధుప్రీతి, బుజ్జగింపు రాజకీయాలను ప్రోత్సహిస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా విమర్శించారు. అది వారసత్వ పార్టీల అహంకార కూటమి అని విమర్శించారు. ఇండియా కూటమిలోని భాగస్వామ్య పార్టీలపై ఆయన నిప్పులు చెరిగారు. దేశంలో అవినీతికి మూలం కాంగ్రెస్ పార్టీయే అన్నారు. 'నేషన్ ఫస్ట్' ఎన్డీయే విధానంగా పేర్కొన్నారు. దేశం స్వావలంబన సాధించేందుకు మోదీ కృషి చేస్తున్నారని చెప్పారు. మరి ఇండియా కూటమి ఏ లక్ష్యం కోసం పనిచేస్తోందని ఆయన ప్రశ్నించారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే సోనియా గాంధీ లక్ష్యమని విమర్శించారు. శరద్ పవార్ ఆయన కుమార్తెను, మమతా బెనర్జీ తన మేనల్లుడిని, స్టాలిన్, లాలూప్రసాద్ యాదవ్, ఉద్ధవ్ ఠాక్రే తమ కుమారులను సీఎంలుగా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. మోదీ 3.0లో ఉగ్రవాదం, తీవ్రవాదం, నక్సలిజం నుంచి విముక్తి లభించి శాంతియుత, సంపన్న దేశంగా భారత్ అభివృద్ధి చెందుతుందని అమిత్ షా ధీమా వ్యక్తంచేశారు.

లోకం తీరు



నడ్డా పదవీ కాలం పొడిగింపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా పదవీ కాలాన్ని పొడిగించారు. ఈ ఏడాది జూన్ 30 వరకు ఆయనే పార్టీకి సారథ్యం వహించనున్నారు. ఆయనను కొనసాగించాలని ఆదివారం బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో నిర్ణయం తీసుకున్నారు. నడ్డా పదవీ కాలాన్ని పొడిగించేందుకు వీలుగా ఈ సమావేశాల్లోనే పార్టీ రాజ్యాంగానికి సవరణ కూడా చేశారు. దీని ద్వారా అత్యవసర పరిస్థితుల్లో అధ్యక్షుడి పదవీ కాలాన్ని పెంచే అధికారాన్ని పార్టీ పార్లమెంటరీ బోర్డుకు కల్పించారు. సాధారణంగా పార్టీ అధ్యక్షుడిని సంస్థాగత ఎన్నికల ద్వారా ఎన్నుకుంటారు. అయితే, నడ్డా పదవీ కాలం పొడిగింపును ఆ పార్టీ నేత సుబ్రమణ్య స్వామి తీవ్రంగా వ్యతిరేకించారు. సంస్థాగత ఎన్నికలు నిర్వహించకుండా నడ్డా పదవీ కాలం పొడిగించడం పార్టీ నియమావళికి విరుద్ధమన్నారు. ఇప్పటికే ఈ అంశం ఈసీ ముందు ఉందని, ఢిల్లీ హైకోర్టులో దావా కూడా వేస్తానని స్పష్టం చేశారు.

అయోధ్యలో మందిర నిర్మాణం రామరాజ్యానికి నాంది!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: అయోధ్యలో రామ మందిర నిర్మాణం.. దేశంలో వచ్చే 1000 ఏళ్ల రామ రాజ్య స్థాపనకు నాంది అని బీజేపీ పేర్కొంది. ఈ మేరకు ఢిల్లీలో జరుగుతున్న పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో ఆదివారం తీర్మానం చేసింది. గత నెలలో మహా సంప్రోక్షణ జరిగిన ఈ ఆలయం 'జాతీయ చైతన్యం'గా మారిందని.. వికసిత భారత్ నిర్మాణంలో భాగంగా ఆమోదించిన తీర్మానాల అమలులో ఇది కీలక పాత్ర పోషించనుందని తెలిపింది. జనవరి 22న అయోధ్యలోని రామాలయంలో జరిగిన ప్రాణప్రతిష్ఠతో భారతీయులందరూ ఎంతో సంతోషించారని తీర్మానంలో వెల్లడించింది. దేశంలో రామరాజ్యం అన్న ఆలోచన మహాత్మా గాంధీ మదిలో నుంచి వచ్చిందేనని గుర్తుచేసింది. నిజమైన ప్రజాస్వామ్యం అంటే రామరాజ్యమేనని ఆయన చెప్పేవారని వివరించింది.

అంతరిక్షంలోకి అణ్వాయుధం!

కొత్త వ్యూహాన్ని సిద్ధం చేస్తున్న రష్యా.. కక్ష్యలోకి పంపి అవసరమైనప్పుడు ప్రయోగం



అమెరికాకు పొంచి ఉన్న ప్రమాదం గురించి ప్రభుత్వం దేశ ప్రజలందరికీ తెలియజేయాలని, మిత్రదేశాలను కూడా హెచ్చరించాలని టర్నర్ సూచించారు. దీనిపై అమెరికా అధ్యక్షుడు బైడెన్ స్పందిస్తూ.. రష్యాతో ప్రస్తుతం అమెరికా ప్రజలకు ఎటువంటి అణుముప్పు లేదని, ప్రపంచదేశాలకూ ఆ ప్రమాదం ఏమీ లేదని పేర్కొన్నారు. అయితే, పైకి ఇలా చెప్పినప్పటికీ.. అంతరిక్షంలోకి అణ్వాయుధాన్ని రష్యా పంపించాలని భావిస్తోందన్న సమాచారం బైడెన్ ప్రభుత్వానికి నిఘా వర్గాల ద్వారా చేరిందని ఆ దేశ మీడియా వెల్లడించింది. సదరు అణ్వాయుధాన్ని భూమ్మీద ఉన్న లక్ష్యాల కోసం కాకుండా, అంతరిక్షంలో ఉన్న ఉపగ్రహాలపై ప్రయోగించటానికే రష్యా తయారు చేయాలని భావిస్తోందని మీడియా పేర్కొంది. అయితే, అణ్వాయుధం అనేది రోదసిలో ఉంటే.. దానిని భూమి మీది లక్ష్యాలతోపాటు ఎక్కడికైనా ప్రయోగించే అవకాశం ఉంటుందనే వాదన కూడా ఉంది. రష్యా ప్రయోగించనున్న అణ్వాయుధం గురించి ప్రస్తుతానికి ఊహాగానాలే తప్ప ఎటువంటి స్పష్టత లేదు. ఒక అంచనా ప్రకారం.. ఏకంగా ఓ అణ్వాయుధాన్నే కక్ష్యలోకి ప్రవేశపెట్టి అవసరం వచ్చినప్పుడు అక్కడి నుంచే ప్రయోగించటం. రెండవది.. అణుశక్తితో నడిచే ఉపగ్రహం. ఇది స్వయంగా బాంబు కాకపోవచ్చు గానీ, దాంట్లోని పరికరాలను అణుశక్తితో నడిపిస్తారు. మూడవది.. ఉపగ్రహాలను ధ్వంసం చేసే అణ్వాయుధం. దీనిని భూమి మీదే నిలిపి ఉంచుతారు. అవసరమైనప్పుడు ప్రయోగిస్తారు.

1962లోనే అమెరికా పరీక్ష

రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్ మీద అమెరికా వేసిన అణుబాంబు సృష్టించిన విధ్వంసాన్ని, రష్యాలో చెర్నోబిల్ అణు దుర్ఘటన తాలూకు భయానక ఫలితాల్ని ప్రపంచం చూసింది. అణుబాంబు పేలినప్పుడు వెలువడే శక్తివంతమైన తరంగాలు అన్నింటినీ భస్మీపటలం చేస్తాయి. వాతావరణంతో నిండి ఉన్న భూమి మీదే ఇంత దారుణంగా ఉంటే, వాతావరణం లేని శూన్యం ఆవరించిన రోదసిలో అణ్వాయుధం పేలుడు సంభవిస్తే పరిస్థితి ఏమిటి? దాని నుంచి వెలువడే విద్యుదయస్కాంత తరంగాలు రోదసిలో సుదూరంగా ఉన్న ఉపగ్రహాలలోని పరికరాలను, వ్యవస్థలను పనికి రాకుండా చేస్తాయి. దీనికో ఉదాహరణ కూడా ఉంది. 1962లో అమెరికా.. పసిఫిక్ సముద్రంపైన 400 కి.మీ.ల ఎత్తులో అణ్వాయుధ పరీక్ష జరిపింది. స్టార్‌ఫిష్ ప్రైమ్ అని పేరు పెట్టిన ఈ పరీక్షలో భాగంగా 1.4 మెగాటన్నుల అణ్వాయుధాన్ని పేల్చివేసింది. దీని నుంచి వెలువడిన రేడియో ధార్మికత భూమి విద్యుదయస్కాంత క్షేత్రంతో కలిసి సమీపంలోని ఉపగ్రహాలనే కాదు.. భూమికి మరో వైపున్న ఉపగ్రహాలపైన కూడా ప్రభావం చూపింది. ఫలితంగా భూమి దిగువ కక్ష్య (ఎల్‌ఈఓ)లో ఉన్న ఉపగ్రహాల్లో మూడోవంతు దెబ్బతిన్నాయి లేదా ధ్వంసమైపోయాయి. అనేక దేశాల ఉపగ్రహాలు, ముఖ్యంగా మిలిటరీ ఉపగ్రహాలు ఎక్కువగా ఈ కక్ష్యలోనే ఉంటాయి. ఎందుకంటే, ఇక్కడి నుంచి భూమి చాలా స్పష్టంగా కనిపిస్తుంది. ఈ కక్ష్య భూమి నుంచి 2 వేల కి.మీ.ల లోపే ఉంటుంది. ప్రస్తుతం ఎల్‌ఈఓలో దాదాపు 8,300 ఉపగ్రహాలు పని చేస్తున్నాయి. ఇక్కడ అణ్వాయుధం పేలుడు సంభవిస్తే.. అమెరికా, రష్యా, చైనా, భారత్ తదితర దేశాల ఉపగ్రహాలు ధ్వంసమవుతాయి. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) కూడా దెబ్బతింటుంది.

జీఈఓ లక్ష్యంగా..

రష్యా తాజాగా తన అణ్వాయుధాన్ని 36 వేల కి.మీ.ల పైనున్న జియో సింక్రనస్ ఆర్బిట్ (జీఈఓ)లో ప్రవేశపెట్టవచ్చన్న వాదనలు ఉన్నాయి. ఇక్కడ ఉన్న ఉపగ్రహాలు భూమిని రోజుకొకమారు చుట్టివేస్తాయి. అంటే, భూమితో పోల్చినప్పుడు స్థిరంగా ఉంటాయి. ఈ కక్ష్యలోనే అమెరికాకు చెందిన పలు నిఘా, మిలిటరీ కమ్యూనికేషన్ ఉపగ్రహాలున్నాయి. కాబట్టి, రష్యా లక్ష్యం జీఈఓ కావచ్చని హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన మాథ్యూ బన్ చెబుతున్నారు. ఎలక్ట్రానిక్ యుద్ధాన్ని కొనసాగించేలా అణుశక్తితో నడిచే ఉపగ్రహాన్ని రష్యా రోదసిలోకి పంపుతుందనేది మరో వాదన. దీని ప్రకారం.. అంతరిక్షంలో శత్రుదేశానికి చెందిన ఉపగ్రహం నుంచి వెలువడే సంకేతాలను లేదా అది స్వీకరించే సంకేతాలను అడ్డుకోవటం, లేదా తాము పంపించే తప్పుడు సంకేతాలను తీసుకునేటట్లు చేయటం ఈ ప్రయోగం లక్ష్యం. అంతరిక్షంలోని ఉపగ్రహాలపై ఎలక్ట్రానిక్ యుద్ధాన్ని భూమి మీది నుంచే జరిపే వ్యవస్థలు అమెరికా, రష్యా వద్ద ఇప్పటికే ఉన్నాయి. కానీ, రోదసిలోకి ఇటువంటి వ్యవస్థను పంపిస్తే శత్రుదేశాల ఉపగ్రహాలపై చాలా సమీపం నుంచి దాడి చేయటానికి వీలవుతుంది. రష్యా ఇటువంటి ప్రయత్నాల్లో ఉందని సెక్యూర్ వరల్డ్ ఫౌండేషన్ అనే స్వచ్ఛందసంస్థ గత ఏడాది ఓ నివేదికను వెలువరించింది. అయితే, ఈ ఉపగ్రహాలను అణుశక్తితోనే ఎందుకు నడిపించాలి?.. పుష్కలంగా కరెంటును ఉత్పత్తి చేయటం కోసమే అణుశక్తి వాడకం. ఎంత విద్యుత్ అందుబాటులో ఉంటే తమ ఉపగ్రహాలపై అంత శక్తివంతమైన రాడార్ జామర్లను అమర్చవచ్చు. అమెరికా 1965లోనే కక్ష్యలోకి అణురియాక్టర్‌ను పంపించింది. సోవియట్ యూనియన్ 40కిపైగా అణు ఉపగ్రహాలను ప్రవేశపెట్టింది. ఇప్పుడు జియో సింక్రనస్ ఆర్బిట్‌లోకి ఇటువంటి అణుశక్తి ఉపగ్రహాన్ని పంపితే.. విశాలమైన పరిధిలో ఎలక్ట్రానిక్ వ్యవస్థలను అడ్డుకోవటానికి వీలవుతుంది.

రోదసిలో ఆయుధాల మోహరింపుపై నిషేధం


ఆయుధాల పోటీకి, ఘర్షణలకు రోదసిని ఉపయోగించవద్దని 1967 నాటి అంతరిక్ష ఒప్పందం స్పష్టం చేస్తోంది. అలాగే, 1963 నాటి పాక్షిక పరీక్షల నిరోధక ఒప్పందం కూడా అంతరిక్షంలో ఆయుధాలను పరీక్షించటం, పేల్చటం వంటి వాటిని నిషేధిస్తోంది. ఈ రెండు ఒప్పందాలపై రష్యా సంతకం చేసింది. అయినప్పటికీ, అంతరిక్ష అణ్వాయుధాన్ని తయారు చేయటమంటే వీటిని ఉల్లంఘించటమే అవుతుంది. అందుకే, రష్యా దీనిపై అధికారికంగా ఏమీ చెప్పటం లేదన్న విమర్శలున్నాయి. (సెంట్రల్ డెస్క్)

ఉక్రెయిన్‌తో యుద్ధమే కారణమా?

శత్రుదేశాలపై దాడికి, నిఘాకు వందల సంఖ్యలో ఉపగ్రహాలను అనుసంధానించి వాడుకోవటం అన్నది ఇప్పుడు సరికొత్త యుద్ధ వ్యూహం. అమెరికా సైన్యం దీనిపై ఇటీవల ఆసక్తి చూపుతోంది. ఉక్రెయిన్ సైన్యం ఈ తరహా ప్రయోగాలు చేసింది. పైగా ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధంలో ఉంది. ఈ నేపథ్యంలోనే రష్యా ఈ కొత్త ఆయుధాన్ని సమకూర్చుకుంటూ ఉండవచ్చని కార్నేగీ ఎండోమెంట్ అనే మేధోసంస్థకు చెందిన నిపుణుడు జేమ్స్ యాక్టన్ తెలిపారు. ఎందుకంటే.. వందలాదిగా ఉన్న శత్రు ఉపగ్రహాలను ఒకదాని తర్వాత ఒకటిగా భౌతికంగా ధ్వంసం చేయటం సాధ్యమయ్యే పని కాదు. ఒకేసారి వాటన్నింటినీ పని చేయకుండా చేసే ఎలక్ట్రానిక్ దాడే అత్యంత అనుకూలం. మరోవైపు, ఫిబ్రవరి 9వ తేదీన రష్యా సోయజ్-2-1వీ అనే రాకెట్‌ను అంతరిక్షంలోకి ప్రయోగించింది. రక్షణ శాఖకు చెందిన రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించామని రష్యా ప్రకటించినప్పటికీ.. రాకెట్‌తోపాటు పంపిన పేలోడ్ ఏమిటన్నది మాత్రం రహస్యంగా ఉంచింది. కాగా, రోదసిలోకి అణ్వాయుధం అంటూ అమెరికా తనపై చేస్తున్న ఆరోపణలను రష్యా ఖండించింది. తమకు వ్యతిరేకంగా ఉక్రెయిన్‌కు మరిన్ని నిధులను అప్పగించటం కోసం, ఈ మేరకు సదరు నిధుల బిల్లుకు అమెరికా చట్టసభల ఆమోదం కోసమే ఆ దేశ ప్రభుత్వం ఈ నాటకం ఆడుతోందని ఆరోపించింది.

అందరిదీ అనుమానాస్పద మరణమే!

పుతిన్‌ను విమర్శించినవారు మిగల్లేదు



మాస్కో, ఫిబ్రవరి 18 : రష్యా విపక్ష నాయకుడు, ప్రముఖ ఉద్యమకారుడు అలెక్సీ నావల్నీ హఠాన్మరణం ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయనది సహజ మరణమని అధికారులు చెబుతున్నా.. ప్రపంచ దేశాలు.. ముఖ్యంగా యూరప్ దేశాలు నమ్మడం లేదు. ఎందుకంటే.. పుతిన్‌ను విమర్శించిన వారిలో ఇప్పటి వరకు చనిపోయినవారంతా అనుమానాస్పదంగానే ప్రాణాలు విడిచిపెట్టారు. పుతిన్ ప్రత్యర్థుల మరణం వెనుక విమానాలు కూలిపోవడం, విష ప్రయోగం, ఆత్మహత్యలు వంటి అనేక ఘటనలు వెలుగుచూశాయి. వీటిని ప్రమాదాలు, ఆత్మహత్యల జాబితాలో ప్రభుత్వం చేర్చేసిందనే వాదన కూడా ఉంది. తాజాగా నావల్నీ మరణంతో మరోసారి ఈ ఘటనలు తెర మీదకి వచ్చాయి. ఇప్పుడు నావల్నీ మరణంపై అందరి వేళ్లూ పుతిన్‌వైపే చూపిస్తున్నాయి. ఇదిలావుంటే నావల్నీ మరణంపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన వెనుక పుతిన్ ప్రభుత్వం ఉందన్నారు. పలువురు ప్రపంచ స్థాయి నాయకులు కూడా ఇవే వ్యాఖ్యలు చేశారు. ఇక రష్యా విపక్ష పార్టీల నేతలు, ఉద్యమకారులు కూడా పుతిన్ ప్రభుత్వంపై అనుమానాలు వ్యక్తం చేశారు. నావల్నీ మృతదేహాన్ని సలేఖర్డ్ శవాగారంలో ఉంచినట్లు రష్యా ప్రభుత్వం అధికారికంగా వెల్లడించినప్పటికీ, అక్కడి నుంచి అది అదృశ్యం కావడంతో అనుమానాలు మరింత బలపడ్డాయి. శవాగారానికి నావల్నీ తల్లి, లాయరు వెళ్లినప్పుడు, మృతదేహం అక్కడ లేదని అధికారులు సమాధానమిచ్చారు. దాంతో చేసేదేమీలేక వారు వెనుదిరిగివెళ్లాల్సి వచ్చింది. కాగా, నావల్నీ మరణంపై యూరప్ వ్యాప్తంగా నిరసనలు మిన్నంటాయి. రష్యాలోని 32 నగరాల్లో ఆదివారం నాడు భారీ ఎత్తున నిరసన ప్రదర్శనలు జరిగాయి. కనీసం 400 మందిని రష్యన్ పోలీసులు అరెస్టు చేశారు.

ఇవీ.. దృష్టాంతాలు!

ఎవ్జెనీ ప్రిగోజిన్: ఈయన పుతిన్‌కు అత్యంత సన్నిహితుడు. వాగ్నర్ మెర్సనరీ గ్రూప్‌కు మాజీ అధిపతి. అయితే క్రెమ్లిన్‌పై తిరుగుబాటు చేసి ప్రిగోజిన్ దళం రెస్టోవ్ నగరాన్ని స్వాధీనం చేసుకుంది. ఆ తర్వాత గత ఏడాది విమానం కూలిపోయిన ఘటనలో ప్రిగోజిన్ మృతి చెందారు.

బోరిస్ బెరెజోవ్‌స్కీ: ఈయన రష్యా వ్యాపారవేత్త. తరచుగా పుతిన్‌ను విమర్శించేవారు. ఈ క్రమంలో 2000 సంవత్సరంలో దేశాన్ని విడిచి వెళ్లిపోయారు. 2007లో ఈయన్ను రష్యా కోర్టు పన్నుల ఎగవేత కేసులో దోషిగా తేల్చింది. 2013లో బోరిస్ బ్రిటన్‌లోని తన నివాసంలో ఉన్న బాత్‌రూంలో ఆత్మహత్యకు పాల్పడ్డారు. వీరితో పాటు ఎఫ్ఎస్‌బీ సెక్యూరిటీ సర్వీసుల మాజీ సభ్యుడు అలెగ్జాండర్ లిత్వినెంకో, ప్రజావేగుగా పనిచేసిన అలెగ్జాండర్ పెరిపిలిచిని, రష్యన్ లాయర్ సెర్గీ మెగ్నిత్స్కీ, రష్యన్ షిప్‌యార్డ్ అధిపతిగా పనిచేసిన అలెగ్జాండర్ బుజకోవ్ తదితరులూ ఇలాగే అనుమానాస్పదంగా ప్రాణాలు కోల్పోయారు. పుతిన్ విమర్శకులు కావడమే వీరంతా చేసుకున్న పాపం.

రైతు నేతలతో కేంద్ర మంత్రుల నాలుగో విడత చర్చలు

చండీగఢ్, ఫిబ్రవరి 18: కేంద్ర మంత్రుల కమిటీ ఆదివారం రైతు సంఘాల నాయకులతో నాలుగో విడత చర్చలు నిర్వహించింది. కేంద్ర మంత్రులు అర్జున్ ముండా, పీయూష్ గోయల్, నిత్యానందర్ రాయ్‌లు ఇక్కడ సెక్టార్ 26లోని మహాత్మా గాంధీ రాష్ట్ర పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ సంస్థలో రైతు నేతలతో చర్చలు ప్రారంభించారు. ఈ నెల 8, 12, 15 తేదీల్లో కూడా చర్చలు జరిగినా అవి అసంపూర్తిగా ముగిశాయి. మరోవైపు పంజాబ్-హరియాణా సరిహద్దుల్లో శంభూ, ఖనౌరీ పాయింట్ల వద్ద వేలాది మంది రైతుల నిరసన కొనసాగుతోంది. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత వంటి డిమాండ్ల సాధన కోసం 'చలో ఢిల్లీ' చేపట్టిన రైతులను పోలీసులు సరిహద్దుల్లో అడ్డుకున్నారు. దాంతో రైతులు అక్కడే ఆందోళన కొనసాగిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సాగదీత ధోరణి మానుకోవాలని, లోక్‌సభ ఎన్నికల కోడ్ రాక ముందే రైతుల డిమాండ్లను అంగీకరించాలని రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ కోరారు.

ఇంద్రకీలాద్రిపై సీఎం జగన్ భజన

▸ మల్లేశ్వరాలయ ప్రతిష్ఠోత్సవాల్లో మంత్రి కొట్టు రాజకీయ ప్రసంగం

విజయవాడ(వన్‌టౌన్), ఫిబ్రవరి 18: ఇంద్రకీలాద్రిపై దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ రాజకీయ ప్రసంగం చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మల్లేశ్వరాలయ స్వర్ణశిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ సీఎం జగన్‌ను పదేపదే స్తుతించారు. జగన్ సంకల్పబలం వల్లే ఇటువంటి కార్యక్రమాలు దిగ్విజయంగా సాగుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో ఆలయ వ్యవస్థకు మంచి రూపురేఖలు తీసుకురావడానికి సీఎం సంకల్పించారని చెప్పారు. ఆయన సూచనల కారణంగానే కైంకర్యాలన్నీ సజావుగా సాగుతున్నాయని పేర్కొన్నారు. దుర్గామల్లేశ్వరులు ఆయనకు మంచి శక్తినివ్వాలని, విజయాలు చేకూరాలని, సంక్షేమ పథకాలు మరింతగా ముందుకు సాగాలని కోరుకుంటున్నానని తెలిపారు. మల్లేశ్వరాలయ పునర్నిర్మాణానికి జగన్ సహృదయంతో సంకల్పించారని చెప్పుకొచ్చారు.

'నైటింగేల్'కు మరోసారి దరఖాస్తులు

▸ నేటి ఉదయం డీఎంఈలో స్ర్కూటినీ

అమరావతి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నర్సింగ్ విభాగంలో అత్యుత్తమ సేవలకు గుర్తింపుగా జాతీయ స్థాయిలో అందించే నైటింగేల్ అవార్డు కోసం డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) మరోసారి దరఖాస్తులు ఆహ్వానించింది. ముందుగా ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 17 నాటికి ఏపీ నుంచి ఎంపిక చేసిన వారి పేర్లను ఢిల్లీకి పంపించాలి. కానీ.. డీఎంఈ అధికారులు ఎంపిక చేసిన జాబితా చూసిన ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. విజిలెన్స్ కేసులున్న వారి పేర్లను సిఫారసు చేయడంతో అధికారులపై ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలోని అన్ని మెడికల్ కాలేజీల నుంచి కొత్తగా దరఖాస్తులు ఆహ్వానించాలని ఆదేశించారు. ఈ మేరకు డీఎంఈ అధికారులు మరోసారి ఆహ్వానించగా.. ఇప్పటికే అనేక దరఖాస్తులు డీఎంఈకి వచ్చాయి. సోమవారం ఉదయం వాటిని స్ర్కూటినీ చేయనున్నారు.

నేరస్తులకు మోదీ రక్షణ

▸ జగన్, కవితలే ఉదాహరణలు: సీపీఐ నారాయణ

▸ కూటమిపై రేపు బెజవాడలో సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో సమావేశం



గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 18: నేరస్తులైనా మద్దతిస్తే చాలని, వారికి మోదీ, అమిత్ షా ఆశ్రయం కల్పిస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆరోపించారు. బెయిల్‌పై తిరుగుతున్న జగన్, వేల కోట్ల లిక్కర్ స్కామ్‌లో ప్రధాన నిందితురాలైన కవిత దీనికి ఉదాహరణలన్నారు. ఆదివారం గుంటూరులోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశ చరిత్రలో బలహీన ప్రధాని వీపీ సింగ్ హయాంలోనూ కంపెనీలు వచ్చాయని, బలవంతుడని చెప్పుకొంటున్న మోదీ పాలనలో ఒక్క కంపెనీ కూడా రాలేదని ఆక్షేపించారు. అందుకే శ్రీరాముని పేరుతో రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. సీఎం జగన్‌కు నెగెటివ్ మనస్తత్వం ఉందని, అందుకే విధ్వంసాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి భజనపరురాలుగా మారారని విమర్శించారు. ఇండియా కూటమి, కలిసొచ్చే పార్టీలతో కలసి సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 20న విజయవాడలో సమావేశం నిర్వహించి, భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.

ఇస్తారా.. ఎగ్గొడతారా?

▸ మూడేళ్లుగా రైతులకు వడ్డీ రాయితీ ఇవ్వలేదు

▸ 2022-23 రబీ పంట బీమా పరిహారం ఊసే లేదు

▸ 2023లో ఖరీఫ్‌లో పంట పరిహారం రూ.400కోట్లు...

▸ ఇన్‌పుట్ సబ్సిడీ 850 కోట్ల చెల్లింపులెప్పుడో

▸ సంక్రాంతికి ఇస్తామన్న రైతు భరోసా మూడో కిస్తీ ఇచ్చేదెప్పుడో

▸ మాట మీద నిలబడడం అంటే ఇదేనా జగన్?

▸ సూటిగా ప్రశ్నిస్తున్న అన్నదాతలు

(అమరావతి- ఆంధ్రజ్యోతి)

నాయకుడంటే మాట మీద ఉండాలి. మాట నిలబెట్టుకున్న వాడే నాయకుడు. రైతులు చంద్రబాబు పేరును గుర్తు పెట్టుకునే పథకం ఒక్కటైనా ఆయన హయాంలో ఉందా?

\- రాప్తాడు సిద్ధం సభలో సీఎం జగన్

2022 రబీ, ఖరీఫ్, 2023 రబీ రైతులకు వడ్డీ రాయితీ రూ.300 కోట్లు ఎప్పుడిస్తావు జగన్? 2023లో కరువు, తుఫాన్‌తో నష్టపోయిన రైతులకు ఇవ్వాల్సిన పరిహారం రూ.1250 కోట్లు ఇచ్చేదెప్పుడు జగన్? ఏటా సంక్రాంతికి ఇస్తానన్న రైతు భరోసా మూడో విడత కిస్తీ సంక్రాంతి పోయి నెలైనా ఇవ్వలేదేం జగన్?

\- అన్నదాతల సూటి ప్రశ్నలు

అన్నదాతలను ఆదుకునే విషయంలో జగన్ సర్కారు మీనమేషాలు లెక్కిస్తోంది. పంట నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట రుణాలపై వడ్డీ రీయింబర్స్ కింద చెల్లించాల్సిన రూ.కోట్లు ఇవ్వడానికి ప్రభుత్వానికి చేతులు రావడం లేదు. క్రమం తప్పకుండా రైతులకు సున్నావడ్డీ రాయితీ ఇస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం 2021-22 రబీ, 2022 ఖరీఫ్, 2022-23 రబీ రైతులకు ఇంత వరకు వడ్డీ రాయితీ ఇవ్వలేదు. మూడు విడతల కింద దాదాపు 30లక్షల మందికి రూ.300 కోట్లు ఇవ్వాల్సి ఉందని అంచనా. ఈ వడ్డీ రాయితీని 2023 నవంబరులోనే ఇస్తామని సంక్షేమ క్యాలెండరులో ప్రకటించిన ప్రభుత్వం ఫిబ్రవరి సగం పూర్తయినా చెల్లించలేదు. ఇటీవల వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని వడ్డీ రాయితీ గురించి ప్రశ్నించగా, ఇచ్చాం కదా.. అన్నారు. అంటే ఇవ్వకుండానే ఇచ్చేశామని చెప్పాలనుకుంటున్నారా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇలాగే 2022-23 రబీ సీజన్‌కు సంబంధించి లక్షలాది రైతులకు పంట బీమా పరిహారం ఇవ్వాల్సి ఉంది. దీనిని 2023 అక్టోబరులో చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు గత సెప్టెంబరులో అసెంబ్లీలో ప్రకటించారు. పంట బీమా పరిహారమూ ఇంత వరకు ఇవ్వలేదు. 2023 ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావం కారణంగా 27లక్షల ఎకరాల్లో విత్తనమే పడలేదు. 62 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేసినా, సాగునీటి సమస్యతో దిగుబడులు తగ్గాయి. 448 మండలాల్లో దుర్భిక్ష పరిస్థితులు కనిపించినా, కేవలం 103 మండలాలనే ప్రభుత్వం కరువు ప్రభావిత



మండలాలుగా ప్రకటించింది. కరువు ప్రాంతాల్లో 14 లక్షలపైగా ఎకరాల్లో పంటలు దెబ్బతిని, ఏడు లక్షల మంది రైతులు నష్టపోయినట్లు అధికారులు అంచనా వేశారు. డిసెంబరులో మిచౌంగ్ తుఫాన్‌కు ఖరీఫ్, రబీ పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారు. 6.65 లక్షల ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు అధికారులు తేల్చారు. దీనికి 4.5 లక్షల మంది రైతులకు రూ.400 కోట్లు, కరువు ప్రాంతాల రైతులకు మరో రూ.850 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ కింద అవసరమని అధికారులు లెక్కలేసారు. కానీ ఇంతవరకూ ఇవేవీ రైతులకు ఇవ్వలేదు. ఇక ఏటా సంక్రాంతి నాటికే రైతు భరోసా మూడో విడత కిస్తీ చెల్లిస్తామన్న ప్రభుత్వం.. సంక్రాంతి పోయి నెల అయినా ఇప్పటి వరకూ భరోసాకు అతీగతీ లేదు. దీంతో చివరలో ఎగనామం పెడతారేమో? అంటూ రైతులు పెదవి విరుస్తున్నారు.

అతిసారతో మరొకరి మృతి



గాజుల సూర్యనారాయణ

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 18: గుంటూరు అతిసార కోరల్లో చిక్కుకుంది. పది రోజుల వ్యవధిలో ముగ్గురు మరణించగా.. ఆదివారం శ్రీనగర్‌కు చెందిన గాజుల సూర్యనారాయణ(75) మృతి చెందారు. దీంతో గుంటూరులో డయేరియా మరణాలు నాలుగుకు చేరాయి. అయినా నామమాత్రపు చర్యలతో ప్రజాప్రతినిధులు, అధికారులు దాటవేత ధోరణితో వ్యవహరిస్తున్నారు. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తాడేపల్లిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గుంటూరులో అనేక ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రజలు డయేరియాకు చికిత్స పొందుతున్నారు.

మద్యం అనుకుని పురుగుల మందు తాగి మృతి

రాజానగరం, ఫిబ్రవరి 18: మద్యం అనుకుని పురుగుల మందు తాగిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలోని తొర్రేడుకు చెందిన కర్రి వీర్రాజు(50) ఈ నెల 4న మద్యం ఎక్కువగా తాగి మరికొన్ని బాటిల్స్ వెంట తెచ్చుకున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యం మత్తులో మద్యం అనుకుని క్రిమి సంహారక మందు తాగేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు.

వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థిని ఆత్మహత్య

తిరుపతి (నేరవిభాగం), ఫిబ్రవరి 18: తిరుపతిలోని ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాలలో పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. తిరుపతి రూరల్ పోలీసుల కథనం మేరకు.. చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం తిరుమలయ్యగారి పంచాయతీ వేణుగోపాలపురానికి చెందిన టీగోవిందరాజులు, మమతల రెండో కుమార్తె శశి (16) కళాశాల బాలికల వసతి గృహంలో ఉంటూ చదువుకుంటోంది. ఇటీవల జరిగిన మొదటి సెమిస్టర్ పరీక్షల్లో ఫెయిలైంది. తల్లి తిడుతుండటం.. పరీక్షల్లో ఫెయిలవడంతో మనస్తాపానికి గురైంది. ఈ క్రమంలో గదిలోని ఫ్యానుకు చీరతో ఉరేసుకుంది.



మంత్రి ఇంటి వైపు వెళ్లకుండా యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు

దగా డీఎస్సీ వద్దు... మెగా డీఎస్సీ ముద్దు

▸ మంత్రి గుడివాడ ఇంటి ముట్టడికి యువజన కాంగ్రెస్ యత్నం

అక్కిరెడ్డిపాలెం(విశాఖపట్నం), ఫిబ్రవరి 18: 'దగా డీఎస్సీ వద్దు-మెగా డీఎస్సీ' ముద్దు అనే నినాదంతో యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, ఎన్ఎస్‌యూఐ ప్రతినిధులు ఆదివారం విశాఖ నగరం మిందిలోని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఇంటిని ముట్టడించేందుకు యత్నించారు. దీనిపై ముందస్తు సమాచారంతో సౌత్ ఏసీపీ త్రినాథ్ ఆధ్వర్యంలో ఉదయమే పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు లక్కరాజు రామారావు ఆధ్వర్యంలో పలువురు నాయకులు రావడంతో వారిని మంత్రి ఇంటివైపు రాకుండా అడ్డుకున్నారు. పోలీసులు వలయంగా ఏర్పడి అడ్డుకున్నప్పటికీ రామారావు వారిని ఛేదించుకుని మంత్రి ఇంటి వైపు పరుగులు తీశారు. మిగతా నాయకులు కూడా మంత్రి ఇంటి గేటు వద్ద బైఠాయించారు. దగా డీఎస్సీ వద్దని నినదించారు. మెగా డీఎస్సీ ఇస్తామని, ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామన్న జగన్ అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులను మోసగించారని రామారావు మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో దగా ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని నిరుద్యోగ యువతను కోరారు. ఆందోళనకారులను పోలీసులు బలవంతంగా ఈడ్చుకుంటూ వెళ్లి వ్యాన్‌లో స్టీల్‌ప్లాంట్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

త్రిపురాంతకంలో జస్టిస్ సుబ్బారెడ్డి పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న జస్టిస్ సుబ్బారెడ్డి దంపతులు

త్రిపురాంతకం, ఫిబ్రవరి 18: ప్రకాశం జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన త్రిపురాంతకంలోని త్రిపురాంతకేశ్వరస్వామి, బాలాత్రిపుర సుందరీదేవిలను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.సుబ్బారెడ్డి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. త్రిపురాంతకేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక అభిషేకం, చినమస్తాదేవికి పూజలు, బాలాత్రిపుర సుందరీదేవికి కుంకుమార్చనలు చేశారు. జస్టిస్ సుబ్బారెడ్డి దంపతులకు శేషవస్త్రాలను, తీర్థప్రసాదాలను అర్చకులు అందజేశారు.

అయోధ్యలో కొనసాగుతున్న టీటీడీ అధికారుల బృందం పరిశీలన

▸ భక్తుల సౌకర్యాల కల్పనపై నేడు నివేదిక



రామాలయ ట్రస్టు ప్రతినిధులతో చర్చిస్తున్న టీటీడీ అధికారులు

తిరుమల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామాలయంలో భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, చేపట్టాల్సిన నిర్మాణాలు, క్యూలైన్ల నిర్వహణ వంటి అంశాలపై టీటీడీ అధికారుల బృందం పరిశీలన కొనసాగుతోంది. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుమల క్షేత్రానికి నిత్యం వచ్చే వేలాది మంది భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనతోపాటు క్యూలైన్ల నిర్వహణ, అభివృద్ధి పనుల్లో టీటీడీ చురుగ్గా ఉంటోంది. గత నెల 22వ తేదీన అయోధ్య రామాలయంలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. భక్తులకు రాముడి దర్శనాలను కూడా ప్రారంభించారు. దేశవిదేశాల నుంచి భక్తులు అయోధ్యకు చేరుకునేలా రవాణా సదుపాయాలను కూడా కేంద్రం పెంచింది. ఈ క్రమంలో రోజురోజుకూ రద్దీ పెరుగుతున్న క్రమంలో అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు కూడా భక్తులకు సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే షిరిడీ, వైష్ణోదేవి, వారాణశి ఆలయాల్లో భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, క్యూలైన్ల నిర్వహణపై టీటీడీ సూచనలు చేసింది. ఈ నేపథ్యంలో రామాలయ ట్రస్టు ప్రతినిధులు టీటీడీ సహకారం కోరారు. ఇందులో భాగంగా నాలుగురోజుల క్రితం టీటీడీ ఇంజనీరింగ్ అధికారుల బృందం అయోధ్యకు చేరుకుంది. క్యూలైన్ల నిర్మాణం, భక్తుల వేచి ఉండే భవనాల నిర్మాణాలపై ట్రస్టు ప్రతినిధులతో చర్చించారు. టీటీడీ ఈవో ధర్మారెడ్డి కూడా శనివారం అయోధ్యకు వెళ్లారు. ట్రస్టు సభ్యులతో సమావేశం నిర్వహించడంతోపాటు రామాలయ పరిసర ప్రాంతాలను పరిశీలించి, అనేక అంశాలపై ట్రస్టు సభ్యులతో చర్చించారు. సోమవారం తమ పరిశీలించిన అంశాలతో నివేదిక రూపొందించి రామాలయం ట్రస్టుకు అందజేయనున్నారు.

బొబ్బిలి కోటకు వెంకయ్య సతీమణి



బొబ్బిలి కోటలోని మ్యూజియంలో వెంకయ్యనాయుడు సతీమణి ఉష

బొబ్బిలి, ఫిబ్రవరి 18: మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు సతీమణి ఉష విజయనగరం జిల్లా బొబ్బిలి పట్టణంలోని చారిత్రక కట్టడాలను ఆదివారం సందర్శించారు. తొలుత స్థానిక కోటలోని మ్యూజియం, రాజావారి గెస్ట్‌హౌస్‌ను పరిశీలించారు. మ్యూజియంలోని రాజుల స్వర్ణ, వెండి సింహాసనాలు, అలనాటి పల్లకీ, బొబ్బిలి యుద్ధంలో వినియోగించిన ఆయుధాలను ఆసక్తిగా తిలకించారు. బొబ్బిలి-విజయనగరం రాజుల మధ్య యుద్ధానికి దారితీసిన పరిస్థితులు, బొబ్బిలి రాజుల చరిత్ర, యుద్ధంలో తాండ్ర పాపారాయుని పాత్ర తదితర అంశాలన్నింటినీ రాజవంశీయుడైన ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) ఆమెకు వివరించారు. రాణి మల్లమ్మదేవి నాయకత్వంలో ఆనాటి మహిళలు ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు సునాయాసంగా ప్రాణత్యాగం చేసి చాటుకున్న తెగువను ఉషావెంకయ్యనాయుడు విని ఆశ్చర్యపోయారు.

కంపెనీలపై కట్టుకథలు

(మొదటి పేజీ తరువాయి)

కొన్ని సంస్థలు మాత్రమే పెట్టుబడులను గణనీయంగా తగ్గించి నామ్ కే వాస్తేగా డీపీఆర్‌లు సమర్పించాయి. ఈ విషయాన్ని దాచిపెట్టి పదేపదే పెట్టుబడుల వరద అంటూ జగన్ సర్కారు అబద్ధాలను ప్రచారం చేస్తోంది.

ఆర్టీఐ దరఖాస్తుకు అరకొర సమాచారం

జగన్ ప్రభుత్వం వచ్చాక 2019 జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు.. 2023 మార్చి 3, 4 తేదీల్లో జరిగిన విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్‌తో సహా పారిశ్రామిక పెట్టుబడులపై కుదిరిన ఒప్పందాలపై పూర్తి వివరాలు ఇవ్వాలని కోరుతూ సమాచార హక్కు సంఘం జాతీయ అధ్యక్షుడు టి.గంగాధర్ ఆర్టీఐ కింద ప్రభుత్వాన్ని కోరారు. సెక్టార్లవారీగా పరిశ్రమలు/వాణిజ్య కార్యకలాపాలకు రాష్ట్ర ప్రభుత్వం/ప్రభుత్వ రంగ సంస్థలతో వివిధ పారిశ్రామిక సంస్థలు చేసుకున్న మొత్తం ఒప్పందాల ప్రతులు (ఎంవోయూలు), సదరు సంస్థలు ఉత్పాదక/వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించిన తేదీలు, కల్పించిన ఉద్యోగాల సంఖ్య (సంస్థల వారీగా) ఎంతో చెప్పాలని దరఖాస్తులో కోరారు. దీనికి రాష్ట్ర పరిశ్రమల శాఖ అరకొర సమాచారాన్ని మాత్రమే ఇచ్చింది. 2019 జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు పరిశ్రమల శాఖ మొత్తం 99 ఎంవోయూలు చేసుకున్నట్లు వెల్లడించింది. అయితే ఇవన్నీ విశాఖ సదస్సులో వచ్చినవే. వాటిలో ఇప్పటి వరకు కేవలం 18 ఎంవోయూల ద్వారా రూ.5,710 కోట్ల పెట్టుబడులు రాగా, 9,150 మందికి ఉద్యోగాలు కల్పించినట్లు పరిశ్రమల శాఖ తెలిపింది. ఆ పరిశ్రమలు కూడా పూర్తి స్థాయిలో పని ప్రారంభించలేదు. యూనిట్ల స్థాపనకు ప్రభుత్వ అనుమతులు, భూ కేటాయింపుల ప్రక్రియ పూర్తికావడంతో గ్రౌండింగ్ దశలో ఉన్నాయి. కాగా రాష్ట్రంలో కొత్తగా నెలకొల్పిన ఆ పారిశ్రామిక యూనిట్లు ఉత్పాదక/వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించిన తేదీలు, ఆయా సంస్థల వారీగా కల్పించిన ఉద్యోగాల సంఖ్యను మాత్రం వెల్లడించలేదు. సమాచార హక్కు చట్టం సెక్షన్ 8(1) (డి) ప్రకారం ఎంవోయూ ప్రతులు ఇవ్వడం కుదరదని స్పష్టం చేసింది. విశాఖ సదస్సులో వివిధ సెక్టార్ల వారీగా సంబంధిత ప్రభుత్వ శాఖలతో కుదుర్చుకున్న ఎంవోయూల వివరాలను మాత్రమే వెల్లడించింది. పరిశ్రమల శాఖ వినహా ఇతర శాఖల పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన వివరాలు ఇవ్వలేదు.



మళ్లీ మళ్లీ ఒప్పందాలు

సాధారణంగా రాష్ట్రంలో కొత్తగా పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే కంపెనీలతో ప్రభుత్వం ఎంవోయూలు చేసుకుంటుంది. అయితే జగన్ సర్కారు రూటే సెపరేటు. గత ప్రభుత్వంలో చేసుకున్న ఒప్పందాలే కొత్తగా కుదిరినట్లు మళ్లీ మళ్లీ చేసుకుంటోంది. అదానీ, అరబిందో, గ్రీన్‌కో, షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ తదితర సంస్థలు గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఒప్పందాలు చేసుకున్నాయి. జగన్ ప్రభుత్వం మళ్లీ అవే సంస్థలతో దావోస్ ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సులో ఒప్పందాలు చేసుకుంది. విశాఖ సదస్సులోనూ మళ్లీ అవే సంస్థలు రూ.వేల కోట్ల పెట్టుబడులు పెడుతున్నాయంటూ ఒప్పందాలు చేసుకుంది. కోటి రూపాయలు కూడా పెట్టుబడి పెట్టే స్థాయి లేని కంపెనీలు.. ఊరూ పేరూ లేని కంపెనీలతో పాటు చివరికి యూట్యూబ్ చానళ్లు, టీవీ యాంకర్లతో కూడా జగన్ సర్కారు ఎంవోయూలు చేసుకుంది.

కంపెనీల జాడే లేదు

ఆయా కంపెనీలతో ఒప్పందాలలో పేర్కొన్న పెట్టుబడుల గణాంకాలను చూసి ఆర్థిక నిపుణులు విస్తుపోతున్నారు. ఉదాహరణకు ఎన్టీపీసీ ఏకంగా రూ.2,35,000 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. కానీ ఆ కంపెనీ మొత్తం మూలధనం 25 వేల కోట్లు మాత్రమే. అదేవిధంగా ఏబీసీ లిమిటెడ్ రూ.12,000 కోట్లు, రెన్యూ పవర్ రూ.97,550 కోట్లు, ఇండోసోల్ రూ.76,033 కోట్లు, ఏసీఎంఈ రూ.68,976 కోట్లు, టీసీపీఎస్‌పీఎల్ రూ.65,000 కోట్లు, జేఎస్‌డబ్ల్యూ రూ.50,632 కోట్లు, హంచ్ వెంచర్స్ రూ.50,000 కోట్లు, గ్రీన్‌కో 47,600 కోట్లు, ఓసీఐవోఆర్ రూ.40,000 కోట్లు, హీరో ఫ్యూచర్స్ సంస్థ రూ.30,000 కోట్లు చొప్పున పెట్టుబడులు పెడతామంటూ ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఇప్పుడు ఈ కంపెనీలన్నీ పత్తా లేకుండా పోయాయి. విశాఖ సదస్సులో చేసుకున్న ఎంవోయూలు వెంటనే కార్యరూపం దాల్చేలా ప్రతి వారం సమావేశమై మానిటరింగ్ చేసేందుకు సీఎస్ నేతృత్వంలో ఒక ఉన్నత స్థాయి కమిటీని కూడా నియమించారు. ఆ కమిటీ ఇప్పటి వరకు 18 సార్లు సమావేశాలు నిర్వహించింది. అయితే కనీసం 18 ఒప్పందాలు కూడా కార్యరూపం దాల్చిన దాఖలాలు లేవు.

వాస్తవ పరిస్థితి ఇదీ..

జగన్ సర్కారు అధికారంలోకి వచ్చాక రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు రాకపోగా.. ఉన్నవి కూడా ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నాయి. ప్రభుత్వ వైఖరితో విసిగిపోయిన కంపెనీలు ఇటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. గత నాలుగున్నరేళ్లుగా పారిశ్రామికాభివృద్ధికి ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. పెట్టుబడులను ఆకర్షించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. యువతకు ఉపాధి అవకాశాలు అడుగంటాయి. రాష్ట్రంలో ఐటీ రంగం కుదేలైంది. 'రాష్ట్రంలో అపారమైన ఖనిజ సంపదతో పాటు పరిశ్రమలు నెలకొల్పడానికి కావలసినంత భూమి, విద్యుత్, నీరు, రవాణా తదితర మౌలిక వసతులు పుష్కలంగా ఉన్నాయి. పెట్టుబడిదారులకు ఎలాంటి రిస్క్ ఉండదు. సింగిల్ డెస్క్ విధానంలో 21 రోజుల్లోనే అన్ని అనుమతులు ఇస్తున్నాం. పారిశ్రామికవేత్తలకు కేవలం ఒక్క ఫోన్ కాల్ దూరంలో అందుబాటులో ఉంటాను. రండి.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి' అంటూ జగన్ పదేపదే వేడుకుంటున్నా పారిశ్రామికవేత్తలు ఏపీ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలు రావడం, త్వరలో ఎన్నికలు జరగనుండటంతో జగన్ సర్కారు కట్టుకథలు చెబుతోంది. రూ.లక్షల కోట్లలో పెట్టుబడులు వస్తున్నాయంటూ ప్రజలను మభ్యపెట్టి, ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రభుత్వ పెద్దలు నానా తంటాలు పడుతున్నారు.

డీపీఆర్‌లూ లేవు

రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న కొన్ని బడా కంపెనీలు ఇప్పటి వరకు కనీసం డీపీఆర్‌లు కూడా సమర్పించలేదంటే పారిశ్రామిక ప్రగతి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అనకాపల్లిలో రూ.50,000 కోట్ల పెట్టుబడితో పరిశ్రమ ఏర్పాటుకు ఎంవోయూ కుదుర్చుకున్న హంచ్ వెంచర్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్, కడప జిల్లాలో యూనిట్ పెడతామన్న జేఎస్‌డబ్ల్యూ (రూ.3,500 కోట్లు), పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, ప్రతిష్ఠ బిజినెస్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (రూ.700 కోట్లు), ఏజీపీ సిటీ గ్యాస్ (రూ.10,000 కోట్లు) తదితర సంస్థలు ఇప్పటి వరకు డీపీఆర్‌లు కూడా సమర్పించలేదు. తిరుపతి జిల్లాలో రూ.2 వేల కోట్లతో యూనిట్ పెడతామన్న బిర్లా కార్బన్ ఇండియా కంపెనీ ఇప్పుడు తన పెట్టుబడిని రూ.1700 కోట్లకు తగ్గించేసింది. వ్యవసాయం, విద్యుత్, పశుసంవర్ధకం, పర్యాటకం, ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో కుదుర్చుకున్న ఎంవోయూల పరిస్థితి కూడా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది.

ప్రభుత్వ శాఖ	ఎంవోయూలు	పెట్టుబడి లక్ష్యం (రూ.కోట్లలో)	ఉద్యోగాలు
వ్యవసాయం	37	3,435	12,935
పశుసంవర్ధకం	8	1,020	3,750
విద్యుత్ రంగం	39	9,05,115	1,69,850
పరిశ్రమలు, వాణిజ్యం	99	3,38,054	2,29,259
ఐటీ, ఎలక్ట్రానిక్స్	86	41,748	1,60,802
పర్యాటకం	117	22,096	30,787
మొత్తం	386	13,11,468	6,07,383

కథా నిలయం 27వ వార్షికోత్సవం


సమాజం నుంచి రచయితగా ఆదరాభిమానాలను గౌరవాలను పొందినవారు సమాజానికి ఋణపడి ఉండాలన్నది కాళీపట్నం రామారావు గాఢంగా నమ్మిన విలువ. దాన్ని అనుసరించే క్రమంలో పుట్టిన ఆలోచనల ప్రతిరూపమే కథానిలయం. ప్రచురితమైన కథలన్నీ భద్రపరిచే ఆలోచనతో 1997లో దానికి ప్రారంభోత్సవం జరిగింది. అప్పటి నుంచి తెలుగు సాహితీ సమాజం దానికి అండగా నిలబడింది. పుస్తకాలు ఇచ్చింది. ధనం చేకూర్చింది. వార్షికోత్సవాలకు అనేక ప్రదేశాల నుంచి వచ్చి కథానిలయం ఆలోచనను అర్థం చేసుకుంది. ఇప్పుడు కథానిలయం వెబ్‌సైట్ కూడా ఏర్పడటంతో సమాచార వితరణకి మరికొంత వెసులుబాటు పెరిగింది. ఎందరో రచయితలు తాము భద్రపరుచుకోలేకపోయిన కథలను సంపుటాలుగా వేసుకోగలిగారు. కథానిలయానికి ఇతర ప్రాంతాలలో వార్షిక కలయికలు అనే ఆలోచన కాళీపట్నం రామారావు జీవితకాలంలో ఫలించలేదు. వారి తదనంతరం వివిధ ప్రాంతాలలో జరపాలని ప్రయత్నం ఆరంభించాం. తొలిసారిగా మిత్రసాహితి సహకారంతో విశాఖపట్నంలో 2023 ఫిబ్రవరిలో జరిపేం. ఈ సంవత్సరం వార్షిక కలయిక హైదరాబాదులో జరపటానికి అన్ని విధాల పూనుకున్నారు వాసిరెడ్డి నవీన్. ఫిబ్రవరి 24 శనివారం సాయంత్రం 5.45 నిమిషాలకు తెలుగు యూనివర్శిటీ ఆడిటోరియం, పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాద్‌లో జరిగే కథానిలయం 27వ వార్షికోత్సవ సభల్లో దాసరి రామచంద్రరావు, వకుళాభరణం రామకృష్ణ, దాసరి అమరేంద్ర, కాళీపట్నం సుబ్బారావు, వాసిరెడ్డి నవీన్ పాల్గొంటారు. సభలో 'సురవరం ప్రతాపరెడ్డి కథలు - ఆనాటి కథానేపథ్యం' అంశంపై సుంకిరెడ్డి నారాయణరెడ్డి; 'కథలు చెప్పే కథలు' అంశంపై కె. సునీతారాణి; 'నేటి కథాసాహిత్యంలో యువస్వరాలు' అంశంపై మహమ్మద్ ఖదీర్ బాబు ప్రసంగిస్తారు. వివరాలకు ఫోన్: 94900 08743.

వివిన మూర్తి

అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం

ఫిబ్రవరి 21 అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ సందర్భంగా మాతృభాషల ప్రాధాన్యత అంశం మీద విజయవాడ లయోల కళాశాలలో, ఆ కళాశాల సహకారంతో సదస్సు జరుగుతుంది. ఇందులో పాపినేని శివశంకర్, ఫాదర్ కిషోర్, గారపాటి ఉమామహేశ్వరరావు, వేంకటేశ మాచకనూర్ (కన్నడ), ఇందు మీనన్ (మలయాళం), ఎల్. రామమూర్తి (తమిళం) పాల్గొంటారు. కవితాపఠనం కార్యక్రమంలో భట్టు నాగేశ్వరరావు (బంజారా), అక్షత రాజ్ పేర్ల (తుళు), ఆర్.ఆనందం (బదగ), ఆత్రం మోతీరాం (కోలామి), గార రంగనాథం, బండ్ల మాధవరావు, మందరపు హైమవతి (తెలుగు), వాసమలి (తోడ), ముల్లెంగడ మాధోశ్ పూవయ్య (కొడవ), రామచంద్రన్ కందమల (ముల్లుక్కురుమ), కొట్నాక్ సాయి కుమార్ (గోండి) లు పాల్గొని తమ కవితలు వినిపిస్తారు.

బండ్ల మాధవరావు



నాలుగెకరాల భూమి

భాషకు అందాన్ని సొగసునిచ్చే
శబ్ద అర్థాలంకారాల వలే
కొట్టంలో గాటికి కట్టేసిన
తెల్లెద్దు ఎర్రెద్దు మా ఇంటికి అలంకారాలు
ఏ ఆవుబిడ్డలో మా ఎద్దులు
భూమికి ఋణపడి పనిచేశాయి
పుట్టెడు వడ్లను బండికేస్తే
తువ్వపోంటి పోటీపడి లాగేవి

నాయెద్దు నాయెద్దు అని
తమ్ముడు నేను మురిసిపోయేటోళ్ళం
జొన్నరొట్టెలు పెట్టి మమల్ని సాకినట్లే
బుట్టి నిండా దానపెట్టి బుడ్డెద్దులను సాకిండు
రాముడు యుద్ధం గెలవడానికి
వానర సైన్యం తోడైనట్లుగా
నాలుగెకరాల భూమి దున్నడానికి
నాన్నకు బుడ్డెద్దులు తోడైనాయి
అపాయాన్ని ముందే పసిగట్టే జింకవలే
తీసుకున్న అప్పుకు వడ్డీ రెండింతలు
వసూలు చేసే మోసాన్ని పసిగట్టిండు

పదవీవిరమణ చేసిన ఉద్యోగిని
గౌరవంగా సన్మానించినట్లే
భూమికోసం పనిచేసిన బుడ్డెద్దులను
పదవీవిరమణ చేయించి సత్కరించాడు
కూతురు పెళ్లి చేసి పంపుతున్నప్పుడు
తల్లిదండ్రులు పట్టుకోని ఏడ్చినట్లే
సంతలో బుడ్డెద్దులను అమ్మినప్పుడు
గుండెలకద్దుకోని ఏడ్చాడు
ఒకటి కావాలంటే మరొకటి వదులుకోవాలన్నట్లుగా
బిడ్డల చదువులు కావాలనుకుండు
నాలుగెకరాల భూమి అమ్ముకుండు

గుర్తింపు కోసం ఆధార్ కార్డు చూస్తున్నట్లు
పెళ్లి సంబంధానికి భూమి అడుగుతుంటే
అసలుకు రెండింతలు వడ్డీ కట్టిన రోజులను
నాన్న నెమరువేసుకుంటున్నాడు
నాలుగెకరాల భూమిలో పారిన
తన రెక్కల కష్టాన్ని యాది చేసుకుంటుండు
బిడ్డల జీవితాలే ముఖ్యమనుకున్న
మా నాన్న భూమిలేనివాడైండు

ఎజ్జు మల్లయ్య
96528 71915

బొమ్మలు: అక్బర్



వాళ్లు వొచ్చారు

వాళ్లు ఊరికెనే రాలే
అడవి పరిమళాన్ని మోసుకు వచ్చారు
పుట్టెడు దుఃఖాల్నీ, అనంత కోపాలనూ
ప్రకటించడానికే వచ్చారు

మైదానం మీద నమ్మకంతో
అడవిని దాటుకు వచ్చారు.

పొలాల్ని చదవడం తప్ప
పెద్దగా పుస్తకాలు చదివింది లేదు
పొడిపొడి మాటలు తప్ప
పెద్దగా ఉపన్యసించిందీ లేదు
మాటల మధ్య ఖాళీలకు
మనసద్ది చూస్తే మాత్రం
మనకు ఒక బస్తరు కనబడుతది
ఒక బాస గూడ భగ్గు మంటది
కార్పొరేట్ మైనింగుల్లో
ఊపిరాడని శ్వాసల్ని వింటాం
తెగిపడ్డ దేహాల హాహాకారాల్నీ వింటాం

భావం చేరడానికి
భాష ఎప్పుడు పెద్దగా అడ్డురాలేదు
కరచాలనాలన్నీ
నదీ సంగమాలై పోయాయి

వాళ్లు అట్లా సభా ప్రాంగణంలో తిరుగాడుతుంటే
అడవి మా చుట్టే
తిరుగాడుతున్నట్టనిపించింది
మెట్ల మీద కూర్చొని
గలగల నవ్వుతుంటే
ఇంద్రావతి
మా కాళ్లను చుట్టేసినట్టే అనిపించింది.

వేదిక మీద లయబద్ధ విన్యాసం
అనేక జలపాతాల పోరు
అది సిలింగేరు జోరు

ఈ నగరాన్ని చూసి
మాకు సంతోషమయిందని
వాళ్ల మాట వరసకు అన్నారేగాని
నిజానికి
నగరమే వాళ్లని చూసి మురిసిపోయింది

వాళ్లకు సలాం...

(విరసం సభల్లో సిలింగేర్ ఉద్యమకారులను చూసి)

ఉదయమిత్ర
89196 50545

వాస్తవాన్ని పరిపూర్ణం చేసేది కల్పనే!

'Art is a lie that enables us to realize the truth.' – Pablo Picasso

బహుశ 1976లో... కృష్ణా పత్రికలో ఎ. నారాయణ మూర్తి అనువదించిన ఒక ఆంగ్ల నవల సీరియల్‌గా వచ్చినప్పుడు.. అది చదువుతూ నేను ఆశ్చర్యపోవడమే కాదు, అందులోని ఘట్టాలు, సన్నివేశాలు నమ్మశక్యం కానివిగా, అభూత కల్పనలుగా భావించాను కూడా. చారిత్రిక ఉదంతాలు, రాజకీయ సంఘటనల నేపథ్యంలో అల్లిన ఒక నిండైన ప్రేమ కథలా, ఆసక్తికరమైన చిక్కటి ప్లాట్‌తో, నాలుగు భాగాలుగా సాగిన ఆ నవల ప్రధానంగా హుకుం చంద్ (జిల్లా మేజిస్ట్రేట్) అనే పాత్ర దృష్టి కోణంలో నడిచింది. జరుగుతోన్న అల్లర్లు, మత కల్లోలాలు చెదరుమదరు ఘటనలనీ, త్వరలోనే అంతా సర్దుకుని శాంతి నెలకొంటుందని మొదట భావించిన అతడు- మత విద్వేషాలు కార్చిచ్చులా వ్యాపించి దారుణ మారణకాండకు దారితీయడం గమనించి, చేజారిపోతోన్న పరిస్థితులకు కారణమైన ఢిల్లీలోని రాజకీయ నాయకులను తిట్టుకుని, తన నిస్సహాయ స్థితికి ఖిన్నుడై, చివరికి తన పరిధిలో కొన్ని మంచి నిర్ణయాలు తీసుకుంటాడు, లాకప్‌లో వున్నవారిని విడిచి పెట్టమని ఇన్‌స్పెక్టర్‌ని ఆదేశిస్తాడు. సైనికాధికారి వచ్చి విషయం చెప్పి ప్రభుత్వ ఆదేశాలు వివరించినప్పుడు, హుకుం చంద్ పోలీసులు వెంటరాగా రైల్వేస్టేషన్‌కి వెళ్లి స్వయంగా రైలు పెట్టెల్లోని గుండెలవిసే దృశ్యం చూసి వాస్తవ పరిస్థితి తీవ్రత తెలుసుకుంటాడు. "రైలు స్టేషన్లను దాటుకుంటూ వెళ్లేందుకు వీలుగా డ్రైవర్‌ను, గార్డును మాత్రం ప్రాణాలతో వదిలారు." పోలీసులు, సైనికులు కలిసి ప్రతి ఇంటి నుంచి కిరసనాయిల్, కట్టెలు ఎందుకు సేకరిస్తున్నారో మనోమజ్రా గ్రామ ప్రజల ఊహకు అందదు, ఎవరినీ అడగలేరు. రకరకాల వార్తల నేపథ్యంలో సరిహద్దు గ్రామాల ప్రజలు దిక్కు తోచని స్థితిలో పిల్లాపాపలను చంకనేసుకుని మూటాముల్లెలతో తరలిపోతుంటే సైనికులు కాల్పుల హెచ్చరిక చేసి నిలువరిస్తారు, సరిహద్దు దాటిపోవాలనుకున్న వాళ్ళను ముందస్తు ప్రకటనతో సమీకరించి, క్యాంపులో దింపేందుకు ట్రక్కుల్లోకి ఎక్కిస్తారు. ఊరి బయట పొలిమేరల్లో కనపడిన దృశ్యం- "...నీలి-బూడిద రంగులోకి మారిన దిఙ్మండలం మళ్ళీ నారింజ రంగులో ప్రకాశించింది. నారింజ వర్ణం క్రమంగా తామ్రవర్ణంగా, పిదప జ్వాజ్జల్యమానమైన కావిరంగుగా మారింది. ఎర్రని అగ్నిజ్వాలలు నల్లని ఆకాశంలోకి ఎగిశాయి. ఒక చల్లని గాడ్పు ఊరి దిక్కుగా మెల్లగా వీచనారంభించింది. మండుతోన్న కిరోసిన్.. ఆ తర్వాత కట్టెల వాసనని.. అది మోసుకొచ్చింది. ఆ వెంటనే కాలుతోన్న మాంసపు కమురు వాసన గాలిలో తేలివచ్చింది..." దీన్నిబట్టి మనోమజ్రా గ్రామస్తులు లాహోర్ నుంచి రైలు ఏమి మోసుకు వచ్చిందో గ్రహించగలుగుతారు..

సాహిత్యాన్ని స్థూలంగా ఫిక్షన్ - నాన్‌ఫిక్షన్ అని వర్గీకరిస్తాం. కథలు, నవలలు, నాటకాలు, కావ్యాలు ఫిక్షన్ కోవకి; శాస్త్ర విజ్ఞాన/ చరిత్ర/ పరిశోధన/ విమర్శ/ విశ్లేషణ వ్యాసాలు, యాత్రా కథనాలు, జీవిత గాథలు, ఆత్మకథలు, పాత్రికేయ రచనలు, ఇంటర్వ్యూలు... ఇవన్నీ నాన్‌ఫిక్షన్ కోవకి చెందుతాయి. ఫిక్షన్ అంటే కాల్పనికం, నాన్‌ఫిక్షన్ అంటే వాస్తవికం... అనే సాధారణ అభిప్రాయం ఒక వర్గం విద్యావంతులలో చెలామణిలో వున్న నేపథ్యంలో 'నిజం కాని' కల్పనని అనుమానించడం, 'యదార్థమైన' వాస్తవాన్ని అభిమానించడం సహజం. వాస్తవం నిస్సందేహంగా ఒక విషయం 'నిజంగా జరిగింది' అనే అర్థాన్నే స్ఫురింప జేస్తుంది; కాల్పనికం ఎల్లప్పుడూ ఒక 'ఊహించిన/ సృజియించిన విషయం'గానే ధ్వనిస్తుంది. అయితే, చాలా ఏళ్ల తర్వాత, ఈ 'Train to Pakistan' (1956, కుష్వంత్ సింగ్) నవలని మూలభాష ఇంగ్లిష్‌లో చదివాక, అదే పేరుతో 1998లో వచ్చిన దాని ఫిలిం అడాప్టేషన్ (పమీలా రూక్స్ దర్శకత్వంలో) చూశాక నా అభిప్రాయాలు, ఆలోచనలు మారాయి. 'నిజంగా జరిగింది (fact)', 'ఊహించి రాసింది (fiction)' - అనే ఈ రెండూ సత్యాన్ని ప్రతిష్ఠించడంలో సమాన పాత్ర వహిస్తాయి అని అర్థమైంది. 'The Ice candy Man' (బాప్సి సిధ్వా నవల), 'Tamas' (భీష్మ సహాని నవల), 'పింజర్' (అమృతా ప్రీతం పంజాబీ నవల), 'A Flight of Pigeons' (భారతీయాంగ్ల రచయిత రస్కిన్ బాండ్ నవలిక), 'Difficult Daughters' (మంజు కపూర్ 1998 నవల)... ఈ పుస్తకాలన్నీ చదివాక ఫిక్షన్ గురించిన నా సానుకూల అభిప్రాయం బలపడింది.

ఒక పని లేదా ఘటన జరిగింది అంటే అది గతం లోకి జారిపోయింది. వర్తమానంలో దానికి భౌతిక అస్తిత్వం లేదు. దాని పర్యవసానాలు, ఫలితాలు ఇంకా వుంటే వుండవచ్చు. దానిని పూర్వ రూపంలో సూచనప్రాయంగా చిత్రించిన/ ప్రతిబింబించిన అక్షర లేదా రేఖా చిత్రణలు ఉండవచ్చు. 1857లో సిపాయిల తిరుగుబాటు, భారత స్వాతంత్ర్యానంతర దేశవిభజన (1947) నాటి కల్లోల పరిస్థితులు, రక్తపాతం, మారణహోమం, 1940-48లలో జరిగిన నైజాం వ్యతిరేక పోరాటాలు, రజాకార్ల అకృత్యాలు... ఇవన్నీ జరిగిపోయిన ఘటనలు.

ఇవేగాక ప్రపంచ చరిత్రలో అనేక ఘటనలకు సంబంధించిన సమాచారం (factual information?) కాస్తా వివరంగానో, అరకొరగానో చరిత్ర పుస్తకాలు, ఆర్కైవ్స్, క్రానికిల్స్, ప్రభుత్వ డాక్యుమెంట్స్.. తదితర ఆకరాలలో నిక్షిప్తమై వుంటే ఉండవచ్చు. కానీ, మానవ జాతి చారిత్రిక ప్రస్థానంలో సంభవించిన అనేక రాజకీయ పరమైన, ఆర్థిక పరమైన ముఖ్య ఘటనలు, అవి స్థూలంగా మానవ సమాజంపై, నిర్దిష్టంగా మనుషుల వ్యక్తిగత జీవితాలపై పడవేసే ప్రభావం వివరంగా 'ఫిక్షన్' లోనే నమోదై వుండి ఒక తరం నుండి మరో తరానికి తెలియ వస్తుందనేది కాదనలేని సత్యం. మరో విధంగా చెప్పాలంటే, భౌతికంగా అస్తిత్వంలో లేని వాస్తవాన్ని అక్షరబద్ధం చేసి దానికి శాశ్వతత్వం కట్టబెట్టేది కాల్పనికమే!

వాస్తవం, కాల్పనికం... ఈ రెండింటి నడుమ వుండే చిత్రమైన సంబంధాన్ని మరింత స్పష్టంగా చూడాలనుకుంటే మనం ఈ రెండూ అత్యంత సన్నిహితంగా సంచరించే 'చరిత్ర' అనే అంశంలోకి అడుగుపెట్టాలి. చరిత్ర అంటే ఒక అర్థంలో గతకాలపు ఘటనల రాశి లేదా పరిణామాల పరంపర; మరో అర్థంలో, గతంలో జరిగినవని భావించిన ఘటనలకు సంబంధించిన వ్యాఖ్యానాల, జనవాక్యాల అక్షరీకృత రూపం- అంటే దస్తావేజు. గతకాలాల ఘటనలరాశిగానూ, ఆ ఘటనలకు సంబంధించిన 'గాథ' గానూ చరిత్ర మనకు స్ఫురిస్తుందన్న మాట. దీనిని బట్టి, చరిత్రకు వాస్తవం, కాల్పనికం అనే ద్వంద్వ రూపాలున్నాయన్నది స్పష్టమవుతున్నది. సమకాలీన చరిత్రగతిని ప్రత్యక్షంగా, సంపూర్ణంగా వీక్షించడం

> **మానవ జాతి చారిత్రిక ప్రస్థానంలో సంభవించిన అనేక రాజకీయ పరమైన, ఆర్థిక పరమైన ముఖ్య ఘటనలు, అవి స్థూలంగా మానవ సమాజంపై, నిర్దిష్టంగా మనుషుల వ్యక్తిగత జీవితాలపై పడవేసే ప్రభావం వివరంగా 'ఫిక్షన్' లోనే నమోదై వుండి ఒక తరం నుండి మరో తరానికి తెలియ వస్తుందనేది కాదనలేని సత్యం. మరో విధంగా చెప్పాలంటే, భౌతికంగా అస్తిత్వంలో లేని వాస్తవాన్ని అక్షరబద్ధం చేసి దానికి శాశ్వతత్వం కట్టబెట్టేది కాల్పనికమే!**



ఎవరికీ సాధ్య పడదు. బ్రిటిష్ ఇండియాలో 1857 సిపాయిల తిరుగుబాటు పరిణామాలు, ద్వేషంతో రగిలిపోయిన భారతీయులు ఆంగ్లేయులపై సాగించిన హత్యాకాండ, దయాళువులైన దాదీలు ప్రాణాలకు తెగించి బ్రిటిష్ కుటుంబాలను రక్షించిన వైనం; లాహోర్ నుంచి హిందువుల, సిక్కుల, గురుదాస్ పూర్ నుంచి ముస్లిముల పీనుగులతో, కోసివేయబడిన స్త్రీల వక్షోజాల మూటలతో నిండిన రైలుపెట్టెలు, ఆడవాళ్ళ కిడ్నాపులు, హత్యలు, తలల నరికివేతలు, వయోభేదం చూడని అత్యాచారాలు, బలవంతపు నిఖాలు, ఆత్మరక్షణకై మతమార్పిడులు, నీటికి బదులు కిరోసిన్ చిమ్మిన అగ్నిమాపక దళాలు, లూటీలు, గృహదహనాల్లో సర్వం కోల్పోయి శోక తప్త హృదయాలతో పుట్టిన గడ్డ పైనే కాందిశీకులై శిబిరాల్లో తలదాచుకున్న ప్రజలు, వారి దీన, హీన స్థితిగతులు; నాజీ కాన్‌సెన్‌ట్రేషన్ క్యాంపుల్లోని ఘోర దురంతాలు, దహన బట్టీలలో, గ్యాస్ చాంబర్‌లలో యూదుల మూకుమ్మడి వధ, అథో మానవ పరిస్థితుల్లో ఆకలికి తాళలేని ఖైదీలు తలలు పేల్చివేయబడిన రష్యన్ యుద్ధ ఖైదీల పచ్చి మెదడుని ఆరగించిన వైనం; ఒక వైపు మొదటి ప్రపంచయుద్ధం, మరోవైపు బోల్షివిక్ విప్లవం రష్యాని అతలాకుతలం చేసిన సందర్భంగా రెడ్‌ఆర్మీ, జార్ సైన్యాలు, డాన్ నదీ తీర ప్రాంత కోసక్కుల మధ్య జరిగిన దారుణ రక్తపాతం, ప్రజల జీవితాల్లోని కల్లోలం; నైజాం నిరంకుశ పాలన కాలంలో రజాకార్ల దుర్మార్గాలు, తెలంగాణ ఫ్యూడల్ దొరల ఘాతుకాలు, ప్రజల బాధలు, పోరాటాలు... వీటిని ఎవరైనా చరిత్రకారుడు నేరుగా చూసి ఉంటాడని భావించలేము. బాధితుల అనుభవాలు, భౌతిక అవశేషాలు, ఆనవాళ్ళు, వార్తాకథనాలు, చాయాచిత్రాలు, శాసనాలు, ప్రభుత్వ ఉత్తర్వులు, రికార్డులు, కైఫీయతుల ఆధారంగానే చరిత్రకారుడు గత చరిత్రను నిర్మిస్తాడు.

చరిత్రకు 'గాథ' మూలం కాబట్టి చరిత్ర నుంచే 'కథ' వ్యుత్పన్నమైనదని విదితమవుతుంది. 'వాస్తవం' కలకాలం నిలవాలంటే 'కాల్పనికం' అవాల్సిందే. ఈ కోణం లోంచి చూసినప్పుడు కాల్పనికం (fiction) వాస్తవానికి (fact) విరుద్ధమైనది కాదు, పైపెచ్చు దానికి పరిపూరకం.

ఆధునిక భారతదేశ చరిత్రలో దేశవిభజన ఒక నెత్తుటి మరక. దేశం రెండుగా చీలి పాకిస్తాన్ అనే కొత్త రాజ్యం ఏర్పడ బోతున్నదన్న ప్రకటన 1947 వేసవిలో వెలువడగానే దాదాపు ఒక కోటి మంది ప్రజలు సరిహద్దు ఇరువైపులా వలస బాట పట్టారు; వర్షాకాలం ప్రవేశించే సమయానికి దాదాపు 10 లక్షల మంది మరణించారు; ఉత్తర భారత్ యావత్తు ఆయుధాలు చేతపూని పిచ్చిభయంతో నిద్రలేని రాత్రుళ్ళు గడిపింది. మత విద్వేషాల కారణంగా చెలరేగిన అప్పటి కల్లోలం అమాయక ప్రజల జీవితాలను చిన్నాభిన్నం చేసిన తీరుని, పంజాబ్‌లోని ఒక కల్పిత ప్రదేశం (మనోమజ్రా ఊరు) నేపథ్య సెట్టింగ్‌గా, అద్భుతంగా చిత్రించిన క్లాసిక్ 'ట్రెయిన్ టు పాకిస్థాన్'. హిందూ, ముస్లిం, సిక్కు స్నేహితుల మైత్రికి దేశవిభజన పెట్టిన చిచ్చు, మత విద్వేషానికి బలైపోయిన శాంత అనే హిందూ యువతి దీనగాథ... లెన్నీ అనే పార్సీ బాలిక దృష్టికోణంలో ఆర్ద్రంగా చిత్రించిన నవల 'ద ఐస్‌కాండీ మేన్'. హిందూ-ముస్లిముల విద్వేషాలకు బలిపశువై, కుటుంబాల పరువు ప్రతిష్ఠల మాటున అస్తిత్వాన్ని కోల్పోయి, పురుషాధిపత్య పద ఘట్టనల కింద జీవచ్ఛవంలా నలిగిన పూరో అనే అభాగ్య స్త్రీ వ్యథాభరిత జీవితాన్ని అక్షరీకరించిన నవలిక 'పింజర్'.

అక్టోబర్ విప్లవం, తదనంతర అంతర్యుద్ధం నేపథ్యంలో, కోసక్కుల ఆరాటాలు పోరాటాలు ఇతివృత్తంగా, నాటి అల్లకల్లోల పరిస్థితుల్లో రష్యన్ ప్రజల జీవితాన్నిసర్వ దిగ్దర్శకంగా, రాజకీయ, చారిత్రిక, మిలిటరీ, రోమాన్స్ కోణంలో- రెడ్‌ఆర్మీ దళాల మితి మీరిన చర్యలతో సహా- చిత్రించిన బృహత్ నవల 'And Quiet Flows the Don'. దీని రచయిత మిఖాయిల్ షొలకోవ్ 1965లో సాహిత్యానికి నోబెల్ ప్రైజ్ అందుకున్నాడు. జర్మన్ పాలకుడు విల్హెల్మ్ కైజర్ ప్రేరేపించిన ఫ్రాన్స్‌తో యుద్ధంలో (1916) పాల్గొన్నప్పటి స్వీయానుభావాలను, యుద్ధం విగిల్చిన విషాద జ్ఞాపకాలను, పౌర జీవితంతో ఎడబాటుకి సంబంధించి సైనికుల శారీరక, మానసిక మనో వేదనని 'All Quiet on the Western Front'లో జర్మనీ రచయిత ఎరిచ్ మారియ కళ్ళకు కట్టినట్లు రెమార్క్ చిత్రించాడు. యుద్ధవ్యతిరేక నవలల్లో ఇది మొదటి స్థానం ఆక్రమిస్తుంది. వియెత్నాం యుద్ధంలో ఒక అమెరికన్ సైనిక ప్లాటూన్ అనుభవాల్ని అనేక ఎపిసోడ్స్‌గా చిత్రించిన 'The Things They Carried' కథా సంపుటి ద్వారా యుద్ధం ఒక వృథాప్రయాస అని నర్మగర్భంగా ప్రకటించిన టిం ఒ'బ్రియన్‌తో ఏకీభవించకుండా, తీవ్రంగా ప్రతిఘటించిన వియెత్నాం ప్రజల పట్ల సానుభూతి చూపకుండా ఉండలేము. తీవ్ర క్షుద్బాధ, చావుభయం అనుక్షణం వెంటాడే పరిస్థితుల్లో (నాజీ కాన్సెంట్రేషన్ క్యాంపుల్లో) ఎలాగోలా బతకడమే పరమావధి అనుకున్న మనిషి ఎంతటి అనైతిక, అమానవీయ, అథో స్థితికి దిగజారుతాడో పోలిష్ కవి, రచయిత బోరోవ్‌స్కీ స్వీయానుభవాల క్వాజీ-కథలు 'This is the Way for the Gas, Ladies and Gentlemen' అద్దం పడతాయి. ఇవి మనల్ని నిద్ర పోనీయవు. ఆధునిక నాగరికత విలువలను అపహాస్యం చేసిన నియంతల యుద్ధోన్మాదం, విజ్ఞానశాస్త్ర దుర్వినియోగం, అది ప్రేరేపించిన హోలోకాస్ట్... వీటి గురించి విరివిగా వచ్చిన దేశ విదేశాల కాల్పనిక సాహిత్యం (ఫిక్షన్) చరిత్ర వేసిన తప్పటడుగులను మనకు నిత్యం గుర్తు చేస్తుంది.

ఆడెపు లక్ష్మీపతి
97012 27207

"తెలుగు ముస్లిం కథకు ఆదరణ పెరిగింది" - వేంపల్లె షరీఫ్

తెలుగు ముస్లిముల జీవన వైవిధ్యాలను, సంస్కృతీ సంప్రదాయాలను, పేదరికాన్ని శక్తిమంతంగా సాహిత్యంలోకి తెస్తున్న కొద్దిమంది కథకుల్లో వేంపల్లె షరీఫ్ ఒకరు. అలా అని షరీఫ్ ముస్లిం కథకుడు అంటూ ముద్రవేసి చూడటం పెద్ద మర్రిచెట్టును బోన్సాయ్ మొక్కగా కుండీలో కుదించి చూపడమే అవుతుంది. ఇతివృత్తం ఎంపికలో, కథానిర్మాణంలో, పాత్రల చిత్రీకరణలో, మొత్తం కథను ఉత్తమంగా మలచడంలో అతనిదొక ప్రత్యేకత.

కేంద్ర సాహిత్య అకాడెమి యువ పురస్కారం పొందిన 'జుమ్మా' కథల సంపుటితో పాటు 'టోపి జబ్బార్' అనే మరో కథల సంకలనాన్ని షరీఫ్ వెలువరించారు. మరో కథకుడు ఖదీర్ బాబుతో కలసి ముస్లిం నేపథ్య కథల సంకలనం 'కథామినార్' వెలువరించారు. ఇటీవలే తెలుగులో 40 ఏళ్లలోపు వయసున్న యువ కథకుల సంకలనం 'యువ-అండర్ ఫార్టీ'ని తీసుకొచ్చారు. ఇటీవల రాసిన 'మట్కా' కథను కేస్ స్టడీగా తీసుకుని కథ వెనక కథను నెమరు వేసుకున్నారు. తెలుగులో ముస్లిం సాహిత్యం స్థితిగతులనూ తలపోసుకున్నారు.

ఇటీవల షరీఫ్ రాసిన 'మట్కా' కథ నేపథ్యం...

రాయలసీమలోని చాలా ఊళ్లలో ఇప్పటికీ మట్కా జాడ్యం వేళ్లూనుకుపోయి ఉంది. వైఎస్ఆర్ జిల్లా ప్రొద్దుటూరులో

సంభాషణ: **గోవిందరాజు చక్రధర్**

కొంతమంది తెలిసినవాళ్ల మట్కా ఆడుతుంటే గమనించేవాణ్ణి. పేదరికంలో ఉన్న వారిని ఆశల పల్లకిలో ఊరేగిస్తోంది మట్కా. ఈ సమస్యపై కథ రాయాలని చాలా కాలంగా అనుకుంటున్నాను. మట్కాకు ప్రాంతాన్ని బట్టి రకరకాల పేర్లున్నాయి. కొన్ని చోట్ల దీన్ని బ్రాకెట్ అంటారు. కథలో మొదట నసీమూన్ పాత్ర ప్రతికూల పాత్రపై తిరుగుబాటు చేసినట్టు రాసుకున్నాను కానీ ఆ పాత్ర తిరుగుబాటు చేయడానికి నిరాకరించింది. పాత్ర చెప్పినట్టు వినాల్సి వచ్చింది.

పాత్ర గొప్పదా? రచయిత గొప్పవాడా?

పాత్రే గొప్పది అంటాను. ఎందుకంటే రచయిత పాత్రను సృష్టిస్తాడు. తర్వాత దాని గమ్యాన్ని అదే వెతుక్కుంటుంది. బలవంతంగా దాన్ని కంట్రోల్ చేయాలని చూస్తే కథ ఔచిత్యం దెబ్బతినే అవకాశం ఉంది. నా కథల్లో నేను చాలా సార్లు పాత్రల మాటే విన్నాను. నేనేదో అనుకుని మొదలు పెడితే పాత్ర ఇంకేదో అనుకుని అర్థాంతరంగా ముగిసిపోతుంది. మంచి రచయిత పాత్ర మాటే వింటాడని నా నమ్మకం. అయితే కథ ప్రధాన అంశాన్ని నిర్దేశించేది మాత్రం రచయితే.

ప్రతి కథా ఒక సవాలే!

నేను రాసిన 'తలుగు' అనే కథ కూడా నాకు మంచి పేరు తెచ్చి పెట్టింది. కులాలే లేవు అని నమ్మే ముస్లిం సమాజం కుల వ్యవస్థను ఎలా పాటిస్తుందో చెబుతూనే మొత్తం ముస్లిం సమాజాన్ని మెజార్టీ సమాజం ఎలా చూస్తుందో చెప్పే ప్రయత్నం చేశాను. ముస్లిముల్లో నువ్వు ఏ ఉపకులానికి చెందినవాడివైనా సరే అంతిమంగా మెజార్టీ సమాజం పెట్టే పరీక్షకు నిలబడాల్సిందే అనే అర్థాన్ని కూడా ప్రభావవంతంగా ఇవ్వదల్చుకున్నాను.

ఇలాంటి సమాకాలీన, రాజకీయ, సాంస్కృతిక అంశాల కథలు రాస్తున్నప్పుడు ఇతర ఏ వర్గ రచయితకు లేని సవాళ్లు ముస్లిం రచయితకు ఎదురవుతాయి. కథలో లేని అర్థాలు ధ్వనించి ఏ వర్గం మనోభావాలు దెబ్బతిన్నా కథ ఉద్దేశ్యం నెరవేరదు. అందుకే స్వతహాగానే కథ రాయడం ఒక సవాలైతే ఇలాంటి ఇతి వృత్తాలతో రాయడం డబుల్ సవాల్. కథా లక్షణాలను పట్టించుకుంటూనే ఈ విషయాలను సమర్థవంతంగా రాయడంలో తెలుగు ముస్లిం కథకులు మంచి పరిణితితో వ్యవహరిస్తున్నారని నా అవగాహన.

ముస్లిం కథకు ఆదరణ పెరుగుతోంది

గతంతో పోల్చుకుంటే ఇప్పుడు తెలుగులో ముస్లిం కథకు ఆదరణ పెరిగింది. దేశ పరిణామాలను ఇవ్వాళ ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోగలుగుతుండటమే అందుకు కారణమని నేను భావిస్తాను. ఇప్పుడున్న పరిస్థితుల్లో ముస్లిం సాహిత్య అవసరాన్ని పాఠకులు, మేధావులు, పాత్రికేయులు గుర్తిస్తున్నారు. ఒక్క తెలుగులోనే కాదు ఇతర భాషల్లోనూ మైనార్టీ సాహిత్యానికి ఆదరణ పెరిగింది. అయితే తెలుగులో విమర్శే ముస్లిం కథ మీద అనుకున్నంత రాలేదు. మైనార్టీ సాహిత్య పరిధిని కుదించి చూడటం లేదా ఆ జీవితాన్ని దగ్గరగా పరిశీలించిన అనుభవం, ఆసక్తి లేకపోవడం అందుకు కారణం కావొచ్చు.

> **ఇప్పుడున్న పరిస్థి తుల్లో ముస్లిం సాహిత్య అవసరాన్ని పాఠకులు, మేధావులు, పాత్రికేయులు గుర్తిస్తున్నారు. ఒక్క తెలుగులోనే కాదు ఇతర భాషల్లోనూ మైనార్టీ సాహిత్యానికి ఆదరణ పెరిగింది. అయితే తెలుగులో విమర్శే ముస్లిం కథ మీద అనుకున్నంత రాలేదు. మైనార్టీ సాహిత్య పరిధిని కుదించి చూడటం లేదా ఆ జీవితాన్ని దగ్గరగా పరిశీలించిన అనుభవం, ఆసక్తి లేకపోవడం అందుకు కారణం కావొచ్చు.**



తెలుగులో ముస్లిం సాహిత్యం ఎవరు చదువుతున్నారు?

ఇది చాలా కీలకమైన ప్రశ్న. చాలామంది ముస్లిం రచయితలు తెలుగులో రాస్తున్నారు అంటే తెలుగొచ్చిన మెజారిటేరియన్లతో పాటు ముస్లిములు చదువుతారు. అయితే తెలుగు చదివే ముస్లిములు ఎంతమంది ఉన్నారనేది కచ్చితమైన లెక్కల్లేవు.

పైనుంచి గమనిస్తే మిగతా సమాజంతోపాటు ముస్లిములు కూడా తమ పిల్లలను ఇంగ్లిషు మీడియంలోనే చదివిస్తున్నారు. మదర్సాల్లో కూడా ఇంగ్లిష్ మీడియం అందుబాటులో ఉంది. ఒకవైపు ఉర్దూ మీడియం, మరోవైపు ఇంగ్లిష్ మీడియం చదువుతున్న పిల్లలు ముస్లిముల్లో పెరుగుతున్నారు. వీరికి తెలుగు సాహిత్యంతో ఏమాత్రం సంబంధం లేకుండా పోతోంది. అటు తెలుగు, ఉర్దూ రచయితల మధ్య సమన్వయం లేదు. వీరు అనువాదంతో ఆదాన ప్రదానాలు కూడా చేసుకోవడం లేదు. దీంతో అపార్థాలు వస్తున్నాయి. తెలుగు సాహిత్యం రాసే ముస్లిములు పూర్తిగా సొంత సమాజానికి వ్యతిరేకంగా రాస్తున్నారని కొంతమంది ఉర్దూ రచయితలు, ఉర్దూలో రచనలు చేసే వాళ్లు పూర్తిగా మతానికి అనుగుణంగా రాసి దాని పరిధి కుదిస్తున్నారని కొంతమంది తెలుగు రచయితలు భావిస్తున్నారు. వీళ్లిద్దరూ ఆ పరిధులు దాటి అపోహలను తుడిచేసుకోవాల్సిన సమయం వచ్చిందని అనుకుంటున్నాను.

మరి ఇన్ని అవరోధాల మధ్య తెలుగు ముస్లిం సాహిత్య ఉద్దేశ్యం నెరవేరుతోందా?

అసలు మొత్తం సాహిత్య ఉద్దేశ్యమే నెరవేరుతోందా లేదా అనేది ఇవ్వాళ ఎవరికి వారు తేల్చుకోవాల్సిన అంశం. ఎందుకంటే ప్రతి సాహిత్యానికి దాని పరిధిలో కొన్ని అవరోధాలు ఉండి తీరాయి. అంతమాత్రాన నిరుత్సాహ పడాల్సిన పనిలేదు.

మొత్తం ముస్లిం సాహిత్యం గురించి కాకుండా కథా సాహిత్యం గురించి నేను కొంత చెబుతాను. తెలుగులో ముస్లిం కథ ప్రధానంగా రెండు రకాలుగా వస్తోంది. మొదటిది సొంత సమాజంలో సంస్కరణలను ఆశిస్తోంది. ఈ రకం సాహిత్యం 1980ల ప్రాంతం నుంచే ఉంది. ఆ మాటకొస్తే తెలుగులో తొలి ముస్లిం కథ పుట్టిందే అంతర్గత సంస్కరణ కోసం. ఈ సాహిత్యం మరి అంతర్గత సమాజం దగ్గరికి పూర్తి స్థాయిలో వెళ్తోందా.. అంటే నేను అంతకు ముందు చెప్పిన అవరోధాలు ఉన్నాయి.

ఇక రెండో రకమైన సాహిత్యం.. మెజార్టీ సమాజానికి ముస్లిములపై ఉన్న అపోహలను తొలగించే సాహిత్యం. దీనికి ఎలాంటి భాషాపరమైన అవరోధాలు లేవు కదా. అందుకే అవకాశం ఉన్నంతవరకు ఈ సాహిత్యం తన ఉద్దేశ్యాన్ని తప్పక నెరవేస్తోంది. ముస్లిం కథకు తెలుగు కథాభిమానుల దగ్గర్నుంచి వస్తున్న స్పందనే ఇందుకు నిదర్శనం.

'నాగలికూడా ఆయుధమే..!' కవితా సంపుటి

కొమ్మవరపు విల్సన్ రావు కవితా సంపుటి 'నాగలి కూడా ఆయుధమే..!' ఆవిష్కరణ సభ ఫిబ్రవరి 25 ఉదయం 9:30కి మీటింగ్ హాల్, యు.టి.ఎఫ్.కార్యాలయం, శ్రీకాకుళంలో జరుగుతుంది. సభలో కె. శ్రీనివాసు (సాహితీ స్రవంతి కన్వీనర్), అట్టాడ అప్పలనాయుడు, కలిమి శ్రీ, కె.జి.వేణు, కె. ఉదయ్ కిరణ్, పాయల మురళీకృష్ణ, బాల సుధాకర్ మౌళి, కంచరాన భుజంగరావు, సాంబమూర్తి లండ తదితరులు పాల్గొంటారు.

సాహితీ స్రవంతి

భూతపురి సాహిత్య పురస్కారం

భూతపురి సుబ్రహ్మణ్యశర్మ మెమోరియల్ ట్రస్ట్, అల్లసాని పెద్దన సాహిత్యపీఠం ఆధ్వర్యంలో భూతపురి సుబ్రహ్మణ్యశర్మ 87వ జయంతి సందర్భంగా 22వ సాహిత్య పురస్కార ప్రదానోత్సవం ఫిబ్రవరి 25 ఉదయం 10.00 గంటలకు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, కడపలో జరుగుతుంది. కవి, విమర్శకులు వైద్యం వేంకటేశ్వరాచార్యులు పురస్కా రంగా రూ.10,116/- నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందుకుంటారు. వివరాలకు: 9966624276.

భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి

రాజాం రచయితల వేదిక సమావేశం

రాజాం రచయితల వేదిక 109వ సమావేశం ఫిబ్రవరి 25 ఉదయం 10.00 గంటలకు విజయనగరం జిల్లా రాజాంలో విద్యానికేతన్ పాఠశాలలో జరుగుతుంది. నల్ల రవికుమార్ అధ్యక్షతన జరుగనున్న ఈ సమావేశంలో 'సమాజానికి అవసరమైన సాహిత్యం' అనే అంశంపై బమ్మిడి సుబ్బారావు ముఖ్యప్రసంగం చేస్తారు. వివరాలకు: 98857 58123.

గార రంగనాథం



ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరాలయ పునఃప్రారంభం

» శాస్త్రోక్తంగా స్వర్ణశిఖరానికి కుంభాభిషేకం

» వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

- 6లో..

ఓటి బోట్లు..!



పర్యాటకుల ప్రాణాలతో ఏపీటీడీసీ చెలగాటం

కృష్ణానదిలో జలవిహారంలో పర్యాటకుల ప్రాణాలకు భద్రత లేకుండాపోతోంది. ప్రైవేటు బోట్లకు సవాలక్ష నిబంధనలు చెప్పే ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) అధికారులు తమ బోట్లకు మాత్రం నిబంధనలు పాటించడం లేదు. కృష్ణానదిలో తిరగాడే పర్యాటక బోట్లలో చాలావరకు మారిటైమ్ బోర్డు అనుమతులు లేవు. ఇరిగేషన్ అనుమతులు కూడా లేవు. బోట్ల ఇన్సూరెన్స్ గడువు కూడా ముగిసిపోయింది. గోదావరి నదిలో జరిగిన బోటు ప్రమాదం తర్వాత.. పర్యాటకాభివృద్ధి సంస్థ అనుమతుల కోసం నిబంధనలను తీసుకొచ్చినా అవి కాగితాలకే పరిమితమయ్యాయి. ఈ నిబంధనలను తుంగలో తొక్కి అడ్డగోలుగా తిప్పుతోంది కూడా ఏపీటీడీసీనే కావటం గమనార్హం.

* జలవిహారంలో అనుమతుల్లేని బోట్లు
* నిబంధనలకు విరుద్ధంగా అనేక బోట్లు నడుపుతున్న పర్యాటకాభివృద్ధి సంస్థ



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కృష్ణానదిలో జల విహారానికి సంబంధించి ఏపీటీడీసీకి చెందిన ధరణి పాంటూన్ (10 + 2 సీటింగ్), పోలిక్రాఫ్ట్ (2+1), జలజాక్షి (10+2), ఆమరపాలి (32+4), జగదాంబ (18+4), క్రిష్ణవేణి (29+4), భవాని (31+4), బోధిసిరి డబుల్ డెక్కర్ క్రూయిజర్ (96+4) బోట్లు ఉన్నాయి. పోర్టు ఎన్ఓసీలు ఉంటే తప్ప వీటిని నడపకూడదు. మారిటైమ్ బోర్డు నుంచి నిరభ్యంతర పత్రాలు రావాలంటే.. అనేక అంశాలను చూస్తారు. బోట్లను తయారు చేసిన కంపెనీ, బోట్ల దుర్భేద్యత, బోట్ల నాణ్యత, నీటి ఉధృతిని తట్టుకునేలా ఉండటం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని తనిఖీలు చేసిన తర్వాతే.. వాటికి పోర్టు ఎన్ఓసీలు వస్తాయి. ఎన్ఓసీలు వచ్చిన తర్వాత ఇరిగేషన్ శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలి. పైన చెప్పుకున్న బోట్లలో చాలా వాటికి పోర్టు అనుమతులు కానీ, ఇరిగేషన్ అనుమతులు కానీ లేవు.

● బోట్ల పరిస్థితిలా..

ధరణి పాంటూన్ బోటుకు 2023 ఫిబ్రవరి 14 నాటికి పోర్టు ఎన్ఓసీ గడువు ముగిసింది. మళ్లీ ఈ బోటుకు మారిటైమ్ బోర్డు ద్వారా పరీక్షలు నిర్వహించి ఎన్ఓసీ తెచ్చుకున్నాకే కృష్ణానదిలో నడపాల్సి ఉండగా.. ఎలాంటి అనుమతులూ లేకుండానే బోటును నడిపేస్తున్నారు.

● పోలిక్రాఫ్ట్ బోటుకు సంబంధించి చూస్తే.. దీనికి కూడా పోర్టు ఎన్ఓసీ, ఇరిగేషన్ అనుమతులు లేవు. 2023 ఫిబ్రవరి 14 నాటికి దీనికి ఉన్న ఎన్ఓసీ గడువు కూడా అయిపోయింది.

● జగదాంబ బోటుకు అక్టోబరు 2024 వరకే ఎన్ఓసీ గడువు ఉంది. ఇప్పటి వరకు దీని ఎన్ఓసీ రెన్యువల్ చేయలేదు.

● ఇక ప్రధానమైన బోట్ల విషయానికి వస్తే క్రిష్ణవేణి ఉంది. ఈ బోటుకు సంబంధించి జనవరి 19, 2024తో పోర్టు ఎన్ఓసీ అనుమతి ముగిసిపోయింది. దీనికి ఎలాంటి ఇరిగేషన్ అనుమతీ లేదు. ఈ బోటుకు రూట్ పర్మిషన్ కూడా జనవరి 19, 2024 నాటికి ముగిసిపోయింది.

● మరో ప్రధానమైన మెకనైజ్డ్ బోటు భవాని. ఈ బోటుకు కూడా జనవరి 19 నాటికి పోర్టు అనుమతి అయిపోయింది. ఇరిగేషన్ అనుమతి కూడా లేదు. ఈ బోటుకు రూట్ పర్మిషన్ జనవరి 19కి అయిపోయినా నడుపుతున్నారు.

● అత్యంత ప్రధానమైన బోధిసిరి డబుల్ డెక్కర్ క్రూయిజర్ బోటుకు కూడా ఏప్రిల్ 3, 2024 వరకే అనుమతి ఉంది. బోధిసిరికి ఇప్పటి వరకు ఇరిగేషన్ అనుమతి కూడా లేదు. ఇరిగేషన్‌శాఖ నుంచి కూడా అనుమతులు, క్లియరెన్సు తీసుకోకుండానే బోట్లను నడిపేస్తున్నారు.

అప్పటి హడావిడి ఇప్పుడేది?

గోదావరి నదిలో బోటు మునిగిపోయినపుడు రాష్ట్ర వ్యాప్తంగా ఏడాది పాటు బోటింగ్ కలాపాలు నిలిపివేశారు. కృష్ణానదిలో కూడా నిలుపుదల చేశారు. పోర్టు ఎన్ఓసీలు, ఇరిగేషన్ అనుమతులు, పర్యాటకుల సేఫ్టీ అరేంజ్‌మెంట్స్, కంట్రోల్‌రూమ్‌లు వంటివి ఏర్పాటు చేశాక మాత్రమే అనుమతులు ఇచ్చారు. ఇప్పుడు అలాంటివేమీ లేకపోయినా.. బోట్లను నడిపేస్తున్నారు.

నిప్పును ఆర్పే పరికరాలకు తీరిన గడువు

బోట్లలో ప్రమాదవశాత్తూ ఏదైనా ఫైర్ సంభవించినా.. తగలబడిపోతున్నా.. ముందుగా రక్షించేది ఫైర్ ఎగ్జింట్వింగిషర్స్ (నిప్పును ఆర్పే పరికరాలు). ఆఖరికి ఇవి కూడా గడువు దాటి పోయాయి. మొత్తం 34 ఫైర్ ఎగ్జింట్వింగిషర్స్ ఉండగా.. అన్నీ జనవరి 11, 2024 నాటికి గడువు దాటి పోయాయి. ఇవి పనిచేయకపోతే పర్యాటకుల ప్రాణాలకే ప్రమాదం సంభవిస్తుంది.



నకిలీ పొగ

పార్శిల్ చేసేది.. తీసుకునేది ఒకరే

● నకిలీ సిగరెట్ల విక్రయాలకు అడ్డాగా రాజధాని జిల్లాలు

● ఒక్కో బ్రాండ్‌తో అమ్మకాలు

● విజయవాడ, గుంటూరులో గోడౌన్లు

● ఢిల్లీ, బంగ్లాదేశ్‌లో తయారీ

● చిరునామాలు లేకుండా పార్శిళ్లు



హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాస్ కొద్దిరోజుల క్రితం ఒక పార్శిల్ చేశాడు. మచిలీపట్నానికి చెందిన శ్రీనివాస్‌కు ఈ పార్శిల్ వచ్చింది. ఈ రెండింటిలో నగరాల పేర్లు మాత్రమే వేర్వేరుగా ఉన్నాయి. పార్శిల్ చేసిన వ్యక్తి, తీసుకునే వ్యక్తుల పేర్లు ఒక్కటే. పేర్లు ఒకటే అయినా వ్యక్తులు మాత్రం వేర్వేరు అనుకుంటున్నారా? అలా అనుకుంటే పొరబడినట్టే. హైదరాబాద్ నుంచి పార్శిల్ చేసిన వ్యక్తి, మచిలీపట్నంలో తీసుకునే వ్యక్తి ఒకరే. నకిలీ సిగరెట్ల పార్శిల్‌లో మాఫియా వ్యవహరిస్తున్న పంథా ఇది.

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : సాధారణంగా ఒక వస్తువును మరోచోటకు పార్శిల్ చేసినప్పుడు చేసిన వ్యక్తి పేరు, చిరునామా, ఫోన్ నంబరు దానిపై ఉంటాయి. పార్శిల్ తీసుకునే వ్యక్తి పేరు, చిరునామా, ఫోన్ నంబర్ ఉంటాయి. ఈ వివరాలతో పనిలేకుండా పేరు, ప్రాంతం పేరు రాసి పార్శిల్ చేస్తున్నారు. తాజాగా విజిలెన్స్ అధికారులు రూ.19.20 లక్షల నకిలీ సిగరెట్లను విజయవాడ ఆటోనగర్‌లోని క్రాంతి పార్శిల్ సర్వీస్ సంస్థలో సీజ్ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో కూపీ లాగుతుంటే కొత్తకొత్త విషయాలు బయటపడుతున్నాయి. నకిలీ సిగరెట్ల వ్యాపారాన్ని సాగిస్తున్న మాఫియా ట్రిక్‌లు వెలుగులోకి వస్తున్నాయి. రాజధాని జిల్లాలు నకిలీ సిగరెట్ల విక్రయాలకు అడ్డాగా మారుతున్నాయని బ్రాండెడ్ కంపెనీలు గగ్గోలు పెడుతున్నాయి. తమ బ్రాండ్లను పోలినట్టుగా నకిలీ బ్రాండ్లతో సిగరెట్లను మార్కెట్‌లోకి దింపి అసలు బ్రాండ్ల వ్యాపారాన్ని కొల్లగొడుతున్నారని గోల పెడుతున్నాయి.

● పాత సామాన్ల ముసుగులో...

నకిలీ సిగరెట్ల వ్యాపారంలో కోట్లకు పడగలెత్తిన మాఫియా నిఘా వర్గాల నుంచి తప్పించుకోవడానికి రకరకాల ఎత్తులు వేస్తోంది. హైదరాబాద్, ఇతర నగరాల నుంచి భారీగా నకిలీ సిగరెట్లను కొనుగోలు చేస్తున్నారు. వాటిని విజయవాడ, గుంటూరు, మచిలీపట్నం నగరాలకు తరలించడానికి పాత సామాన్లను ఎంచుకుంటున్నారు. సిగరెట్ల పెట్టెలు ప్యాక్ చేసిన అట్టపెట్టెలను గోనె సంచుల్లో పెట్టి పార్శిల్ చేస్తున్నారు. పార్శిల్ కార్యాలయాల వద్ద సరుకు ఏమిటని ఆరా తీస్తుంటే పాత ఇంటి సామాన్లు అని చెబుతున్నారు. సరుకును కొనుగోలు చేసిన వ్యక్తులే ఆయా నగరాల నుంచి పార్శిల్ చేస్తున్నారు. విజయవాడ, గుంటూరు నగరాల్లో ఉన్న పార్శిల్ కార్యాలయాలకు తమ పేరు మీదే పార్శిల్ చేస్తున్నారు. పార్శిల్ చేసేటప్పుడు పేరు, ఊరు వివరాలు మాత్రమే ఇస్తున్నారు. కొద్దిరోజుల క్రితం విజయవాడ ఆటోనగర్‌లో క్రాంతి పార్శిల్ సర్వీసు కార్యాలయంలో విజిలెన్స్ అధికారులు పాత ఇంటి సామాన్లు అని రాసి ఉన్న పార్శిల్‌ను తెరచి చూడగా, అందులో నకిలీ సిగరెట్లు ఉన్నట్టు గుర్తించారు. మచిలీపట్నంలో ఒకరు, గుంటూరు జిల్లా తెనాలిలో ఇద్దరు ఈ పార్శిళ్లను తీసుకోవాల్సి ఉంది. వారి పేర్ల మీదే పార్శిళ్లు ఇక్కడికి వచ్చాయి. అసలు వాటిని ఎవరు పంపారు అని పరిశీలించగా హైదరాబాద్ నుంచి ఈ ముగ్గురూ ఈ పార్శిల్ చేసినట్టు తేలింది.

ప్రత్యేక గోడౌన్లు

ఢిల్లీ, ఓడల రేవుల నుంచి కంటైనర్ల ద్వారా వచ్చిన నకిలీ సిగరెట్లను భద్రపరచడానికి విజయవాడ, గుంటూరులో ప్రత్యేకంగా గోడౌన్లు ఉన్నాయి. విజయవాడలో భవానీపురం, గొల్లపూడి ప్రాంతాల్లో కొన్ని గోడౌన్లలో ఈ నకిలీ సిగరెట్లు ఉంటున్నాయి. గుంటూరు, చిలకలూరిపేట జాతీయ రహదారికి పక్కన ఈ గోడౌన్లను వ్యాపారులు అద్దెకు తీసుకున్నారు. ఢిల్లీతోపాటు మరికొన్ని ప్రాంతాల నుంచి రాత్రిపూట ఈ కంటైనర్లు బయలుదేరి విజయవాడ, గుంటూరుకు చేరుకుంటున్నాయి. గోడౌన్లలో అన్‌లోడ్ అయిన సరుకును అక్కడే ఉంచకుండా భాగాలుగా విడదీసి వేర్వేరుచోట్ల భద్రపరుస్తున్నారు. నకిలీ సిగరెట్ల సరఫరాకు విజయవాడ, గుంటూరు వాణిజ్య కేంద్రాలుగా పనిచేస్తున్నాయి. ఇదే విషయాన్ని కస్టమ్స్ ప్రివెంటివ్ విభాగాధికారులు గుర్తించారు. ప్రతినెలా కోట్లాది రూపాయల విలువ చేసే సరుకు విజయవాడ, గుంటూరులో అన్‌లోడ్ అవుతున్నట్టు సమాచారం. కస్టమ్స్ అధికారులు ఇప్పటి వరకు 16 మిలియన్ల నకిలీ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారంటే వ్యాపారం ఎంత జోరుగా సాగుతుందో అర్థమవుతోంది.

భర్తల ఓట్లు ఒకచోట భార్యల ఓట్లు మరోచోట

లక్ష్మీపురం ఓటర్ల జాబితాలో గందరగోళం

తిరువూరు : మండలంలోని లక్ష్మీపురం ఓటర్ల జాబితా పూర్తి గందరగోళంగా ఉంది. పంచాయతీ పరిధిలో రాయిగూడెం, కొత్తలక్ష్మీపురం, దళితవాడ శివారు గ్రామాలు ఉన్నాయి, ఈ గ్రామంలో రెండు పోలింగ్ బూత్‌లకు సంబంధించి 1645 ఓట్లకు గాను, బూత్‌నెం.128లో 803 ఓట్లు, బూత్‌నెం.129లో 842 ఓట్లు ఉన్నాయి. కుటుంబంలో భర్తల ఓటు లక్ష్మీపురం బూత్ (128)లో భర్యల ఓట్లు దళితవాడ (బూత్ నెం.129)లో ఉన్నాయి. లక్ష్మీపురం మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ ఓట్లు సైతం పోలింగ్ బూత్‌లు మార్చివేశారు.

ఓటు వేయాలంటే నాలుగు కిలోమీటర్లు వెళ్లాల్సిందే..

లక్ష్మీపురం పంచాయతీ పరిధిలో 128 బూత్‌లోని బొల్లినేని తేజశ్వీ (వరుస నెం.486) గ్రామ మాజీ సర్పంచ్ బొల్లినేని మినా (వరుస నెం.178)తో పాటుగా 20 మంది మహిళా ఓట్లు గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలోని దళితవాడ పోలింగ్ బూత్ నంబరు 129లోకి మార్చారు. వారి భర్తల ఓట్లు గ్రామంలోని 128వ బూత్‌లో ఉన్నాయి. రాయిగూడేనికి చెందిన మాజీ ఎంపీటీసీ గొల్లమంద స్వరూపరాణి (వరుస నెంబరు 143) దళితవాడ పోలింగ్ బూత్ నెంబరు 129 నుంచి లక్ష్మీపురంలోని బూత్ నెంబరు 128లోకి మార్చారు. రాయిగూడేనికి చెందిన కంటిపూడి కృష్ణవేణి (వరుసనెం.1), కంటిపూడి కృష్ణ (వరుస నెం.131) తదితరులతో పాటుగా సుమారు 100 ఓట్లను బూత్‌నెం.129 నుంచి రాయిగూడెం నుంచి అయిదు కిలోమీటర్ల దూరంలోని లక్ష్మీపురం బూత్ నెంబరు 128కి మార్చారు. లక్ష్మీపురం 128వ బూత్‌లోని మహిళల ఓట్లు మరో బూత్‌లోకి మార్పు చేయడం కుట్రపూరితంగా జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో లక్ష్మీపురంలో ఓటర్ల పోలింగ్ స్టేషన్ల మార్పుపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదు. గ్రామంలో కనుచూపు మేరలో పోలింగ్ కేంద్రం ఉన్న ఈ ప్రాంత మహిళలు రెండు మూడు కిలోమీటర్లు వెళ్లి ఓట్లు వెయాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామంలో లేనివారు, ఇతర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారిఓట్లు పదిలంగా గ్రామంలోని పోలింగ్ కేంద్రంలోనే ఉన్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓట్లు మార్పు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



రాయిగూడెం ఓటర్ల జాబితాలో లక్ష్మీపురం ఓటర్లు



సూత్రధారి ఆర్ఐ

మైనింగ్ గద్దలకు అండగా వాట్సాప్ గ్రూపు ఏర్పాటు

● మైనింగ్ దొంగల అప్రమత్తం

● అడ్డగోలుగా తవ్వుకునేందుకు అనుమతుల్లో ఆర్ఐ కీలకపాత్ర

● కాదన్న అధికారులు బదిలీ

మైనింగ్ గద్దలు విజయవాడ మండలంలో రెచ్చిపోవటానికి రెవెన్యూ, మైనింగ్ శాఖలు కీలకంగా మారాయి. కలెక్టర్ ఢిల్లీరావు తనిఖీల్లో ఈ రెండు శాఖలు అడ్డంగా దొరికిపోయాయి. ఈ క్రమంలో జరుగుతున్న విచారణలో అనేక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ మొత్తం వ్యవహారంలో ఒక ఆర్ఐ కీలకంగా మారాడని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ మండలంలోని రెవెన్యూలో నాలుగేళ్లుగా అనేక మంది పనిచేశారు. తిలాపాపం తలాపిడికెడు అన్నట్టు తహసీల్దార్ల దగ్గర నుంచి కిందిస్థాయి వీఆర్వోల వరకు మైనింగ్ గద్దల నుంచి కాసులు పిండుకున్నవారే. అయితే వీరిలో ఒకే ఒక్కడు అన్నట్టుగా ఇటీవల ఆర్ఐగా వచ్చిన వ్యక్తి దూకుడు చూస్తే అదిరిపోవాల్సిందే. మైనింగ్ గద్దలను తవ్వుకోమని అనధికారిక అనుమతులు ఇవ్వటం దగ్గర నుంచి, మైనింగ్ గద్దలను దాడుల నుంచి రక్షించే బాధ్యతలను కూడా ఈ ఆర్ఐ తీసుకున్నాడు. రీ సర్వేలో గుర్తించిన ప్రభుత్వ భూముల జాబితా మైనింగ్ మాఫియాకు చేరవేయడం, తవ్వుకోమని గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం, ఆ పైన వారి నుంచి అందిన కాడికి దండుకోవడం.. ఇదే ఆయన తీరు.

● అక్రమ క్వారీయింగ్‌పై పోరాటం

అక్రమ క్వారీయింగ్‌పై పోరాటానికి స్థానికులు కంకణం కట్టుకున్నప్పటి నుంచి ఈ ఆర్ఐకి కంటిమీద కునుకు లేదు. అప్పటి వరకు దండిగా బిజినెస్ చేసుకున్న ఈ ఆర్ఐ.. మైనింగ్ గద్దలను రక్షించే పనిలో పడ్డాడు. దీని కోసం తానే ఒక వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసి స్థానిక వీఆర్వోలు, మైనింగ్ సిబ్బంది, కొంతమంది మీడియా ప్రతినిధులు, స్థానిక ఇన్‌ఫార్మర్లతో పాటు మైనింగ్ గద్దల పేర్లను యాడ్ చేశాడు. కొత్తూరు తాడేపల్లిలోని ప్రభుత్వ భూముల్లో అక్రమ మైనింగ్‌కు కారణం ఆర్ఐ అందించిన సహకారమేనని తెలుస్తోంది. వసంతరాయుల తిప్పను కరిగించేసిన వ్యవహారంలో ఆర్ఐ పాత్ర ఉందని తెలుస్తోంది.

● అడ్డుకున్న అధికారుల బదిలీ..

తహసీల్దార్‌గా జాహ్నవి రెడ్డి రావటంతో.. ఆర్ఐకి ఇబ్బందికరంగా మారింది. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే తక్షణం ఆమె చర్యలు తీసుకునేవారు. అక్రమ తవ్వకాలను నిలుపుదల చేసేవారు. దీంతో జాహ్నవి రెడ్డి అడ్డువస్తున్నారన్న ఉద్దేశంతో అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో ఆమెను బదిలీ చేయించారు. ఇదే సందర్భంలో విజయవాడ సబ్ కలెక్టర్ ఆదితిసింగ్ కూడా అక్రమ క్వారీయింగ్‌పై ఉక్కుపాదం మోపారు. ఆదితి సింగ్ ఇటీవలే అనూహ్యంగా బదిలీ అయ్యారు. ఆదితీ సింగ్‌ను కూడా తానే బదిలీ చేయించానని సహచరుల దగ్గర ఈ ఆర్ఐ చెప్పుకుంటున్నాడని తెలుస్తోంది. ఎన్నికల బదిలీలో భాగంగా తహసీల్దార్ జాహ్నవి రెడ్డి మళ్లీ ఇదే మండలానికి రావటంతో మళ్లీ ఈవిడను ఎలా పంపించాలన్న దానిపై అధికార పార్టీ నేతలతో ఆర్ఐ సంప్రదింపులు ప్రారంభించినట్టు తెలుస్తోంది. ఇలా రెవెన్యూలో ఒకే ఒక్కడై సాగించిన అరాచక వ్యవహారాలు కలెక్టర్ ఢిల్లీరావు దృష్టికి వచ్చాయి.

చిన్నారిని చిదిమేసిన లారీ

తల్లి కళ్లెదుటే కుమార్తె మృతి

గుణదల, ఫిబ్రవరి 18 : లారీ రూపంలో వచ్చిన మృత్యువు ఒక చిన్నారిని చిదిమేసింది. కళ్ల ఎదుటే బిడ్డ లారీ చక్రాల కింద ఛిద్రమై ప్రాణాలు వదలడం చూసిన తల్లి దిక్కులు పిక్కటిల్లేలా రోదించింది. ఈ దారుణం రామవరప్పాడు రింగ్ సెంటర్లోని నోవొటెల్ హోటల్ వద్ద ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రసాదంపాడు కోళ్లఫారం రోడ్డులో నివాసం ఉంటున్న నలజల నాగబాబు, రాధిక దంపతులకు ఇద్దరు సంతానం. దంపతులు ఇరువురు ప్రైవేటు టీచర్లుగా పనిచేసి జీవనం సాగిస్తున్నారు. కుమారుడు డిగ్రీ పూర్తిచేయగా, కుమార్తె పూనం చౌదరి (12) గుణదలలోని సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో 7వ తరగతి చదువుతోంది. ఆదివారం సెలవు కావడంతో తల్లితో కలిసి పంటకాల్వ రోడ్డులోని చర్చికి ఇంటి నుంచి రాధిక కుమార్తెను తీసుకుని స్కూటీపై బయలుదేరారు. వీరు ఇరువురు నోవొటెల్ వద్ద జాతీయ రహదారి వద్దకు చేరుకోగానే వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ వీరిని ఢీకొట్టడంతో తల్లి రాధిక కుడివైపుకు పడిపోయారు. పూనం ఎడమవైపునకు పడటంతో లారీ ముందు చక్రాలు పూనం పై నుంచి వెళ్లాయి. ప్రమాదంలో బాలిక అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. స్వల్పగాయాలతో బయటపడ్డ రాధిక కళ్లెదుటే కుమార్తె పూనం విగతజీవిగా పడి ఉండటంతో గుండెలవిసేలా రోదిస్తున్న తల్లిని చూసి ప్రతి ఒక్కరూ కలతచెందారు. సమాచారం అందుకున్న పటమట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పటమట సీఐ మోహన్‌రెడ్డి తెలిపారు.



పూనం చౌదరి (ఫైల్)



అజాతశత్రువు మురళీమోహన్

» అక్కినేని శత జయంతి వేడుకల్లో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి

- 6లో..

వీరమ్మ తిరునాళ్లకు ఏర్పాట్లు పూర్తి

ఉయ్యూరు, ఫిబ్రవరి 18 : వీరమ్మ తిరునాళ్లకు అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. సోమవారం రాత్రి మెట్టినింటి నుంచి గండదీపాలతో బయలు దేరే అమ్మవారు ఆచారం ప్రకారం ఉయ్యూరు పట్టణ పోలీసుల పసుపుకుంకుమ, చీర సారె అందు కున్న తరువాత పల్లకిలో ఊరంతా ఊరేగుతారు. అమ్మవారికి పసుపు కుంకుమ అం దించేందుకు పట్టణ ఎస్సై గణేశ్‌కుమార్ ముందుగా స్టేషన్‌లో పూజలు చేసి కుటుంబ సభ్యులు, పోలీసు సిబ్బంది వెంటరాగా వెళ్లి అమ్మవారికి సమర్పిస్తారు. రాత్రి 9 గంటల తరువాత అమ్మవారు మెట్టినింటి నుంచి బయలుదేరేలా కమిటీ ఏర్పాట్లు చేసింది.





ఇంద్రకీలాద్రిపై

ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు, స్వర్ణశిఖరానికి అభిషేకం చేస్తున్న పండితులు

మల్లేశ్వరాలయ పునఃప్రారంభం

- శాస్త్రోక్తంగా స్వర్ణశిఖరానికి కుంభాభిషేకం
- వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

వన్‌టౌన్, ఫిబ్రవరి 18: ఇంద్రకీలాద్రిపై భక్తుల శివనామ స్మరణల మధ్య ఆదివారం ఉదయం మల్లేశ్వరాలయం పునఃప్రారంభమైంది. స్వర్ణశిఖర ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. స్వర్ణశిఖర ప్రతిష్ఠ సందర్భంగా శాస్త్రోక్తంగా కుంభాభిషేకాన్ని నిర్వహించారు. ఆలయ అర్చక బృందం, వేదపండితులు, వైదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈవో రామారావు పర్యవేక్షించారు. దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ కర్నాటి రాంబాబు దంపతులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు పూజల్లో పాల్గొన్నారు. ముహూర్త సమయంలో యంత్రప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానాచార్యుడు శివప్రసాదశర్మ, కోట ప్రసాద్, యజ్ఞనారాయణ శర్మ, శంకరశాండిల్య తదితర అర్చక బృందం హోమాలు, పూజలు నిర్వహించారు. ఉదయం 8 గంటలనుంచి క్రతువులు నిర్వహించారు. పునఃప్రారంభ కార్యక్రమంలో తాను పాల్గొనడం ఎన్నో జన్మల అదృష్టమని దేవదాయ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు.



నందీశ్వరుడికి పూజలు

శ్రీకాళహస్తి దేవస్థానం నుంచి పట్టువస్త్రాలు

మల్లేశ్వరాలయ పునఃప్రారంభం సందర్భంగా శ్రీకాళహస్తి దేవస్థానం ఆలయ ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ అం జూరు శ్రీనివాసు, ఆలయ అధికారులు, ప్రధాన అర్చ కుడు పట్టువస్త్రాలను తీసుకువచ్చారు. దుర్గగుడి ఈవో రామారావు, అర్చక బృందాలు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పట్టు వస్త్రాల సమర్పణ అనంతరం అమ్మవారిని, మల్లేశ్వరస్వామిని దర్శించుకున్నారు.



తిరుపతమ్మ, పరివార దేవతలకు

నీరాజనం

పల్లకీల్లో తరలుతున్న తిరుపతమ్మ, గోపయ్య, ఇతర పరివార దేవతలు



తిరుపతమ్మ



గోపయ్యస్వామి

- రంగుల ఉత్సవం అనంతరం పెనుగంచిప్రోలుకు పయనం
- జల బిందెలతో వార పోసి మొక్కులు తీర్చుకున్న మహిళలు, భక్తులు

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 18: రంగుల మహోత్సవానికి పట్టణానికి విచ్చేసిన గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారు, పరివార దేవతలు ఆదివారం ఉదయం తిరిగి పెనుగంచిప్రోలుకు బయల్దేరారు. తెల్లవారుజామున 5.15 గంటలకు దేవస్థానం వేదపండితులు ప్రత్యేక పూజలు చేశాక, అమ్మవారు, పరివార దేవతలను ప్రభుత్వవిప్ సావినేని ఉదయభాను, దేవస్థానం ఛైర్మన్ జంగాల వాసు, దేవస్థానం ఈవో కె.రమేష్‌నాయుడు, అధికారులు దగ్గరుండి పల్లకీల్లోకి ఎక్కించారు. పెనుగంచిప్రోలు బయల్దేరిన అమ్మవారిని దర్శించుకునేందుకు, మొక్కులు తీర్చుకునేందుకు పోటెత్తారు. భక్తులు వేలాదిగా తరలివచ్చి ఘనంగా వీడ్కోలు పలికారు. పల్లకీల్లో ఉన్న అమ్మవారి పరివార దేవతలకు జలబిందెలతో వార పోసి మొక్కులు తీర్చుకున్నారు. రంగుల మండపం నుంచి కమలా సెంటర్‌కు రావటానికి 6గంటలు పట్టింది. పల్లకీలను మోసేందుకు, వారు పోసేందుకు, మొక్కులు తీర్చుకునేందుకు జగ్గయ్యపేట పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మెయిన్ రోడ్డుకు ఇరువైపులా వేచి ఉన్నారు. కాకతీయ కమ్మ సేవాసమితి సభ్యులు కమలా సెంటర్‌లో పెద్ద ఆర్చి ఏర్పాటు చేసి, భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. టీడీపీ విజయవాడ పార్లమెంట్ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు శ్రీరాం చినబాబు, కమ్మసేవాసమితి అధ్యక్షుడు ఇంటూరి రంగనాయకులు, సూరపనేని సుబ్బారావు తదితరులు అమ్మవారి పల్లకీలను కాసేపు మోశారు.



సినీనటుడు మురళీమోహన్‌కు అక్కినేని శతజయంతి స్మారక పురస్కారాన్ని అందజేస్తున్న జస్టిస్ ఏవీ శేషసాయి

అజాత శత్రువు మురళీమోహన్

- అక్కినేని శత జయంతి వేడుకల్లో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): సినీనటుడు మురళీమోహన్ రాజకీయ, చిత్రరంగంలో అజాత శత్రువని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి అన్నారు. అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నగరంలోని ఓ హోటల్‌లో అక్కినేని శతజయంతి వేడుకలు ఆదివారం నిర్వహిం చారు. మురళీమోహన్‌కు అక్కినేని శతజయంతి స్మారక పురస్కారాన్ని అంద జేశారు. అక్కినేని నవరస పోషకుడని శేషసాయి అన్నారు. మద్రాసు నుంచి సినీ పరిశ్రమను హైదరాబాద్‌కు తరలించడానికి ప్రధాన కారకుడు అక్కినేని అని వివ రించారు. ఆయన స్మారక పురస్కారాన్ని అందుకోవడానికి మురళీమోహన్‌కు అన్ని అర్హతలు ఉన్నాయన్నారు. జీవితంలో మంచి వ్యక్తిగా గుర్తింపు పొందడానికి అక్కినేని తనకు హితబోధ చేశారని వాటని తాను పాటించానని మురళీమోహన్ తెలిపారు. సినీ రచయిత సంజయ్ కిషోర్, నిర్వాహకుడు చీదెళ్ల నాగేశ్వరరావు, దామోదర గణపతి తదితరులు పాల్గొన్నారు.

రాబోయే పాతికేళ్లలో
మహాశక్తిగా భారత్

ఎస్ఆర్‌జీఈసీ రజతోత్సవ ముగింపు కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్



కేరింతలు కొడుతున్న విద్యార్థులు





మాట్లాడుతున్న గవర్నర్ అబ్దుల్ నజీర్, హాజరైన విద్యార్థులు, గ్రామస్థులు

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 18: రాబోయే పాతికేళ్లలో ప్రపంచంలోనే అత్యంత నైపుణ్యం కలిగిన మహాశక్తిగా భారతదేశం నిలవనుందని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. ఆదివారం గుడ్లవల్లేరులోని శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల(ఎస్ఆర్‌జీఈసీ) రజతోత్సవ వేడుకల ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ప్రపంచాన్ని మార్చే శక్తివంతమైన ఆయుధం విద్య అని, గ్రామీణ విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించాలనే లక్ష్యం, దూరదృష్టి, అభిరుచి, ఆలోచనలతో యాజమాన్యం ఎస్ఆర్‌జీఈసీని స్థాపించి ఉన్నత విద్యాప్రమాణాలతో కళాశాలను నడపడం అభినందనీయమని ఆయన అన్నారు. పాతికేళ్ల కళాశాల విద్యా ప్రయాణంలో ఇక్కడ విద్యనభ్యసించిన ఎంతోమంది దేశ విదేశాల్లో పేరెన్నికగన్న ప్రైవేటు సెక్టార్లలో, రాష్ట్ర, జాతీయ ప్రభుత్వ సంస్థల్లో, పరిశోధనా సంస్థల్లో కొలువుదీరడం ప్రశంసనీయమన్నారు. తొలుత కలెక్టర్ పి.రాజాబాబు, ఎస్పీ నయీం అస్మీ, గుడివాడ ఆర్డీవో పద్మావతి, కళాశాల ఛైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావులు గవర్నర్‌కు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. సభా కార్యక్రమాన్ని గవర్నర్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీని స్థాపించిన అడుసుమిల్లి అశ్వర్థనారాయణ మూర్తి, వల్లూరుపల్లి వెంకటరామశేషాద్రిరావు కుటుంబ సభ్యులకు కృతజ్ఞతాంజలి సన్మానపత్రాలను గవర్నర్ అందజేశారు. కళాశాల యాజమాన్యం గవర్నర్‌ను ఘనంగా సన్మానించింది. ఛైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కో-ఛైర్మన్ ముసునూరి శ్రీనివాసరావు, కార్యదర్శి వల్లూరుపల్లి సత్యనారాయణరావు, సహకార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ, సంస్థ అధ్యక్షుడు వల్లభనేని సుబ్బారావు, ఉపాధ్యక్షులు కొడాలి వెంకట కృష్ణారావు, గవర్నింగ్‌బాడీ సభ్యులు వల్లూరుపల్లి వెంకట్ కిరణ్, ముసునూరి శ్రీరామ్, ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణకుమార్, వైస్ ప్రిన్సిపాల్స్ పి.కోదండరామారావు, ఎంఆర్‌సీహెచ్‌శాస్త్రి, యాజమాన్య సలహాదారు పొట్లూరి రవీంద్ర బాబు, పీజీసీ ఆర్డీ డైరెక్టర్ జీ.వి.ఎస్.ఎన్.ఆర్.వి ప్రసాద్ పాల్గొన్నారు.

ఉర్రూతలూగించిన సినీగీతాలాపన

రజతోత్సవ వేడుకల ముగింపు సందర్భంగా నిర్వహించిన మ్యూజికల్‌నైట్ విద్యార్థులను ఉర్రూతలూగించింది. సినీ సంగీత దర్శకుడు అనూప్‌రూబెన్స్, గాయకులు ధనుంజయ్, సాహితీ బృందం చేసిన సినీ గీతాలాపన విద్యార్థులను కేరింతలు కొట్టించింది.



మాట్లాడుతున్న కేశినేని చిన్ని

దళిత ద్రోహి సీఎం జగన్

- దళితులకు అమలవ్వాల్సిన 27 సంక్షేమ పథకాలు రద్దు చేశారు
- వచ్చే ఎన్నికల్లో దళిత వ్యతిరేక ప్రభుత్వాన్ని ఓడించండి
- జైభీమ్ ఆర్మీ ఎన్టీఆర్ జిల్లా సమావేశంలో కేశినేని చిన్ని పిలుపు

భారతీనగర్: దళితులకు అమలవ్వాల్సిన 27 సంక్షేమ పథకాలు రద్దుచేసిన దుర్మార్గుడు, దళిత ద్రోహి సీఎం జగన్ అని టీడీపీ నాయకుడు కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. దళిత వ్యతిరేక జగన్ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో తరిమికొట్టాలని చిన్ని పిలుపునిచ్చారు. భారతీనగర్ కాలనీలోని అన్న క్యాంటీన్ ప్రాంగణంలో ఆదివారం జైభీమ్ ఆర్మీ ఎన్టీఆర్ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. అంబేడ్కర్ విదేశీ విద్యాదీవెన పథకం పేరు మార్చి జగనన్న విదేశీ విద్యాదీవెన పథకమని పెట్టుకున్నారన్నారు. నాలుగేళ్లుగా ఉద్యో గాలు లేక యువత మత్తు పదార్థాలకు బానిసగా మారుతోందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ఈనెల 22న జగ్గయ్యపేటలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన నిరుద్యోగులు పాల్గొని ఉద్యోగాలు పొందాలని సూచించారు. చిన్ని గెలుపు కోసం జైభీమ్ ఆర్మీ పనిచేస్తుందని జైభీమ్ ఆర్మీ ఫౌండర్ గొర్రెముచ్చు వెంకట నరసింహరావు తెలిపారు. జైభీమ్ ఆర్మీ కార్యవర్గ సభ్యులు చిన్నిని సన్మానించారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్‌మీరా, మైనారిటీ సెల్ రాష్ట్ర సెక్రటరీ ఎండీ ఫతావుల్లా, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం..బీఎల్వో సస్పెన్షన్

కూచిపూడి, ఫిబ్రవరి 18: బూత్ లెవల్ ఆఫీసర్(బీఎల్వో)గా బాధ్యతలు నిర్వహిస్తున్న మొవ్వ సచివాలయం-1 వెల్ఫేర్ అసిస్టెంట్ అవనిగడ్డ నాగమహేష్‌ను సస్పెండ్ చేస్తూ కృష్ణాజిల్లా కలెక్టర్ రాజాబాబు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎండీవో జి.చంద్రశేఖర్‌రావు తెలిపారు. విధి నిర్వహణలో అలసత్వం వహించారని, ఓటర్ల జాబితాలో మరణించిన వ్యక్తుల పేర్లు తొలగించటంలో నిర్లక్ష్యంగా వ్యవహరిం చారని పూర్వ తహసీల్దార్ కలెక్టర్‌కు ఇచ్చిన నివేదిక ఆధారంగా సస్పెన్షన్ వేటు పడిందని తెలిపారు. కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులను మహేష్ తీసుకోకుండా విధులకు గైర్హాజరు కావటంతో సస్పెన్షన్ ఉత్తర్వులను మహేష్ ఇంటి గోడకు అం టించామని ఎండీవో తెలిపారు.

మరో ఉద్దానంగా ఎ.కొండూరు

- కిడ్నీ బాధితులకు కృష్ణా జలాలు సరఫరా చేయండి: సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్

ధర్నాచౌక్, ఫిబ్రవరి 18: ఎన్టీఆర్ జిల్లాలోని ఎ.కొండూరు ప్రాంతం మరో ఉద్దానంగా మారనుందని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ ఆం దోళన వ్యక్తం చేశారు. ఎ.కొండూరు ప్రాంత కిడ్నీ బాధితులతో కలిసి దాసరి భవన్‌లో ఆదివారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, ప్రజా ప్రతినిధుల అలసత్వం వల్ల మండలంలోని 21 గ్రామ పంచాయతీలు, శివారు ప్రాంతాలైన తండాల ప్రజలు కిడ్నీవ్యాధితో బాధపడుతున్నారన్నారు. భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్ అధిక శాతం ఉండటంతో తాగునీరు కరువైందన్నారు. ఆ ప్రాంతాలకు కృష్ణాజలాలను సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కిడ్నీ బాధితులకు ప్రతీనెలా రూ.10 వేల పింఛన్ ఇవ్వాలన్నారు. ఈ వ్యాధితో మృతి చెం దిన వారి కుటుంబానికి రూ.10 లక్షలు ప్రకటించాలని, రెండున్నర ఎకరాల సాగు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. డయాలసిస్ సెంటర్‌లో పర్మినెంట్ డాక్టర్లను నియమించాలని కోరారు.

రసాభాసగా..

పట్టాభి స్మారక భవన అనుమతులపై అఖిలపక్ష సమావేశం

- పట్టాభి భవన కమిటీ కరపత్రాలు చించేసిన వైసీపీ కార్పొరేటర్ మేకల సుబ్బన్న
- వాగ్వివాదాల మధ్య ముగిసిన సమావేశం



మేకల సుబ్బన్నతో మాట్లాడుతున్న జనసేన నాయకులు కొట్టె వెంకట్రావు, మాదివాడ రాము

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 18: భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవన నిర్మాణానికి మునిసిపల్ కౌన్సిల్ అనుమతుల కోసం ఆదివారం వివేకానంద మందిరంలో ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశం రసాభాసగా ముగిసింది. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, నగర పెద్దలు హాజరయ్యారు. భవనాన్ని నిర్మించడంలో జాప్యం జరిగితే యూనియన్ బ్యాంకు మంజూరు చేసిన నిధులు వెనక్కి వెళ్లిపోయే ప్రమాదం ఉందని బందరు అభివృద్ధిని ఆకాంక్షించే రాజకీయ పార్టీ నాయకులందరూ ఏకం కావాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్దుల్ మతిన్, టీడీపీ నగర అధ్యక్షుడు ఎండీ ఇలియాస్ బాషా కోరారు. సీఎం నుంచి పట్టాభి భవనానికి కావలసిన స్థలాన్ని, యూనియన్ బ్యాంకు నుంచి రూ.40 కోట్ల నిధులను ఎంపీ వల్లభనేని బాలశౌరి తీసుకుని వచ్చారని, అయితే నగరపాలక సంస్థ భవన నిర్మాణానికి ఎన్వోసీ ఇవ్వడానికి ఎందుకు ముందుకు రావడంలేదో తెలియడం లేదని, దీనిపై కలెక్టర్ చెప్పినా మునిసిపల్ కౌన్సిల్‌లో పాలకవర్గం తీర్మానం ప్రవేశపెట్టడం లేదని న్యాయవాది, భవన నిర్మాణ సాధక కమిటీ కన్వీనర్ సోడిశెట్టి బాలాజీ అన్నారు. దీంతో కలెక్టరుకు, మునిసిపల్‌కమిషనర్‌కు వినతిపత్రాలు ఇస్తే సరిపోతుందా.. మేయర్‌ను ఎవరు అడిగారని వైసీపీ కార్పొరేటర్ మేకల సుబ్బన్న ప్రశ్నించారు. మీరే వినతి పత్రాలు తీసుకుని పని పూర్తి చేయించండి అని సుబ్బన్నతో బాలాజీ అన్నారు. అనంతరం సుబ్బన్న భవన నిర్మాణ సాధన కమిటీ ముద్రించిన కరపత్రాలను చించేశారు. దీంతో సభ రసాభాసగా మారింది. టీడీపీ ప్రచార కార్యదర్శి పీవీ ఫణికుమార్, మేకల సుబ్బన్న మధ్య తీవ్రంగా వాదోపవాదాలు జరిగాయి.

సీఎం ఉత్తర్వులిచ్చారు..అనుమతులివ్వండి:జనసేన

వాదనలు జరుగుతుండగా జనసేన నాయకుడు మాదివాడ రాము, కొట్టె వెంకట్రావులు జోక్యం చేసుకుని మాట్లాడారు. సీఎం ఉత్తర్వులు ఇచ్చారని, కలెక్టర్ ఇందుకు కావలసిన రెండెకరాలు స్థలం కేటాయించారని, జగన్‌పై గౌరవంతో భవన నిర్మాణానికి వైసీపీ కార్పొరేటర్లు మునిసిపల్ కౌన్సిల్‌లో అనుమతులు ఇవ్వాలని సూచించారు. పట్టాభి స్మారక భవన నిర్మాణానికి కావలసిన స్థలాన్ని వేరే చోట కొనుక్కోవడం మంచిదని, పట్టాభి స్మారక భవనానికి కలెక్టర్ కేటాయించిన స్థలాన్ని 30 ఏళ్ల లీజుకు తీసుకుని వైసీపీ కార్యాలయ భవనం, క్రీడా భవనం నిర్మాణాలు జరుగుతున్నాయని అర్బన్ బ్యాంకు మాజీ అధ్యక్షుడు బొర్రా విఠల్ అన్నారు. అక్కడ మిగిలి ఉన్న స్థలం పోలీసు శాఖదన్నారు. దీంతో పీవీ ఫణికుమార్‌కు బొర్రా విఠల్‌కు మధ్య వాదోపవాదాలు జరిగాయి. పట్టాభి భవనానికి కేటాయించిన స్థలం ఇవ్వాలని రాజకీయపార్టీల నాయకులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకుడు కె.చంద్రశేఖర్, న్యాయవాది పుప్పాల ప్రసాద్, సీపీఎం నాయకుడు కొడాలి శర్మ, టీడీపీ నాయకుడు పిప్పళ్ల కాంతారావు, జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, డాక్టర్ బి.ధన్వంతరి ఆచార్య, సింగరాజు గోవర్ధన్ పాల్గొన్నారు.







కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న బాల దేవాలయాలు, మరమ్మతులు లేని వసతి భవనం

హంసలదీవి పవిత్ర సంగమంలో

కానరాని అభివృద్ధి

శిథిలావస్థకు చేరిన కృష్ణవేణమ్మ విగ్రహం

కోడూరు, ఫిబ్రవరి 18: హంసలదీవిలో కృష్ణా సాగర సంగమ క్షేత్రం అభివృద్ధి నోచుకోవటం లేదు. నాలుగేళ్లుగా పవిత్ర సంగమం వద్దకు ఎవరూ వెళ్లకుండా అధికారులు భద్రత పేరుతో ఆంక్షలు విధించటంతో ఆ ప్రాంతమంతా నిర్మానుష్యంగా మారింది. సంగమ ప్రదేశంలో నిర్మించిన రెండు అంతస్థుల భవనం శిథిలావస్థకు చేరింది. దేవతా విగ్రహాలు, కృష్ణమ్మ పాదాలు పగుళ్లిచ్చాయి. అయినా అధికారులు పట్టించుకోలేదు. ఫిబ్రవరి 24వ తేదీన మాఘశుద్ధ పౌర్ణమి పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు సంగమ ప్రదేశంలో స్నానమాచరించేందుకు హంసలదీవి రానున్నారు. కానీ అధికారులు మాత్రం భద్రత పేరుతో పవిత్ర సంగమానికి అనుమతించమని చెప్పటంతో భక్తులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కనీసం పవిత్ర సంగమ విశిష్టతను కాపాడేందుకు భక్తుల మనోభావాలను గౌరవిస్తూ జల్లు స్నానాలైనా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



టీడీపీలో చేరిన యువకులతో ప్రమాణం చేయిస్తున్న కొల్లు రవీంద్ర

యువత భవితకు శాపంగా వైసీపీ ప్రభుత్వం

- అందుకే యువకులంతా టీడీపీలోకి వస్తున్నారు: కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 18: ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం యువత భవితకు శాపంగా మారడంతో యువత టీడీపీలో చేరుతున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర అన్నారు. ఆదివారం టీడీపీ అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయంలో వైసీపీ నాయకుడు కళ్లేపల్లి రాణాప్రతాప్ ఆధ్వర్యంలో బుట్టాయిపేట, సుకర్లాబాద్, రాజుపేట, దిమ్మలసెంటర్, చిలకలపూడి ప్రాంతాల నుంచి 150 మంది యువకులు పార్టీలో చేరారు. యువకులకు కొల్లు రవీంద్ర పార్టీ కండువాలు కప్పి ప్రతిజ్ఞ చేయించారు. ఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తానని యువతీ యువకులను మోసం చేసి ఓట్లు దండుకున్న వైసీపీకి రానున్న ఎన్నికల్లో యువత తగిన బుద్ధి చెబుతారన్నారు. జగన్ పాలనలో గ్రాడ్యుయేట్లు వలంటీర్లుగా చాలీచాలని జీతాలతో బతుకుతున్నారన్నారు. కె.నిఖిలేష్, కె.మూర్తి, కె.సుధాకర్, సురేంద్రప్రసాద్, మహి, అజయ్, లాలా, బాలు, అభినవ్, భారతరెడ్డి, యశ్వంత్, గణేష్, ప్రవీణ్, జి.సుబ్రహ్మణ్యం తదితరులు పార్టీలో చేరారు. మోటమర్రి బాబా ప్రసాద్, హసీంబేగ్, చిత్తజల్లు నాగరాము, దేవరపల్లి అనిత, దింటకుర్తి సుధాకర్, ఎండీ ఇలియాస్ పాషా, పిప్పళ్ల కాంతారావు పాల్గొన్నారు.

ఖో-ఖో జిల్లా జట్ల ఎంపిక

గుడివాడ: ఎస్పీఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కృష్ణాజిల్లా ఖో-ఖో పురుషులు, మహిళ జట్లను ఆదివారం ఎంపిక చేశారు. మహిళల జట్టుకు కె.కుమారి, టి.ఝాన్సీరాణి, కె.చైతన్య, అఖిల, ఎం.దుర్గాభవాని, బి.మౌనిక, బి.నాగసుశీల, జి.దీప్తి, ఎ.దేవి, టి.జ్యోతి, హురున్నీసా, ఎం.లావణ్య బి.శివస్వప్న, ఎస్.ధనలక్ష్మి, జి.అనిత, స్టాండ్‌బైలు డి.చరితశ్రీ, కె.ఊర్వ, అభిజ్ఞలు ఎంపికయ్యారు. పురుషుల జట్టుకు కె.కొండలరావు, బి.వినయ్, టి.తిమోతి, సీహెచ్ అజయ్‌కుమార్, జి.హన్సల్, సీహెచ్ గణేష్, రాకేష్, జె.నాగశేషు, డి.షణ్ముఖ శ్రీనివాస్, ఆసిఫ్‌ఖాన్, కె.జగదీష్, కె.జయసూర్యతేజ, పి.అభిషేకం, డి.దుర్గాప్రసాద్, సీహెచ్ రేవంత్‌కుమార్, స్టాండ్‌బైలుగా యు.నాగరాజు, గణేష్‌నాయుడు, భరత్‌కుమార్ ఎంపికయ్యారు. ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు సామర్లకోట ప్రభుత్వ కళాశాలలో నిర్వహించే అంతర్ జిల్లాల ఖో-ఖో పోటీల్లో ఎంపికైన జట్లు పాల్గొంటాయని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మడక ప్రసాద్, మద్దినేని సత్యప్రసాద్ తెలిపారు.

అన్ని పీఎస్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

- ఎన్నికల సంఘాన్ని కోరిన ఏపీ టుమారో

విజయవాడ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఏపీ టుమారో స్వచ్ఛంద సంస్థ కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరింది. సంఘ అధ్యక్షుడు నలమోతు చక్రవర్తి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం పోలీసులను రాజకీయ కక్షలకు ఉపయోగించుకుని అధికార దుర్వినియోగం చేస్తోందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రజల హక్కులను కాపాడడంలో భాగంగా సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం అన్ని పోలీస్‌స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర డీజీపీ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కేబీఎన్‌లో సీతారామ కల్యాణోత్సవం



వన్‌టౌన్, ఫిబ్రవరి 18: కేబీఎన్ కళాశాలలోని దాసాంజనేయస్వామి దేవస్థాన విగ్రహ పునఃప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠను పురస్కరించుకుని ఆదివారం సీతారామకల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శాస్త్ర విధానంలో సీతారాముల కళ్యాణ ఘట్టాలను భక్తుల రామనామస్మరణ మధ్య నిర్వహించారు. పునఃప్రతిష్ఠలో భాగంగా 2వ రోజున దేవతా, మూలమంత్ర, చండీ తదితర హోమాలను నిర్వహించారు. క్షీరాధివాసం, పంచగవ్యాధివాసం, ధాన్యధివాసం నిర్వహించడంతో పాటు శ్రీరామ శ్రీ హనుమా మహామంత్ర హవన నిర్వహించారు. కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు తొమ్మండ్రు శేషయ్య, తూనికుంట్ల శ్రీనివాసు, సహాయ కార్యదర్శి డి.వి రామారావు పాల్గొన్నారు.

ప్రజల కన్నీళ్లు తుడిచేందుకే 'సూపర్ సిక్స్'

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 18: రాష్ట్ర ప్రజల కన్నీటిని తుడిచేందుకు తెలుగుదేశం పార్టీ సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు ప్రకటించిందని, అధికారంలోకి రాగానే వాటిని అమలు చేస్తామని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. మొగల్రాజపురంలోని ఆయన నివాసంలో ఆదివారం విలేకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ తుగ్లక్ పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్న తమ అధినేత సూపర్ సిక్స్ పథకాలను ప్రవేశపెట్టనున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో దగాపడ్డ ప్రజలకు చంద్రబాబు ఇచ్చే ఉపశమనమే ఈ పథకాలన్నారు. ఎన్నికల ముందు ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంత మందికి అమ్మఒడి పథకం, 45ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు పింఛన్లు అందజేస్తామన్న జగన్ హామీలు ఏమైయ్యాయని ప్రశ్నించారు. ఏడాదికోసారి జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని యువతను మోసం చేశారని, నిరుద్యోగ భృతి ఏమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగుదేశం, జనసేన పార్టీ అధికారంలోకి రాగానే తమ అధినేత చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలతో జగన్ ప్రభుత్వంలో దగాపడ్డ ప్రజలకు ఉపశమనం కలుగుతుందన్నారు.

కార్యకర్తలకు అండగా పార్టీ: నవనీతం

సత్యనారాయణపురం: కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని టీడీపీ రాష్ట్రకార్యదర్శి నవనీతం సాంబశివరావు అన్నారు. 31వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పడమటి రామకృష్ణ ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. విషయం తెలుసుకున్న బొండా ఉమాహేశ్వరరావు రామకృష్ణను ఫోన్‌లో పరామర్శించారు. ఆయన ఆదేశాలతో నవనీతం ఆదివారం శ్రీనగర్‌కాలనీలోని రామకృష్ణ నివాసానికి చేరుకుని నవనీతసం సాంబశివరావు, టీడీపీ నేతలు ఆయన్ను పరామర్శించారు. ఏ అవసరమొచ్చినా అండగా ఉంటామన్నారు. టీడీపీ నేతలకు, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట స్థానిక టీడీపీ నేతలు పాల్గొన్నారు.



రామకృష్ణను పరామర్శిస్తున్న సాంబశివరావు

ఉరేసుకుని యువకుడి మృతి

పాయకాపురం: ఉరేసుకుని ఓ యువకుడు మృతి చెందిన ఘటనపై నున్న రూరల్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. నున్న గ్రామానికి చెందిన కందుల రాకేష్ (22) గ్రామ పంచాయతీలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు చీరతో ఉరేసుకుని మృతి చెందాడు. నున్న రూరల్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవనం పై నుంచి పడి కార్మికుడి మృతి

అజిత్‌సింగ్‌నగర్: నిర్మాణంలో ఉన్న భవనం పై నుంచి పడి ఓ కార్మికుడి మృతి చెందిన ఘటన అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతంలో ఆదివారం చోటు చేసుకుంది. కరెన్సీనగర్ ప్రాంతానికి చెందిన రెడ్డి వెంకటరమణ (43) సెంట్రింగ్ పనులు చేస్తుంటాడు. ఆదివారం అజిత్‌సింగ్‌నగర్ తోట వారి వీధిలోని నిర్మాణంలో ఉన్న భవనం 2వ అంతస్తులో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. తోటి కార్మికులు వెంకట రమణను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రమణ మృతి చెందాడు. అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

25న జిల్లా క్యారమ్స్ సింగిల్స్ ఎంపికలు

విజయవాడ స్పోర్ట్సు: నగరంలోని ఐజీఎంసీ స్టేడియంలోని డీ2 బ్లాక్‌లో ఈ నెల 25న ఉదయం 9 గంటలకు జిల్లా వెటరన్ పురుషుల, మహిళల సింగిల్స్ క్యారమ్స్ ఎంపికలను నిర్వహిస్తున్నట్టు జిల్లా క్యారమ్స్ అసోసియేషన్ సెక్రటరీ జె.మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారిని మార్చి 2నుంచి 4వరకు గుంటూరులో జరిగే ఏపీ స్టేట్ అంతర్ జిల్లాల క్యారమ్స్ టోర్నీకి పంపుతామన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు 24న సాయంత్రం 5గంటల్లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

40వ డివిజన్‌లో షేక్ ఆసిఫ్ పర్యటన

విద్యాధరపురం: భవానీపురంలోని 40వ డివిజన్‌లో మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి పశ్చిమ వైసీపీ ఇన్‌చార్జి, స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ షేక్ ఆసిఫ్ గడప గడపకు నిర్వహించారు. కార్పొరేటర్ వై.ఆంజనేయరెడ్డి ఆధ్వర్యంలో గాంధీబొమ్మ రోడ్డు, కొళ్లఫారం రోడ్డులో ప్రజలను కలుసుకుని ప్రజాసమస్యలను తెలుసుకున్నారు. వైసీపీ నేతలు పాల్గొన్నారు.

త్రిశక్తిపీఠంలో రాజశ్యామలాదేవిగా కాళీమాత

కృష్ణలంక, ఫిబ్రవరి 18: త్రిశక్తిపీఠంలోని కాళీమాత అమ్మవారి దేవస్థానంలో మాఘశుద్ధ పాడ్యమి నుంచి మాఘ శుద్ధ నవమి వరకు కాళీమాత అమ్మవారు శ్రీ రాజ శ్యామలాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. 9 రోజుల పాటు హోమం నిర్వహించారు. చివరి రోజైన ఆదివారం కమిటీ సభ్యులు పూర్ణాహుతి సమర్పించారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జి.పుల్లయ్య, కొప్పురావూరి జగదీష్ కుమార్, ఆధ్యాత్మిక సలహాదారు భారతుల విజయ్‌కిరణ్, జి.సత్యం, సూపరింటెండెంట్ అచ్యుత మధుసూధనరావు, అర్చకులు శిష్లా ప్రసాద్, జంధ్యాల ఆంజనేయ శర్మ పాల్గొన్నారు.



పూర్ణాహుతి సమర్పిస్తున్న కమిటీ సభ్యులు



మాట్లాడుతున్న సీపీఎం నేత సీహెచ్ బాబూరావు

వాంబేకాలనీ, న్యూ రాజరాజేశ్వరిపేట

ఇళ్లకు రిజిస్ట్రేషన్ చేయాలి

● సీపీఎం నిరసన దీక్ష

పాయకాపురం, ఫిబ్రవరి 18: వాంబేకాలనీ, న్యూ రాజరాజేశ్వరిపేటలోని ప్రభుత్వ పక్కాగృహాలకు నామమాత్రపు చార్జీలతో రిజిస్ట్రేషన్లు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. నగర శివార్లలో దీర్ఘకాలంగా పరిష్కారంకాని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో వాంబేకాలనీలో ఆదివారం నిరసన దీక్ష జరిగింది. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ వాంబేకాలనీ, న్యూ రాజరాజేశ్వరిపేట ప్రాంతాల్లో వేలాది మంది పేదల ఇళ్లకు గత ప్రభుత్వాలు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం రిజిస్ట్రేషన్లు చేస్తామని హామీ మోసం చేశాయన్నారు. వాంబేకాలనీ, మధురానగర్ మధ్య రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం హామీని కూడా గాలికొదిలేశారన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి నామమాత్రపు చార్జీలతో ఇళ్ల రిజిస్ట్రేషన్లు చేయాలని, వాంబేకాలనీ వద్ద అర్‌యూబీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే డిస్నీల్యాండ్ స్థలంలో కబేళా ఏర్పాటు ఆలోచనను విరమించుని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నేతలు కాశీవిశ్వనాథ్, కె.దుర్గారావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పాయకాపురం, ఫిబ్రవరి 18: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం నున్న పాలెం అడ్డరోడ్డులో జరిగింది. నున్న గ్రామానికి చెందిన ఎస్‌కే నాగూల్ షరీఫ్ (27) కూలీ పనులు చేస్తుంటాడు. ఆదివారం ఇంటి నుంచి తన ద్విచక్రవాహనంపై బయటకు వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి తిరిగొస్తుండగా పాలెం అ డ్డరోడ్డు వద్ద ఏపీ 16డీక్యూ 3033 నెంబరు గల వా హనం ఢీకొంది. ఈ ఘటనలో నాగూల్ షరీఫ్ అక్కడికక్కడే మృతి చెందాడు. నున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



టీడీపీతోనే తూర్పు అభివృద్ధి: గద్దె

భారతీనగర్, ఫిబ్రవరి 18: జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక నగరాభివృద్ధి మరిచారని, గత టీడీపీ ప్రభుత్వంలోనే తూర్పు నియోజకవర్గ అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీలో భాగంగా ఆదివారం 3వ డివిజన్ కనకదుర్గ నగర్‌లో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పర్యటించి స్థానికులతో పలు అంశాలపై చర్చించారు. అనంతరం మాట్లాడుతూ అభివృద్ధికి చిరునామా చంద్రబాబు అన్నారు. నగరానికి మునుపటి కళ రావాలంటే వచ్చేఎన్నికల్లో చంద్రబాబు మళ్లీ ముఖ్య మంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నియోజకవర్గంలో గత ప్రభుత్వంలోనే రూ.2357 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరిగాయన్నారు.

వెటర్నరీ కాలనీలో..

4వ డివిజన్‌లోని వెటర్నరీ కాలనీలో వీఎంసీ పార్కులో జడ్పీమాజీ ఛైర్ పర్సన్ గద్దె అనురాధ పర్యటించి కాలనీ వాసులతో సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్పొరేటర్ దేవినేని అపర్ణ, జాస్తి సాంబశివరావు వెటర్నరీ, కనకదుర్గ కాలనీ పెద్దలు, 43వ డివిజన్ నేతలు పాల్గొన్నారు.



సేవ్ స్పారో చిత్రలేఖన పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నరసింహారావు

సామాజిక చైతన్యానికి కళలు ఉపయోగపడాలి

● వాతావరణ శాస్త్ర నిపుణుడు డాక్టర్ నరసింహారావు

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 18: కళ అనేది సాంస్కృతిక చైతన్యానికి ఉపయోగపడేలా ఉండాలని ఆచార్య రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వాతావరణ శాస్త్ర నిపుణుడు డాక్టర్ ఎస్‌బీఎస్ నరసింహారావు అన్నారు. ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, జాషువా సాంస్కృతిక వేదిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు ఆక్రందన-మిచౌంగ్ తుపాను అనే అంశంపై చిత్రకారులకు నిర్వహించిన ఆర్ట్ పోటీల్లో విజేతల చిత్రాలతో ప్రదర్శన, బహుమతి ప్రదానోత్సవం ఆదివారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా విజేతలకు క్యాష్ అవార్డులతో పాటు ప్రశంసా పత్రం, జ్ఞాపికలు అందజేశారు. జాషువా సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు ఎ.సునీల్‌కుమార్, ఏపీ రైతు సంఘం నేత ఎం. సూర్యనారాయణ, ఏపీ రైతు సంఘం నేతలు ఎం. హరిబాబు, ఎంబీవీకే బాధ్యులు పి. మురళీకృష్ణ పాల్గొన్నారు. అలాగే పిచ్చుకను మచ్చిక చేసుకుందాం అనే నినాదంతో నిర్వహించనున్న సేవ్ స్పారో జాతీయ చిత్రలేఖనం పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు.



స్కూల్స్ హెడ్ మాస్టర్లకు చెక్కు అందజేస్తున్న స్టేట్ బ్యాంక్ ఎండీ వినయ్ టాన్‌సే, చీఫ్ జనరల్ మేనేజర్ నవీన్ చంద్ర జా

సామాజిక సేవలో ఎస్‌బీఐ ముందంజ

లబ్బీపేట, ఫిబ్రవరి18: వ్యాపార ధోరణితోనే కాకుండా సామాజిక సేవల్లోనూ స్టేట్ బ్యాంక్ ముందుంటుందని స్టేట్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ ఎమ్.వినయ్ టాన్‌సే పేర్కొన్నారు. సామాజిక సేవలో భాగంగా సి.ఎస్.ఆర్ యాక్టివిటీలో కింద రాష్ట్రంలో ఎంపిక చేయబడిన 12 ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.60 లక్షలు అందజేశారు. బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ నవీన్ చంద్ర జా, గుంటూరు జిల్లా నారాకోడూరు జెడ్.పి.హెచ్ స్కూల్ హెడ్ మాస్టర్ ఎమ్.ఏడుకొండలు, కర్నూలులోని శాప్ క్యాంప్ సీఆర్ఆర్‌ఎమ్ హైస్కూల్ హెడ్ మాస్టర్ టి.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 18: సీతారామపురం సబ్‌స్టేషన్ గీతమందిర్, సత్యసాయి ఫీడర్ల పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం ఈనెల 19న ఉదయం 8 నుంచి 10 గంటల వరకు ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చుట్టుగుంట రైవస్, సీతారామపురం కాలువ గట్టు, లాల్‌బహదూర్ శాస్త్రి వీధి, మేదర బజార్, కోటిలింగాల వారి వీధి, నెహ్రూ వీధి, చాపరాల వారి వీధి, ఐనవోలు వీధి, రామా కార్పొరేషన్ ఏరియా, శాతవాహన కళాశాల, ఐకాన్ పబ్లిక్ స్కూల్ ప్రాంతాలు, సీతారామపురం సిగ్నల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తామన్నారు.

పాయకాపురం: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సుందరయ్యనగర్, కొత్త రాజీవ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నామన్నారు.

పేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 18: విద్యార్థులు పట్టుదలతో నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించి ఉన్నతస్థానాలకు ఎదగాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్ అన్నారు. కాపు అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (కోపా) ఆధ్వర్యంలో ఆదివారం ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన చంద్రశేఖర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ప్రభుత్వ న్యాయశాఖ సెక్రటరీ గాదం సత్యప్రభాకరరావు, కోపా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేవీ రమణారావు, రామాయణం నాగసత్యం, కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు, మైలవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి, కోపా సభ్యులు డాక్టర్ దావులూరి కైలాసరావు, డాక్టర్ పీఎస్ఆర్ ప్రసాదరావు, కొత్తపల్లి సంజీవ్, దుట్టా రమేష్‌కుమార్, మద్దాలి సాంబశివరావు, కేతినీడి భాస్కరకుమార్ పాల్గొన్నారు.

వృద్ధులను ఆదరించడం

సామాజిక బాధ్యత: డాక్టర్ చల్లా

సత్యనారాయణపురం, ఫిబ్రవరి 18: వృద్ధులను ఆదరించడం సామాజిక బాధ్యతని వయోవద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ డా.చల్లా హరికుమార్ అన్నారు. స్థానిక అల్లూరి సీతారామరాజు వంతెన సమీపంలోని విజయ్ నర్సింగ్‌స్కూల్‌లో ఆదివారం సాయంత్రం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధులకు నిత్యావసరాలు, మందుల పంపిణీ జరిగింది. అనంతరం డా.ఏవీఎస్‌కే ప్రసాద్, డా.ఆదిత్యచంద్ర వృద్ధులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులిచ్చారు. మేనేజింగ్ ట్రస్టీలు కె.మధుసూదనరావు, వెంకటేష్ గోదావరి పాల్గొన్నారు.

జూపూడి వ్యాఖ్యలు సరికావు: పరిశపోగు

విద్యాధరపురం , ఫిబ్రవరి 18: అంబేద్కర్ కన్నా డబ్బే ముఖ్యమని వైసీపీ నేత జూపూడి ప్రభాకర్ వ్యాఖ్యలు చేయడం సరికాదని కులవివక్ష వ్యతిరేక ప్రచార చైతన్య సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు దళితరత్న పరిశపోగు రాజేష్ ఆదివారం ఒక ప్రకటన అన్నారు. గతంలో తాను అంబేద్కర్ వాదినని జూపూడి చెప్పేవారని, మాలమహానాడు అధ్యక్షుడి హోదాలో అనేక ప్రసంగాల్లో తమ బతుకులు మార్చడానికి వచ్చిన మహానీయుడు అంబేద్కర్ అని ఆయనొక దేవుడన్న ప్రభాకర్ ఇప్పుడు అంబేద్కర్ కంటే డబ్బే ముఖ్యమని చెప్పడం విడ్డూరంగా ఉం దన్నారు. జూపూడి పలు పార్టీలు మారారని, రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఎమ్మెల్సీగా, చంద్రబాబు హయాంలో ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్‌గా, జగన్‌రెడ్డి ప్రభుత్వంలో సాధికారిక సంఘం ఛైర్మన్‌గా ఉన్నాడన్నారు. ఇన్ని పార్టీలు మార్చిన ఊసరవెల్లి ప్రభాకర్ ఇన్నోవా కార్ల విషయంలో కమీషన్‌లు తీసుకున్నారని ఆరోపించారు. జూపూడి అక్రమ ఆస్తులపై దర్యాప్తు జరపాలని కోరతామన్నారు. అతను బేషరతుగా అంబేద్కర్ విగ్రహం వద్ద క్షమాపణలు చెప్పకపోతే మాలమహానాడు, ఎంఆర్‌పీఎస్, డీబీఎఫ్, కేవీపీఎస్, డీహెచ్‌పీఎస్ తదితర దళిత సంఘాలు, మహిళా సంఘాలతో ఆయన కార్యాలయం వద్ద ధర్నా చేస్తామన్నారు.

ప్రజలంతా యోగాను అభ్యసించాలి

విద్యాధరపురం: ప్రజలంతా తమ ఆరోగ్యాల కోసం యోగాను అభ్యసించాలని ఆంధ్ర యూనివర్శిటీ ప్రొఫెసర్ వెంకటేశ్వర యోగా సేవా కేంద్రం వ్యవస్థాపకుడు డాక్టర్ వెంకటేశ్వరయోగీ గురూజీ అన్నారు. విరాట్ యోగా-900 పేరుతో ఆదివారం భవానీపురంలో పలు కార్యక్రమాలను నిర్వహించారు. మినర్వా హోటల్‌లో యోగా గురువులతో సమావేశం, భవానీపురంలో పాదయాత్ర చేశారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, కార్యకర్తలు తుమ్మలపెంట నాగేశ్వరరావు, బొమ్మిశెట్టి తిరుమల రమేష్‌బాబు, మునగంటి నాగేశ్వరరావు, రంగు దుర్గాభవాని, ఆలమూరు ఉపేంద్ర గుప్తా, శ్రీనివాసా కుమార్, సుశీలదేవి పాల్గొన్నారు.

పారిశుధ్యం అధ్వానం

- అడుగడుగునా చెత్తకుప్పలు
- డ్రెయిన్లలో నిలిచిపోయిన మురుగు
- దుర్వాసన, దోమలతో ప్రసాదంపాడు వాసుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



ప్రసాదంపాడు డ్రెయిన్లలో నిలిచిపోయిన మురుగు.. డ్రెయిన్ల పక్కన చెత్తకుప్పలు


గుణదల, ఫిబ్రవరి 18 : ప్రసాదంపాడులో పారిశుధ్యం అధ్వానంగా మారింది. ఎక్కడ చూసినా చెత్తకుప్పలు.. ప్రవహించని మురుగు కాల్వలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్యంపై శ్రద్ధ పెట్టాల్సిన పాలకులు, అధికారులు నిర్లక్ష్యం వహించడంతో నానాటికి సమస్య తీవ్రమవుతుఉంది. యాదవుల బజార్‌కు చివరన ఎస్‌సీ కాలనీలో ఎక్కడ చూసినా చెత్తకుప్పలే దర్శమిస్తున్నాయి. మురుగు కాల్వలు పూడిక తీయకపోవడం వల్ల మురుగునీరు ప్రవహించక దోమల విజృంభణతో పాటు దుర్వాసన వెదజల్లుతోంది. ఇప్పటికే అనేక మంది దోమల బెడదతో రోగాల బారిన పడ్డారు. దీనికి తోడు పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారిపై వీధిలైట్లు లేక గ్రామస్తులు ఇబ్బది పడుతున్నారు. గ్రామస్తులు నిలదీస్తే అది మా బాధ్యత కాదు.. మున్సిపల్ కార్పొరేషన్ బాధ్యత అంటూ పంచాయతీ అధికారులు, పాలకులు చేతులు దులిపేసుకుంటు న్నారు కోట్ల రూపాయలు వెచ్చించి రామవరప్పాడు రింగ్ నుంచి గన్నవరం విమానాశ్రయం వరకు ఫుట్‌పాత్‌లను సుందరీకరణ చేయించి, ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు నిర్వహించకుండా చూడాలని విజయ వాడ మున్సిపల్ కమిషనర్ ఆదేశాలు జారీ చేసినా, పంచాయతీ కార్యదర్శి మాత్రం పట్టించుకున్న దాఖలాలు లేవు. గతంలో కమిషనర్ స్వయంగా పరిశీలించి వ్యాపారులపై చర్యలు తీసుకున్నా, కార్యదర్శి పట్టించుకోకపోవడంపై తీవ్రవిమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పంచాయతీ కార్యదర్శిగాని, సర్పంచ్‌గాని స్పందించకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గ్రామంలో పారిశుధ్యం మురుకాల్వల పూడికతీత పనులు చేపట్టాలని, ప్రజలను అనారోగ్యం బారిన పడకుండా చూడాలని కోరుతున్నారు. ఈ విషయంపై కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్‌ను వివరణ కోరగా పారిశుధ్యంపై దృష్టి పెడతామని, ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తామని తెలిపారు.

దిక్సూచి DIKSUCHI

భారతదేశంలోనే ఉన్నత ఉద్యోగాలైన ఐఏఎస్, ఐపీఎస్ తదితర కీలక సర్వీసులకి సంబంధించి 1056 పోస్టులకుగాను సివిల్ సర్వీసెస్ నోటిఫికేషన్‌ను యూపీఎస్సీ విడుదల చేసింది. నిర్ణీత వయోపరిమితి, బ్యాచిలర్స్ డిగ్రీ ఉన్న అభ్యర్థులు ఈ పరీక్ష రాసేందుకు అర్హులు. జనరల్ అభ్యర్థుల గరిష్ఠ వయోపరిమితి 32 సంవత్సరాలు. ఆరు సార్లు ఈ పరీక్ష రాయవచ్చు. రిజర్వుడు వర్గాలకు వయస్సు, అటెంప్టుల విషయంలో నిబంధనల మేరకు సడలింపు ఉంటుంది.

సివిల్స్ ప్రిలిమ్స్ ప్రిపరేషన్

తొలి మెట్టు నుంచే పట్టు సాధించాలి



సివిల్ సర్వీసెస్ పరీక్షను మూడు అంచెలలో నిర్వహిస్తారు. ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్స్, ఇంటర్వ్యూ అనే మూడు దశల ద్వారా నిర్వహణ ప్రక్రియ ఉంటుంది. ప్రిలిమినరీ పరీక్ష ఈ ఏడాది మే 26న నిర్వహిస్తున్నారు.

మెయిన్స్‌కు నిగ్గుతేల్చే పరీక్ష

ప్రిలిమినరీ(ప్రాథమిక) పరీక్షను అర్హత పరీక్షగానే పరిగణించాలి. ఈ మార్కులను మెయిన్స్‌కు అభ్యర్థులను ఎంపిక చేసేందుకు మాత్రమే పరగణనలోకి తీసుకుంటారు. ఇది ఆబ్జెక్టివ్ రూపంలో నిర్వహించే పరీక్ష. ప్రిలిమినరీ పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. ఒక్కొక్క పేపరు 200 మార్కులకి ఉంటుంది. ఇందులో నెగిటివ్ మార్కింగ్ ఉంటుంది. అందువల్ల విద్యార్థి జాగ్రత్తగా వ్యవహరించాలి. మొదటి పేపర్ జనరల్ స్టడీస్‌కి సంబంధించింది. దీనిలో 100 ప్రశ్నలకు 200 మార్కులు ఉంటాయి. ఈ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా మెయిన్స్ పరీక్షకి అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

జనరల్ స్టడీస్

ప్రధానంగా భారతదేశ చరిత్ర, స్వాతంత్ర్యోద్యమ చరిత్ర, భారతదేశ - ప్రపంచ భౌగోళిక శాస్త్ర అంశాలు; పాలిటీలో భారత రాజ్యాంగం, పరిపాలన, పంచాయతీ రాజ్ వ్యవస్థ; ఎకానమీలో సుస్థిరాభివృద్ధి, పేదరికం, బడ్జెట్, ద్రవ్య విధానం - కోశ విధానం; సైన్స్ అండ్ టెక్నాలజీలో స్పేస్ టెక్నాలజీ, ఐటీ, రోబోటిక్స్, డిఫెన్స్, కమ్యూనికేషన్స్‌కు తోడు వర్తమాన అభివృద్ధి; పర్యావరణంలో సంబంధిత అంశాలు, జనరల్ సైన్స్ అలాగే వర్తమాన జాతీయ, అంతర్జాతీయ అంశాలపై ప్రశ్నలు ఉంటాయి.

గత సంవత్సరం(2023) పరీక్ష పేపరును పరిశీలిస్తే సబ్జెక్టుల వారీగా మార్కులు ఇలా ఉన్నాయి.

- చరిత్ర(14)
- జాగ్రఫీ(16)
- పాలిటీ(15)
- ఎకానమీ(14)
- పర్యావరణం(14)
- కరెంట్ అఫైర్స్(15)
- సైన్స్ అండ్ టెక్నాలజీ(12)

చరిత్ర

చరిత్రకు సంబంధించి 2012 నుంచి 2023 వరకు ప్రశ్నపత్రాలను పరిశీలిస్తే అత్యల్పంగా 2017, 2023లలో 14; అత్యధికంగా 2014లో 22 ప్రశ్నలు వచ్చాయి. చరిత్రలో ప్రాచీన, మధ్య యుగ, ఆధునిక భారతదేశ చరిత్రతోపాటు కళలు - సంస్కృతి (ఆర్ట్ అండ్ కల్చర్)కి సంబంధించిన ప్రశ్నలు వస్తాయి. చరిత్ర విషయంలో ప్రాథమిక అంశాలు బాగా చదవాలి. 75 వసంతాల భారతదేశంలో 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'పై తప్పనిసరిగా ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. ప్రాచీన భారత చరిత్ర విషయానికి వస్తే ముఖ్యంగా ఇటీవలి కాలంలో సింధు నాగరికతకి సంబంధించిన కట్టడాలు తవ్వకాలలో బయటపడ్డాయి. దీనికి సంబంధించి ప్రశ్న వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుత తవ్వకాలలో బయల్పడిన కట్టడం గురించి అయినా అడగవచ్చు లేదా సింధు నాగరికత పట్టణాలకి సంబంధించి ఏ అంశం అయినా అడగవచ్చు. అందువల్ల ఈ విషయంలో పూర్తిగా చదివితే పరీక్షలో సులభంగా సమాధానాన్ని గుర్తించవచ్చు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, సుభాష్ చంద్రబోస్, దయానంద సరస్వతి వంటి ప్రముఖులపై ఇటీవలి కాలంలో దిన పత్రికలలో వార్తలు బాగా వస్తున్నాయి. వీరిపై ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది.

చరిత్ర కోసం 6, 7, 8, 12వ తరగతి నూతన ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలతోపాటు ప్రాచీన భారతదేశ చరిత్ర(ఆర్.ఎస్. శర్మ), మధ్యయుగ భారతదేశ చరిత్ర(సతీష్ చంద్ర), ఆధునిక భారతదేశ చరిత్ర(బిపిన్ చంద్ర), స్వాతంత్ర్యోద్యమ చరిత్ర(బిపిన్ చంద్ర) పుస్తకాలు చదివితే సబ్జెక్టుపై సమగ్ర అవగాహన వస్తుంది. ఇవి చదివితే 60 నుంచి 70 శాతం మార్కులు సాధించినట్లే. వీటితోపాటు టాటా మెగ్రాహెల్, స్పెక్ట్రమ్, సివిల్ సర్వీసెస్ క్రానికల్ వంటి సంస్థలకి సంబంధించి ఏదైనా ఒక స్టాండర్డ్ పుస్తకాన్ని ఆసాంతం చదివితే సరిపోతుంది.

2023లో చరిత్ర నుంచి అడిగిన ప్రశ్నలు (ఉదాహరణకు):

- **మహాసాంఘిక ఆధ్వర్యంలో, ప్రముఖ బౌద్ధ కేంద్రంగా విలసిల్లిన ధాన్యకటకం కింది ప్రాంతాల్లో ఎక్కడ ఉంది?**
  ఎ) ఆంధ్ర బి) గాంధార సి) కళింగ డి) మగధ

కటాఫ్

2022 ప్రిలిమ్స్ పేపర్ కట్ ఆఫ్ మార్కులు పరిశీలిస్తే 200 మార్కులకిగాను జనరల్ అభ్యర్థులు 88.22 మార్కులు, ఈడబ్ల్యుఎస్ -82.83, ఓబీసీ-87.54, ఎస్సీ-74.08, ఎస్టీ-69.35, దివ్యాంగుల కేటగిరి 1 - 49.84, కేటగిరి 2 - 58.59, కేటగిరి 3 - 40.40, కేటగిరి5 - 41.76 వచ్చాయి. ఈ మార్కులకి అటు ఇటుగా 5 మార్కులు అంచనా వేసుకుని ముందస్తు ప్రణాళిక చేసుకుంటే ఎవరికైనా మెయిన్స్‌కు మార్గం సుగమం అవుతుంది.

- **ప్రాచీన దక్షిణ భారతదేశానికి సంబంధించి, కోర్కై, పూంపుహార్, ముచిరి అనేవి ఏ విధంగా ప్రసిద్ధి చెందాయి?**
  ఎ) రాజధాని నగరాలు బి) ఓడరేవులు
  సి) ఇనుము-ఉక్కు తయారీ కేంద్రాలు
  డి) జైన తీర్థంకరుల పుణ్యక్షేత్రాలు

జాగ్రఫీ



దీనిలో అత్యల్పంగా 2016లో 7 ప్రశ్నలు రాగా, అత్యధికంగా 2013లో 18 ప్రశ్నలు వచ్చాయి. జాగ్రఫీలో భారతదేశ భౌగోళిక పరిస్థితులేగాక ప్రపంచ భౌగోళానికి సంబంధించిన అంశాలను చదవాలి. అయితే భౌతిక భౌగోళిక అంశాలపై ప్రధానంగా ప్రశ్నలు వస్తాయి. ఉదాహరణకి టోంగా అగ్నిపర్వతం గురించి ఇటీవల వార్తలు వచ్చాయి. టోంగా అగ్నిపర్వతం గురించి ప్రత్యేకంగా చదవాలి. అదే సమయంలో అగ్నిపర్వతం(ఓల్కనో) రకాలు, అవి ఏర్పడటానికి కారణాలు, ఎక్కడెక్కడ ఉన్నాయి వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఇటీవలి కాలంలో తరచూ నదుల అనుసంధానం ప్రస్తావన వచ్చింది. కెన్-బెట్వా అనుసంధానం గురించి చదవాలి. అలాగే నదులు, వాటి ఉపనదులను మ్యాప్ సహాయంతో నేర్చుకోవాలి. ఫారెస్ట్ రిపోర్ట్ 2021 ప్రకారం అడవుల విస్తీర్ణం పెరిగింది. అడవుల రకాలు, విస్తీర్ణం ఏ రాష్ట్రాలలో ఏవిధంగా ఉంది సమగ్రంగా చదవాలి. మడ అడవులను అధ్యయనం చేయాలి. ఇండియాకి సంబంధించి రామ్సర్ సైట్స్ 80కి చేరాయి. చిత్తడి నేలలు అంటే ఏమిటో, ఎక్కడెక్కడ ఉన్నాయో చదువుకోవాలి. ప్రతి సంవత్సరం ఏదైనా ఒక సముద్రం సరిహద్దులను పరీక్షలో ఇస్తున్నారు. ఈ సంవత్సరం నల్లసముద్రం, ఎర్ర సముద్రం తరచూ వార్తల్లో నిలిచాయి. వాటి చుట్టుపక్కల ప్రాంతాలు, జలసంధులపై ప్రశ్నలు అడగవచ్చు. వార్తల్లో నిలిచిన వివాదాస్పద ప్రాంతాలు పాలస్తీనా - ఇజ్రాయెల్; నగోర్నో కారాబాగ్, హెల్మాండ్ నది వివాదం వంటివి పరిశీలించండి. వివిధ దేశాల సరిహద్దులు, సమగ్ర సరిహద్దులు మ్యాప్ పాయింటింగ్ ద్వారా చదువుకోవాలి. జాగ్రఫీకి సంబంధించి 6-12 ఎన్‌సీఈఆర్‌టీ బుక్స్ బాగా చదివితే సరిపోతుంది. వీటితోపాటు ఏదైనా ఒక స్టాండర్డ్ బుక్ చదివితే మంచిది.

పాలిటీ

ఇందులో అంతర్జాతీయ అంశాలకు సంబంధించి అత్యల్పంగా 2016లో 7 ప్రశ్నలు, అత్యధికంగా 2017లో 22 ప్రశ్నలు వచ్చాయి. పాలిటీలో భారత రాజ్యాంగంలోని అంశాలకు వర్తమాన విషయాలు జోడించి చదవాలి. ఉదాహరణకు దేశంలో గవర్నర్ వ్యవస్థ వివాదాస్పదం అవుతోంది కాబట్టి దానిపై ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నిక, కొలిజియం వ్యవస్థ, కేంద్ర ఎన్నికల సంఘం-కమిషనర్ల నియామకం- సుప్రీం కోర్టు తీర్పు, ఎన్నికల సంస్కరణలు, ఎలక్టోరల్ బాండ్స్ - సుప్రీం తీర్పు, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్స్ - సుప్రీం కోర్టు తీర్పు, భారత రాజ్యాంగం, దానిలోని మౌలికాంశాలు, కేశవానంద భారతి కేసు వంటి వాటితో పాటు, రాజ్యాంగంలోని అంశాలు ఎక్కడ నుంచి తీసుకున్నారు వంటి అంశాలు చదవాలి. పార్లమెంట్లో ప్రవేశపెట్టిన బిల్లుల గురించి చదవాలి. సుప్రీంకోర్టు, హైకోర్టులు ఇచ్చిన వివిధ ముఖ్యమైన తీర్పులు చదవాలి. వివిధ కమిటీల రిపోర్ట్‌లు చదవాలి. 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, మహిళ వివాహ వయస్సుకి సంబంధించిన అంశాలతోపాటు వారికి సంబంధించిన హక్కులు చదవాలి. ఓబీసీ జాబితాకి చేసిన రాజ్యాంగ సవరణ బిల్లుతోపాటు ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన రాజ్యాంగ ఆర్టికల్స్, వారికి సంబంధించిన కమిషన్ల గురించి చదవాలి.

2023లో పాలిటీలో అడిగిన ప్రశ్నలు (ఉదాహరణకు)

సిశాట్

ప్రిలిమ్స్‌లో రెండో పేపర్ సిశాట్ 200 మార్కులకిగాను 80 ప్రశ్నలతో నిర్వహిస్తారు. ఈ పేపర్ క్వాలిఫైయింగ్ పేపర్ మాత్రమే. ఈ పేపర్‌లో 33 శాతం మార్కులు సాధించాలి.

ఈ పేపర్‌లో సాధారణ న్యూమరసీ, అర్థమెటిక్, లాజికల్ రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, గ్రాఫ్స్, టేబుల్స్‌కి సంబంధించి పదో తరగతి పరిజ్ఞానం సరిపోతుంది. ఇంగ్లిష్ ప్యాసేజ్, కమ్యూనికేషన్ స్కిల్స్‌కు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి.

రీజనింగ్, అర్థమెటిక్‌కు సంబంధించి చాంద్ బుక్స్ లేదా, అరిహంట్ బుక్స్ గానీ చదవాలి. ఇంగ్లిష్ పాసేజ్‌కి సంబంధించి టాటా మెగ్రాహిల్ లేదా అరిహంట్ లేదా పియర్సన్ బుక్స్ చదవాలి.

ప్రిలిమినరీ పరీక్షకి చదువుతూనే మెయిన్స్ సంబంధించి కూడా చరిత్ర, భౌగోళిక శాస్త్రం, ఎకానమీ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ, పాలిటీలను అనుసంధానం చేసుకుంటూ వెళ్ళాలి. తద్వారా మెయిన్స్‌కి ప్రిలిమ్స్ తరవాత చదవడం కూడా సులభతరమవుతుంది.

- **'డ్యూ ప్రాసెస్ ఆఫ్ లా' అంటే ఏమిటి?**
  ఎ) సహజ న్యాయ సూత్రం
  బి) చట్టం ద్వారా ఏర్పాటు చేసిన విధానం
  సి) న్యాయమైన చట్టం దరఖాస్తు
  డి) చట్టం ముందు సమానత్వం
- **కింది వాటిలో ఏది దేశ రాజ్యాంగం ముఖ్య ఉద్దేశాన్ని ప్రతిబింబిస్తుంది?**
  ఎ) అవసరమైన చట్టాలను రూపొందించడానికి ఇది లక్ష్యాన్ని నిర్ణయిస్తుంది. బి) ఇది రాజకీయ కార్యాలయాలు, ప్రభుత్వాన్ని సృష్టించడానికి వీలు కల్పిస్తుంది.
  సి) ఇది ప్రభుత్వ అధికారాలను నిర్వచిస్తుంది, పరిమితం చేస్తుంది.
  డి) ఇది సామాజిక న్యాయం, సామాజిక సమానత్వం, సామాజిక భద్రతను కల్పిస్తుంది.

పాలిటీ విషయంలో ఎన్‌సీఈఆర్‌టీ ప్రచురించిన ఇండియన్ కాన్‌స్టిట్యూషన్ ఎట్ వర్క్ అనే 11వ తరగతి పుస్తకం చదవాలి. ఇండియన్ కాన్‌స్టిట్యూషన్ పుస్తకంతో పాటు లక్ష్మీకాంత్ ఇండియన్ పాలిటీ లాంటి స్టాండర్డ్ బుక్ ఏదైనా ఒకటి చదవాలి. పాలిటీ చదివేటప్పుడు ముఖ్యంగా వర్తమాన అంశాలు కలుపుకొని బాగా చదవాలి. రాజ్యాంగ ప్రకరణలపై అవగాహన రావాలి.

జనరల్ సైన్స్

శాస్త్ర సాంకేతికతకి సంబంధించి 2019లో 7 అత్యల్పంగా, 2014లో అత్యధికంగా 16 ప్రశ్నలు వచ్చాయి. జనరల్ సైన్స్‌లో వ్యాధులు, విటమిన్‌లు, వృక్ష, జంతువులకి చెందిన సాధారణ అంశాలు ముఖ్యం. సైన్స్ అండ్ టెక్నాలజీలో కమ్యూనికేషన్స్, స్పేస్, ఐటీ, రోబోటిక్స్, బయోటెక్నాలజీ, డిఫెన్స్ వంటి అంశాల్లో నూతన ఆవిష్కరణలు, సమకాలీన డెవలప్‌మెంట్స్ పైన ప్రశ్నలు అధికంగా వస్తాయి. ఇటీవలి కాలంలో భారతదేశంతోపాటు ఇతర దేశాల అంతరిక్ష ప్రయోగాల గురించి ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. ఈసారి చంద్రయాన్-3, ఆదిత్య ఎల్1 ప్రయోగం తదితరాలపై కచ్చితంగా చదవాలి. వార్తల్లో నిలిచిన వ్యాధులు - సంక్రమణ, నివారణ చర్యల గురించి చదవాలి.

(మిగతా రేపటి దిక్సూచిలో)



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

22,400 పైన క్లోజయితే బుల్లిష్

(ఫిబ్రవరి 19-23 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

టెక్నో అస్త్ర

నిఫ్టీ గత వారం 22,069-21,530 పాయింట్ల మధ్యన కదలాడి లాభంతో చివరకు 22,041 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 22,400 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

» 30, 50, 150, 200 రోజుల చలన సగటు స్థాయిలు 21,692, 21,544, 20,261, 19,855 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 22,450
బ్రేక్‌డౌన్ స్థాయి: 21,650
నిరోధ స్థాయిలు: 22,250, 22,350, 22,450 (22,150 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 21,850, 21,750, 21,650 (21,950 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



18వ తేదీ			
హైదరాబాద్	554	విజయవాడ	542
19వ తేదీ		విశాఖపట్నం	555
చిత్తూరు	603	వరంగల్	556
గోదావరి	542	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	130	గోదావరి	134
వరంగల్	130	విజయవాడ	134
కరీంనగర్	130	గుంటూరు	135
మహబూబ్‌నగర్	130	ఒంగోలు	135
కర్నూలు	130	చిత్తూరు	135
విశాఖపట్నం	122		

ప్రభుత్వ పెట్టుబడులే చాలవు

» ప్రైవేట్ పెట్టుబడులూ పెరగాలి
» ఆర్‌బీఐ మాజీ గవర్నర్ సుబ్బారావు



న్యూఢిల్లీ: ప్రైవేట్ పెట్టుబడులు ఇంకా పుంజుకోకపోవడంపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పెట్టుబడులకు ప్రైవేట్ పెట్టుబడులు కూడా తోడైతేనే 6.5 శాతం నుంచి 7 శాతం జీడీపీ వృద్ధి రేటు సాధ్యమవుతుందని ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. 'ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనపై పెట్టుబడి పెట్టడం సానుకూల అంశమే. ఇది ఆర్థిక వ్యవస్థ దీర్ఘకాల వృద్ధికి దోహదం చేస్తుంది. అయితే 2025-26 ఆర్థిక సంవత్సరం కల్లా ద్రవ్య లోటును జీడీపీలో 4.5 శాతం వద్ద కట్టడి చేయాలంటే ఈ స్థాయిలో ప్రభుత్వ పెట్టుబడులు కొనసాగించడం కష్టమవుతుంది' అన్నారు. ప్రైవేట్ పెట్టుబడులతో పాటు ప్రస్తుతం వినియోగం, ఎగుమతుల అవకాశాలూ అంతంత మాత్రంగానే ఉన్నట్టు సుబ్బారావు చెప్పారు.

చాయిస్‌లు తక్కువే: ప్రభుత్వ పెట్టుబడులు తగ్గించేందుకు ప్రభుత్వం ముందున్న చాయిస్‌లూ తక్కువేనని సుబ్బారావు చెప్పారు. ఒకవేళ ముందు ముందు కూడా ప్రభుత్వ పెట్టుబడులు ఇదే స్థాయిలో కొనసాగించాలంటే ఇతర ఖర్చులైనా తగ్గించుకోవాలి లేదా అప్పులైనా తేవాల్సి ఉంటుందన్నారు. స్వల్పకాలంలో ఇతర ఖర్చులు తగ్గించుకుంటే ఇతర సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయాన్ని అప్పుల తెచ్చి ప్రభుత్వ పెట్టుబడులు కొనసాగించాలంటే ఎఫ్‌ఆర్‌బీఎం లక్ష్యాలు దెబ్బతింటాయన్నారు.

వృద్ధిలో అసమతౌల్యం: ప్రస్తుతం దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతున్నా, సగం జనాభా ఆదాయాలు అంతంత మాత్రంగానే ఉన్న విషయాన్ని సుబ్బారావు గుర్తు చేశారు. అభివృద్ధి ఫలాలు వీరికి కూడా చేరితే తప్ప వినియోగం పుంజుకోదన్నారు. వీరి ఆదాయం, వినియోగ ఖర్చులు పెరిగితే ప్రైవేట్ పెట్టుబడులు, ఉపాధి అవకాశాలూ పెరుగుతాయన్నారు. దేశీయ వినియోగ పరిశ్రమ ప్రస్తుతం తన ఉత్పత్తి సామర్థ్యంలో 75 శాతం వినియోగించుకుంటోందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రైవేటు పెట్టుబడులు లోక్‌సభ ఎన్నికల తర్వాత పుంజుకునే అవకాశం ఉందని ఆయన చెప్పారు.

ఉచితాలు సరికాదు

ఓటర్లను ఆకర్షించేందుకు రాజకీయ పార్టీలు పోటీ పడి ఇస్తున్న 'ఉచిత హామీ'లపై సుబ్బారావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఉచితాలపై చేసే ఖర్చులను ప్రజలకు విద్య, ఆరోగ్యం లేదా మౌలిక వసతుల కల్పనపై చేయడం మంచిదన్నారు. ఈ రంగాలపై చేసే ఖర్చులు దీర్ఘకాలంతో దేశ అభివృద్ధికి తోడ్పడతాయన్నారు. ఓటర్లు కూడా ఉచితాల హేతుబద్ధతను ఆలోచించి ఓటేయ్యాలని కోరారు.

ఈ వృద్ధి రేటు చాలదు

2047 నాటికి మన దేశం అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే ప్రస్తుత వృద్ధి రేటు చాలదని సుబ్బారావు స్పష్టం చేశారు. వచ్చే 20 ఏళ్ల పాటు ఏటా సగటున 7.6 శాతం చొప్పున అభివృద్ధి చెందితేనే ఆ లక్ష్యం సాధ్యమవుతుందన్నారు. వాతావరణ మార్పులు, ప్రపంచీకరణపై వ్యక్తమవుతున్న వ్యతిరేకత, పెరిగిపోతున్న వృద్ధులు, అంతర్జాతీయ ఉద్రిక్తతలు ఇందుకు ఆటంకంగా మారే ప్రమాదం ఉందన్నారు. కృత్రిమ మేధ (ఏఐ) కూడా ఇందుకు ప్రతిబంధకం కావచ్చని చెప్పారు. మన దేశ అభివృద్ధి ప్రపంచ అభివృద్ధితో ముడిపడి ఉందనే విషయాన్ని మర్చిపోకూడదన్నారు. ప్రపంచ అభివృద్ధి క్షీణిస్తుంటే, మన దేశం అభివృద్ధిలో పయనిస్తుందని భావించడం వృధా ప్రయాస అని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ స్పష్టం చేశారు.

బిజినెస్



త్వరలో రెండు సెమీకండక్టర్ ప్లాంట్లు

- రూ.వేల కోట్ల పెట్టుబడులు
- కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్

న్యూఢిల్లీ: మన దేశంలో త్వరలో రెండు పూర్తి స్థాయి సెమీకండక్టర్ ప్లాంట్లు ఏర్పాటు కానున్నాయి. కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ఈ విషయం వెల్లడించారు. ఇందులో ఒక ప్లాంట్‌ను ఇజ్రాయెల్ కేంద్రంగా పని చేసే 'టవర్ సెమీకండక్టర్ కంపెనీ, రెండో ప్లాంట్‌ను టాటా గ్రూప్ ఏర్పాటు చేస్తాయన్నారు. ఈ రెండు ప్లాంట్ల కోసం ఇజ్రాయెల్ కంపెనీ, టాటా గ్రూప్ రూ.వేల కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్టు చెప్పారు. ఇజ్రాయెల్ కంపెనీ పెట్టుబడులే 800 కోట్ల డాలర్ల (సుమారు రూ.66,400 కోట్లు) వరకు ఉంటుందని చంద్రశేఖర్ తెలిపారు. ఈ రెండు ప్లాంట్లకు అనుబంధంగా అనే చిప్ అసెంబ్లింగ్, ప్యాకేజింగ్ యూనిట్లూ ఏర్పాటవుతాయన్నారు

జూన్‌లోగా అనుమతులు : టవర్ సెమీకండక్టర్, టాటా గ్రూప్ ఇందుకు అవసరమైన అనుమతుల కోసం ఇప్పటికే ప్రభుత్వానికి దరఖాస్తు చేశాయి. వీలైనంత త్వరలో ఈ రెండు ప్రతిపాదనలకు ప్రభుత్వం లోక్‌సభ ఎన్నికల్లోపు ఆమోదం తెలుపుతుందని చంద్రశేఖర్ చెప్పారు. ఒకవేళ ఈ లోపు కుదరకపోయినా లోక్‌సభ ఎన్నికల తర్వాత జూన్‌లోపు అన్ని అనుమతులు మంజూరు చేస్తామన్నారు. ఇజ్రాయెల్, టాటా గ్రూప్ ఏర్పాటు చేసే రెండు సెమీకండక్టర్ ప్లాంట్లలో 65, 40, 28 నానోమీటర్ చిప్స్ తయారవుతాయన్నారు.

● గీతమ్ యూనివర్సిటీ.. ప్రతిష్ఠాత్మక ప్రభుత్వ ఇనిస్టిట్యూషన్స్ నుంచి రూ.28.87 కోట్ల నిధులను అందుకుంది. నిధులు మంజూరు చేసిన సంస్థల్లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఐసీఎస్ఎస్ఆర్, కేంద్రవిద్యా శాఖ, యూజీసీ-డీఏఈ-సీఎస్ఆర్ తదితర సంస్థలు ఉన్నాయి. గిరిజన సాధికారిత-అనుభవిక పరిశోధన, సైంటిఫిక్ అడ్వాన్స్‌మెంట్, ఇంజనీరింగ్‌లో ఇన్నోవేషన్, అకాడమియా-పారిశ్రామిక రంగ భాగస్వామ్యం వంటి విభాగాల్లో పరిశోధన సహా ఇతరత్రా కార్యకలాపాల కోసం ఈ నిధులను మంజూరు చేశాయి.

● అమెజాన్ ఫ్రెష్.. వేగన్ స్టోర్‌ను ప్రారంభించింది. భారత్‌లో రోజురోజుకు శాఖాహారుల సంఖ్య గణనీయంగా పెరిగిపోతోందని, వారి అవసరాలకు తగ్గట్టుగా ఈ స్టోర్‌ను ప్రారంభించినట్లు వెల్లడించింది. ఈ స్టోర్‌లో పలు రకాలైన ప్లాంట్ ఆధారిత ఉత్పత్తులతో పాటు రెడీ టు యూజ్ ప్రొడక్ట్స్ ఉన్నట్లు తెలిపింది. సో గుడ్, సోఫిట్, ఎపిగమియా, ఆర్ఏడబ్ల్యూ వంటి బ్రాండ్స్ అమెజాన్ ఫ్రెష్‌లో అందుబాటులో ఉన్నాయి.

ఫార్మా, మెటల్ షేర్లపై కన్నేయండి..!

స్టాక్ రికమండేషన్స్

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారం మరింత కన్సాలిడేషన్‌కు గురికావచ్చు. గత వారం వరుసగా నాలుగు సెషన్ల సూచీలు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ పరిణామాలతో పాటు రిలయన్స్, ఎల్ అండ్ టీ వంటి షేర్లు పెరగటమే ఇందుకు కారణం. దీంతోపాటు ఆటో, బ్యాంకింగ్, ఐటీ రంగాల నుంచి మంచి తోడ్పాటు లభించింది. ఈ వారం ఫార్మా, మెటల్ రంగాల్లో మూమెంటమ్ ఉండే అవకాశం ఉంది. నిఫ్టీ ఫిబ్రవరి ఫ్యూచర్స్ మద్దతు స్థాయిలు 21,900, నిరోధ స్థాయిలు 22,150 వద్ద ఉన్నాయి. నిఫ్టీ 22,200 స్థాయిని అధిగమిస్తేనే బుల్లిష్‌నెస్ వస్తుంది.

పాలీక్యాబ్ ఇండియా: ఈ ఏడాది ఆరంభంలో ఒక్కసారిగా పతనమైన ఈ షేరు ప్రస్తుతం నిలదొక్కుకుంది. షేర్ల కదలికల్లో స్థిరత్వం వచ్చింది. మూడో త్రైమాసిక ఫలితాల తర్వాత స్వల్ప కన్సాలిడేషన్ జరిగింది. గత శుక్రవారం ఈ షేరు రూ.4,670 వద్ద క్లోజైంది. ఈ కౌంటర్‌లోకి ఇన్వెస్టర్లు రూ.4,600/4,650 శ్రేణిలో ప్రవేశించి రూ.5,000/5,250 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.4,550 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఆల్కెమ్ లేబొరేటరీస్: కొన్ని నెలలుగా ఈ కౌంటర్ జోరు ప్రదర్శిస్తూ వస్తోంది. త్రైమాసిక ఫలితాలు ఆకర్షణీయంగా ఉండటం, డివిడెండ్ ప్రకటించటంతో ఈ నెల మొదటి వారం నుంచి అప్‌ట్రెండ్‌ను కనబరుస్తూ వస్తోంది. గత శుక్రవారం ఈ షేరు రూ.5,442 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.5,400 ఎగువన ప్రవేశించి రూ.5,770/5,800 టార్గెట్ ధరతో పొజిషన్ తీసుకోవచ్చు. అయితే రూ.5,340 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టాటా కమ్యూనికేషన్స్: గత చివరి నాలుగు సెషన్లలో ఈ షేరు లాభాల్లోనే ముగిసింది. త్రైమాసిక ఫలితాల అనంతరం ఈ కౌంటర్‌లో కొనుగోళ్లు పెరిగాయి. గత శుక్రవారం రూ.1,812 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లోకి మూమెంటమ్ ట్రేడర్లు రూ.1,775/1,800 శ్రేణిలో ప్రవేశించి రూ.1,945/2,000 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,750 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎస్‌బీఐ లైఫ్: సుదీర్ఘ అప్‌ట్రెండ్ అనంతరం ఈ కౌంటర్ స్వల్ప దిద్దుబాటుకు లోనైంది. త్రైమాసిక ఫలితాల తర్వాత ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ క్రమంగా పెరుగుతోంది. గత శుక్రవారం ఈ షేరు రూ.1,508 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.1,475/1,500 శ్రేణిలో ప్రవేశించి రూ.1,650/1,750 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,450 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టీవీఎస్ మోటార్స్: రెండేళ్లుగా అప్‌ట్రెండ్‌లో కొనసాగుతున్న ఈ షేరు తాజాగా సరికొత్త జీవితకాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. రెండు నెలలుగా రూ.1,950 స్థాయిలో కన్సాలిడేషన్ జరిగింది. గత శుక్రవారం ఈ షేరు రూ.2,138 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.2,100 శ్రేణిలో ప్రవేశించి రూ.2,350/2,550 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,050 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

కీలక నిరోధ స్థాయిల్లో పరీక్ష

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం కరెక్షన్‌తో ప్రారంభమై ఆ తర్వాత రికవరీ సాధించి తదుపరి 21,500 ఎగువకు వెళ్లింది. చివరకు 22,000 పాయింట్లకు స్వల్ప ఎగువన క్లోజైంది. గత వారం నిఫ్టీ ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయిలైన 22,150 పాయింట్ల చేరువలోకి వెళ్లింది. ఈ స్థాయిల వద్ద నిఫ్టీ పరీక్షను ఎదుర్కొనటం ఇది మూడో సారి. టెక్నికల్‌గా చూస్తే ప్రధాన నిరోధ స్థాయిల వద్ద ఎలాంటి అప్‌సైడ్ బ్రేకౌట్‌ను సూచించటం లేదు. గత శుక్రవారం అమెరికా మార్కెట్లు మైనర్ రియాక్షన్‌ను చవిచూడటంతో భారత మార్కెట్లు అప్రమత్త ట్రెండ్‌ను సూచించే అవకాశం ఉంది. ప్రధాన నిరోధ స్థాయిల వద్ద కొద్ది రోజుల పాటు నిలదొక్కుకుంటేనే స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌ను కనబరుస్తుందో లేదో తెలుస్తుంది.

బుల్లిష్ స్థాయిలు: పాజిటివ్ ట్రెండ్‌ను కనబరిస్తే 22,150 ఎగువన తదుపరి ప్రధాన నిరోధ స్థాయిలుంటాయి. ప్రస్తుతం నిఫ్టీ ఈ స్థాయిలకు 100 పాయింట్ల దూరంలో ఉంది. గడిచిన రెండు నెలలుగా ఈ స్థాయిల వద్ద నిలదొక్కుకోవటానికి ప్రయత్నం చేస్తూ కరెక్షన్‌లోకి జారుకుంటోంది. ఈ స్థాయి ప్రస్తుతం స్వల్పకాలిక నిరోధ స్థాయిగా ఉంది. స్వల్పకాలిక అప్‌ట్రెండ్ కోసం ఈ నిరోధ స్థాయిలకు ఎగువన నిలదొక్కుకోవాల్సి ఉంటుంది.

బేరిష్ స్థాయిలు: నిఫ్టీ ఏదైనా అప్రమత్త ట్రెండ్‌ను సూచిస్తే ప్రధాన మానసిక అవధి స్థాయిలైన 22,000 ఎగువన కచ్చితంగా నిలదొక్కుకోవాల్సి ఉంటుంది. ఈ స్థాయిల వద్ద నిలదొక్కుకోలేకపోతే మైనర్ కరెక్షన్‌ను సూచిస్తుంది. తదుపరి స్వల్పకాలిక మద్దతు స్థాయిలు 21,800 దిగువన ఉంటాయి. ఇక్కడ కూడా నిలదొక్కుకోకపోతే మరింత బలహీనతను సూచిస్తుంది. 21,400 కింద ప్రధాన మద్దతు స్థాయిలుంటాయి.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ కూడా కనిష్ఠ స్థాయిలైన 44,600 వద్ద రికవరీ సాధించి 46,600 వరకు వెళ్లింది. గత శుక్రవారం కరెక్షన్‌ను చవిచూసినా 750 పాయింట్ల లాభంతో 46,380 వద్ద నిలకడగా ముగిసింది. ఈ వారం పాజిటివ్ ట్రెండ్‌ను కనబరిస్తే 46,700 ఎగువన ప్రధాన నిరోధం ఉంటుంది. ఇక్కడ నిలదొక్కుకుంటేనే అప్‌ట్రెండ్‌ను సూచిస్తుంది. తదుపరి ప్రధాన నిరోధం 47,200. ఒకవేళ ప్రస్తుత స్థాయిలైన 46,000 వద్ద నిలదొక్కుకోలేకపోతే అప్రమత్తతను సూచిస్తుంది.

పాటర్న్: మార్కెట్ గత రెండు నెలలుగా దీర్ఘచతురస్రాకార ప్యాటర్న్‌లో నిలిచిపోయింది. 221,50 వద్ద నిరోధ స్థాయిలున్నాయి. దీన్ని బ్రేక్ చేస్తేనే తదుపరి అప్‌ట్రెండ్‌ను కనబరుస్తుంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	22,080, 22,150
మద్దతు	21,940, 21,850

www.sundartrends.in

ప్రయాణంలో.. ఎన్నో పాఠాలు నేర్చుకున్నా!

ఆమె నటి, మోడల్, పొలిటీషియన్. పేరు ఇషా కొప్పికర్. 'వైఫ్ ఆఫ్ వర ప్రసాద్', 'చంద్రలేఖ' చిత్రాలతో తెలుగు తెరకు పరిచయమై... ఆ తర్వాత బాలీవుడ్‌కు పరిమితమైంది. ఇటీవలే 'ఏలియన్' అనే తమిళ చిత్రంలో నటించింది. ఇషా కొప్పికర్ గురించి కొన్ని విశేషాలు..

"మోడలింగ్‌లో పేరు తెచ్చుకోవటం.. నటిగా నిలదొక్కుకోవటం.. రాజకీయాల్లోకి రావటం.. ఇదంతా ఊరికే జరగలేదు. ఎన్నో కష్టాలు పడ్డాను. ఇబ్బందులెదుర్కుంటేనే జీవితం తెలిసేది. ఎక్కడా ఆగలేదు. ఏ కష్టానికి భయపడలేదు. ముందడుగులేశా కాబట్టి ఇలా ఉన్నా. జీవిత ప్రయాణంలో ఎన్నో పాఠాలు నేర్చుకున్నా. ఏదీ సాఫీగా సాగిపోలేదు. ఎప్పుడూ నా సోల్‌ను పోగొట్టుకోలేదు. అదే నా లైఫ్‌లో ఉండే గొప్పతనం.

అలా సినిమాల్లోకి..

ఇషా కొప్పికర్ ముంబైలో పుట్టి పెరిగింది. లైఫ్ సైన్సెస్ చదివింది. కాలేజీ రోజుల్లోనే మోడలింగ్ చేసేది. అలా ఫొటోషూట్స్ చేసేది. ఆమె లుక్స్ చూసి లక్స్, రెగ్జోనా, కామె.. లాంటి



ప్రముఖ సబ్బుల సంస్థలు ఆమెను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకున్నాయి. కోకోకోలా యాడ్ కూడా చేసింది. 1995లో మిస్ ఇండియా పోటీల్లో పాల్గొంది. ఆమెకు 'మిస్ టాలెంట్ క్రౌన్' అవార్డును అందుకుంది. అప్పుడే 'వైఫ్ ఆఫ్ వరప్రసాద్' చిత్రంలో నటించే అవకాశం వచ్చింది. అలా ఈ ముంబై భామ తెలుగు చిత్రాలతోనే తెరమీదకొచ్చింది. ఆ తర్వాత 'చంద్రలేఖ'తో మంచి పేరు తెచ్చుకుంది. తమిళ, కన్నడ చిత్రాల్లో నటించింది. హిందీలో 'ఫిజా' చిత్రంతో ఎంటరైంది. 'కంపెనీ', 'డాన్', 'ఏక్ వివాహ్..', 'షబ్రీ', 'డార్లింగ్' లాంటి పదుల చిత్రాల్లో నటించింది. అయితే ఆమెకు నచ్చేది మాత్రం 'డాన్', 'ఖల్లాస్' చిత్రాలేనట.

అందుకే కొన్ని చిత్రాలు చేయలేకపోయా..

'స్పెషల్ అప్పియరెన్స్‌తో పాటు సెకండ్ క్యారెక్టర్స్ కూడా నటించా. కొన్ని మంచి చిత్రాల్లో నటించే అవకాశం వచ్చింది. అయినా అవకాశాలెదుర్కున్నా. ఓ హీరోతో క్యాస్టింగ్ కౌచ్ సమస్య ఎదుర్కున్నా. 1999 చివర్లో.. ఓ హీరో నన్ను ఒంటరిగానే రమ్మని తన ఇంటికి ఆహ్వానించాడు. పదే పదే 'నీ స్టాఫ్‌ను తీసుకురాకు' అన్నాడు. నేను వెళ్లలేదు. ఆ తర్వాత ఆ చిత్రం ఓ ప్రముఖ నిర్మాత బిడ్డ ఆ సినిమా హీరోయిన్‌గా కనిపించింది. అవేమీ పట్టించుకోలేదు. ఇలాంటి ఇబ్బందులు కొన్ని ఎదుర్కున్నా. ప్రతిభ, గుడ్ లుక్స్‌తోనే పాత్రలు దొరికాయి.



అదే చాలనుకుంటా..

ఇషా కొప్పికర్ 2009లో పెళ్లి చేసుకుంది. ఆమెకో కూతురు. న్యూమరాలజీని నమ్ముతుంది. తనకు రణబీర్ కపూర్ యాక్టింగ్ అంటే ఇష్టమని చాలా ఇంటర్వ్యూల్లో చెబుతుంది. 'వర్కవుట్స్ చేయటంలో ముందుంటాను. అదో అలవాటు. మూడ్ బాలేకుంటే మంచి మ్యూజిక్ పెట్టుకుని డ్యాన్సేయటం.. స్నేహితులతో చిల్ అవటం చేస్తుంటా. ప్రయాణాలు చేస్తుంటా' అంటుందామె. 'సినిమా నటిని అవుతానని.. ఇలా ఫేమ్ అవుతానని అనుకోలేదు. ఇదంతా అదృష్టం. ఇదే చాలనుకుంటా'నంటుంది ఇషా కొప్పికర్. 'దహనం' వెబ్‌సిరీస్‌తో నటిగా మంచి పేరొచ్చింది. 'అమ్మగా.. లైఫ్ స్టయిల్ ఇన్‌ఫ్లూయన్సర్‌గా.. వెల్‌నెస్ ఎక్స్‌పర్ట్‌గా జీవితాన్ని ఎంజాయ్ చేస్తున్నా' అంటూ మురిసిపోతుందీమె.



ఆమె లక్ష్యం అగ్ని రక్ష

గొప్ప గాయని కావాలనే ఆమె ఆశ మంటల్లో కాలిపోయింది. అందమైన ఆమె రూపం తనకే భయం పుట్టేంత వికారంగా మారింది. కానీ తల్లి సంకల్పాన్ని తన దృఢ నిశ్చయంగా మార్చుకున్నారు డాక్టర్ ప్రేమా ధనరాజ్. పాతికవేల మందికి పైగా అగ్నిప్రమాద బాధితులకు ప్లాస్టిక్ సర్జరీతో కొత్త జీవితాన్నిచ్చారు. తన స్వచ్ఛంద సంస్థ ద్వారా వారి జీవనోపాధికి సైతం దోహదం చేస్తున్నారు.

తమిళనాడులోని వెల్లూరు క్రిస్టియన్ మెడికల్ కాలేజీ ఆసుపత్రి (సిఎంసిహెచ్). డైరెక్టర్ జోసెఫ్ గదిలోకి అటెండర్ వచ్చి "సార్! ఎవరో డాక్టర్. మిమ్మల్ని కలవడానికి వచ్చారు" అని చెప్పాడు. "లోపలికి పంపించు" అని అన్నారు జోసెఫ్. గదిలోకి ఒక అమ్మాయి ప్రవేశించి "డాక్టర్! నేను గుర్తున్నానా?" అని అడిగింది. లేదు అన్నారు జోసెఫ్. "నా పేరు ప్రేమా ధనరాజ్ సర్! మీరు నాకు సర్జరీలు చేశారు. చాలా రోజులు ఈ ఆసుపత్రిలోనే పేషెంట్‌గా ఉన్నాను. ఇప్పుడు డాక్టర్‌నయ్యాను" అని చెప్పిందామె. జోసెఫ్ ఆశ్చర్యంగా చూస్తూ "నిజమా? నువ్వు డాక్టర్ అయ్యావా?" అని అడిగారు. అవునన్నట్టు తల ఊపిందామె. ఆమె వైద్యురాలు కావాలనే నిర్ణయానికి బీజం పడింది కూడా ఆ ఆసుపత్రిలోనే.

వైద్యులు కనిపిస్తే అరిచేదాన్ని...

ప్రేమ స్వస్థలం బెంగళూరు. రోజీ స్టెల్లా, ధనరాజ్ దంపతుల నలుగురు సంతానంలో ఆమే పెద్దది. బంగారు రంగులో, చక్కటి కళ్లతో... ఎంతో అందంగా ఉండే ప్రేమకు సంగీతం అంటే ప్రాణం. పోటీల్లో పాల్గొంటే బహుమతి గెలవాల్సిందే. అది 1965. ఎనిమిదేళ్ల ప్రేమ స్కూల్‌లో జరిగే పాటల పోటీకి సిద్ధమవుతోంది. అమ్మా, నాన్నా బయటకు వెళ్లడంతో... కాఫీ కాచడానికి స్టవ్ వెలిగించింది. కిరోసిన్ లేకపోవడంతో స్టవ్ మండలేదు. సీసాతో కిరోసిన్ తెచ్చి, స్టవ్‌లో పోస్తుండగా... హఠాత్తుగా మంటలు చెలరేగి ఆమె ముఖాన్ని తాకాయి. స్టవ్ పేలిపోయింది. ఆమె కేకలు విని ఇరుగు పొరుగువారు వచ్చి, ఆసుపత్రికి తీసుకువెళ్లారు. "అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. నా కింది పెదవి ఛాతీకి అంటుకుపోయింది. నా మెడ ఉందో లేదో తెలియడం లేదు. యాభై శాతం కాలిన గాయాలతో ఆసుపత్రిలో చేరిన నాకు ప్రథమ చికిత్స చేసిన తరువాత... వెల్లూరు సిఎంసిహెచ్‌కు బెంగళూరు వైద్యులు రిఫర్ చేశారు. నా గొంతులోంచి ట్యూబ్ అమర్చడానికి మూడు సర్జరీలు చేసినా... మెడ దగ్గర అవరోధం వల్ల అవన్నీ ఫెయిలయ్యాయి. ఆ సర్జరీల సమయంలో నరకం చూశాను. వైద్యులు కనిపిస్తే వారి మీద అరిచేదాన్ని" అని గుర్తు చేసుకున్నారు ప్రేమ. నాలుగో సర్జరీకి ఏర్పాట్లు జరుగుతున్నప్పుడు... ఆమె తల్లి "దేవుడా! ఎలాగైనా నా బిడ్డను కాపాడు. ఆమెను వైద్యురాల్ని చేస్తాను. ఇదే ఆసుపత్రిలో అర్హులైన రోగులకు సాయపడేలా తీర్చిదిద్దుతాను" అని మొక్కుకున్నారు. పన్నెండు గంటల పాటు జరిగిన ఆ సర్జరీ విజయవంతమయింది. ఆరు నెలల తరువాత వెల్లూరు ఆసుపత్రి నుంచి బెంగళూరుకు ప్రేమ తిరిగొచ్చారు. "కాస్త కోలుకున్నాక మళ్లీ బడికి వెళ్లాలనుకున్నాను. కానీ నా ముఖం అందవికారంగా తయారైంది. పూర్తిగా కాలిపోయిన జుట్టు అప్పుడప్పుడే కాస్త వస్తోంది. అందరికీ ఎంతో ఇష్టమైన నా గొంతు బొంగురుగా మారిపోయింది. మంచి గాయని కావాలనుకున్న నా ఆశ నాశనమైపోయింది. రోజూ నాతో ఆడుకొనే పిల్లలు నా దగ్గరకు రావడం మానేశారు. అద్దంలో నా ముఖాన్ని చూసుకోవడానికి భయపడేదాన్ని. ఆ సమయంలో నా తోబుట్టువులు నాకు ధైర్యం చెప్పేవారు" అని తెలిపారు ప్రేమ.

అది దైవ నిర్ణయం

ఆమె హైస్కూల్ చదువంతా ప్రైవేటుగానే సాగింది. దాదాపు ఆరేళ్లలో పద్నాలుగు సర్జరీలు చేయించుకోవాల్సి రావడంతో... చదువుకు మూడేళ్ల విరామం వచ్చింది. ఎక్కువసేపు మెడను నిలబెట్టి కూర్చోలేకపోవడంతో పాఠాలు చదవడానికి ఇబ్బందయ్యేది. కానీ డాక్టర్ కావాలనే తపన ఆ కష్టాన్నీ, వేదననూ భరించేలా చేసింది. మంచి మార్కులతో టెన్త్ పాసవడం ఆమెలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఇంటర్ పూర్తి చేశారు. హుబ్లీ మెడికల్ కాలేజీ నుంచి ఎంబిబిఎస్ డిగ్రీ అందుకున్నారు. తల్లి దేవుడికి చేసిన వాగ్దానం ప్రకారం... సిఎంసిహెచ్‌లో... డైరెక్టర్ హోదాకు చేరుకున్న డాక్టర్ జోసెఫ్‌ను కలిశారు. అక్కడే వైద్యురాలుగా చేరారు. ఆయన ప్రోత్సాహంతో... లూధియానాలోని సిఎంసిలో ప్లాస్టిక్, రీకన్‌స్ట్రక్షన్ సర్జరీలో స్పెషలైజేషన్ చేశారు. సర్జన్‌గా సిఎంసిహెచ్‌లో సేవలు అందించడం ప్రారంభించారు. "నన్ను ఆసుపత్రికి తీసుకువెళ్ళిన ప్రతిసారీ... మా అమ్మ నన్ను డాక్టర్ కుర్చీలో కూర్చున్నట్టు ఊహించుకొనేది. నన్ను రోగుల సేవకే అంకితం చేయాలన్న అమ్మ నిర్ణయాన్ని దేవుడి నిర్ణయంగానే పరిగణిస్తాను" అంటారు ప్రేమ. అగ్ని ప్రమాద బాధితులకు ప్లాస్టిక్ సర్జరీ చేయడంలో నిపుణురాలుగా అతి తక్కువ కాలంలోనే ఆమె పేరు పొందారు. మరోవైపు దేశ, విదేశీ వైద్య విద్యార్థులెందరికో సర్జరీలో శిక్షణ ఇచ్చారు. పాతికవేలకు పైగా ప్లాస్టిక్ సర్జరీలు చేసి, అగ్నిప్రమాద బాధితులకు కొత్త జీవితాన్ని ప్రసాదించారు. ప్రస్తుతం వెల్లూరు సిఎంసిహెచ్‌లో ప్లాస్టిక్ సర్జరీ విభాగం అధిపతిగా, యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లో విజిటింగ్ ప్రొఫెసర్‌గా వ్యవహరిస్తున్నారు. పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థల నుంచి పురస్కారాలు అందుకున్నారు.

బాధ్యత పెరిగింది...

సమాజానికి తన వంతు సేవ చేయాలనే ఆలోచనతో... 2002లో 'అగ్ని రక్ష' అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. అగ్నిప్రమాదాలకు గురైనవారికి సంపూర్ణమైన చికిత్స, పునరావాసం కల్పించడం ఈ సంస్థ లక్ష్యం. అంతేకాదు, బాధితులకు ఆరోగ్య కార్యకర్తలుగా శిక్షణనిచ్చి, ఉపాధి కూడా కల్పిస్తున్నారు. "మా సంస్థ ద్వారా ఇప్పటివరకూ 18 వేల మంది అగ్ని ప్రమాద బాధితులకు చికిత్స చేశాం. సుమారు 17 మందికి కౌన్సెలింగ్ ఇచ్చాం. ఇంటి దగ్గరే వైద్యం, ఫిజియోథెరపీ, న్యాయపరమైన సహాయం లాంటివి పొందినవారి సంఖ్య దాదాపు 15 వేల వరకూ ఉంటుంది. పేద కుటుంబాల వారికి, ముఖ్యంగా మహిళలకు, పిల్లలకు సమగ్రమైన వైద్యంతో పాటు ఆదాయాన్ని పొందే అవకాశాలను కూడా కల్పిస్తున్నాం. వాళ్ల జీవితాల్లో మార్పు కనిపించినపుడు... నన్ను వారి సేవకు అంకితం చేస్తానని మొక్కుకొని, అది సాధ్యం కావడానికి దోహదం చేసిన మా అమ్మ సంకల్పాన్ని తలచుకుంటాను. అది నాకు నిరంతరం ప్రేరణ ఇస్తూనే ఉంటుంది" అంటారామె. డాక్టర్ ప్రేమ సేవానిరతిని గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం ఆమెకు ఈ ఏడాది 'పద్మశ్రీ' పురస్కారం ప్రకటించింది. "ఇది నాకు ఎంతో ప్రత్యేకం. ఎందరెందరో అభినందనలు చెబుతూ ఉంటే... నా బాధ్యత మరింత పెరిగినట్టు అనిపిస్తోంది. నాకు ప్రమాదం జరిగిన తరువాత ఎన్నో ఏళ్ల పాటు శారీరకంగా, భావోద్వేగపరంగా, సామాజికంగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నాను. అలాంటి బాధ ఎవరూ పడకూడదు. బాధితుల్లో చాలామంది కుంగిపోతూ ఉంటారు. కానీ జీవితం అక్కడితో ముగిసిపోదు. ఇది కొత్త జీవితానికి ఆరంభంగా భావిస్తే... కొత్త దారులు కనిపిస్తాయి. దానికి నాకన్నా పెద్ద ఉదాహరణ అవసరం లేదు" అంటున్నారు ప్రేమ.

లిల్లీ పూలతో లక్షలు సంపాదిస్తోంది!



ఆమెకు పూలంటే ఇష్టం. కుండీల్లో పూలను పెంచటం భలే ఇష్టం. ఆ ఇష్టమే కాస్త వ్యాపారంగా మార్చుకుంది. తన పేరు విజి అబి. ఉండేది కేరళలో. అందరిలా కాకుండా వాటర్ లిల్లీలను పెంచుతోందీమె. నెలకు లక్ష రూపాయలను సంపాదిస్తూ తన పూల వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుంటోన్న విజి అబిని 'వాటరాఫ్ లిల్లీ' అని పిలుస్తున్నారిప్పుడు.



"నేనిప్పుడు నీళ్లలో పెరిగే లిల్లీ పూలను ఫేస్‌బుక్, ఇన్‌స్టా ద్వారా దేశంలోనే కాకుండా ఇతర దేశాలకూ అమ్ముతాను. నెలకు కనీసం లక్ష రూపాయల సంపాదన ఉంటుంది. పిల్లలకంటే ప్రేమగా ఈ పూలను పెంచాలి. అప్పుడే ఇందులో రాణించగలం. నా వరకు ఈ వాటర్ లిల్లీ పూల వ్యాపారం అంత సులువేమీ కాదు. అనుభవంతోనే పూల పెంపకాన్ని నేర్చుకున్నా.

అలా పూల వ్యాపారంలోకి..

ఎందుకో తెలీదు చిన్నప్పటి నుంచి గార్డెనింగ్ అంటే ఇష్టం. మల్లెపూలు, రోజా, గులాబీ పూలను పెంచేదాన్ని. ఏదో ఆసక్తితో ప్రతి ఆడపిల్ల పెంచినట్లే పూల మొక్కలను పెంచేదాన్ని. కుండీల్లో నీళ్లను పోయటం, మట్టి తీసుకురావటం.. పూలను గమనించటం చేసేదాన్ని. పెళ్లయ్యాక కూడా ఇంట్లో పూలను పెంచుకునేదాన్ని. మా అబ్బాయి పుట్టాక ఖాళీగా ఉండేదాన్ని. ఉద్యోగంలో మళ్లీ చేరదామనుకున్నా. ఆ సమయంలో ఇంట్లోనే ఉండి ఏదైనా చేయాలనుకున్నా. బాబును చూసుకుంటూ పూల మొక్కలు ఎక్కువగా ఇంట్లోనే పెంచాలనుకున్నా. అందుకే ఉద్యోగానికి రాజీనామా చేశా. లిల్లీ పూల పెంపకం బావుంటుందని తెలిస్తే ఐదేళ్ల కితం తొలి వాటర్ లిల్లీ మొక్కలను కొన్నా. కేరళలో త్రిశూర్ ప్రాంతంలోని వాతావరణానికి ఆ మొక్కలు బతకలేదు. దీంతో ఇక్కడ బతికే పూలేవీ అని ఇంటర్నెట్‌లో వెతికా. ఫేస్‌బుక్‌లో వాటర్ లిల్లీ పూల గురించి తెలిసింది. ఇంటర్నేషనల్ వాటర్ లిల్లీ గ్రూప్స్‌తో పాటు గార్డెనింగ్ గ్రూప్స్‌లో జాయిన్ అయ్యా. వారితో మాట్లాడటం, మెసేజుల్లో సలహాలు తీసుకునేదాన్ని. వాటర్ లిల్లీను పెంచా. మంచి గిరాకీ ఉండటంతో.. వాటర్ లిల్లీల పెంపకం పూర్తి స్థాయిలో చేయాలనుకున్నా.

అందుకే సక్సెస్..

మా ఇంట్లోవారి ప్రోత్సాహం ఉంది. దీనికి తోడు ఈ వాటర్ లిల్లీ పూల కోసం మంచి వాతావరణాన్ని క్రియేట్ చేశా. ఇంట్లో పనులు చేసుకుని, మా అబ్బాయిని బడికి పంపించి.. ఈ లిల్లీ పూల మొక్కలను ప్రాణంగా చూసుకునేదాన్ని. నాకంటూ ఓ కొత్త ప్రపంచాన్ని ఏర్పరచుకోవాలి. అందులో నేనే డైరక్టర్‌గా ఉండాలనుకుండేదాన్ని మనసులో. అలా ఈ వాటర్ లిల్లీ వ్యాపారంలో నిజమైంది. మంచి సక్సెస్ అందుకున్నా. ఇంటి వద్దకే కాదు.. ఆన్‌లైన్‌లో ఆర్డర్స్ పెరిగాయి. వంద రకాల వాటర్ లిల్లీ మొక్కలను పెంచుతాను. ఆర్గానిక్ ఫామింగ్ చేస్తాను. దగ్గరుండి ఈ పని ప్రేమతో చేస్తాను కాబట్టే పూల గురించి ఎన్నో విషయాలు తెలిసాయి. విభిన్న పూలకోసం వెతకటం.. అంటు కట్టడం చేస్తుంటా. ఏ సీజన్‌లో ఏ పూలకు డిమాండ్ ఉంటే అక్కడకు సరఫరా చేస్తాను. అంతర్జాతీయ వాటర్ లిల్లీ మెంబర్స్ గుర్తించారు. కేరళలో అవార్డులు ఇచ్చారు. ప్రకృతికి మంచి చేసే ఈ పూల వ్యాపారం ఎవరైనా చేసుకోవచ్చని చెబుతా. నాకు తెలిసింది నేర్పిస్తా. విత్తనాలను, పూల మొక్కలను ఇస్తుంటా. నాలా ఈ వ్యాపారం ఇష్టం ఉండేవారికి నా వంతు సాయం చేస్తా. పూలంటే ఎవరికి ఇష్టం ఉండదు? నాకూ అంతే. అయితే కాస్త ఎక్కువ ఇష్టం. అందుకే పూల మనసును అర్థం చేసుకుని.. ఈ వాటర్ లిల్లీ పూలతో లక్షలు సంపాదిస్తున్నా."

నవ్య | చిత్రజ్యోతి

అన్ని భాషల్లో అద్భుతాలు సృష్టిస్తుంది



ప్రతి భారతీయుడు కచ్చితంగా చూడాల్సిన సినిమా 'రికార్డ్ బ్రేక్' అని నిర్మాత, దర్శకుడు చదలవాడ శ్రీనివాసరావు చెప్పారు. ఆయన దర్శకత్వంలో చదలవాడ పద్మావతి నిర్మించిన 'రికార్డ్ బ్రేక్' చిత్రం టీజర్, ట్రైలర్‌లను ఆదివారం ప్రసాద్ ప్రీవ్యూ థియేటర్‌లో జరిగిన కార్యక్రమంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ' ఈ సినిమాలో హీరో అంటూ ఎవరూ లేరు ఇందులో పని చేసిన ఆర్ట్ డైరెక్టర్, ఫైట్ మాస్టర్, మ్యూజిక్ డైరెక్టర్.. వీళ్లే హీరోలు. నాకున్న అనుభవంతో మంచి కథ తీసుకుని సమాజానికి ఉపయోగపడే సినిమా అందించాలనే తపనతో ఐదేళ్లు కష్టపడి 'రికార్డ్ బ్రేక్' తీశాం. ఈ చిత్రానికి ఆ టైటిల్ కరెక్ట్ అని చూసిన వాళ్లంతా చెప్పారు. తెలుగుతో సహా ఎనిమిది భాషల్లో చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. అన్ని భాషల్లో అద్భుతాలు సృష్టిస్తుంది. కచ్చితంగా అందరికీ ఈ సినిమా నచ్చుతుంది' అన్నారు. దర్శకుడు అజయ్‌కుమార్ మాట్లాడుతూ 'ఇప్పుడు వస్తున్న చిత్రాలకు భిన్నంగా ఈ సినిమా ఉంటుంది. ఇద్దరు అనాధలు దేశానికి గర్వకారణంగా ఎలా ఎదిగారు అనే కథతో ఈ సినిమా తీశాం. ఇప్పటివరకూ ఎవరూ టచ్ చేయని పాయింట్‌ను ఇందులో చూపిస్తున్నాం' అని చెప్పారు. నిర్మాతలమండలి కార్యదర్శి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ 'మంచి మనసున్న వ్యక్తి, ఎన్నో అద్భుత చిత్రాలు నిర్మించిన నిర్మాత శ్రీనివాసరావుగారు. సామాజిక కథాంశంతో ఆయన రూపొందించిన 'రికార్డ్ బ్రేక్' చిత్రం మంచి విజయం సాధించాలి' అని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, హీరోయిన్ రగ్గా, నటి సత్యకృష్ణ, హీరోల్లో ఒకరైన నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

భయపెట్టనున్న వేదిక



హీరోయిన్ వేదిక ప్రధాన పాత్ర పోషిస్తున్న 'ఫియర్' చిత్రం షూటింగ్ పూర్తయింది. సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంతో హరిత గోగినేని దర్శకురాలిగా పరిచయమవుతున్నారు. అరవింద్ కృష్ణ ఒక ప్రత్యేక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రాన్ని ఏఆర్ అభి నిర్మిస్తున్నారు. ఆయన ఈ చిత్రం గురించి వివరిస్తూ 'మా దర్శకురాలికి ఇది తొలి చిత్రమే అయినా ఎంతో క్లారిటీతో ఉండడం వల్ల పక్కాగా ప్లాన్ చేసి తక్కువ టైమ్‌లో సింగిల్ షెడ్యూల్‌తో చిత్రాన్ని పూర్తి చేశారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం' అని చెప్పారు. జయప్రకాశ్, పవిత్రా లోకేశ్, అనిష్ కురివిల్లా, షాయాజీ షిండే, సత్యకృష్ణ, సాహితి దాసరి, షాని తదితరులు నటించిన ఈ చిత్రానికి పాటలు: కృష్ణకాంత్, సంగీత: అనూప్ రూబెన్స్, ఫొటోగ్రఫీ: ఆంద్రూ, కో ప్రొడ్యూసర్స్: సుజాత రెడ్డి, సురేందర్ రెడ్డి.

ఏఐ జనరేటెడ్ తొలి లిరికల్ వీడియో



శివ కందుకూరి హీరోగా రూపొందిన యానిక్ క్రైమ్ థ్రిల్లర్ 'భూతద్దం భాస్కర్ నారాయణ' మార్చి ఒకటిన విడుదల కానుంది. పురుషోత్తమ్ రాజ్ దర్శకత్వంలో స్నేహాల్, శశిధర్, కార్తీక్ నిర్మించారు. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రూపుదిద్దుకున్న ఈ చిత్రం నుంచి 'శివ ట్రాప్ ట్రాన్స్' పాటను సంగీత దర్శకుడు కీరవాణి విడుదల చేశారు. చైతన్యప్రసాద్ రాసిన ఈ పాటకు శ్రీ చరణ్ పాకాల స్వరాలు అందించారు. ఏఐ చాట్ జీపీటీని ఉపయోగించి లిరికల్ విజువల్స్ తయారు చేశారు. ఈ లాంచింగ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన హీరో సుహాస్ మాట్లాడుతూ 'శివ చాలా మంచోడు. ఈ సినిమా ప్రొడక్షన్ వాల్యూస్ బాగున్నాయి. చైతన్యప్రసాద్ రాసిన పాటలు గూస్ బంప్స్ తెప్పించాయి. శ్రీ చరణ్ మంచి సంగీతం ఇచ్చారు' అని ప్రశంసించారు. హీరో శివ కందుకూరి మాట్లాడుతూ 'సినిమాలో చాలా కీలకమైన సన్నివేశంలో ఈ పాట వస్తుంది. నా ఫేవరెట్ సాంగ్ ఇది' అన్నారు. 'మార్చి ఒకటిన సినిమాను విడుదల చేస్తున్నాం. తప్పకుండా థియేటర్‌లో చూడండి. అందరికీ అద్భుతంగా నచ్చుతుంది' అన్నారు నిర్మాతలు.

ఎప్పటికీ మాతోనే ఉంటావు

తారకరత్న భార్య ఎమోషనల్ పోస్ట్



హీరోగా, విలన్‌గా ప్రేక్షకులను అలరించిన నందమూరి తారకరత్న గుండెపోటుతో అకాల మరణం పొంది ఈ ఆదివారానికి ఏడాది అయింది. ఆయన తొలి వర్ధంతి సందర్భంగా ఆయన భార్య అలేఖ్య రెడ్డి సోషల్ మీడియాలో ఓ ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. 'నిన్ను నేను చివరిసారిగా చూసిన రోజు దగ్గరయ్యే కొద్దీ.. నేను పడుతున్న బాధ ఎవరికీ చెప్పలేనిది. నీకు, నాకు మధ్య సరిహద్దులు లేవు. రెండు విభిన్న ప్రపంచాల నుంచి మా ప్రయాణాన్ని ఇలాగే కొనసాగిస్తాం. ఎలాంటి మార్పు లేదు. నీ ఉనికి, నీ ప్రేమ, మాపై చూపించే ప్రభావం ఎప్పటికీ మరువలేం. నేను నిన్ను ముట్టుకోలేను కానీ నీ ఉనికి ఎప్పుడూ మా చుట్టే ఉంటుంది. మీరే మా బలం.. ఎప్పటికీ మాతోనే ఉంటావు' అంటూ పేర్కొన్న అలేఖ్య పిల్లలతో ఉన్న ఫొటో షేర్ చేశారు.

గాంజా శంకర్ చిత్ర యూనిట్‌కు.. నార్కోటిక్ బ్యూరో నోటీసులు

సాయిధరమ్‌తేజ్ హీరోగా నటిస్తున్న గంజా శంకర్ చిత్రానికి తెలంగాణ నార్కోటిక్ బ్యూరో అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇటీవల విడుదలైన గంజాశంకర్ ప్రచార చిత్రాన్ని చిత్ర బృందం యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసింది. అందులో లీఫీ వెజిటబుల్స్ మాటున గంజాయి స్మగ్లింగ్, డ్రగ్స్ వినియోగంతో యువతను పెడదోవ పట్టించే అంశాలు ఉన్నాయని పోలీసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి రాష్ట్ర, అంతరరాష్ట్ర ఘరానా స్మగ్లర్స్ ఆటకట్టిస్తూ మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతుంటే.. మరోవైపు సినిమా ఇండస్ట్రీ వారు గంజాయి, డ్రగ్స్ వంటి కంటెంట్‌ను పెట్టి సినిమాలు తీస్తున్నారని అన్నారు. సినిమా ఇండస్ట్రీ పెద్దలకు కూడా సామాజిక బాధ్యత ఉండాలని తెలంగాణ నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య నోటీసుల్లో పేర్కొన్నారు.

- హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి)

తండ్రి దర్శకుడు.. తనయుడు హీరో



తన తనయుడు హేమచంద్రారెడ్డిని హీరోగా పరిచయం చేస్తూ కుల్లపరెడ్డి సురేశ్‌బాబు స్వీయ దర్శకత్వంలో 'ఇద్దరికీ కొత్తేగా' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా సురేశ్‌బాబు మాట్లాడుతూ 'ఇంతకుముందు నేను 'వకాలత్ నామా' అనే చిత్రంలో హీరోగా నటించాను. ఇప్పుడు మా అబ్బాయిని హీరోగా పరిచయం చేస్తూ 'ఇద్దరికీ కొత్తేగా' చిత్రాన్ని నా దర్శకత్వంలో నిర్మిస్తున్నాను. నా లైఫ్‌స్టోరీనే ఇతివృత్తంగా ఎన్నుకున్నాను. ఇందులో ముగ్గురు హీరోయిన్లు ఉంటారు. ప్రేక్షకులకు కావాల్సిన అన్ని అంశాలూ ఉంటాయి' అని తెలిపారు. ఈ చిత్రానికి ఫొటోగ్రఫీ: కోట తిరుపతిరెడ్డి, మాటలు: కరుణాకర్, కె.కె.రెడ్డి, సంగీతం: ఎం.ఎం.ఎస్.

గ్రూప్ దశలో చైనా గోడ బద్దలు.. క్వార్టర్స్‌లో హాంకాంగ్ చిత్తు.. సెమీస్‌లో పటిష్ఠ జపాన్‌కు ఝలక్.. ఫైనల్లో జెయింట్‌కిల్లర్ థాయ్‌లాండ్‌కు షాక్.. ఇదీ ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో మనమ్మాయిల అద్భుత ప్రదర్శన గురించి క్లుప్తంగా. ప్రతి దశలోనూ ఎన్నోరెట్లు మెరుగైన ప్రత్యర్థి ఎదురైనా.. మన అమ్మాయిలు విజయమే లక్ష్యంగా ముందుకెళ్లారు.

సీనియర్లు సింధు, అశ్వినితో సమన్వయం చేసుకుంటూ యువ కెరటాలు అన్‌మోల్, అస్మిత, గాయత్రి, ట్రీసా జాలీ అసమాన ఆటతీరుతో విజృంభించారు. కాంస్యం దక్కినా చాలన్న దశను దాటుకొని ఏకంగా స్వర్ణంతో సరికొత్త చరిత్ర సృష్టించారు. ఫైనల్ చేరిన మొదటి ప్రయత్నంలోనే చాంపియన్‌షిప్‌ను దక్కించుకొని 'ఆసియా' రారాణులుగా నీరాజనాలందుకున్నారు.



'ఆసియా'ను కొల్లగొట్టారు

మనమ్మాయిల మరో చరిత్ర

స్వర్ణంతో సత్తా చాటిన భారత్

ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ టైటిల్ కైవసం

ఉత్కంఠ ఫైనల్లో థాయ్‌లాండ్‌పై గెలుపు

టీనేజర్ అన్‌మోల్ అద్భుత ప్రదర్శన



షా అలమ్ (మలేసియా): ఆసియా టీమ్ చాంపియన్‌షిప్ చరిత్రలో ఇప్పటిదాకా కనీసం సెమీఫైనల్ కూడా చేరలేకపోయిన భారత అమ్మాయిల జట్టు ఈసారి అమోఘమైన ప్రదర్శనతో ఏకంగా టైటిల్ కొల్లగొట్టారు. ఆదివారం అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు సారథ్యంలోని భారత బృందం 3-2తో రెండుసార్లు కాంస్య పతక విజేత థాయ్‌లాండ్ జట్టుపై విజయభేరి మోగించి తొలిసారి దేశానికి మొదటిసారి పసిడి పతకాన్ని అందించారు. జపాన్‌తో పోరులో సంచలన ఆటతీరుతో అలరించి జట్టును ఫైనల్‌కు చేర్చిన 17 ఏళ్ల అన్‌మోల్ కర్బ్ ఫైనల్లోనూ భారత్ విజయంలో కీలకపాత్ర పోషించింది. బ్యాడ్మింటన్‌లో రెండేళ్ల క్రితం ప్రతిష్ఠాత్మక థామస్‌కప్ నెగ్గిన భారత్‌కు ఆ తర్వాత ఇదే అతిపెద్ద గెలుపు కావడం విశేషం. ఇక 2016, 2020లో పురుషుల జట్టు కాంస్య పతకాలు నెగ్గడమే ఆసియా టీమ్ బ్యాడ్మింటన్‌లో ఇప్పటిదాకా భారత జట్ల అత్యుత్తమ ప్రదర్శన. తాజాగా సింధు బృందం ఆ రికార్డును అధిగమించి బంగారు పతకాన్ని అందుకోవడం చరిత్రాత్మకం.

నువ్వా..నేనా

సెమీస్ తరహాలోనే ఫైనల్ పోరు కూడా హోరాహోరీగా సాగింది. ప్రత్యర్థి థాయ్‌లాండ్ నుంచి గట్టిపోటీ ఎదురైనా ఒత్తిడిని అధిగమించి మన షట్లర్లు ఫలితాన్ని రాబట్టారు. జపాన్‌తో సెమీఫైనల్లో సింగిల్స్ పోరులో అనూహ్యంగా ఓటమిపాలైన సింధు ఈసారి మాత్రం ఎక్కడా తడబడలేదు. తొలి సింగిల్స్ బరిలో దిగిన సింధు 21-12, 21-12తో ప్రపంచ 17వ ర్యాంకర్ సుపనిద కాటేతాంగ్‌ను వరుసగేముల్లో ఓడించి భారత్‌కు శుభారంభాన్నిచ్చింది. ఆ తర్వాత తొలి డబుల్స్‌లో పోటీపడ్డ పుల్లెల గాయత్రీ గోపీచంద్-ట్రీసా జాలీ మూడుగేముల పాటు పోరాడి పైచేయి సాధించింది. ప్రపంచ 23వ ర్యాంకరైన గాయత్రి జంట 21-16, 18-21, 21-16తో 10వ ర్యాంక్ ద్వయం జాంగ్‌కోల్ఫాన్ కితితరకుల్-రవిందా ప్రజోంగ్జాయ్‌పై గెలిచి 2-0 ఆధిక్యాన్ని అందించింది. అయితే, సెమీస్ పోరులో ప్రపంచ మాజీ విజేత నొజొమి ఒకుహరాకు షాకిచ్చి సంచలనం సృష్టించిన అస్మిత చాలిహా ఈసారి ఆస్థాయి ప్రదర్శన చేయలేకపోయింది. రెండో సింగిల్స్‌లో అస్మిత 11-21, 14-21తో 18వ ర్యాంకర్ బుసానన్ ఓంగ్బారున్‌గాపాన్ చేతిలో ఓటమిపాలైంది. ఇక, ఏమాత్రం అనుభవం లేని భారత యువ జంట శ్రుతి మిశ్రా-ప్రియ రెండో డబుల్స్ మ్యాచ్‌లో 11-21, 9-21తో 13వ ర్యాంకర్ జోడీ బెన్యాపా అమ్‌సార్డ్-నున్‌తాకర్న్ అమ్‌సార్డ్‌కు తలొగ్గింది. దీంతో ఇరుజట్లు 2-2తో సమంగా నిలిచాయి. సెమీస్ తరహాలోనే మరోసారి తీవ్ర ఒత్తిడి మధ్య నిర్ణాయక మూడో సింగిల్స్‌లో తలపడ్డ అన్‌మోల్ అమోఘమైన పోరాటాన్ని ప్రదర్శించింది. తనపై ఉన్న అంచనాలను నిలబెడుతూ అన్‌మోల్ 21-14, 21-9తో ప్రపంచ 45వ ర్యాంకర్ పోర్న్‌పిచా చోకేవాంగ్‌ను వరుసగేముల్లో చిత్తుచేసి భారత్‌కు 3-2తో చరిత్రాత్మక విజయాన్ని కట్టబెట్టింది.

భవితపై ఆశలు రేకెత్తించిన విజయం

ఇది అద్భుత ప్రదర్శన. జట్టులోని క్రీడాకారిణులంతా సమష్టిగా పోరాడారు. టోర్నీలో చైనా, జపాన్, థాయ్‌లాండ్ లాంటి టాప్ జట్లను ఓడించడమంటే సాధారణ విషయం కాదు. సీనియర్లు సింధు, అశ్విని, జూనియర్లు గాయత్రి, ట్రీసా జాలీ, అన్‌మోల్, అస్మిత అమోఘమైన ఆటతీరు కనబరిచారు. ఇప్పుడు మన జట్టులో బలమైన సింగిల్స్, డబుల్స్ షట్లర్లు ఉన్నారు. వచ్చే ఏప్రిల్‌లో జరిగే ఉబెర్ కప్‌లో సత్తా చాటేందుకు ఈ విజయం మరింత ఉత్సాహాన్నిస్తుంది.

- జాతీయ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్

మన ప్రతిభకు తార్కాణం

ఈ విజయం మనందరికీ గర్వకారణం. ప్రపంచ బ్యాడ్మింటన్‌లో మన ప్రతిభ ఏస్థాయిలో ఉందనేందుకు ఇదే నిదర్శనం. సీనియర్లు, జూనియర్ల మేళవింపుతో కూడిన ఈ జట్టు భవిష్యత్‌లో మరిన్ని పతకాలు కొల్లగొడుతుందన్న విశ్వాసం ఉంది.

- భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్)

పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న వేళ.. ఈ టెస్టు అయినా ఐదు రోజుల వరకు సాగుతుందని అంచనా వేశారు. కానీ భారత బౌలర్ల పరాక్రమం ముందు ప్రత్యర్థి ఇంగ్లండ్ బేలగా మారింది. యశస్వీ రెండో డబుల్ సెంచరీ, గిల్ అద్భుత ఇన్నింగ్స్, సర్ఫరాజ్ దూకుడుతో టీమిండియాకు ఏకంగా 557 రన్స్ ఆధిక్యం దక్కింది. ఇక ఈ కష్టసాధ్య ఛేదనలో స్టోక్స్ సేన బజ్‌బాల్ గేమ్ మచ్చుకు కూడా కానరాలేదు. 'రాజ్‌కోట్ రాజా' జడేజా తన మాయాజాలంతో ఉచ్చు బిగించగా, బ్యాటర్లంతా కనీసం ఓ సెషన్ పాటు క్రీజులో నిలిచేందుకే ఆపసోపాలు పడ్డారు. ఫలితంగా భారత్ ఖాతాలో అతి పెద్ద విజయంతో పాటు సిరీస్‌లో పైచేయి సాధించింది.


రాజ్‌కోటలో రాజసంగా..

భారత్ రికార్డు విజయం

- 434 రన్స్ తేడాతో ఇంగ్లండ్ చిత్తు
- భారత్ రెండో ఇన్నింగ్స్ 430/4 డిక్లేర్
- యశస్వీ మరో డబుల్
- గిల్ శతకం మిస్
- ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్ 122 ఆలౌట్
- జడేజాకు ఐదు వికెట్లు



యశస్వీ జైస్వాల్ (241 నాటౌట్)



జడేజా (12.4-4-41-5)

1 కెరీర్‌లో తొలి మూడు టెస్టు సెంచరీలను 150+ స్కోర్లుగా మలిచిన భారత బ్యాటర్‌గా జైస్వాల్. ఓవరాల్‌గా ఏడో బ్యాటర్. అలాగే ఓ సిరీస్‌లో ఎక్కువ పరుగులు సాధించిన భారత లెఫ్ట్‌హ్యాండర్‌గా నిలిచాడు.

ఒకే ఇన్నింగ్స్‌లో ఎక్కువ సిక్సర్లు (12) బాదిన బ్యాటర్‌గా వసీం అక్రమ్‌తో కలిసి టాప్‌లో ఉన్న జైస్వాల్. అలాగే ఓ సిరీస్‌లో ఎక్కువ సిక్సర్లు (22) బాదిన ఆటగాడు.

రాజ్‌కోట్: రికార్డులను బద్దలుకొడుతూ టీమిండియా మూడో టెస్టులో అద్భుత విజయాన్ని నమోదుచేసింది. నాలుగో రోజే ముగిసిన ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్‌పై ఏకంగా 432 పరుగుల తేడాతో రోహిత్ సేన సూపర్ విక్టరీని అందుకుంది. తమ టెస్టు చరిత్రలో పరుగుల పరంగా ఇదే అతి పెద్ద గెలుపు కావడం విశేషం. దీంతో ఐదు టెస్టుల సిరీస్‌లో భారత్ 2-1తో ఆధిక్యంలో నిలిచింది. నాలుగో టెస్టు ఈనెల 23 నుంచి జరగనుంది. ఆదివారం ఆటలో ఆద్యంతం భారత్‌దే హవా. యశస్వీ జైస్వాల్ (241 నాటౌట్) అజేయ డబుల్ సెంచరీతో చెలరేగాడు. అటు గిల్ (91) కొద్దిలో శతకాన్ని కోల్పోగా, సర్ఫరాజ్ (68 నాటౌట్) తన సత్తాను మరోసారి చాటాడు. వీరి ఆటతో భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 430/4 పరుగుల వద్ద డిక్లేర్ చేయగా, అప్పటికే 556 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. ఇక ఛేదనలో ఇంగ్లండ్ 39.4 ఓవర్లలో 122 పరుగులకే తమ రెండో ఇన్నింగ్స్‌ను ముగించి ఓటమి పాలైంది. పదో నెంబర్ బ్యాటర్ ఉడ్ (33) టాప్ స్కోరర్‌గా నిలవడం గమనార్హం. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ జడేజాకు ఐదు, కుల్దీప్‌కు రెండు వికెట్లు దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 445, ఇంగ్లండ్ 319 పరుగులు సాధించాయి.

జైస్వాల్, సర్ఫరాజ్ అలవోకగా..: ఓవర్‌నైట్ స్కోరు 196/2 తో రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన భారత్‌ను ఇంగ్లండ్ బౌలర్లు ఏ దశలోనూ ఇబ్బంది పెట్టలేకపోయారు. ముంబై కుర్రాళ్లు యశస్వీ, సర్ఫరాజ్ వారిని చెడుగుడు ఆడేశారు. లంచ్ బ్రేక్‌కల్లా జట్టు 440 పరుగుల తిరుగులేని ఆధిక్యంలో నిలిచింది. తొలి గంటపాటు గిల్, కుల్దీప్ (27) తమ వికెట్‌ను కాపాడుకుంటూ ప్రత్యర్థిని విసిగించారు. అయితే నాలుగో వికెట్‌కు 55 రన్స్ జోడించాక రనౌట్‌తో గిల్ సెంచరీని కోల్పోయాడు. కుల్దీప్ సింగిల్ కోసం పిలుపునిచ్చి ఆగిపోగా, అటు తిరిగి వెనక్కి వెళ్లే క్రమంలో స్టోక్స్ త్రోతో గిల్ పెవిలియన్‌కు చేరాడు. లంచ్ బ్రేక్‌కు ముందు కుల్దీప్‌ను రెహాన్ అవుట్ చేశాడు. ఇక మూడో రోజు ఆటలో 104 పరుగుల దగ్గర ఆగిన జైస్వాల్ ఆదివారం అదే ఊపును కొనసాగించాడు. టీ సెషన్‌లో సర్ఫరాజ్‌తో కలిసి ఇంగ్లండ్‌పై దాడికి దిగాడు. ఓవర్‌కు ఏడు పరుగుల రన్‌రేట్‌తో స్కోరుబోర్డు కదలడంతో పరుగుల వరద పారింది. ఆదిలోనే పేసర్ అండర్సన్ ఓవర్‌లో జైస్వాల్ వరుసగా మూడు సిక్సర్లు బాదడం హైలైట్‌గా నిలిచింది. అండర్సన్ సుదీర్ఘ కెరీర్‌లో ఇలా జరగడం కేవలం రెండోసారి మాత్రమే. అటు సర్ఫరాజ్ సైతం వరుస ఫోర్లతో తన సహకారం అందిస్తూనే రెండో అర్ధసెంచరీ పూర్తి చేశాడు. ఇక రూట్ ఓవర్‌లో ద్విశతకం పూర్తి చేసిన వెంటనే యశస్వీ రెండు భారీ సిక్సర్లు బాదాడు. ఇన్నింగ్స్ చివరి ఓవర్‌లో సర్ఫరాజ్ వరుసగా 6,4,6తో అదరగొట్టాడు. వీరి మధ్య ఐదో వికెట్‌కు అజేయంగా 172 పరుగులు సమకూరాయి.

పేకమేడలా..: కొండంత లక్ష్యంతో రెండో సెషన్ ఆఖర్లో బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ పసికూన మాదిరి ఆడింది. గతంలో పాక్‌పై ఒక్క రోజులోనే 500కు పైగా పరుగులు చేసిన ఈ జట్టు కనీసం ఐదో రోజుకు మ్యాచ్‌ను తీసుకెళ్లలేకపోయింది. అదేంటో.. భారత బ్యాటింగ్‌కు అద్భుతంగా సహకరించిన పిచ్ వీరిని మాత్రం తెగ భయపెట్టింది. డిఫెన్స్ ఆడేందుకే కష్టపడుతూ.. తొలి రెండు ఓవర్లను మెయిడిన్‌గా మొదలెట్టి ఆరు ఓవర్లలో 15 రన్స్ మాత్రమే చేసింది. ఇక లేని పరుగు కోసం ముందుకువెళ్లిన ఓపెనర్ డకెట్ (4), కీపర్ జురెల్ అద్భుత రనౌట్‌తో వెనుదిరిగాడు. కాసేపటికే క్రాలే (11) అవుట్‌తో టీ బ్రేక్‌కు వెళ్లిన ఇంగ్లండ్.. చివరి సెషన్‌లో మిగిలిన ఎనిమిది వికెట్లను టపటపా కోల్పోయింది. జడేజా వరుస ఓవర్లలో పోప్ (3), బెయిర్‌స్టో (4) పనిబట్టడంతో పాటు స్వల్ప వ్యవధిలోనే రూట్ (7)ను అవుట్ చేయడంతో ఇంగ్లండ్ ఓటమి కళ్లముందు కనిపించింది. మరోవైపు కెప్టెన్ స్టోక్స్ (15), రెహాన్ (0)లను కుల్దీప్ వరుస ఓవర్లలో అవుట్ చేయడంతో 50/7 స్కోరుతో ఇంగ్లండ్ మరిక కోలుకోలేదు. 38వ ఓవర్‌లో ఉడ్ వరుసగా 4,4,4,6,4తో 23 పరుగులు సాధించి ఓటమి అంతరాన్ని కాస్త తగ్గించగలిగాడు. ఇక ఉడ్‌ను కూడా జడేజా ఐదో వికెట్‌గా అవుట్ చేయడంతో ఇంగ్లండ్ కథ కంచికి చేరింది.

పట్టుదలతో సత్తాచాటాలనుకొన్నా

టెస్టు క్రికెట్ ఎంతో కఠినం. కానీ, జట్టు కోసం పట్టుదలతో ఆడాలనుకొన్నా. క్రీజులో నిలదొక్కుకొన్న ప్రతిసారీ భారీ స్కోర్లు చేయడానికే శ్రమించా. ఆరంభంలో కొంత కష్టపడినా.. సెట్ అయిన తర్వాత సులువుగా బ్యాటింగ్ చేయగలిగా. నాలుగో రోజు మళ్లీ బ్యాటింగ్‌కు వచ్చిన తర్వాత చివరి వరకు నిలవాలనుకొన్నా. పిచ్ నుంచి బౌలర్లకు ఎంతో కొంత మద్దతు లభిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో జట్టుకు శుభారంభం అందించడమే నా లక్ష్యంగా భావించా. తొలి ఇన్నింగ్స్‌లో రోహిత్, జడేజా శతకాల స్ఫూర్తితో డబుల్ సెంచరీ సాధించా.

- యశస్వీ జైస్వాల్

అశ్విన్ బరిలోకి..

శుక్రవారం ఆట ముగిశాక తల్లి అనారోగ్యంతో చెన్నైకి వెళ్లిన స్పిన్నర్ అశ్విన్ నాలుగో రోజు ఆఖరి సెషన్‌లో మైదానంలోకి దిగాడు. ఈ క్రమంలో ఎలాంటి పెనాల్టీ టైమ్ లేకుండానే ఆరు ఓవర్లు కూడా వేసి హార్ట్‌లీ వికెట్ తీశాడు. 'ఓ ప్లేయర్ సరైన కారణంతో మైదానం వీడి, తిరిగి ఫీల్డ్ అంపైర్ల అనుమతితో జట్టులోకి వచ్చాక పెనాల్టీ టైమ్ విధించాల్సిన అవసరం లేదు' అని ఐసీసీ రూల్ చెబుతోంది. మరోవైపు అశ్విన్ ప్రయాణానికి బీసీసీఐ చార్టర్ ఫ్లయిట్ ఏర్పాటు చేయడం విశేషం.

రావాలా? వద్దా?

భారత్ రెండో ఇన్నింగ్స్ డిక్లేర్ సమయంలో కాస్త అయోమయం చోటు చేసుకుంది. జైస్వాల్ డబుల్ సెంచరీ అయ్యాక ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేస్తారని అంతా భావించారు. దీనికి తగ్గట్టుగానే 97వ ఓవర్‌లో అతడు ఈ ఫీట్ పూర్తి చేశాడు. వెంటనే డ్రింక్స్ రాగా అటు డ్రెస్సింగ్ రూమ్‌లో భారత ఆటగాళ్లంతా మైదానంలోకి వచ్చేందుకు సిద్ధమవుతూ కనిపించారు. ఇక్కడ యశస్వీ, సర్ఫరాజ్ ఇన్నింగ్స్ డిక్లేర్ చేశారనే భావనలో పెవిలియన్ వైపు కదిలారు. అటు డకెట్ అయితే బౌండరీ లైన్ కూడా దాటేశాడు. కానీ ఇదంతా గమనిస్తున్న రోహిత్ తమ బ్యాటర్లను సీరియస్‌గా చూస్తూ 'ఎక్కడికి వస్తున్నారు.. గో బ్యాక్' అంటూ సైగలు చేయడం కనిపించింది. దీంతో కుర్రాళ్లు క్రీజులోకి వెళ్లారు. కానీ ఒక ఓవర్ ఆడాక భారత కెప్టెన్ అధికారికంగా డిక్లేర్ చేశాడు.

2 ఓ టెస్టులో సెంచరీ+5 వికెట్లు తీయడం జడేజాకిది రెండోసారి. ఓవరాల్‌గా వినూ మన్కడ్, పాలీ ఉమ్రిగర్, అశ్విన్ తర్వాత నాలుగో భారత క్రికెటర్.

1 టెస్టుల్లో పరుగుల పరం (434)గా భారత్‌కిదే అతిపెద్ద విజయం

1 ఓ టెస్టు సిరీస్‌లో ఎక్కువ (48) సిక్సర్లు బాదిన తొలి జట్టుగా భారత్.

2 ఇంగ్లండ్‌కు పరుగుల పరంగా ఇది రెండో ఘోర ఓటమి

3 రెండు వరుస టెస్టుల్లో డబుల్ సెంచరీలు చేసిన మూడో భారత బ్యాటర్‌గా జైస్వాల్. గతంలో వినోద్ కాంబ్లీ, విరాట్ ఈ ఫీట్ సాధించారు.

రెండో ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీ చేసిన మూడో పిన్నవయస్కుడిగా జైస్వాల్.

రెండు ఇన్నింగ్స్‌లోనూ 400+ స్కోర్లు సాధించడం భారత్‌కిది మూడోసారి.

4 అరంగేట్ర టెస్టు రెండు ఇన్నింగ్స్‌లోనూ హాఫ్ సెంచరీలు చేసిన నాలుగో భారత బ్యాటర్‌గా సర్ఫరాజ్. దిలావర్, గవాస్కర్, శ్రేయాస్ ముందున్నారు.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 445; ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 319.

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (నాటౌట్) 214; రోహిత్ (ఎల్బీ) రూట్ 19; గిల్ (రనౌట్) 91; రజత్ (సి) రెహాన్ (బి) హార్ట్‌లీ 0; కుల్దీప్ (సి) రూట్ (బి) రెహాన్ 27; సర్ఫరాజ్ (నాటౌట్) 68; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 98 ఓవర్లలో 430/4. వికెట్ల పతనం:** 1-30, 2-191, 3-246, 4-258; **బౌలింగ్:** అండర్సన్ 13-1-78-0; రూట్ 27-3-111-1; హార్ట్‌లీ 23-2-78-1; ఉడ్ 10-0-46-0; రెహాన్ 25-1-108-1.

ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: క్రాలే (ఎల్బీ) బుమ్రా 11; డకెట్ (రనౌట్) 4; పోప్ (సి) రోహిత్ (బి) జడేజా 3; రూట్ (ఎల్బీ) జడేజా 7; బెయిర్‌స్టో (ఎల్బీ) జడేజా 4; స్టోక్స్ (ఎల్బీ) కుల్దీప్ 15; ఫోక్స్ (సి) జురెల్ (బి) జడేజా 16; రెహాన్ (సి) సిరాజ్ (బి) కుల్దీప్ 0; హార్ట్‌లీ (బి) అశ్విన్ 16; ఉడ్ (సి) జైస్వాల్ (బి) జడేజా 33; అండర్సన్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 39.4 ఓవర్లలో 122 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-15, 2-18, 3-20, 4-28, 5-50, 6-50, 7-50, 8-82, 9-91, 10-122; **బౌలింగ్:** బుమ్రా 8-1-18-1; సిరాజ్ 5-2-16-0; జడేజా 12.4-4-41-5; కుల్దీప్ 8-2-19-2; అశ్విన్ 6-3-19-1.

రోహిత్ ధైర్యంగా..



ఇంగ్లండ్ 'బజ్‌బాల్' శకంలో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసిన తొలి కెప్టెన్‌గా రోహిత్ శర్మ నిలిచాడు. స్టోక్స్, కోచ్ మెకల్లమ్ హయాంలో 20 టెస్టులు ఆడిన ఇంగ్లండ్ 14 మ్యాచ్‌లు గెలిచి.. ఐదు టెస్టులు ఓడింది. ఒకటి డ్రాగా ముగిసింది. అయితే, ఏ జట్టు కూడా ఇన్నింగ్స్ డిక్లేర్ చేయడానికి సాహసించలేదు.

రెండో స్థానానికి టీమిండియా

రాజ్‌కోట్: మూడో టెస్టులో ఇంగ్లండ్‌ను చిత్తుగా ఓడించడంతో భారత్ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పట్టికలో తిరిగి రెండో స్థానానికి ఎగబాకింది. గతవారం దక్షిణాఫ్రికాపై వరుసగా రెండు టెస్టులు నెగ్గిన న్యూజిలాండ్ 75 శాతంతో అగ్రస్థానానికి చేరుకోగా, అప్పటిదాకా టాప్‌లో ఉన్న ఆస్ట్రేలియా రెండో స్థానానికి, రెండులో ఉన్న భారత్ మూడో స్థానానికి పడిపోయిన సంగతి తెలిసిందే. తాజా ప్రదర్శనతో 59.52 శాతంతో రోహిత్ సేన ఆసీస్ (55 శాతం)ను వెనక్కినెట్టి మళ్లీ తన రెండో స్థానానికి చేరుకుంది. బంగ్లాదేశ్, పాకిస్థాన్, వెస్టిండీస్, దక్షిణాఫ్రికా తర్వాతి స్థానాల్లో ఉండగా.. ఇంగ్లండ్ (21.88 శాతం) చివరిదైన 8వ స్థానానికి పరిమితమైంది.

ఐపీఎల్ ఆల్‌టైమ్ గ్రేట్

టీమ్ కెప్టెన్ ధోనీ

రోహిత్‌కు దక్కని చోటు

న్యూఢిల్లీ: ఐపీఎల్ ఆల్‌టైమ్ గ్రేట్ టీమ్ కెప్టెన్‌గా ధోనీ ఎంపికయ్యాడు. మాజీలు వసీం అక్రమ్, మాథ్యూ హేడెన్, టామ్ మూడీ, డేల్ స్టెయిన్‌లతోకూడిన సెలెక్షన్ ప్యానెల్ ఈ ఐపీఎల్ డ్రీమ్ టీమ్‌ను ఎంపిక చేసింది. 70 మంది జర్నలిస్టులు కూడా ఈ సెలెక్షన్ ప్రక్రియలో పాల్గొన్నారు. వార్నర్, విరాట్ కోహ్లీని ఓపెనర్లుగా ఎంపిక చేయగా.. వన్‌డౌన్‌లో క్రిస్ గేల్‌కు, మిడిలార్డర్‌లో రైనా, డివిలీర్స్, సూర్యకుమార్, హార్దిక్ పాండ్యా, జడేజా, పొలార్డ్‌లకు స్థానం లభించింది. స్పిన్ విభాగంలో రషీద్ ఖాన్, నరైన్, చాహల్‌కు చోటు దక్కగా.. పేసర్లుగా మలింగ, బుమ్రాలను ఎంపిక చేశారు. 16 ఏళ్ల తన ఐపీఎల్ ప్రయాణంలో చెన్నై సూపర్ కింగ్స్ సారథిగా ధోనీ తనదైన ముద్రవేశాడు. ముంబై ఇండియన్స్ కెప్టెన్‌గా రోహిత్ శర్మ కూడా ఎంతో పాపులారిటీ సాధించాడు. అయితే, ఆల్‌టైమ్ టీమ్ కెప్టెన్ ఎంపికలో మహీ, హిట్‌మ్యాన్ మధ్య తీవ్రపోటీ నెలకొన్నా.. ధోనీవైపు ప్యానెల్ సభ్యులు మొగ్గు చూపారు. కాగా, ఐదుసార్లు ముంబైను విజేతగా నిలిపిన రోహిత్‌కు అసలు టీమ్‌లోనే చోటు దక్కపోవడం గమనార్హం.





సౌతాఫ్రికా క్రికెట్ దిగ్గజం ప్రోక్టర్ ఇక లేరు

జొహాన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా దిగ్గజ ఆల్‌రౌండర్ మైక్ ప్రోక్టర్ (77) మరణించాడు. డర్బన్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం కన్నుమూశాడు. గుండెకు శస్త్రచికిత్స తర్వాత పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్టు తెలిసింది. నిషేధం తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లోని పునరాగమనం చేసిన సౌతాఫ్రికా జట్టు తొలి కోచ్‌గా ప్రోక్టర్ వ్యవహరించాడు. తాను ఆడే సమయంలో ఫాస్ట్ బౌలర్, ఆఫ్ స్పిన్నర్, మిడిలార్డర్ బ్యాటర్‌గా భిన్న పాత్రలు పోషించిన మైక్.. రిటైర్మెంట్ తర్వాత కోచ్, సెలెక్టర్, కామెంటేటర్, బోర్డు సభ్యుడిగా, ఎలిట్ ఐసీసీ రెఫరీగా కూడా పనిచేశాడు. తన జీవిత చరమాంకంలో పేద పిల్లలకు కోచింగ్ ఇస్తూ గడిపాడు. వర్ణ వివక్ష కారణంగా సౌతాఫ్రికాపై నిషేధం విధించడంతో.. ప్రోక్టర్ తన కెరీర్‌లో 7 టెస్టులు మాత్రమే ఆడాడు. 2008లో సిడ్నీ టెస్టులో జరిగిన మంకీ గేట్ వ్యవహారంలో భారత స్పిన్నర్ హర్భజన్ సింగ్‌పై మూడు టెస్టుల నిషేధం విధిస్తూ వివాదాస్పద నిర్ణయం తీసుకొన్న మ్యాచ్ రెఫరీ ప్రోక్టరే. అయితే, టీమిండియా నిరసన తర్వాత ఆ నిషేధాన్ని రద్దు చేశారు.

కేరళకు ఆధిక్యం

ఆంధ్రతో రంజీ

విజయనగరం: అక్షయ్ చంద్రన్ (184), సచిన్ బేబి (113) శతకాలు సాధించడంతో.. ఆంధ్రతో రంజీ మ్యాచ్‌లో కేరళ భారీ స్కోరు చేసింది. మూడో రోజైన ఆదివారం ఓవర్‌నైట్ స్కోరు 258/3తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన కేరళ 514/7 వద్ద డిక్లేర్ చేసింది. ఆంధ్ర తొలి ఇన్నింగ్స్ స్కోరు (272) కంటే 242 పరుగుల ఆధిక్యాన్ని నమోదు చేసింది. మనీష్ 4 వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో ఆంధ్ర ఆట ముగిసేసరికి 19/1 స్కోరు చేసింది. మహీప్ (8), అశ్విన్ హెబ్బార్ (2) క్రీజులో ఉన్నారు.

'బజ్‌బాల్'కు దండేయాల్సిందేనా!



బ్రిటిష్ మీడియా విమర్శలు

రాజ్‌కోట్‌లో భారీ ఓటమితో ఇంగ్లండ్ టీమ్ ఆటతీరును బ్రిటిష్ మీడియా తూర్పారబట్టింది. 'బజ్‌బాల్'కు శ్రద్ధాంజలి ఘటించాలి అన్నట్టుగా రాశాయి. 'స్టోక్స్ సేనకు ఏం చేయాలో పాలుపోలేదు. ప్రత్యర్థి ముందు మోకరిల్లారు. మళ్లీ పాతకథే పునరావృతమవుతోంద'ని టెలిగ్రాఫ్ విమర్శించింది. స్టోక్స్ 100వ టెస్ట్.. పీడకల అని ఓ పత్రిక పేర్కొనగా.. 'బజ్‌బాల్ శకంలో ఇంగ్లండ్ దారుణ ప్రదర్శన. ఛేజింగ్‌లో ఏమాత్రం పోరాడలేద'ని మరో పత్రిక దుయ్యబట్టింది.

● మెరిసిన మనికా.. భారత్ బోణీ

బుసాన్: స్టార్ క్రీడాకారిణి మనికా బాత్రా సత్తా చాటడంతో ప్రపంచ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళల జట్టు తొలి విజయాన్ని నమోదు చేసింది. ఆదివారం జరిగిన తమ గ్రూప్ రెండో మ్యాచ్‌లో భారత్ 3-2తో హంగేరీని ఓడించింది. తొలి మ్యాచ్‌లో భారత్ 1-3తో ఓటమి పాలైన సంగతి తెలిసిందే. కాగా, హంగేరితో పోరులో మనికా రెండు సింగిల్స్‌లోనూ నెగ్గి భారత గెలుపులో కీలకపాత్ర పోషించింది.



అదరగొట్టిన తలైవాస్

పంచకుల: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) సీజన్-10లోని తమ ఆఖరి మ్యాచ్‌ను తమిళ్ తలైవాస్ భారీ విజయంతో ముగించింది. అలాగే లీగ్ చరిత్రలో కొత్త రికార్డులను నెలకొల్పింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో తలైవాస్ 74-37 స్కోరుతో బెంగాల్ వారియర్స్‌పై ఘన విజయం సాధించింది. ఒక లీగ్ మ్యాచ్‌లో అత్యధిక పాయింట్లు సాధించిన జట్టుగా తలైవాస్ నిలిచింది. ఒక మ్యాచ్‌లో ఇరుజట్లు కలిసి అత్యధిక పాయింట్లు (111) సాధించిన గేమ్ కూడా పీకేఎల్‌లో ఇదే కావడం విశేషం. తలైవాస్ అత్యధిక ఆలౌట్లు (7) చేసిన మ్యాచ్ కూడా ఇదే. తలైవాస్ ఈ మ్యాచ్‌లో ఇన్ని రికార్డులు సాధించడానికి కారణం ఆ జట్టు రైడర్లు విశాల్ (18 పాయింట్లు), నరేందర్ (17 పాయింట్లు) ప్రదర్శన. మరో మ్యాచ్‌లో దబాంగ్ ఢిల్లీ 46-38తో బెంగుళూరు బుల్స్‌పై గెలిచింది. ఈ విజయంతో ఢిల్లీ పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి చేరింది.



కొణతాల నివాసంలో పవన్‌కల్యాణ్

జనసేనాని బిజీ బిజీ

విశాఖలో మూడు రోజులు మకాం

- నియోజకవర్గాల వారీగా పార్టీ నేతలతో భేటీ
- టీడీపీ నాయకులతోనూ సమావేశాలు
- ఈ వారంలోనే ఢిల్లీ పర్యటన
- టీడీపీ అధినేత చంద్రబాబుతో కలిసి వెళ్లే చాన్స్

అమరావతి, విశాఖపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఈ వారం బిజీ బిజీగా గడపనున్నారు. ప్రస్తుతం ఉత్తరాంధ్ర పర్యటనలో ఉన్న ఆయన ఈ వారంలోనే ఢిల్లీ పర్యటనకు కూడా వెళ్లనున్నారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో ఆదివారం రాత్రి ఏడున్నర గంటలకు విశాఖ నగరానికి వచ్చిన ఆయన విమానాశ్రయం నుంచి నేరుగా పెదవాల్తేరులోని కొణతాల రామకృష్ణ నివాసానికి వెళ్లారు. అక్కడ కొంతసేపు కొణతాలతో ఏకాంతంగా భేటీ అయ్యారు. అక్కడి నుంచి నోవాటెల్ హోటల్‌కు వెళ్లారు. అక్కడ నియోజకవర్గాల సమన్వయకర్తలు, ఉమ్మడి విశాఖ జిల్లాలోని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు 33 మందితో పవన్ సమావేశం కానున్నారు. సోమ, మంగళవారాల్లోనూ విశాఖలోనే ఉండే పవన్.. నగర నాయకులతో పాటు భీమిలి, గాజువాక, చోడవరం, యలమంచిలి నియోజకవర్గ నాయకులతో సమావేశమవుతారు. అలాగే ఉమ్మడి గోదావరి జిల్లాల నాయకులను కూడా విశాఖకు పిలిపించుకుని వారితో భేటీ కానున్నారు. వాస్తవానికి ఈ నెల 14నే పవన్ ఉత్తరాంధ్ర పర్యటనకు సిద్ధమయ్యారు. కానీ ప్రభుత్వం హెలికాప్టర్‌కు అనుమతి ఇవ్వకపోడంతో పర్యటన వాయిదా వేసుకున్నారు. రీ షెడ్యూల్ చేసుకుని అందరి నాయకులతో భేటీ అవుతున్నారు. కాగా, ఈ పర్యటనలో భాగంగా కొన్ని నియోజకవర్గాల్లో టీడీపీ నాయకులతోనూ ఆయన భేటీ కానున్నారు. పొత్తులో భాగంగా కొన్ని చోట్ల ఇరుపార్టీ నేతల మధ్య సఖ్యత కల్పించే క్రమంలో ఇరుపార్టీ నేతలతో సమావేశాలు నిర్వహిస్తారు. మంగళవారం రాత్రికి ఆయన విజయవాడ చేరుకుంటారు. మరో వైపు ఈ వారం జనసేనాని ఢిల్లీ పర్యటన కూడా దాదాపు ఖరారైంది. ఈ నెల 22, 23వ తేదీల్లో టీడీపీ అధినేత చంద్రబాబుతో కలిసి పవన్ ఢిల్లీ వెళ్లే అవకాశాలున్నాయి. బీజేపీతో పొత్తులు, సీట్లు సర్దుబాటుతో పాటు ఇతర అంశాలపై మూడు పార్టీల నేతలు చర్చలు జరపనున్నారు.

జగన్‌కు డబ్బే ముఖ్యం.. అంబేడ్కర్ కాదు: జవహర్

అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డి జమానాలో డబ్బుకు తప్ప.. మనుషులకు, మహాత్ములకు విలువ లేదని మాజీ మంత్రి కేఎస్ జవహర్ విమర్శించారు. జగన్ ధన ఉన్మాద ప్రభావంతో అంబేడ్కర్ పేరు కన్నా.. డబ్బే ఎక్కువ అంటూ జగన్ మనసులోని మాటను వైసీపీ నేత జూపూడి ప్రభాకర్ బహిరంగం చేశాడని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అంబేడ్కర్ విదేశీ విద్య పేరుతో చంద్రబాబు ఐదేళ్ల పాలనలో 5వేల మంది విద్యార్థులను ఉన్నత విద్య కోసం విదేశాలకు పంపగా, జగన్‌రెడ్డి విదేశీ విద్యను రద్దు చేశాడని ఆరోపించారు. దళితులు నిలదీయడంతో అంబేడ్కర్ విదేశీ విద్య పథకం పేరును జగనన్న విదేశీ విద్యగా మార్చి, ఐదేళ్లలో కేవలం 300మందినే విదేశాలకు పంపారని తెలిపారు. దీనికి అనేక షరతులు పెట్టి పేద దళిత విద్యార్థులను విదేశీ విద్యకు దూరం చేశారని ఆరోపించారు. అంబేడ్కర్‌కు వైసీపీ చేసిన అవమానాన్ని దళిత జాతి క్షమించదని స్పష్టం చేశారు.

జగన్..

దమ్ముంటే చర్చకు రా!

ఏ అంశంపైనైనా బహిరంగ చర్చకు నేను సిద్ధం: చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పాలన ఎవరిదో.. విధ్వంసం ఎవరిదో చర్చించేందుకు తాను సిద్ధమని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించారు. ఎవరి పాలన స్వర్ణ యుగమో.. ఎవరి పాలన రాతి యుగమో.. తేల్చేందుకు తాను సిద్ధమేనన్నారు. 'రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ అరాచక, విధ్వంస పాలనపై చర్చించేందుకు నేను సిద్ధం. బూటకపు ప్రసంగాలు కాదు.. దమ్ముంటే నాతో బహిరంగ చర్చకు సిద్ధమా? చర్చకు వచ్చే దమ్ముందా సీఎం జగన్మోహన్‌రెడ్డికి ఉందా' అని సవాల్ విసిరారు. ఆదివారం రాత్రి చంద్రబాబు ఓ ప్రకటన విడుదల చేశారు. సీఎం జగన్‌తో చర్చకు సిద్ధమని.. రూ. వందల కోట్లు ఖర్చు చేస్తూ, అధికార దుర్వినియోగంతో సిద్ధం అని సభలు పెడుతూ, జగన్ చెబుతున్న అసత్యాల నిగ్గు తేల్చేందుకు తాను సిద్ధమన తెలిపారు. జగన్ సిద్ధం అని సభలు పెట్టి.. అశుద్ధం మాటలు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. ఇంకా ఏమన్నారంటే..



రాజశ్యామల యాగంలో చంద్రబాబు దంపతులు

> అన్ని వర్గాలను మోసగించి సామాజిక ద్రోహం చేసిన జగన్‌కు.. సామాజిక న్యాయం అనే పదం పలికే అర్హత లేదు. వచ్చే ఎన్నికల్లో ప్రతి బాధిత కుటుంబం వైసీపీని ఓడిం చేందుకు స్టార్ క్యాంపెయినర్ కాబోతోంది.
>
> - చంద్రబాబు

జనం కసితో సిద్ధం..

2019లో ప్రజలిచ్చిన ఒక్క చాన్సే జగన్‌కు రాజకీయంగా చివరి చాన్స్. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ రెక్కలు విరిచేయడానికి జనం కసితో సిద్ధంగా ఉన్నారు. ఓటమి భయంతో 77 మంది ఎమ్మెల్యేలను జగన్ ఇప్పటికే మడతపెట్టాడు. మిగిలిన వైసీపీ ఎమ్మెల్యేలను 50 రోజుల్లో ఇక జనం మడత పెడతారు. రూ.10 ఇచ్చి, రూ.100 దోచిన జగన్.. సంక్షేమం గురించి చెప్పడమా? సహజ వనరుల దోపిడీతో, స్కాం కోసమే స్కీం పెట్టిన విధానాలతో అత్యంత ధనిక ముఖ్యమంత్రిగా మారిన జగన్‌కు.. పేదల జీవితాల గురించి మాట్లాడే అర్హత ఎక్కడిది? రాష్ట్రంలో ఏ మూల చూసినా అభివృద్ధి కాదు.. ఏ ఊరెళ్లినా ఈ ఐదేళ్ల పాలనా విధ్వంసంతో నష్టపోయిన ప్రజలే కనిపిస్తున్నారు. వచ్చే ఎన్నికలు నిజమైన పెత్తందారు జగన్‌కు, 5 కోట్ల మంది ప్రజలకు మధ్య జరిగే యుద్ధం. రాయలసీమలో 52 నియోజకవర్గాల్లో ప్రయాణికులను ఇబ్బంది పెట్టి ఆర్టీసీ, స్కూలు బస్సులను లాక్కుని, బలవంతంగా రాప్తాడు సభకు తరలించారు. సభ నిజంగా సక్సెస్ అయిఉంటే జగన్‌రెడ్డి రౌడీ గ్యాంగ్.. నిస్పృహతో మీడియా సిబ్బందిపై దాడులు ఎందుకు చేశారు?

విధ్వంస పాలనతోనే నష్టం ఎక్కువ

రాష్ట్ర విభజన అనంతరం టీడీపీ ప్రభుత్వ హయాంలో అనేక అడ్డంకులు, సవాళ్లను అధిగమించి, నేను రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళితే.. జగన్ తన విధ్వంస పాలనతో విభజన కంటే ఎక్కువ నష్టం చేశారని చంద్రబాబు మండిపడ్డారు. టీడీపీ హయాం లో 14% ఉండే వృద్ధి రేటు ఈ ప్రభుత్వం వచ్చాక 10.93 శాతానికి పడిపోయింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో వృద్ధి రేటు 4.06శాతానికి తగ్గింది. ట్యాక్స్ రూపంలో ప్రభుత్వానికి ఏటా రూ.30వేల కోట్లు ఆదాయానికి గండిపడింది. విభజన జరిగినప్పుడు మనకంటే తెలంగాణ 35% అధికంగా తలసరి ఆదాయం ఉంటే 2014 తర్వాత ఏపీలో సుపరిపాలన ద్వారా వ్యత్యాసాన్ని 27.5 శాతానికి తగ్గించాం. ఇప్పుడు జగన్ నిర్వాకం వల్ల ఏపీ తలసరి ఆదాయం తెలంగాణతో పోల్చితే 44% తక్కువగా ఉంది. అభివృద్ధి లేక ప్రజల జీవన ప్రమాణాలు దారుణంగా పడిపోవడమే ఇందుకు కారణం.

ఒక్కో కుటుంబంపై 8 లక్షల భారం

జగన్‌రెడ్డి పేరు చెబితే బాబాయిపై గొడ్డలి వేటు, కోడికత్తి శ్రీను, ప్రభుత్వ టెర్రరిజం, క్విడ్‌ప్రోకో, ల్యాండ్, శాండ్, వైన్, మైన్ మాఫియా గుర్తొస్తాయి. ఆయన పేరు చెబితే అధిక ధరలు, పన్నులు, చార్జీల పెంపు, అప్పులు, బాదుడు, మోసాలు, దొంగ ఓట్లు, హింసా రాజకీయాలు గుర్తొస్తాయి. వైసీపీ మేనిఫెస్టోలో మద్య నిషేధం అని చెప్పి.. తర్వాత దానిని మద్య నియంత్రణ అని మార్చి రూ.లక్షన్నర కోట్ల మద్యం అమ్మిన జగన్ విశ్వసనీయత గురించి చెబితే జనం నమ్మాలా? 98% హామీలు అమలు చేశామంటున్న జగన్ మాటలు పూర్తిగా బూటకం. ధరలు, పన్నులు, చార్జీలు, అప్పుల బాదుడుతో ఒక్కో కుటుంబంపై రూ.8లక్షల భారం మోపం నిజం కాదా? నిన్నటి వరకు పరదాల్లో తిరిగిన జగన్.. 9సార్లు కరెంట్ చార్జీలు పెంచిన జగన్.. పేదల గురించి ఎన్నికల సమయంలో మాయమాటలు చెబితే జనం నమ్ముతారా? రైతు భరోసాలో జగన్ ఇచ్చింది రూ.37 వేలు. రైతు రుణ మాఫీ ద్వారా ఒకేసారి మేం రూ.50వేలు ఇచ్చింది వాస్తవం కాదా? ఎన్నికల సమయంలో మిగిలిన మొత్తం అందకుండా జగన్ కుట్రలు చేసింది నిజం కాదా? సాగునీటి ప్రాజెక్టులను రివర్స్ చేసి, రైతుల సబ్సిడీలు నిలిపివేసిన జగన్‌కు అసలు రాయలసీమలో సభ పెట్టే అర్హతే లేదు.

జాకీ పరిశ్రమను ఎందుకు తరిమేశావ్?

జాకీ పరిశ్రమను ఎందుకు తరిమేశావని రాప్తాడు అడుగుతోందని, జగన్ దీనికి సమాధానం చెప్పాలని చంద్రబాబు పేర్కొన్నారు. సిద్ధం సభను ఉద్దేశించి ఆదివారం 'ఎక్స్' వేదికగా సీఎం జగన్‌కు చంద్రబాబు పలు ప్రశ్నలు సంధించారు. 'రాప్తాడు అడుగుతోంది.. జాకీ పరిశ్రమను ఎందుకు తరిమేశావని? అనంత అడుగుతోంది.. కియా అనుబంధ పరిశ్రమలు ఏమయ్యాయని? సీమ రైతన్న అడుగుతున్నాడు నాటి డ్రిప్ పథకాలు ఎక్కడని? సమాధానం చెప్పి సభ పెడతావా? సభలో సమాధానం చెబుతావా?' అంటూ జగన్‌ను ట్యాగ్ చేసి ప్రశ్నించారు.

ముగిసిన రాజశ్యామల యాగం..

చంద్రబాబు నివాసంలో మూడురోజుల పాటు నిర్వహించిన రాజశ్యామల యాగం ఆదివారం పూర్ణాహుతితో ముగిసింది. గుంటూరుకు చెందిన వేదపండితులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో 50మంది రిత్వికులు చంద్రబాబు, భువనేశ్వరి దంపతులతో యాగం, పూజాక్రతువులు నిర్వహించారు. కార్యక్రమాల్లో పార్టీ నేతలు, ఆఫీస్ సిబ్బంది కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు.

టీడీపీ పథకాలు ప్రజలకు గుర్తే!

టీడీపీ తెచ్చిన 120 సంక్షేమ పథకాలు రద్దు చేసిన జగన్ ప్రభుత్వాన్ని రద్దు చేయడానికి జనం కసితో ఉన్నారు. టీడీపీ పేరు, నా పేరు చెబితే దళితులకు ఇచ్చిన సబ్‌ప్లాన్ నిధులు, ఇన్నోవా కార్లు, నిరుద్యోగ భృతి, 11 డీఎస్సీలతో ఇచ్చిన లక్షన్నర టీచర్ పోస్టులు, రైతు రుణమాఫీ, అన్నదాత సుఖీభవ, పసుపు-కుంకుమ, చంద్రన్న బీమా, పండుగ కానుకలు, పెళ్లి కానుకలు, ఇరిగేషన్ ప్రాజెక్టులు, అమరావతి, 16లక్షల కోట్ల పెట్టుబడులు, 10లక్షల ఉద్యోగాలు ప్రజలకు గుర్తొస్తాయి.

పవన్‌పై కేసును ఖండిస్తున్నా..

రాష్ట్రంలో అక్రమ కేసులు, అధికార దుర్వినియోగం తప్ప.. జగన్ సాధించింది శూన్యం. అక్రమాలను ప్రశ్నించిన ప్రతిపక్షాలకు సమాధానం చెప్పలేకే కేసులతో వేధిస్తున్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై కేసు పెట్టడాన్ని ఖండిస్తున్నాను. ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది. వారు ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారు. తమ జీవితాలను నాశనం చేసిన ఫ్యాన్ రెక్కలు విరగ్గొట్టడానికి కసితో ఎదురుచూస్తున్నారు.



తన రక్తంతో గోడపై 'సీబీఎన్ జిందాబాద్' అని రాస్తున్న బుద్దా వెంకన్న

చంద్రబాబు నా ప్రాణం!

రక్తంతో గోడపై రాసిన బుద్దా వెంకన్న

విజయవాడ(వన్‌టౌన్), ఫిబ్రవరి 18 : 'సీబీఎన్ జిందాబాద్.. నా ప్రాణం మీరే' అంటూ టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి బుద్దా వెంకన్న తన రక్తంతో గోడపై రాసి తన అభిమానాన్ని చాటుకున్నారు. ఆదివారం విజయవాడలోని తన నివాసంలో గోడపై ఆయన రక్తాక్షరాలను లిఖించడంతో పాటు చంద్రబాబు కటౌట్ పాదాలకు రక్తాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బుద్దా వెంకన్న మాట్లాడుతూ తనకు విజయవాడ పశ్చిమ సీటు ఇవ్వాలని, చట్టసభలో చంద్రబాబు వెనుక కూర్చునే అవకాశం తనకు కల్పించాలని కోరారు. లేదా అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీచేసే అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సంకీర్ణ ప్రభుత్వం వస్తున్న నేపథ్యంలో రాయల్టీగా ఉండి, పార్టీ కోసం నిలబడే వారికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. తనకు చంద్రబాబు కుటుంబం తప్ప వేరే నాయకులు లేరని, తన ప్రాణ సమానమైన చంద్రబాబు కోసం తన గుండె కోసి ఇవ్వమన్నా సిద్ధమని తెలిపారు. తన రక్తంలో చంద్రబాబే ఉన్నారన్నారు. రక్తంతో ఆయన కాళ్లు కడిగి తన ప్రేమను నిరూపించుకున్నట్లు తెలిపారు. తనకు టికెట్ ఇవ్వక పోయినా 'సీబీఎన్ జిందాబాద్' అనే అంటానని, తాను కొడాలి నాని, వంశీ, కేశినేని నాని టైప్ కాదని చెప్పారు. తనలో ఊపిరి ఉన్నంతవరకు చంద్రబాబుతోనే తన ప్రయాణమని పేర్కొన్నారు.

21న బీజేపీ ఎంపీలకు నల్లజెండాలతో నిరసన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ఎంపీలకు వ్యతిరేకంగా 21న దేశవ్యాప్తంగా నల్లజెండాలతో నిరసన చేపట్టనున్నట్లు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ప్రకటించింది. కార్మిక, ప్రజా సంఘాలు సంఘీభావం తెలపాలని కోరింది. మంగళవారంనుంచి మూడు రోజుల పాటు పంజాబ్‌లోని బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు, నాయకుల ఇళ్ల ముందు ఘెరావ్ చేపడతాని ఎస్‌కేఎం తెలిపింది. ఇదిలా ఉండగా, రైతు నేతలతో కేంద్ర మంత్రులు అర్జున్ ముండా, గోయల్, నిత్యానంద రాయ్ జరిపిన 4వ విడత చర్చలు కూడా అసంపూర్తిగా ముగిశాయి. మరోవైపు పంజాబ్-హరియాణా సరిహద్దుల్లో శంభూ, ఖనౌరీ పాయింట్ల వద్ద వేలాది మంది రైతుల నిరసన కొనసాగుతోంది.

సర్కారీ పర్యవేక్షణలో ఇసుక మహాదోపిడీ

(మొదటి పేజీ తరువాయి)

నివేదించింది. ఆ నివేదిక ప్రకారం గతేడాది మార్చి 23న రాష్ట్రంలోని 110 బీ2 కేటగిరీ రీచ్‌ల పర్యావరణ అనుమతులు రద్దయ్యాయి. ఈ మేరకు ఎస్‌ఈఐఏఏ ఆదేశాలు ఇచ్చింది. దీని ప్రకారం భారీ యంత్రాలు, సాధారణ యంత్రాలతో ఇసుక తవ్వకాలు ఆపేయాలి. దీన్ని అమలు చేయాల్సింది గనులు, రెవెన్యూ శాఖలే. అయితే ఇసుక దందాలో పెద్దల ప్రమేయం ఉండటంతో గనుల శాఖ కళ్లు మూసుకుంది. ఫలితంగా 110 బీ2 రీచ్‌ల్లో ఇప్పటికీ యంత్రాలతో ఇసుకను తవ్వి తరలిస్తున్నారు. నాడు జేపీ వెంచర్స్ అదే పనిచేయగా, నేడు కొత్తగా వచ్చిన ప్రతిమ, జీసీకేసీ సంస్థలు అదే దారిలో వెళ్తున్నాయి. పర్యావరణ అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు జరగనివ్వమని హైకోర్టుకు హామీ ఇచ్చిన గనుల శాఖ ఆచరణలోకి వచ్చేసరికి హామీని గంగపాలు చేసింది. వైసీపీ ఇసుక ముఠాల దోపిడీకి జీ హుజూర్ అంటోంది. ఏడాదిగా అక్రమంగా సాగుతున్న ఇసుక తవ్వకాలు, అమ్మకాలను గనుల శాఖ విజిలెన్స్ విభాగం, సెబ్, రెవెన్యూ, ఇతర వ్యవస్థలేవీ అడ్డుకోలేకపోయాయి. పదేపదే పారదర్శకత గురించి వల్లించే గనుల శాఖ అధికారి వెంకటరెడ్డి కళ్లముందు జరుగుతున్న దోపిడీ గురించి సీబీడీకి కానీ పోలీసులకు కానీ ఎందుకు ఫిర్యాదు చేయలేకపోయారు? వాస్తవానికి ఇసుక రీచ్‌లపై నివేదిక ఇచ్చేందుకు ఎస్‌ఈఐఏఏ మూడు వారాలు గడువు కోరింది. ఇప్పటికే సమయం మించిపోయిందని, మీ దగ్గర ఉన్న రికార్డులు చూసి చెప్పడానికి సుదీర్ఘ సమయం అవసరం లేదని, వెంటనే రిపోర్టు ఇవ్వాలని ఎన్జీటీ ఘాటుగా చురకలంటించింది. దీంతో ఆ సంస్థ వెనువెంటనే నివేదిక ఇచ్చింది.

> మనుషులు మాత్రమే ఇసుకను తవ్వే బీ1 రీచ్‌ల అనుమతి కోసం 183 దరఖాస్తులు వచ్చినట్లు రాష్ట్ర పర్యావరణ ప్రభావ అంచనా సంస్థ ఎన్జీటీకి నివేదించింది. ఇందులో 113 దరఖాస్తులను పరిశీలించి 41 రీచ్‌లకు పర్యావరణ అనుమతులు ఇచ్చామని వివరించింది. 11 దరఖాస్తులను తిరస్కరించామని, మరో 4 దరఖాస్తులను పున:పరిశీలన చేయాలని రాష్ట్రస్థాయి నిపుణుల కమిటీ (ఎస్‌ఈఏసీ)కి పంపించామని పేర్కొంది. మరో 57 దరఖాస్తులపై ఇతర సమాచారం, వివరణలు ఇవ్వాలని ఇటు గనుల శాఖ, అటు నిపుణుల కమిటీని కోరామని రాష్ట్ర పర్యావరణ ప్రభావ అంచనా సంస్థ తన నివేదికలో పేర్కొంది. అయితే బీ2 కేటగిరీ రీచ్‌ల్లో ఏ ఒక్కదానికీ పర్యావరణ అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేసింది.
>
> **బీ1 కోసం 183 దరఖాస్తులు**

2023లోనే ఈసీలు రద్దు

జేపీ వెంచర్స్ ఇసుక కాంట్రాక్టు చేస్తున్న సమయంలో 2021లోనే ఇసుకను భారీ యంత్రాలతో అక్రమంగా తవ్వి తరలిస్తున్నారని, దీనివల్ల పర్యావరణం దెబ్బతింటోందని, తక్షణమే ఈ చర్యలను అడ్డుకోవాలని కోరుతూ గుంటూరు, చిత్తూరు జిల్లాలకు చెందిన పర్యావరణవేత్తలు ఎన్జీటీని ఆశ్రయించారు. ఈ కేసును ఏడాదిన్నరకు పైగా విచారించిన ఎన్జీటీ 2023 మార్చి 23న తుది తీర్పు ఇచ్చింది. 106 ఇసుక రీచ్‌లకు ఇచ్చిన పర్యావరణ అనుమతులను తక్షణమే రద్దు చేయాలని ఎన్జీటీ ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు ఉత్తర్వులు ఇవ్వాలని రాష్ట్ర పర్యావరణ ప్రభావ అంచనా సంస్థను ఆదేశించింది. ఈ సంస్థ నింపాదిగా ఎన్జీటీ ఉత్తర్వులు ఇచ్చిన నెల తర్వాత అంటే, గతేడాది ఏప్రిల్ 24న ఈ రీచ్‌లలో ఇసుక తవ్వకాలను నిలిపివేస్తూ, వాటిపై ఇచ్చిన పర్యావరణ అనుమతుల(ఈసీ)ను రద్దుచేస్తున్నట్లు ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు తక్షణమే చర్యలు తీసుకోవాలని గనుల శాఖను ఆదేశించింది. నిబంధనల ప్రకారం గనుల శాఖ ఎస్‌ఈఐఏఏ ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలి. తన శాఖ విజిలెన్స్, రెగ్యులర్ బృందాలను జిల్లాల వారీగా ఇసుక రీచ్‌లకు పంపించి మైనింగ్‌ను నిలిపివేయించాలి. అక్కడున్న యంత్రాలను బయటకు తరలించాలి. కానీ గనుల శాఖ ఆ పని చేయలేదు. జేపీ వెంచర్స్ పేరిట వైసీపీ ముఠాలు యథేచ్ఛగా నదులను కొల్లగొట్టాయి. అయితే ఎక్కడా గనుల శాఖ విజిలెన్స్ బృందాలు దాడులు చేయలేదు. 'జేపీ వెంచర్స్ బిల్లులు చూపించే ఇసుక తీసుకెళ్తున్నారు కదా.. ఇందులో తప్పేముంది' అని కొత్త రాగం వినిపించారు.

అడ్డగోలుగా దోపిడీ

సెమీ మెకనైజ్డ్ యంత్రాలతో ఇసుకను తవ్వే రీచ్‌ల (బీ2 కేటగిరీ) నిర్వహణ కోసం ఈ రోజుకు కూడా ఎస్‌ఈఐఏఏ పర్యావరణ అనుమతులు ఇవ్వలేదు. మరోవైపు గనుల శాఖ కూడా ఈసీలు లేకుండా ఇసుక మైనింగ్ చేపట్టబోమని హైకోర్టుకు చెప్పింది. కానీ ఆచరణలో ఇందుకు భిన్నంగా జరుగుతోంది. గతేడాది డిసెంబరు నుంచే రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రతిమ, కోస్తాంధ్రలో జీసీకేసీ సంస్థలు ఇసుక మైనింగ్ చేస్తున్నాయి. రెండున్నర నెలలుగా రాష్ట్రంలో రెండు కంపెనీలు యథేచ్ఛగా మైనింగ్ కార్యకలాపాలు చేస్తున్నాయి. ఈసీలు లేకుండా ఇసుక మైనింగ్ చేయడం చట్టవిరుద్ధం. మరి గనుల శాఖ ఏం చేస్తున్నట్లు? ఈ సారి ఇసుకను ముఖ్యమంత్రి సోదరుడే అమ్ముకుంటున్నారని చర్చ జరుగుతోంది. పేరుకే తెరముందు కంపెనీలున్నా, తెరవెనుక దందా అంతా ఆయనదే అని చెబుతున్నారు.

బీ1 రీచ్‌లలోనూ యంత్రాలతో తవ్వకాలు

రాష్ట్ర పర్యావరణ ప్రభావ అంచనా సంస్థ తాజా నివేదిక ప్రకారం రాష్ట్రంలో 26 జిల్లాల పరిధిలో ఈ నెల 7వ తేదీన 41 రీచ్‌లకే (బీ1 కేటగిరీ) పర్యావరణ అనుమతులు ఇచ్చారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 6వ తేదీ వరకు ఈసీలు చెల్లుబాటు అవుతాయి. ఈ రీచ్‌ల విస్తీర్ణం అంతా కూడా 200 హెక్టార్లకు మించి ఉండదు. అయితే వీటిలో సైతం యంత్రాలను మోహరించి ఇసుక తవ్వుతున్న ఉదంతాలను 'ఆంధ్రజ్యోతి' ఫొటోలతో సహా వెలుగులోకి తీసుకొచ్చింది. ఇదే విషయాన్ని కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ శాస్త్రవేత్తలు కూడా నిర్ధారించారు.

20 మిలియన్ టన్నుల దోపిడీ?

గత ఏడాది కాలంగా రాష్ట్రంలో అక్రమంగా 20 మిలియన్ టన్నుల ఇసుకను తవ్వి తరలించి ఉంటారని పర్యావరణ వేత్తలు అంచనా వేస్తున్నారు. ఇసుకను బ్లాక్ మార్కెటింగ్ కిందకు తీసుకొచ్చి అమ్మడం ద్వారా 18 వేల కోట్లపైనే నేతలు వెనకేసుకొన్నారని ప్రముఖ జియాలజిస్ట్ శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి చెప్పారు. ఇందులో ఎవరి వాటా ఎంతో తేలాల్సి ఉంది. 'ఇటీవల ఇసుకకు డిమాండ్ పెరిగినప్పుడు 25 టన్నుల లారీ ఇసుకను 35 వేల చొప్పున అమ్మారు. కొన్ని చోట్ల డిమాండ్‌ను బట్టి రేటు పెంచారు. ఏడాదిలో స్టాక్ పాయింట్లకు చేర్చినవి, అడ్డగోలుగా అమ్ముకున్న ఇసుక 20 మిలియన్ టన్నులు ఉంటుంది. దీని విలువ 18 వేల కోట్లపైనే ఉంటుంది. గతంలో ఎన్నడూ లేనంతగా గత ఏడాదిగా అక్రమంగా ఇసుకను దోచుకున్నారని ఈ నివేదిక చెబుతోంది' అని శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు.

రీచ్‌లు రెండు రకాలు

ఇసుక రీచ్‌లను రెండు రకాలుగా విభజించారు. సాధారణ రీచ్‌లు అంటే.. మనుషులు చిన్న చిన్న పనిముట్లతో ఇసుకను తవ్వి తరలించుకుపోయే విధానం. వీటిని బీ1 కేటగిరీ రీచ్‌లు అంటారు. చిన్నపాటి యంత్రాలు ఉపయోగించి ఇసుకను తవ్వే విధానాన్ని సెమీ మెకనైజ్డ్ అంటారు. వీటిని బీ2 కేటగిరీ అంటారు. రాష్ట్రంలో 110 రీచ్‌లు బీ2 కేటగిరీలో ఉండగా, 50 బీ1 కేటగిరీలో ఉన్నాయి. పేరు ఏదైనా వైసీపీ ఇసుక ముఠాలు అన్నిచోట్లా యంత్రాలను ఉపయోగించే ఇసుక తవ్వి తరలిస్తున్నాయి.

బొంకులు.. బేలమాటలు

- ఒకసారి ఆశీర్వదిస్తేనే ఎంతో చేశాను
- మరో 4సార్లు గెలిపిస్తే ఇంకెంతో చేస్తా
- సీమ సిద్ధం సభలో జగన్ పచ్చి అబద్ధాలు

అనంతపురం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): 'అంతా నేనే చేశాను' అంటూ బొంకులు! అంతలోనే 'ఇది పేదలకు, పెత్తందారులకు మధ్య పోటీ' అంటూ బేలమాటలు! ఎప్పటిలాగే చంద్రబాబు, పవన్ కల్యాణ్, కొన్ని పత్రికలు అంటూ అక్కసు.. వెరసి అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గం కేంద్రంలో ఆదివారం ముఖ్యమంత్రి జగన్ పాల్గొన్న రాయలసీమ జిల్లాల సిద్ధం బహిరంగ సభలో పచ్చి అబద్ధాల వర్షం కురిపించారు. ఇంటింటికీ ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధి పథకాలన్నీ కొనసాగాలంటే వైసీపీని గెలిపించాలని అభ్యర్థించారు. నాన్ రెసిడెంట్ ఆంధ్రులకు.... ఈ గడ్డపై పుట్టి.. ఇక్కడే ఇల్లు కట్టుకొని, ప్రజల మధ్యఉన్న తనకు మధ్య యుద్ధం జరుగుతోందన్నారు. ఫ్యాన్ ఎప్పుడూ ఇంట్లోనే ఉండాలి.. సైకిల్ ఎప్పుడూ బయటే ఉండాలి.. టీ గ్లాస్ ఎప్పుడూ సింక్‌లోనే ఉండాలని వ్యాఖ్యానించారు. 'ప్రజలు ఫస్ట్ టైం ఆశీర్వదిస్తేనే ఇంత మంచి జరిగింది. సెకెండ్, థర్డ్, ఫోర్త్ టైమ్ ఆశీర్వదిస్తే ఇంకా ఎంతమంచి జరుగుతుందో ప్రజలకు చెప్పండి" అని పార్టీ శ్రేణులకు సూచించారు. 175 అసెంబ్లీ స్థానాలు, 25 ఎంపీ సీట్లు గెలవాల్సిందేనని నిర్దేశించారు.

తాపించి.. తినిపించి.. బస్సెక్కించారు

అయినా జగన్ ప్రసంగం వినని జనం

ఖాళీగా కనిపించిన గ్యాలరీలు

అనంతపురం జిల్లా రాప్తాడులో నిర్వహించిన సిద్ధం సభను వైసీపీ నడిపించలేదు. మందు, మాంసం, డబ్బులు.. అధికార బలం.. అన్నీ కలిపి నడిపించాయి. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ పాఠశాలలను వీధి వీధికీ, ఊరూరుకీ పంపి జనాన్ని బలవంతంగా తరలించారు. మందు పోసి, మాంసం తినిపించి మరీ జనాన్ని బస్సులు ఎక్కించారు. ఆర్టీసీ బస్సులు లేక ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. సభకు ముందే తాగేసిన వైసీపీ కార్యకర్తలు... సభ జరుగుతున్నంత సేపూ చిందేస్తూ కనిపించారు. మీడియా వారు కనిపిస్తే 'ఎవరు..? ఏ పేపర్..? ఏ చానల్..?' అంటూ బెదిరింపు ధోరణి ప్రదర్శించారు. సభ ప్రారంభమైన కాసేపటికే జనం జారుకోవడం మొదలుపెట్టారు. బలవంతంగా వచ్చినవారు బస్సు దిగి సభా ప్రాంగణానికి వచ్చి.. కాసేపటి తరువాత వెనుదిరిగారు. జగన్ మాట్లాడుతుండగానే చాలా మంది ఆ ప్రాంతాన్ని ఖాళీ చేశారు. మధ్యాహ్నం 12గంటలలోపు సభాప్రాంగణానికి చేరుకున్న జనం, ఎండ వేడిమికి అల్లాడిపోయారు. సిద్ధం సభ కారణంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఇదే పరిస్థితి కనిపించింది. బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారి, అనంతపురం-కదిరి రహదారిపై ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అనంతపురం నగరానికి అటూ ఇటూ దాదాపు 5 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.



సిద్ధం సభకు వచ్చి.. మద్యం సేవిస్తున్న వైసీపీ కార్యకర్తలు

సీఎం జగన్‌కు పట్టు రైతుల నిరసన సెగ

నల్ల ప్లకార్డులతో పుట్టపర్తి ఎయిర్‌పోర్టుకు.. ఇన్సెంటివ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్

పుట్టపర్తి, ఫిబ్రవరి 18: శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని సత్యసాయి విమానాశ్రయంలో ముఖ్యమంత్రి జగన్‌కు పట్టు రైతుల నుంచి నిరసన ఎదురైంది. రాప్తాడులో సిద్ధం సభకు హాజరయ్యేందుకు సీఎం ప్రత్యేక విమానంలో ఆదివారం మధ్యాహ్నం పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్నారు. ప్రభుత్వం చెల్లించాల్సిన ఇన్సెంటివ్ బకాయిలపై ఆయనకు వినతిపత్రం ఇచ్చేందుకు హిందూపురం, మడకశిర ప్రాంతాల పట్టు రైతులు అక్కడకు చేరుకున్నారు. సీఎంను కలిసేందుకు పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో వారంతా ఎయిర్‌పోర్టు ఎదురుగా ఉన్న భవనం పైకి ఎక్కారు. సీఎం విమానం దిగగానే నల్ల ప్లకార్డులు చూపించారు. సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. పోలీసులు వెంటనే అప్రమత్తమై పట్టు రైతులందరినీ కిందకు దించి కొత్తచెరువు స్టేషన్‌కు తరలించారు. తమకు దాదాపు రూ.4కోట్ల ఇన్సెంటివ్ రావాల్సి ఉందని రైతులు తెలిపారు.



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న పట్టు రైతులు

యువకుడి పాదాలపై ఎక్కేసిన బస్సు

సిద్ధం సభకెళ్లిన ఓ యువకుడు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలంలోని మొగిలిచెట్ల తండాకు చెందిన మూడే వెంకటరమణ నాయక్ అలియాస్ బుల్లి సిద్ధం సభకు వెళ్లారు. సభ అనంతరం తిరుగు ప్రయాణవుతుండగా వేదిక సమీపంలో వెంకటరమణ నాయక్‌పైకి బస్సు దూసుకొచ్చింది. అంతా చూస్తుండగానే ఆయన పాదాలపైగా వెళ్లిపోయింది. దీంతో ఆయన రెండుపాదాలు నుజ్జయ్యాయి. బాధితుడిని అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడు దినసరి కూలీ అని, వైద్యం చేయించుకునే స్థోమత కూడా లేదని బంధువులు వాపోతున్నారు.

ఏపీకి ఏమిటీ ఖర్మ?

రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తయింది

విభజన హక్కులేవీ సాధించలేదు: ఉండవల్లి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 18: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను విభజించి ఆదివారం నాటికి పదేళ్లు పూర్తయిందని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ అన్నారు. నేటికీ విభజన హామీలు అమలు చేయడం లేదని, కేంద్రం పట్టనట్లు వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్రానికి ఏమిటీ ఖర్మ, ఇక మనకు దిక్కెవరని ఆవేదన వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి ఐదేళ్ల పాటు ప్రత్యేక హోదా ఇవ్వాలని, పోలవరం ప్రాజెక్టు కట్టి అప్పగిస్తామని నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం తీర్మానంచేసిందని గుర్తు చేశారు. లోకసభ ప్రచురించిన డాక్యుమెంట్ ఆధారంగానే తాను విభజన చట్టం అమలుకు కోర్టుకు వెళ్లానని చెప్పారు. జగన్ సీఎం అయ్యాక అబిత్ సింగ్ అనే పెద్ద లాయర్ ఏపీ తరఫున వాదించారని తెలిపా రు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇచ్చిన బ్రీఫింగ్ అక్కడ అర్థం కాలేదన్నారు. గత వాయిదాలో తెలంగాణ తరఫున సీనియర్ అడ్వకేట్ హాజరైతే ఏపీ నుంచి ఎవరు లేరన్నారు. ఆ రోజు తాను కోర్టుకు జరిగిన వాస్తవాన్ని తెలియజేశానని చెప్పారు. మంచి అడ్వకేట్‌ను పెట్టుకుని డివిజన్ అడగాలని, లేకుంటే కేసు కొట్టేసే ప్రమాదం ఉందని ఉండవల్లి ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికలకు వెళ్లేలోపు అడ్వాన్స్ డేట్ తీసుకుని చట్టం అమలు చేయాలని కోరాలన్నారు. ఇప్పటికైనా విభజన చట్టం అమలుకు ఇరు పార్టీలు పోరాడాలని ఉండవల్లి సూచించారు.



'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడిని ఖండిస్తూ తిరుపతిలో నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు

జగన్ రెచ్చగొట్టడం వల్లే దాడి!

▸▸ 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై హత్యాయత్నాన్ని ఖండించిన జర్నలిస్టులు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ముఖ్యమంత్రి జగన్ రెచ్చగొట్టడం వల్లే వైసీపీ మూకలు 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ కృష్ణపై దాడి చేశాయని జర్నలిస్టు సంఘాలు ఆరోపించాయి. సీఎం సభలోనే పాత్రికేయులపై ఇంతటి దౌర్జన్యం జరిగినందున, అందుకు పూర్తి బాధ్యత ఆయనే వహించాలని ఐజేయూ జాతీయ కార్యదర్శి సోమసుందరం, ఏపీడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏచూరి శివ, జాప్ కార్యదర్శి లక్ష్మీపతి తదితరులు పేర్కొన్నారు. సీఎం సభలో ఫొటోలు తీసేందుకు వెళ్లిన ఫొటోగ్రాఫర్ కృష్ణను వైసీపీ రౌడీలు చుట్టుముట్టి విచక్షణా రహితంగా చేతులు, కాళ్లతో దాడి చేయడం చూస్తే.. చంపాలనే కుట్ర స్పష్టంగా కనిపిస్తోందన్నారు. వైసీపీ రౌడీలు అంతలా రెచ్చిపోవడానికి కారణం సీఎం జగన్ పదే పదే ఒక వర్గం మీడియా అంటూ వేరుచేసి మాట్లాడటమేనని విమర్శించారు. మొన్న అమరావతిలో ఈనాడు విలేకరి, ఇప్పుడు అనంతపురంలో 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పత్రికా స్వేచ్ఛకోసం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతపురంలో పాత్రికేయుడిపై జరిగిన దాడిని పత్రికా ప్రపంచం తీవ్రంగా ఖండిస్తోందని జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(జాప్) రాష్ట్ర కార్యదర్శి ఎస్.లక్ష్మీపతి, ఉపాధ్యక్షుడు వలివేటి సత్యనారాయణ పేర్కొన్నారు.

టీడీపీ నిరసన..

'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ ఆదివారం రాత్రి తిరుపతిలోని భవానీ నగర్ సర్కిల్లో టీడీపీ శ్రేణులు నిరసన తెలిపాయి. వీధి రౌడీల్లా దాడులకు దిగిన వైసీపీ మూకలను వెంటనే అరెస్టు చేయాలని నాయకులు డిమాండు చేశారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి సభలో 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడికి పాల్పడటం నిరంకుశత్వానికి ప్రత్యక్ష నిదర్శనమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. పాత్రికేయులకు రాజ్యాంగం ప్రసాదించిన హక్కుపై దాడి చేయడం హేయమైన చర్యగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ అభివర్ణించారు. 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ పేర్కొన్నారు. ప్రజాస్వామిక వాదులు కృష్ణను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. 'మీరు దాడులు చేసేందుకు సిద్ధమైతే, ప్రజలు మిమ్మల్ని ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారు' అని చిత్తూరు జిల్లాకు చెందిన మాజీ మంత్రి అమరనాథరెడ్డి హెచ్చరించారు.

ఆటవిక చర్య: కన్నా లక్ష్మీనారాయణ

'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడి ఆటవిక చర్య అని మాజీ మంత్రి, టీడీపీ నేత కన్నా లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫొటోగ్రాఫర్‌పై జరిగిన దాడి రాష్ట్రంలో పరిస్థితి ఏవిధంగా ఉందో తెలియజేస్తున్నాయన్నారు.

అరాచక పాలనకు తార్కాణం: సీపీఐ

అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణను విస్మరించి, అధికార పార్టీ అడుగులకు మడుగులు ఒత్తుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందనడానికి 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ కృష్ణపై జరిగిన దాడే తార్కాణమని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.



శ్రీకృష్ణను మెడపట్టి లాగి కింద పడేస్తున్న వైసీపీ కార్యకర్తలు



ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణను కిందపడేసి కాళ్లతో తంతున్న దృశ్యం

దీనికేనా సిద్ధం

'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకల దాడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఫొటోగ్రాఫర్

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన 'సిద్ధం' సభ కవరేజీకి వెళ్లిన ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ప్రతినిధులే లక్ష్యంగా ముందే దాడికి వైసీపీ మూకలు అంతా 'సిద్ధం' చేసుకున్నాయి. 'మీరు ఆంధ్రజ్యోతా' అంటూ పత్రిక పేరు ఆరా తీసి.. ఎంపిక చేసుకుని మరీ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై విచక్షణారహితంగా వైసీపీ మూకలు విరుచుకుపడ్డాయి. సభా ప్రాంగణంలో కనిపించిన ప్రతి రిపోర్టరు, ఫొటోగ్రాఫర్‌నూ ఆపి.. ఏ పేపరో అడిగి.. పేరు చెప్పమని.. ఐడెంటిటీ కార్డు చూపించమని గదమాయిస్తూ యథేచ్ఛగా స్వైరవిహారం చేశాయి. అప్పటికే మద్యం మత్తులో ఉన్న ఆ మూకలు కేకలు, కేరింతలు వేస్తూ సభా ప్రాంగణంలో చెలరేగిపోయాయి. ఈ క్రమంలో వాటి కంట శ్రీకృష్ణ పడ్డారు. కొందరు వైసీపీ కార్యకర్తలు.. ఆయన జేబులో బలవంతంగా చేతులు పెట్టి పర్సును బయటకు లాగారు. అందులోని ఐడెంటిటీ కార్డును చూస్తూ.. 'నువ్వు ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌వి కదా' అంటూ ఒక్కసారిగా ఆగ్రహంతో ఊగిపోయారు. తమ చేతుల్లోని వైసీపీ జెండా కర్రలతో శ్రీకృష్ణపై కర్రలతో పటపటా.. మని కొడుతూ, దెబ్బలవర్షం కురిపించారు. సిద్ధం సభా వేదిక నుంచి దాదాపు అర కిలోమీటరు వరకు కొట్టుకుంటూ తీసుకెళ్లారు. దెబ్బలను తప్పించుకోవడానికి అడ్డుపెట్టిన చేతులపై, కాళ్లపై కర్రలతో కొట్టారు. చేతులతో పిడిగుద్దులు గుద్దారు. తప్పించుకునే ప్రయత్నం చేసినా వదలకుండా.. వెంటాడారు. అక్కడున్న కొందరు శ్రీకృష్ణను వారినుంచి కాపాడటానికి ప్రయత్నించగా, వారిపైనా దాడిచేశారు. శ్రీకృష్ణ వంటిపై వాతలు తేలేలా కొడుతూనే ఉన్నారు. ఒకదశ వరకు ప్రతిఘటనకు ఆయన ప్రయత్నించారు. ఆ తర్వాత శ్రీకృష్ణ సొమ్మసిల్లిపడిపోయారు.

పోలీసులపైనా ప్రతాపం!

సొమ్మసిల్లిన శ్రీకృష్ణను అక్కడే ఉన్న ఓ సీఐ ఎత్తుకుని తన వాహనంలోకి ఎక్కించారు. శ్రీకృష్ణను తమకు అప్పగించాలంటూ కొందరు వైసీపీ కార్యకర్తలు వాహనానికి అడ్డుగా నిలబడ్డారు. సీఐపైనా దాడికి యత్నించారు. పోలీసు జీపుపై రాళ్లు రువ్వారు. శ్రీకృష్ణ వద్ద ఉన్న కెమెరా, సెల్‌ఫోన్, పర్సు సహా అన్నీ లాగేసుకున్నారు. వారిని ఎలాగోలా తప్పించుకుని పోలీసు వాహనం అక్కడ నుంచి కదిలింది. విషయం తెలియగానే పలువురు జర్నలిస్టులు, ఆంధ్రజ్యోతి సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణ ఆచూకీ కోసం సుమారు గంటపాటు ఆరాతీయాల్సి వచ్చింది. రాప్తాడు పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లినప్పుడు చివరకు గుర్తించారు. స్టేషన్‌కు అంతా చేరుకున్నారు. అక్కడ వారికి శ్రీకృష్ణ కనిపించారు. ఆయనను 'ఆంధ్రజ్యోతి' సిబ్బంది ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో అక్కడనుంచి ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న శ్రీకృష్ణను మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యేలు గోనుగుంట్ల సూర్యనారాయణ, ప్రభాకర్ చౌదరి, సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ తదితరులు పరామర్శించారు. కాగా, తీవ్రంగా గాయపడ్డ ఫొటో జర్నలిస్టును పోలీసులు ఆస్పత్రికి కాకుండా పోలీస్‌స్టేషన్‌కు తరలించడం విమర్శలకు దారి తీస్తోంది.



ముఖంపై పిడిగుద్దులు కురిపిస్తున్న వైసీపీ మూకలు

జగన్ సంస్థలో పని చేసే వారినీ రిస్క్‌లో పెట్టడమే: లోకేశ్

రాప్తాడు సిద్ధం సభలో 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసీపీ మూకలు దాడి చేయడాన్ని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తీవ్రంగా ఖండించారు. 'సిద్ధం సభ వద్ద ఫొటోలు తీయడం నిషిద్ధమా? నేరమా? ఇది మీడియాపై జగన్ చేయించిన ఫ్యాక్షన్ దాడి. ఒక పత్రిక, చానల్ యజమాని అయిన నువ్వు ఇటువంటి దాడుల్ని ప్రోత్సహించడం నీ సంస్థలో పని చేసే వారందరినీ రిస్క్‌లో పెట్టడమే' అని లోకేశ్ హెచ్చరించారు.

మీడియాపై దాడి దుర్మార్గం: అచ్చెన్న

ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన మీడియాను జగన్‌రెడ్డి కక్షతో కూలగొడుతున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆరోపించారు. 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ రౌడీమూకల దాడి దుర్మార్గమని మండిపడ్డారు. జగన్ సభలకు ఆయన కూలి, నీలి మీడియా తప్ప.. ఇంకెవరూ రాకూడదా? అని ప్రశ్నించారు. జగన్ అధికారంలోకి వచ్చాక మీడియాపై దాడులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడిని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, టీడీపీ మీడియా కోఆర్డినేటర్లు వెంకటరాముడు, గోళ్ల సతీశ్‌బాబు కూడా తీవ్రంగా ఖండించారు.

సీపీఎస్ నేతలపై ఉక్కుపాదం

▸▸ ఎక్కడికక్కడ నిర్బంధాలు, కేసులు

▸▸ 'చలో విజయవాడ' ఆపేసినా కర్కశత్వం

విజయవాడ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం(ఏపీసీపీఎస్‌ఈఏ) తలపెట్టిన 'చలో విజయవాడ-ఓట్ ఫర్ ఓపీఎస్' కార్యక్రమంపై పభుత్వం కర్కశత్వాన్ని ప్రదర్శించింది. దీనిని నిలుపుదల చేశామని చెప్పినా.. అగ్రనేతలు, ఇతర నాయకులపై ఆదివారం మధ్యాహ్నం వరకు నిర్బంధాన్ని కొనసాగించింది. ఏపీసీపీఎస్‌ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు కోరుకొండ సతీశ్, మాజీ అధ్యక్షుడు రొంగలి అప్పలరాజును అనకాపల్లి డీఎస్పీ చర్చలకని పిలిపించి బలవంతంగా అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. రాత్రి 9గంటల వరకు ఆఫీసులోనే కూర్చోబెట్టి, ఆ తర్వాత నోటీసుపై సంతకం పెట్టాలని ఒత్తిడి చేశారు. ప్రభుత్వం నుంచి కఠిన ఆదేశాలు ఉన్నందున ఇలా చేయాల్సి వస్తుందని, సంతకాలు చేయగానే వదిలేస్తామని బుజ్జగించారు. కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతుండటం తెలిసి నాయకులు సంతకాలు చేశారు. వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని, అక్కడే ఉండాలని పోలీసులు పేర్కొన్నారు. దీంతో ఇద్దరూ అక్కడే నిరాహార దీక్ష చేపట్టారు. ఆదివారం ఉదయం పెద్ద ఎత్తున ఉద్యోగులు వచ్చి ధర్నా చేయగా, 9.30 గంటల ప్రాంతంలో తెల్ల కాగితాలపై సంతకాలు పెట్టించుకుని వదిలేశారు.

విజయవాడలో నిర్బంధాలు

విజయవాడలో ఏపీసీపీఎస్‌ఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసు, సంఘం నేత రాంప్రసాద్‌ను చర్చల పేరుతో శనివారమే విజయవాడ పోలీసు కమిషనర్ పిలిచారు. ప్రభుత్వం సీరియస్‌గా ఉందని, ఆందోళనలకు అనుమతి లేదని చెప్పి పంపించారు. బయటకు రాగానే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లోనే ఉంచారు. రాత్రంతా దాసు, రాంప్రసాద్ అక్కడే నిరాహార దీక్ష చేపట్టారు. ఫోన్లు లాక్కుని స్విచ్చాఫ్ చేశారు. ఉదయం కూడా వారిని వదల్లేదు. మధ్యాహ్నం ఒంటిగంట తర్వాత తెల్లకాగితాలపై సంతకాలు చేయించుకుని వదిలేశారు. ఏపీసీపీఎస్‌ఈఏ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె. శ్యామ్‌బాబును గృహ నిర్బంధం చేశారు. అగ్రనేతలను, సీపీఎస్ ఉద్యోగులను నిర్బంధించడంపై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. జంగారెడ్డిగూడెం ఆర్‌డీవో కార్యాలయం దగ్గర పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. సీపీఎస్ ఉద్యోగులపై ప్రభుత్వ నిర్బంధం నశించాలని నినదించారు.

ప్రభుత్వానిది ద్వంద్వనీతి: సతీశ్

'ఓట్ ఫర్ ఓపీఎస్' పేరిట విజయవాడలో తాము తలపెట్టిన కార్యక్రమానికి తొలుత అనుమతులిచ్చి తర్వాత రద్దు చేశామని చెప్పడం ప్రభుత్వ ద్వంద్వనీతి, నిరంకుశత్వానికి నిదర్శనమని ఏపీ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ అసోసియేషన్(ఏపీసీపీఎస్‌ఈఏ) రాష్ట్ర అధ్యక్షుడు కోరుకొండ సతీశ్ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. విజయవాడ ధర్నాచౌక్‌లో ఏపీజేఏసీ ఆందోళనలకు పోలీసులే దగ్గరుండి నిరభ్యంతరంగా నిర్వహింపజేశారని, అదే స్థలంలో సీపీఎస్ ఉద్యోగుల కార్యక్రమానికి చివరి క్షణంలో అనుమతులు రద్దు చేయడం అప్రజాస్వామికమన్నారు. తనతో పాటు మాజీ అధ్యక్షుడు అప్పలరాజును అనకాపల్లిలో శనివారం మధ్యాహ్నం నుంచి అరెస్టు చేసి పలు కేసులు నమోదు చేయడం దారుణమని మండిపడ్డారు. ఏపీసీపీఎస్‌ఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీఎం దాసును, రాష్ట్ర కార్యదర్శి కె. రామ్‌ప్రసాద్‌లు అనుమతి కోసం పోలీస్ స్టేషన్‌కు వెళ్తే బలవంతంగా జీపు ఎక్కించి రహస్య ప్రదేశానికి తీసుకెళ్లారని, అక్కడ వారి ఫోన్లు లాక్కుని స్విచ్చాఫ్ చేశారని, ఆదివారం వదిలిపెట్టారని తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న ఈ దమనకాండను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అధికారంలోకి వచ్చిన వారంలోపే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని చెప్పి.. మాట మార్చి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరికాదన్నారు. ప్రతిపక్షాలు కూడా సీపీఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇవ్వాలని సతీశ్ కోరారు.

జగన్ అక్రమాస్తులు జప్తు చేస్తాం!



చంద్రబాబు హయాంలో ప్రశాంతమైన, సంతోషకరమైన నగరంగా గుర్తింపుపొందిన విశాఖలో ఇప్పుడు రోజుకో కుంభకోణం, కిడ్నాప్, హత్య జరుగుతున్నాయి.

గంజాయి విస్తరించడానికి వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు కారకుడు. తూర్పు గోదావరిలో దాని సాగును ప్రోత్సహించి పెద్దఎత్తున ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. లక్షల కుటుంబాలు నాశనమైపోయాయి.

జగన్ జలగలాంటి వాడు. సైలెంట్‌గా కృష్ణపట్నం, గంగవరం పోర్టులు కొట్టేశాడు. ఇప్పుడు కృష్ణపట్నం పోర్టులో పది వేల మంది కార్మికులను రోడ్డున పడేశాడు. - లోకేశ్



విశాఖ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని గోపాలపట్నం పెట్రోల్ బంకు సమీపంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన శంఖారావం సభకు హాజరైన జనం

▸▸ ముఖ్యమంత్రి తిన్నదంతా కక్కిస్తాం

▸▸ ఈ సీఎం పాపాలపుట్ట.. అబద్ధాలకోరు

▸▸ బెంగళూరు, హైదరాబాద్, తాడేపల్లి ప్యాలెస్‌లూ అవినీతి పునాదులపై కట్టినవే: లోకేశ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అనేక పాపాలు చేశారని, ఈ మధ్య పచ్చి అబద్ధాలు చెబుతున్నారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ఆరోపించారు. సొంతంగా టీవీ, పేపర్ లేవంటున్నారని, ఒకవిధంగా అది నిజమేనని.. ఎందుకంటే ఆ రెండు ప్రజల సొమ్ముతో ఏర్పాటు చేసినవేనని వ్యాఖ్యానించారు. రూ.లక్ష కోట్ల ప్రజాధనం లూటీ చేసి ఏర్పాటుచేసింది కాబట్టి భారతీ సిమెంట్స్ కూడా ప్రజలదేనన్నారు. బెంగళూరు, హైదరాబాద్, తాడేపల్లిలో ప్యాలెస్‌లు ఉన్నాయని.. అవి కూడా అవినీతి పునాదులపై కట్టినవేనని తెలిపారు. ప్రజల డబ్బుతో ఏర్పాటుచేసిన టీవీ, పేపర్, సిమెంట్ కంపెనీ, ప్యాలెస్‌లు మనవేనని.. టీడీపీ-జనసేన ప్రభుత్వం వచ్చిన వెంటనే వాటన్నింటినీ జప్తు చేస్తామని ప్రకటించారు. 'శంఖారావం' యాత్రలో భాగంగా ఆదివారం ఉదయం విశాఖ తూర్పు, దక్షిణ, పశ్చిమ నియోజకవర్గాల పరిధిలో జరిగిన సభల్లో ఆయన ప్రసంగించారు. జాబ్స్ కేపిటల్ ఆఫ్ ఇండియాగా టీడీపీ అభివృద్ధి చేసిన విశాఖను గంజాయి రాజధానిగా మార్చిన ఘనత సీఎం జగన్‌దేనని ఆరోపించారు. టీడీపీ-జనసేన ప్రభుత్వం వచ్చాక గంజాయిపై ఉక్కుపాదం మోపుతామని స్పష్టంచేశారు. యువగళం పాదయాత్రలో భాగంగా చంద్రగిరిలో ఒక తల్లి తనను కలిసిందని, తన కున్న ముగ్గురు కుమార్తెలలో పదో తరగతి చదువుతున్న పెద్దమ్మాయికి వైసీపీ నాయకులు గంజాయి అలవాటు చేసి శారీరకంగా వాడుకున్నారని కన్నీరు పెట్టడం మనసును కలచివేసిందన్నారు. గంజాయి రవాణా వెనుక ఎవరున్నారో బయటకు లాగి ఆ మహమ్మారి నుంచి ప్రజలను రక్షిస్తామని హామీ ఇచ్చారు. తప్పులు చేసిన అధికారులు, వైసీపీ నేతల పేర్లు రెడ్ బుక్‌లో ఉన్నాయని చూపిస్తూ.. తనను అరెస్టు చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. తానెక్కడకూ పారిపోలేదని, విశాఖలోనే ఉన్నానని లోకేశ్ తెలిపారు. ఇంకా ఏమన్నారంటే..

ఆ ఎంపీ నీతులు చెబుతున్నారు..

విశాఖ ఎంపీ సొంత కుటుంబ సభ్యులే కిడ్నాప్‌నకు గురికావడం చూశాం. అందుకు కారణమేమిటో ఆయనే చెప్పాలి. ఇప్పుడాయన కుటుంబం హైదరాబాద్ పారిపోయి బతుకుతున్న విషయం చెప్పకుండా మాకు నీతులు చెబుతున్నాడు. నగరంలో వైసీపీ నేతల భూదందాలకు అడ్డుచెబుతున్నారన్న కారణంతో తహసీల్దారు రమణయ్యను అతి కిరాతకంగా చంపేశారు. ఎవరైనా ప్రశ్నిస్తే ఆయనకు పట్టిన గతే పడుతుందని హెచ్చరికలు చేస్తున్నారు.

ఎవరు పేదవాడు?

రాష్ట్రంలో పేదలు, పెత్తందార్లకు మధ్య యుద్ధమని జగన్ తరచూ అంటున్నాడు. రూ.లక్షల కోట్లు ఆస్తి, రూ.లక్ష విలువైన చెప్పులు వేసుకుని, రూ.1,000 వాటర్ బాటిల్ తాగేవాడు.. బెంగళూరు, హైదరాబాద్, ఇడుపులపాయ, తాడేపల్లి, విశాఖల్లో ప్యాలెస్‌లు ఉన్న వ్యక్తి పేదవాడా? రెండు నెలల్లో జగన్మోహన్‌రెడ్డి అహంకారానికి, పేద ప్రజల ఆత్మగౌరవానికి మధ్య యుద్ధం జరుగబోతోంది.

కళాశాలల ఖాతాల్లోకి..

జగన్ అధికారంలోకి వచ్చాక ఇసుక అక్రమ వ్యాపారంతో రోజుకు రూ.3 కోట్ల వంతున ఐదేళ్లలో రూ.5,400 కోట్లు దోచుకున్నాడు. వెయ్యికి దొరికే ట్రాక్టర్ ఇసుక ఇప్పుడు ఏకంగా ఆరు వేలయింది. ఇప్పుడు ఏ పందికొక్కు ఇసుక తింటున్నాడో జగన్ చెప్పాలి. ఆయన అన్నం తినడం మానేసి ఇసుక తింటున్నాడు. రెండు నెలలాగితే ఆయన తిన్నదంతా కక్కిస్తాం. జగన్ నిలిపివేసిన విదేశీ విద్యను తిరిగి అందుబాటులోకి తెస్తాం. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కళాశాలల ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకుంటాం.

సంక్షేమానికి ఆద్యుడు ఎన్టీఆర్

వైసీపీ హయాంలో సుమారు 100 సంక్షేమ పథకాలను జగన్ రద్దు చేశాడు. పైగా వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు నిలిపివేస్తారని వలంటీర్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రంలో సంక్షేమానికి ఆద్యుడు నందమూరి తారకరామారావు. ఆయన తర్వాత చంద్రబాబు సుమారు 100 పథకాలు అమలుచేశారు. టీడీపీ-జనసేన ప్రభుత్వం వచ్చాక హైదరాబాద్‌కు దీటుగా విశాఖను అభివృద్ధి చేస్తాం. చంద్రబాబు హయాంలో ఆంధ్ర యూనివర్సిటీ అత్యుత్తమ పనితీరుతో జాతీయ స్థాయిలో 29వ స్థానంలో ఉండేది. ప్రసాదరెడ్డిని వైస్ చాన్సలర్ చేసిన తరువాత 76వ స్థానానికి దిగజారిపోయింది. ఆయన యూనివర్సిటీని ధ్వంసం చేస్తున్నాడు. బాలయ్య, పవన్‌ను చూస్తే జగన్‌కు అసూయ. అందుకే యాత్ర-2 తీశాడు. కానీ ఫస్ట్ షోకు కూడా జనాలు లేరు. జగన్ నవ్వు, మాట, నడక అంతా అబద్ధం. ఈ మధ్య జోకులు వేస్తూ జోకర్‌గా మారాడు. నేను ఐటీ మంత్రిగా ఉన్నప్పుడు అనేక కంపెనీలను తీసుకొచ్చాను. వాటిని కొనసాగించి ఉంటే ఇప్పటికి ఐదు లక్షల మందికి ఉద్యోగాలు వచ్చేవి. కానీ గుడ్డు మంత్రి ఆమ్లెట్లు వేసుకునే పనిలో ఉన్నాడు. ప్రజల కష్టాలు తీర్చేందుకు సూపర్ సిక్స్‌తో ప్రజలకు ముందుకు వస్తున్నాం. వారంతా మాకు అండగా ఉండాలి. పార్టీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేసిన అధికారులు, వైసీపీ నాయకుల పేర్లు రెడ్ బుక్‌లో ఉన్నాయి.

ఉత్తమ కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు

పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలకు రానున్న రోజుల్లో నామినేటెడ్ పదవులిస్తాం. 'బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ' కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన వారికి ఉత్తమకార్యకర్త అవార్డు అందించాం. ఈ అవార్డు కాగితం మాదిరిగా కనిపించవచ్చు. కానీ భవిష్యత్‌లో చంద్రబాబును, నన్ను కలిసేందుకు రాచమార్గంగా ఉపయోగపడుతుంది. ఈ అవార్డు గ్రహీతలు మమ్మల్ని కలవడానికి ఎప్పుడూ తలుపులు తెరిచే ఉంటాయి. రానున్న రెండు నెలలు కష్టపడి పనిచేసే వారికి మంచి అవకాశాలు కల్పిస్తాం.క్లస్టర్, బూత్ అధ్యక్షులకు 'సూపర్ సిక్స్' కిట్లు ఇచ్చాం. వాటిని ప్రజలకు అందించాలి. రానున్న రెండు నెలలు ప్రజల్లో ఉండాలి. టీడీపీకి భారీ మెజారిటీ వచ్చే సీట్లలో విశాఖ తూర్పు టాప్-3లో ఉండాలి.

అప్పన్నను దర్శించుకున్న లోకేశ్

సింహాచలం: లోకేశ్ ఆదివారం సింహాచలం లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. ఆయనకు దేవాలయ ఏఈవోలు భ్రమరాంబ, పాలూరి నరసింగరావు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆయన కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండప ప్రదక్షిణ చేసి అంతరాలయంలోకి వెళ్లారు. పూజల అనంతరం పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. డిప్యూటీ ఈవో ఎన్.సుజాత స్వామివారి చిత్రపటం జ్ఞాపిక, ప్రసాదాలను అందజేశారు. కాగా.. నందమూరి తారకరత్న ప్రథమ వర్ధంతి సందర్భంగా లోకేశ్ ఘనంగా నివాళులు అర్పించారు. తారకరత్న చిత్రపటానికి అంజలి ఘటించారు.

ఉత్తరాంధ్రను దోచేస్తున్నారు

ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని బొత్స సత్యనారాయణ, వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి కుటుంబాలకు జగన్ రాసిచ్చేశాడు. ఈ మూడు కుటుంబాల చేతుల్లోకి వేల ఎకరాలు వెళ్లాయి. అడ్డగోలుగా దోపిడీకి పాల్పడుతున్నారు. జగన్‌రెడ్డి ఏ ముహూర్తంలో విశాఖ రాజధాని అని అన్నాడో గానీ అప్పటి నుంచి ఇక్కడ ఇబ్బందులు మొదలయ్యాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా కెమికల్ ఫ్యాక్టరీలో లీకేజీలు ఏర్పడ్డాయి. బాయిలర్స్ పేలిపోయాయి. ఒక్క వ్యక్తి ఉండడానికి రూ.500 కోట్లతో ప్యాలెస్ కట్టుకున్నాడు. చంద్రబాబు ఇల్లు ఆ ప్యాలెస్‌లో బెడ్‌రూమ్ అంత ఉంటుంది. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖలో భూ కబ్జాలు, నేరాలు పెరిగిపోయాయి. ఆయన కటింగ్, ఫిటింగ్ మాస్టర్. బులుగు బటన్ నొక్కి పది రూపాయిలు ఇస్తే, రెడ్ బటన్ నొక్కి చార్జీల రూపంలో వంద రూపాయలు లాగేస్తున్నాడు.

అంతిమయాత్ర మొదలు..

జగన్మోహన్‌రెడ్డిని చూస్తే బిల్డప్ బాబాయ్ గుర్తుకొస్తున్నాడు. రూ.కోట్లు ఖర్చు పెట్టి యాత్ర-2 సినిమా తీసి, థియేటర్లకు జనాలను తీసుకొచ్చేలా టికెట్లు కొనుగోలు చేయాలని ఎమ్మెల్యేలకు టార్గెట్లు ఇచ్చారు. అయినా ఎవరూ సినిమా చూసేందుకు రావడం లేదు. వైసీపీ ఎమ్మెల్యేలకు అంతిమయాత్ర మొదలైంది. జగన్ అర్జునుడు, అభిమన్యుడు కాదు. ఆయనొక సైకో.. భస్మాసురుడు.. అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్.



యాక్సిల్ రాడ్ విరగడంతో రాజమహేంద్రవరంలో నడిరోడ్డుపై ఊడిపోయిన బస్సు చక్రాలు

రోడ్డుపైనే చక్రాలు ఊడి ధమాల్..!

▸▸ యాక్సిల్ రాడ్ విరిగి ఊడిపోయిన ఆర్టీసీ బస్సు చక్రాలు

▸▸ రాజమండ్రి వద్ద ప్రమాదం.. 65 మందికి తప్పిన ముప్పు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్ హయాంలో కాలం చెల్లిన ఆర్టీసీ బస్సులు మొండికేస్తున్నాయి. అయినా సరే తిరగాల్సిందే అని తిప్పుతుండడంతో.. నడిరోడ్డుపైనే చక్రాలు ఊడి పడిపోతున్నాయి. తాజాగా ఆదివారం కూడా తూర్పుగోదావరి జిల్లా గోకవరం డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు యాక్సిల్ రాడ్ విరిగిపోవడంతో ప్రమాదానికి గురైంది. డ్రైవర్ అప్రమత్తతతో పాటు, ప్రయాణికుల అదృష్టం కలిసిరావడంతో బస్సులోని 65 మంది సురక్షితంగా బయటపడ్డారు. తూర్పుగోదావరి జిల్లా గోకవరం డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు ఆదివారం గోకవరం నుంచి రాజమహేంద్రవరం బయలుదేరింది. సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో క్వారీ మార్కెట్ సమీపంలోని నరసింహస్వామి దేవాలయం దాటిన తర్వాత ఒక్కసారిగా పెద్ద శబ్దం చేస్తూ ఆగిపోయింది. దీంతో ప్రయాణికులు భయంతో కేకలు వేశారు. బస్సు దిగి చూడగా.. యాక్సిల్ రాడ్ విరిగి వెనుక ఎడమవైపు రెండు చక్రాలు ఊడిపోయి కొద్దిదూరం వెళ్లిపోయాయి. ఆ సమయంలో బస్సులో 65 మంది ప్రయాణికులున్నారు. ప్రమాద స్థలం వద్ద రోడ్డు కాస్త మెరకగా ఉండడంతో పాత బస్సు ఫుల్ లోడుతో నెమ్మదిగా ప్రయాణిస్తోంది. దీంతో యాక్సిల్ రాడ్ విరిగిన వెంటనే బస్సు నిలిచిపోయింది. ఇదే ప్రమాదం బస్సు వేగంగా ఉన్నప్పుడు జరిగితే దుర్వార్త వినాల్సి వచ్చేది. ఆర్టీసీలోని ప్రైవేటు బస్సులను మినహాయిస్తే కొన్ని ప్రభుత్వ బస్సులు ప్రయాణానికి ఏమాత్రం అనుకూలంగా లేకపోయినా అలాగే తిప్పుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రాణదాత ఈ పోలీస్!

▸▸ బైక్‌ను ఢీకొట్టి పంట కాల్వలోకి దూసుకెళ్లిన కారు

▸▸ ఏడుగురి ప్రాణాలు కాపాడిన ఏఆర్ కానిస్టేబుల్



నెల్లి శ్రీనివాస్



కారు నుంచి ప్రయాణికులను బయటకు తీసుకొస్తున్న నెల్లి శ్రీనివాస్

పి.గన్నవరం, ఫిబ్రవరి 18: అదుపుతప్పిన కారు మోటార్ సైకిల్‌ను ఢీకొట్టి పంటకాల్వలోకి దూసుకుపోయింది. ఆ కారులో ఉన్న ఏడుగురిని అటుగా వెళ్తున్న ఏఆర్ కానిస్టేబుల్ కాపాడారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం శివకోడు గ్రామానికి చెందిన కుటుంబం ఆదివారం రాజమహేంద్రవరంలో జరిగిన ఒక కార్యక్రమానికి హాజరైంది. వారంతా తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా పిగన్నవరం మండలం బెల్లంపూడి వద్ద కారు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్‌ను ఢీకొట్టి పంట కాల్వలోకి దూసుకెళ్లింది. తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నెల్లి శ్రీనివాస్ ఆదే సమయంలో అటుగా వెళ్తున్నారు. ఆయన వెంటనే స్పందించి పంటకాల్వలోకి దూకారు. కారు డోర్లు తెరిచి లోపల ఉన్న కసుకుర్తి భాస్కర సుధీర్‌కుమార్, భార్య కె.సింధు, పిల్లలు భాను, జయాన్ష, తల్లి కె.పార్వతి, అత్త బిక్కిన సూర్యకాంతం, మామ సుబ్బారాయుడును బయటకు తీసుకొచ్చి ఒడ్డున ఉన్న వలంటీర్ లక్ష్మణ్, స్థానికుల సాయంతో రక్షించారు. కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను ఎమ్మెల్యే చిట్టిబాబు, ప్రయాణికులు, వారి బంధువులు, స్థానికులు అభినందించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

మంచు దొంతరలు..

- నగరాన్ని వీడని మంచు.. పడిపోతున్న పగటి ఉష్ణోగ్రతలు
- ఉదయం పూట వాహనదారులకు తప్పని తిప్పలు
- మంచు దొంతరలతో సేదదీరుతున్న పాదచారులు

సాధారణంగా ఏజెన్సీ.. కొండ ప్రాంతాల్లో కనిపించే పొగమంచు కొద్ది రోజులుగా నగరాన్ని కమ్మేస్తోంది. ఉదయం సమయంలో మంచు తీవ్రత అధికంగా ఉండటంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్నింగ్ వాక్‌కు వెళ్లేవారు మంచుతో కొత్త అనుభూతిని పొందుతుండగా.. అక్కడక్కడ వాహనచోదకులకు దారి కానరాక ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఆదివారం తెల్లవారుజామున 4 గంటల నుంచే నగర వీధులను మంచు దుప్పటి కప్పేసింది. సెలవు కావడంతో పిల్లలు మంచులోనే ఆటలతో సేదదీరారు.





రామరాజభూషణుడి పాండిత్యం అపారం

- విగ్రహావిష్కరణలో కొనియాడిన వక్తలు



విగ్రహావిష్కరణలో ప్రసంగిస్తున్న రసరాజు

వన్‌టౌన్, ఫిబ్రవరి 18 : శ్రీకృష్ణ దేవరాయల కొలువులోని అష్టదిగ్గజాలలో ఒకరైన రామరాజ భూషణుడి పాండిత్యం అపారమని వక్తలు కొనియాడారు. రామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ తుమ్మపల్లివారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో రామరాజుభూషణుడి విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగింది. ట్రస్ట్ అధ్యక్షుడు కూరపాటి కోటంరాజు, ఏపీ భట్టరాజ కార్పొరేషన్ ఛైర్ పర్సన్ కూరపాటి గీతాంజలి, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, గజల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో రామరాజభూషణుడు రచించిన వసుచరిత్ర విశిష్టను చేగొండి సత్యనారాయణమూర్తి గానం చేశారు. అలంకార శాస్త్రం, శ్లేషలపై ఆయన రచనలు అద్భుతమని కొనియాడారు. కథ రచయిత కంఠ స్ఫూర్తి కవి సరికొండ నరసింహరాజు, సేవారత్న లోలభట్లు శ్రీనివాసరాజు, డాక్టర్ రమాదేవి తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా కురుక్షేత్రంలో ఒక ఘట్టాన్ని విజయషణ్ముఖి ఆధ్వర్యంలోని కళాకారుల బృందం ప్రదర్శించింది. ఈ సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో భట్రాజు విద్యార్థులకు ఉపకార వేతనాలను అందజేశారు.

రాష్ట్ర భవిష్యత్‌ను నాశనం చేస్తున్న సీఎం జగన్

- యునైటెడ్ ఫ్రంట్

ధర్నాచౌక్, ఫిబ్రవరి 18 : కేసుల వలలో చిక్కుకుని రాష్ట్ర భవిష్యత్‌ను సీఎం జగన్ నాశనం చేస్తున్నారని యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ ఎన్.దశరథరాంరెడ్డి ఆరోపించారు. గాంధీనగర్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. తనకు 25 మంది ఎంపీలను ఇస్తే కేంద్రం మెడలు వంచి రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధిస్తానన్న సీఎం జగన్ ఎందుకు సాధించలేదని ప్రశ్నించారు. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకు కృషి చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేసిన పార్టీలు రాబోయే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ప్రత్యేక హోదా జేఏసీ కన్వీనర్ మర్రి రాజా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మరో ఉద్దానంగా ఎ.కొండూరు!

- కిడ్నీ బాధితులకు కృష్ణాజలాలు సరఫరా చేయండి : దోనేపూడి

ధర్నాచౌక్, ఫిబ్రవరి 18 : ఎన్టీఆర్ జిల్లాలో ఎ.కొండూరు ప్రాంతం మరో ఉద్దానంగా మారనుందని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎ.కొండూరు ప్రాంత కిడ్నీ బాధితులతో కలిసి స్థానిక దాసరిభవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల అలసత్వం వల్ల ఎ.కొండూరు మండలంలోని 21 గ్రామ పంచాయతీలు, శివారు ప్రాంతాలైన తండాల ప్రజలు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారన్నారు. భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్ అధిక శాతం ఉండటంతో తాగునీరు కరువైందన్నారు. ఆయా ప్రాంతాలకు కృష్ణా జలాలను సరఫరా చేయాలన్నారు. కిడ్నీ బాధితులకు ప్రతీనెలా రూ. 10 వేల పింఛన్ ఇవ్వాలన్నారు. ఈ వ్యాధితో మృతి చెందిన వారి కుటుంబానికి రూ. 10 లక్షలు ప్రకటించాలని, రెండున్నర ఎకరాల సాగుభూమి ఇవ్వాలన్నారు. డయాలసిస్ సెంటర్‌లో పర్మినెంట్ డాక్టర్లను నియమించాలని డిమాండ్ చేశారు.



జ్యోతిని వెలిగిస్తున్న గద్దె అనురాధ, తదితరులు.

ఎప్పటికీ ఎన్టీఆర్ అభిమానినే : ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, ఫిబ్రవరి 18 : తాను ఎప్పటికీ నందమూరి తారక రామారావు అభిమానినేనని తూర్పునియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. గురునానక్ కాలనీలో ఓ హోటల్‌లో ఆదివారం నియోజకవర్గ తెలుగు ప్రొఫెషనల్ వింగ్, టౌన్ హాల్ కో-ఆర్డినేటర్ చలసాని ఫణిశ్రీ ఆధ్వర్యంలో టౌన్‌హాల్ సమావేశం జరిగింది. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుషలూరి ముకేశ్ తెరకెక్కించిన గద్దె రామ్మోహన్ రాజకీయ ప్రస్థానం లఘుచిత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ, తాను ఎప్పటికి నందమూరి తారక రామారావు అభిమానినేనని అన్నారు. తనకు జన్మనిచ్చింది తల్లిదండ్రులు అయితే రాజకీయంగా జన్మనిచ్చింది ఎన్టీఆర్ అన్నారు. సమావేశంలో ముస్లిం మైనార్టీల సంక్షేమానికి టీడీపీ ప్రభుత్వం ఏమి చేస్తుందని అబుల్ రషీద్ అడిగిన ప్రశ్నకు గద్దె సమాధానమిస్తూ. మైనార్టీలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీ అధికారంలోకి రాగానే మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, గంజాయి సరఫరా వంటి కార్యకలాపాలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్స్ బ్యాడ్మింటన్ రన్నరప్‌గా శ్రీదేవి, లక్ష్మీతనూజ



రైల్వేస్టేషన్, ఫిబ్రవరి18 : రాజమండ్రిలో ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాస్టర్స్ బ్యాడ్మింటన్ ఛాంపియనయన్‌షిప్ ఓపెన్ టోర్నమెంట్‌లో రైల్వే అధికారులు ఏడీఆర్ఎం డి.శ్రీనివాసరావు సతీమణి డి.శ్రీదేవి, సీనియర్ డీఈఈ ప్రసాదరావు సతీమణి లక్ష్మీతనూజలు 40 సంవత్సరాలు పైబడిన వయస్సు కేటగిరీలో ఏపీస్టేట్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీలో పాల్గొని మహిళల డబుల్స్‌లో రన్నరప్‌లుగా నిలిచారు. వీరిద్దరు ప్రీలిమ్స్ లీగ్ సెమీఫైనల్ మ్యాచ్‌లో విజేతలుగా నిలిచారు. ఎం.సుభాషిణీ, పి.ఉషశ్రీలను ఫైనల్‌లో ఓడించారు. శ్రీదేవి, లక్ష్మీతనూజలను విజయవాడ డివిజన్ ఆర్ఎం నరేంద్ర ఏ.పాటిల్, ఆయన సతీమణి మహిళా విభాగం చైర్మన్, వైస్ ప్రెసిడెంట్ వీరిని అభినందించారు.

నేడు స్పందన రద్దు

వన్‌టౌన్, ఫిబ్రవరి 18 : ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమాన్ని సోమవారం రద్దు చేసినట్టు జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో అధికారులకు కలెక్టరేట్‌లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కారణంగా స్పందనను రద్దు చేసినట్టు తెలిపారు. అన్ని స్థాయిలలో కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు, అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని పేర్కొన్నారు.



టిడ్కో ఇళ్ల వద్ద ధర్నా చేస్తున్న బోడె ప్రసాద్, టీడీపీ నాయకులు

టీడీపీ వచ్చాక ఆరు నెలల్లో

లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు

- పెనమలూరు టీడీపీ ఇన్‌చార్జి బోడె ప్రసాద్

ఉయ్యూరు, ఫిబ్రవరి 18 : ఉయ్యూరులో టిడ్కో ఇళ్ల లబ్ధిదారులను మరోసారి మోసగించేందుకు వైసీపీ, గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్ ఎత్తుగడను వేశారని పెనమలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ బోడె ప్రసాద్ ఆరోపించారు. ఉయ్యూరులో టిడ్కో ఇళ్ల దీనస్థితిని ఆదివారం టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించి మంత్రి జోగి రమేశ్, ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో మంత్రి లబ్ధిదారులను మరోసారి కొత్తనాటకంతో మోసం చేసేందుకు తెరలేపినట్టు తెలియవచ్చిందన్నారు. వైసీపీ మోసపూరిత ఎత్తుగడలను లబ్ధిదారులు నమ్మ వద్దన్నారు. పార్టీ నాయకులు గుర్నాథరావు, యెనిగళ్ల కుటుంబరావు, ఆకునూరు సర్పంచ్ గోలి వసంతకుమార్, ఉయ్యూరు మాజీ ఛైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు, అబ్దుల్ ఖుద్దూస్, 10వ వార్డు కౌన్సిలర్ పలి యాల శ్రీనివాస రావు, నజీర్, చిరంజీవి, జగరోతు నాగరాజు, కూనపరెడ్డి వాసు, కుటుంబరావు, యుగ బాబు, పరిమి భాస్కర్, పడమట వెంకటేశ్వరరావు, అంజిబాబు, అను మోలు ప్రభాకర్, బూరెల నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంస్కార భారతి సంస్థ అధ్యక్షుడు కృష్ణ

ముగిసిన శాస్త్రీయ నృత్య పోటీలు

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 18 : సంస్కార భారతి, సుమధుర కళానికేతన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి శాస్త్రీయ నృత్య పోటీలు ఆదివారంతో ముగిశాయి. రెండు రోజులపాటు జరిగిన పోటీల్లో సుమారుగా 1000 మంది కళాకారులు పాల్గొన్నారు. విజేతలకు పారిశ్రామికవేత్త కోగంటి సత్యం, సంస్కార భారతి సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పీవీఎన్ కృష్ణ, పసుమర్తి భాస్కరశర్మ, కోగంటి జగన్నాథరావు, దుర్గా శ్రీనివాస్ బహుమతి ప్రదానం చేశారు. గ్రూపు క్లాసికల్‌లో శివజ్యోతి గ్రూపు ప్రథమ, భారతీయ భారతి నృత్య అకాడమీ ద్వితీయ, కళాక్షేత్ర డ్యాన్స్ అకాడమీ తృతీయ బహుమతులు సాధించాయి. కూచిపూడి జూనియర్స్ విభాగంలో జి.ప్రవస్తి, రియాన్షిక, భువన ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. సీనియర్స్ విభాగంలో సాయివర్షిత, మీనశ్రీ, సాయి దుర్గాదేవి, సబ్‌జూనియర్స్‌లో యశ్వవర్థిక, రోషిత, పార్థివి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. ఫోక్‌గ్రూపులో బిందు జోషిత బృందం, లహరి డ్యాన్స్ ఫీట్ బృందం, తేజస్విని బృందం, భరతనాట్యం జూనియర్స్‌లో ఎన్.సాహితి, సీహెచ్ బాలలక్ష్మీదుర్గ, జాహ్నవి మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. సబ్‌జూనియర్స్ విభాగంలో కైవల్య, సాయి రుత్వి, పరిమిత, సీనియర్స్ విభాగంలో గాయత్రి, హర్షిత, సాయిసృజన బహుతులు అందుకున్నారు.

మామిడికి తెగుళ్లు!

- మామిడి దిగుబడిపై రైతుల ఆందోళన
- తేనె మంచు, కోడిపేను తెగుళ్లతో మాడిపోతున్న పూత
- తోటల వైపు కన్నెతి చూడని ఉద్యానశాఖ అధికారులు



తెగుళ్లతో మాడిపోతున్న పూత

విజయవాడ రూరల్, ఫిబ్రవరి 18 : మరో నెల రోజుల్లో మామిడి సీజన్ ఆరంభం కానుండగా, కాయ దిగుబడిపై రైతులు దిగాలు చెందుతున్నారు. మామిడి చెట్లకు పూర్తిస్థాయిలో పూత వచ్చినప్పటికీ, తేనె మంచు, కోడిపేను తెగుళ్లతో దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో నూజివీడు తరువాత విజయవాడ రూరల్ మండలం నున్నలోనే సుమారు 2500 ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. ఒకవైపు రైతులు చెట్లకు ఆశించిన తెగుళ్లతో ఆందోళన చెందుతున్నా, సంబంధిత అధికారులు కన్నెతి చూడకపోవడం గమనార్హం. మామిడి సీజన్‌లో కనీసం రెండు మూడు పర్యాయాలు రైతులకు తోటల నిర్వాహణపై అవగాహన సదస్సులు నిర్వహించాల్సి ఉంది. అయితే ఒక్కసారి సదస్సు నిర్వహించడం కూడా ఉద్యాన అధికారులకు గగనంగా మారింది. ఫలితంగా తెగుళ్ల నివారణ చర్యలు తెలియక రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తేనెమంచు, కోడిపేను తెగుళ్ల వలన మామిడి పూత పూర్తిగా మాడిపోవడంతో పిందెలు రాలిపోతున్నాయని రైతులు చెబుతున్నారు. గ్రామ సచివాలయాలలో ప్రత్యేకంగా ఉద్యాన సిబ్బంది ఉన్నప్పటికీ, రైతులకు అందుబాటులో ఉండటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మామిడిని ఆశిస్తున్న తెగుళ్ల నివారణకు చేపట్టాల్సిన చర్యలు వివరించాలని రైతులు కోరుతున్నారు.

అత్యాధునిక టెక్నాలజీతో..

త్రీఎం కార్ కేర్ స్టూడియో ప్రారంభం

భారతీనగర్, ఫిబ్రవరి 18 : ఎన్టీఆర్ కాలనీ మెయిన్ రోడ్డులో నూతనంగా అత్యాధునిక టెక్నాలజీతో ఏర్పాటు చేసిన త్రీఎం కార్ కేర్ స్టూడియోను ప్రముఖులు కనుమూరి సత్యనారాయణరాజు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వర్క్‌షాప్ అధినేత అజయ్ వర్మ మాట్లాడుతూ, బాష్ కార్ సర్వీస్ భాగస్వామ్యంతో హంటర్ వీల్ కేర్ టెక్నాలజీ, మల్టీ-బ్రాండ్ కార్ సర్వీస్ అత్యాధునిక సేవలు తమ వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఏపీ ఆక్వా డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధ్యక్షుడు కె.భాస్కర్‌రాజు, జాతీయ అధ్యక్షుడు ఐవీఆర్ మోహన్‌రాజు, వైస్‌చైర్మన్ వడ్డి రాఘురాం, ప్రముఖులు వాసిరెడ్డి నాగార్జున, షోరూం యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.





వర్క్‌షాప్ ప్రారంభిస్తున్న కనుమూరి సత్యనారాయణరాజు, త్రీఎం కార్ కేర్ స్టూడియో (పైన)

దాడి చేసిన వారిపై హత్యాయత్నం

కేసు నమోదు చేయాలి

- జేబీఎన్‌పీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

విజయవాడ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) : రాప్తాడులో సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై విచక్షణారహితంగా దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయ న ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైసీపీ శ్రేణులు చేసిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. భారీ సభల్లో మీడియాకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం ఉందని స్పష్టం చేశారు. అటువంటిది సీఎం సభలోనే ఈవిధంగా దాడి చేస్తే ఎలా అని ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

విద్యార్థిని ఆత్మహత్య!

వన్‌టౌన్. ఫిబ్రవరి 18 : ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆదివారం విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన కృష్ణలంకలో జరిగింది. కృష్ణలంక బాలాజీనగర్ ఓగిరాల సాయిబాబా వీధికి చెందిన సర్గం పూజిత (16) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలు తండ్రి వెంకటదుర్గా ప్రసాద్ ఫిర్యాదు మేరకు కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, వెంకటదుర్గాప్రసాద్ ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడికి భార్య కుమార్తె, కుమారుడు ఉన్నారు. పూజిత విజయవాడలో ఒక ప్రైవేట్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్ చదువుతోంది తల్లిదండ్రులు గన్నవరంలో జరిగిన కార్యక్రమానికి వెళ్లగా.. మధ్యాహ్నా సమయంలో పూజిత ఇంటికి వచ్చింది. సాయంత్రం 5 గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చిన తండ్రి తలుపులు వేసి ఉండడాన్ని గమనించి, కిటికీ లోంచి చూడగా కుమార్తె ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించింది. సమాచారం పోలీసులు సంఘటన ప్రదేశానికి చే రుకుని వివరాలు నమోదు చేశారు. పూజిత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్త జీజీహెచ్‌కు తరలించారు.

చికిత్స పొందుతూ..

ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ సుమారు 52 సంవత్సరాల వయస్సుగల వ్యక్తి మృతి చెందాడు. ఆదివారం కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పండిట్ నెహ్రూ బస్సు స్టేషన్ 45వ ప్లాట్ పారం వద్ద వ్యక్తి ఫిట్స్ వచ్చి పడిపోవడంతో సమాచారం తెలుసుకున్న ఆర్టీసీ అధికారులు 108 ద్వారా చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు పంపించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు, అతని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు.

అంగన్వాడీల పోరాటాల్లో రాష్ట్రం రెండోస్థానం

ఉంగుటూరు, ఫిబ్రవరి 18 : సమస్యల సాధనకు జాతీయస్థాయిలో అంగన్వాడీలు చేసే పోరాటాల్లో రాష్ట్రం రెండో స్థానంలో వుందని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ అన్నారు. పెదఅవుటపల్లిలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గన్నవరం ప్రాజెక్ట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన సభలో ముఖ్య అతిథిగా హాజరైన సుబ్బరావమ్మ మాట్లాడుతూ, అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించే విషయంలో మొండిగా వ్యవహరించిన రాష్ట్ర ప్రభుత్వం మెడలు వంచి కోర్కెలు సాధించుకున్న అంగన్వాడీ వర్కర్లు, మినీవర్కర్లు, హెల్పర్లు అందరికీ విప్లవాభివందనాలు తెలియజేశారు. చర్చలద్వారా వేతనాలు పెంచలేమని తేల్చిచెప్పిన ప్రభుత్వం, విధులకు హాజరవకపోతే తీవ్రపరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించినా బెదరకుండా సమ్మె కొనసాగించామని, దీంతో ఎస్మా ప్రయోగించి, షోకాజ్ నోటీసులతో భయపెట్టేందుకు ప్రయత్నించిందని, అయినా మొక్కవోని దీక్షతో మన కోర్కెలు సాధించుకున్నామని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను లిఖితపూర్వకంగా మినిట్స్‌లో వ్రాయించిందని, ఈ ప్రభుత్వం మారినా వచ్చే ప్రభుత్వం ప్రతి హామీని అమలు పరిచేవిధంగా లెటర్‌లో పేర్కొందన్నారు. సమష్టిపోరాటంతో సాధించుకున్న ఘన విజయమని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ

యూనియన్ జిల్లా కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ, అంగన్వాడీ సెంటర్ల తాళాలు పగలగొట్టిన సందర్భాల్లో లబ్ధిదారుల సహకారం మరువలేనిదన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రవి, కౌలురైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ లక్ష్మణస్వామి, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా సహాయ కార్యదర్శి అజ్మీర్ వెంకటేశ్వరరావు, సీఐటీయూ నాయకులు కళ్లం వెంకటేశ్వరరావు, కడవకొల్లు రామరాజు, బేత శ్రీనివాసరావు, బడగు మరియదాసు, బుద్ధవరం సర్పంచ్ బడుగు బాలమ్మ, అంగన్వాడీ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పండిట్ నెహ్రూ బస్టాండ్ వద్ద

చీకటిపడితే రెచ్చిపోతున్నారు..

- పట్టించుకోని అధికారులు
- పెచ్చుమీరుతున్న ఆగడాలు

గుణదల : స్థానిక సిటీ బస్టాండ్ వద్ద జోరుగా చీకటి వ్యాపారం జోరుగా సాగుతోంది. రోజూ రాత్రి 8 గంటల నుంచి అర్ధరాత్రి 2 గంటల వరకు ఇతర ప్రాంతాల నుంచి యువతులు అక్కడికి చేరుకుని యువకులకు ఎరవేస్తున్నారు. ఇంత బహిరంగంగా వ్యభిచారం జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అటు చీకటి వ్యాపారాలు.. ఇటు బ్లేడ్ బ్యాచ్.. గంజాయి బ్యాచ్‌ల ఆగడాలు పెచ్చురిల్లిపోతున్నాయి. గుణదల పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల వెలుగు చూసిన మహిళ హత్య దీనికి నిదర్శనం. రాత్రిపూట పోలీసు గస్తీ పెంచడం, అనుమానితులను, యువతను నిలదీస్తే.. ఇటువంటి ఘటనలు పునరావృతం కావన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. బెంజి సర్కిల్, రామవరప్పాడురింగ్ రోడ్డు, ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్, బస్టాండ్, రైల్వే స్టేషన్ వంటి రద్దీ ప్రదేశాల్లో యువతులు ఎక్కువగా సంచరిస్తున్నారు. వీరిని వెంటాడి పట్టుకునేందుకు యువకులు మోటారు బైక్‌లపై మద్యం సేవించి వాహనాలు నడపడం కూడా ప్రమాదంగా ఉందని నగరవాసులు పేర్కొంటున్నారు.

సరిహద్దుల్లో దొంగ చెవులు

- ఉగ్ర చొరబాట్లు ఎక్కువగా జరుగుతున్న పీవోకే భూభాగంలో టెలికామ్ టవర్లు
- పెద్దఎత్తున ఏర్పాటు చేస్తున్న పాక్

జమ్మూ, ఫిబ్రవరి 18 : పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో (పీవోకే) ఇటీవల పెద్దఎత్తున టెలికామ్ టవర్ల ఏర్పాటుపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సరిహద్దు వెంట ఉన్న పీవోకే భూభాగంలో ఈ టవర్ల నిర్మాణం కొనసాగుతోంది. అదీ భారత్‌లోకి చొరబాట్లు ఎక్కువగా చోటుచేసుకుంటున్న చోట్లే వీటి నిర్మాణం జరుగుతోంది. పీవోకే చాన్నాళ్లుగా ఉగ్రవాద కార్యకలాపాలకు అడ్డాగా ఉన్న విషయం తెలిసిందే. దీంతో టెలికామ్ టవర్ల వల్ల ఉగ్రవాద సంస్థలు బలపడతాయని, చొరబాట్లు పెరుగుతాయని భారత సైనిక, నిఘా వర్గాలు హెచ్చరిస్తున్నాయి. ఈ వర్గాల సమాచారం ప్రకారం... మన బలగాలు సరిహద్దుల్లో వాడే రేడియో సెట్లు, స్మార్ట్‌ఫోన్ల సంభాషణలను దొంగచాటుగా వినడానికి 'వైఎస్ఎంఎస్' అనే అత్యున్నత టెక్నాలజీని ఉగ్రవాద సంస్థలు వినియోగిస్తున్నాయి. దక్షిణ జమ్మూ పరిధిలోని పీర్ పంజల్ రేంజ్‌లో ఇటీవల జరిగిన ఉగ్రవాద దాడులు, కొన్ని చొరబాటు ఘటనలను విశ్లేషించినప్పుడు ఈ విషయం బయటపడింది. 'వైఎస్ఎంఎస్' వ్యవస్థను సరిహద్దుల వెంట మరింత విస్తరించడంలో భాగంగా టెలికామ్ టవర్ల నిర్మాణం పీవోకేలో పెంచేవారు. వీటి నిర్మాణం కోసం పాక్ ప్రభుత్వం స్పెషల్ కమ్యూనికేషన్ ఆర్గనైజేషన్ అనే సంస్థను ఏర్పాటుచేసింది. పాకిస్థాన్ సైనికాధికారి మేజర్ జనరల్ ఉమర్ అహ్మద్ షా స్వయంగా ఆ సంస్థను నడిపిస్తున్నారు. భారత్‌లో ఉగ్రవాద చర్యలను ప్రోత్సహిస్తున్న ఐఎస్ఐతో ఉమర్ కలిసి పనిచేస్తున్నారని చెబుతున్నారు. వాస్తవానికి దేశాల సరిహద్దుల వెంట టెలికమ్యూనికేషన్ల విషయంలో అంతర్జాతీయ చట్టాలు ఉన్నాయి. ఐక్యరాజ్యసమితి అనుబంధ ఇంటర్నేషనల్ టెలికమ్యూనికేషన్ యూనియన్ (ఐటీయూ) 45వ నిబంధనను పాక్ ఉల్లంఘించి టెలికాం టవర్లను ఏర్పాటుచేస్తోంది. మన సైనిక, నిఘా వర్గాలు మండిపడుతున్నాయి. తదుపరి కార్యాచరణకు సిద్ధమవుతున్నాయి.

గుడ్డు మీద ఈకలు పీకే మంత్రి!

- అమర్నాథ్‌పై పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ ఫైర్



అమరావతి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కోడు గుడ్డు మీద ఈకలు పీకే మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు కాంగ్రెస్‌ను విమర్శించే హక్కులేదని పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ ఆగ్రహం వ్యక్తం చేశారు. చిల్లర రాజకీయాలు చేసేది వైసీపీయేనని ఆదివారం ఓ ప్రకటనలో విమర్శించారు. ఐదేళ్లలో డీఎస్సీ విడుదల చేయాలని కోరుతున్నా.. మరో రెండు నెలల్లో ఎన్నికలు ఉన్న సమయంలో 25,000 ఖాళీలకు కాకుండా 6,100 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం దగా కాదా? అని నిలదీశారు. విభజన హామీలు కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. వైసీపీ సర్కారు నిరుద్యోగులతో సహా అన్నివర్గాలనూ మోసగించిందని విమర్శించారు.

సీమకు జగన్ పెట్టిన ఖర్చు 0.7శాతమే!

- బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ ట్వీట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): జగన్ సర్కారు గత ఐదేళ్లలో సాగు నీటి పారుదల రంగంపై రాయలసీమలో పెట్టిన ఖర్చు బడ్జెట్‌లో 0.7శాతమేనని బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ తెలిపారు. ప్రధానమంత్రి నీటి పారుదల యోజన(యాక్సిలరేటెడ్ ఇరిగేషన్ బెనిఫిట్ ప్రోగ్రాం) కింద నిధులు ఇవ్వడానికి కేంద్రం ప్రతిపాదనలు పంపమంటే, జగన్ ప్రభుత్వం పంపిన 7 ప్రాజెక్టులలో ఒక్కటి కూడా రాయలసీమ ప్రాంతం నుంచి లేదని సత్యకుమార్ ఆదివారం ట్వీట్ చేశారు. రాయలసీమపై, అక్కడి రైతాంగంపై జగన్‌కు అంత కోపమెందుకని ప్రశ్నించారు. పులివెందుల పులి అని చెప్పుకొనే జగన్ తన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

పద్మావతి మహిళా యూనివర్సిటీకి రూ.100 కోట్ల రూసా నిధులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 18: తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీకి పీఎం ఉష (రూసా) నిధులు రూ.100 కోట్లు మంజూరయ్యాయి. దీనిపై వర్సిటీ వీసీ భారతి, రిజిస్ట్రార్ రజని హర్షం వ్యక్తం చేశారు. 40 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర ఉన్న వర్సిటీ.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందని తెలిపారు. ఇప్పటికే అనేక గొప్ప ర్యాంకులను సాధించిందని గుర్తు చేశారు. యూజీసీ నాక్ ఏప్లస్ పొందడం వల్లే రూసా నిధులకు ఎంపికైనట్టు పేర్కొన్నారు. ఈ నిధులతో వర్సిటీలో బోధన, పరిశోధనకు సంబంధించిన సదుపాయాలను మెరుగుపరుస్తామని వెల్లడించారు.



వీఆర్ఏల రిలే దీక్షలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

వీఆర్ఏల రిలే నిరహార దీక్షలు ప్రారంభం

- రేపటిలోగా ప్రభుత్వం స్పందించకుంటే నిరవధిక సమ్మె

విజయవాడ (ధర్నాచౌక్), ఫిబ్రవరి 18: రీసర్వేల పేరుతో వీఆర్ఏలపై మోపుతున్న అదనపు భారాన్ని తొలగించాలని, తొలగించిన టీఏ, డీఏలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.అంజి, ఉమామహేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 7న అధికారులకు సమ్మె నోటీసు ఇచ్చామని, 20 లోగా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరించాలని, లేదంటే నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో విజయవాడ ధర్నాచౌక్‌లో వీఆర్ఏల రెండు రోజుల రిలే నిరహార దీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. దీక్షలను ప్రారంభించిన ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వీఆర్ఏలకు తెలంగాణలో అమలవుతున్న విధంగా పే స్కేల్ జీతాలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎంపీలో ఒకేచోట వందలాది ఆవుల కళేబరాలు

- ఇంకా తెలియరాని కారణాలు

భోపాల్, ఫిబ్రవరి 18: మధ్యప్రదేశ్‌లోని సిల్లియర్‌పూర్ గ్రామం సమీపంలోని అడవి వద్ద వందలాది ఆవుల కళేబరాలు కనిపించడం సంచలనం కలిగించింది. ఇందుకుగల కారణాలు తెలియరాలేదు. ఇవేమైనా వ్యాధితో చనిపోయాయా? ఎక్కడ నుంచి తీసుకొచ్చి పడేశారు? తదితర సమాచారమేమీ వెల్లడి కాలేదు. రాత్రిపూట సమీపంలోని పట్టణాల నుంచి తీసుకొచ్చి ఇక్కడ పడేసినట్టు గ్రామస్థులు అనుమానిస్తున్నారు. కనీసం 400-500 ఆవుల కళేబరాలు అక్కడ పడి ఉన్నాయని, దీనిని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆ గ్రామ ప్రధాన్ చెప్పారు. సమీపంలోని కరైరా మున్సిపాలిటీలో చనిపోయిన ఆవులను తీసుకొచ్చి ఇక్కడ పడేస్తుంటారని స్థానిక పశువైద్యుడు డాక్టర్ వాదిల్ జాతవ్ చెప్పారు. తీవ్రమైన చలి కారణంగా ఆ ఆవులన్నీ చనిపోయి ఉండవచ్చని పోలీసులు తెలిపారు. చనిపోయిన జంతువులను సల్లియపూర్ గ్రామం అడవి వద్ద పడేస్తుంటామని మున్సిపాలిటీ కార్మికులు కూడా చెప్పారని వివరించారు.


అమెరికాలో కాల్పులు.. ఇద్దరు పోలీసుల మృతి

బర్న్స్‌విల్లె, ఫిబ్రవరి 18: అమెరికాలో గుర్తు తెలియని దుండగుల కాల్పుల్లో విధుల్లో ఉన్న ఇద్దరు పోలీసులు మృతిచెందారు. మిన్నెసొటాలో ఓ కుటుంబం ప్రమాదంలో ఉందంటూ బర్న్స్‌విల్లె పోలీసులకు ఆదివారం వేకువజామున ఓ ఫోన్ కాల్ వచ్చింది. వెంటనే స్పందించిన ఇద్దరు పోలీసులు, అత్యవసర విభాగానికి చెందిన ఓ అధికారి ఆ ఇంటికి వెళ్లారు. అక్కడ గుర్తు తెలియని వ్యక్తులు వారిపై కాల్పులు జరిపారు. దీంతో ఆ ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. కాగా ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

తెలుగుగంగ నీళ్లకు..
పాఠ్యపుస్తకాలకు ముడి..!

- తమిళనాడు న్యూస్‌ప్రింట్‌కు 200 కోట్ల బకాయిలు
- తెలుగుగంగ నీళ్ల సొమ్ముతో సర్దుకోవాలని ఏపీ సూచన
- బకాయిలు చెల్లించకుండానే కొత్త టెండర్లకు పిలుపు
- తమిళనాడు న్యూస్‌ప్రింట్ లిమిటెడ్ తీవ్ర అభ్యంతరం
- పెద్ద కాంట్రాక్టర్లకు మేలు చేసేలా ప్రభుత్వ నిర్ణయం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)



పిల్లల పుస్తకాలకు సరఫరా చేసిన కాగితానికి... తెలుగు గంగ నీళ్లకు జగన్ ప్రభుత్వం ముడిపెట్టింది. కాగితం డబ్బులు ఇవ్వాలని తమిళనాడు నిలదీయగానే, తెలుగు గంగ ద్వారా చెన్నై నగరానికి ఇచ్చే నీళ్లతో సర్దుబాటు చేసుకోవాలని మెలిక పెట్టింది. అంటే పిల్లల పుస్తకాలకు కావాల్సిన కాగితానికి ఇచ్చేందుకు కూడా తమ వద్ద నిధులు లేవని చేతులెత్తేసింది. అది కూడా ఏడాది కాలంగా బకాయిపెట్టి, తమకు డబ్బులివ్వకుండా ఇతర మార్గాల ద్వారా కాగితం ఎలా తీసుకుంటారని తమిళనాడు న్యూస్‌ప్రింట్ లిమిటెడ్ (టీఎన్‌పీఎల్) ప్రశ్నించడంతో ఈ నిర్ణయం తీసుకుంది. టీఎన్‌పీఎల్ రాష్ట్ర జ్యుడీషియల్ ప్రివ్యూకు లేఖ రాయడంతో ఈ మేరకు స్పందించింది.

విధానం మార్చిన ప్రభుత్వం

రాష్ట్రంలోని పాఠశాలల విద్యార్థుల పాఠ్య పుస్తకాలకు అవసరమైన కాగితాన్ని దశాబ్దకాలం పైగా టీఎన్‌పీఎల్ సరఫరా చేస్తోంది. ఒప్పందం లేకపోయినా అదొక ఆనవాయితీగా ఉంది. జగన్ ప్రభుత్వం వచ్చాక తరచూ సరఫరా చేసిన కాగితానికి నిధులు చెల్లించడంలో జాప్యం జరిగింది. ప్రస్తుత విద్యా సంవత్సరానికి గతేడాది సరఫరా చేసిన కాగితానికి ఇంతవరకూ ఏపీ ప్రభుత్వం నగదు చెల్లించలేదు. అయితే వచ్చే విద్యా సంవత్సరానికి అవసరమైన కాగితాన్ని టీఎన్‌పీఎల్ నుంచి కాకుండా ప్రింటర్లే సమకూర్చుకోవాలనే నిబంధనతో ఇటీవల టెండర్లు పిలిచింది. దీనిపై తమిళనాడు ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తంచేసింది. ఏపీకి ఎప్పటినుంచో తామే కాగితం సరఫరా చేస్తున్నామని, పైగా బకాయిలు చెల్లించకుండా ఇలా ఏకపక్ష నిర్ణయం ఎలా తీసుకుంటారని ప్రశ్నిస్తూ ఏపీ జ్యుడీషియల్ ప్రివ్యూకు లేఖ రాసింది. తమకు బకాయిపడిన రూ.199.68 కోట్లు చెల్లించకుండా కాగితం విషయంలో టెండర్లు పిలవడం సరికాదని తప్పుబట్టింది. గతేడాది 16,514 టన్నుల కాగితం సరఫరా చేసినట్లు తెలిపింది.

నీళ్లకు బదులుగా తీసుకోండి

ఏపీ నుంచి చెన్నైకు తెలుగు గంగ ద్వారా తాగు నీరు సరఫరా అవుతుంది. టీఎన్‌పీఎల్ కాగితం డబ్బులు అడగటంతో ఇప్పుడు ఏపీకి తెలుగు గంగ గుర్తుకొచ్చింది. టీఎన్‌పీఎల్ అభ్యంతరంపై పాఠశాల విద్యాశాఖ స్పందిస్తూ... "ఇప్పటికే తమిళనాడు ముఖ్యమంత్రికి ఏపీ సీఎం సమాచారం పంపారు. కాగితం బకాయిలకు బదులుగా తెలుగు గంగ నిధులు సర్దుబాటు చేసుకోవాలని ప్రతిపాదించారు. 2023 మార్చి నాటికి తెలుగు గంగ తాగునీటికి తమిళనాడు ప్రభుత్వం రూ.345 కోట్లు చెల్లించాల్సి ఉంది. వాటిని కాగితం బకాయిలకు సర్దుబాటు చేసుకోండి" అంటూ జ్యుడీషియల్ ప్రివ్యూకు ఇచ్చిన సమాధానంలో

చిన్న ప్రింటర్లకు కష్టం

సుదీర్ఘకాలంగా ప్రభుత్వ పాఠ్యపుస్తకాల ముద్రణపైనే చిన్న ప్రింటర్లు ఆధారపడ్డారు. సుమారు 75 మంది ప్రింటర్లు ప్రతి ఏటా ప్రభుత్వ పాఠ్యపుస్తకాల ముద్రణ చేస్తున్నారు. వారికి ప్రభుత్వం కాగితం ఇస్తే పుస్తకాలు ముద్రించి ఇస్తారు. అయితే టీఎన్‌పీఎల్‌తో వివాదం కారణంగా ప్రభుత్వం ఈసారి కాగితం కూడా సమకూర్చుకోవాలనే నిబంధన పెట్టింది. అది చిన్న ప్రింటర్లకు సాధ్యంకాదు. దీంతో పెద్ద పెద్ద ప్రింటింగ్ సంస్థలే ఈ టెండర్లలో పాల్గొనే వీలుంది. దీంతో చిన్న ప్రింటర్ల మనుగడ కష్టమయ్యే పరిస్థితి వచ్చింది. అలాగే దేశవ్యాప్తంగా కాగితం ధర తగ్గిపోతున్నా గతేడాది తరహాలోనే ఈ ఏడాది కూడా పేజీకి 34.2 పైసలు ఇచ్చేలా ప్రభుత్వం ప్రతిపాదించింది. పదో తరగతి ఫిజికల్ సైన్స్ పుస్తకానికి పేజీకి 39పైసలుగా పేర్కొంది. మొత్తం మొత్తం 4.78 కోట్ల పుస్తకాలకు రూ.253.75కోట్లు అవుతుందని అంచనా వేసింది. ఇంత పెద్ద కాంట్రాక్టును ఇప్పుడు కొందరు కావాల్సిన కాంట్రాక్టర్లకు అప్పగించేలా పాఠశాల విద్యాశాఖ వ్యవహరిస్తోంది. రూ.10కోట్ల టర్నోవర్ అనే నిబంధన పెట్టడంతో చిన్న ప్రింటింగ్ సంస్థలు టెండర్లలో అర్హతను కోల్పోయాయి.



పొద్దుతిరుగుడు
ధర ఢమాల్

- ప్రభుత్వ 'మద్దతు' క్వింటా 6,760
- వ్యాపారుల కొనుగోలు ధర 3,200

అమరావతి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పొద్దు తిరుగుడు (సన్‌ఫ్లవర్) విత్తనాలకు కనీస మద్దతు ధర దక్కడం లేదు. 2023-24 ఖరీఫ్ సీజన్‌లో క్వింటాకు రూ.6,760గా కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించింది. కానీ కర్నూలు, ఆదోని వంటి మార్కెట్లలో సగం ధర కూడా రావట్లేదని రైతులు వాపోతున్నారు. గత నవంబరులో రూ.4,700 దాకా ఉన్న ధర ఇప్పుడు రూ.3,200లోపే పలుకుతోంది. మూడు నెలల్లోనే క్వింటాకు రూ.1,500దాకా తగ్గింది. సాధారణంగా పొద్దుతిరుగుడు పంట రాయలసీమ ప్రాంతంలోనే ఎక్కువగా సాగవుతుంది. ఈ ఏడాది తీవ్ర వర్షాభావం కారణంగా పంట సాగు తగ్గింది. ఖరీఫ్ సీజన్‌లో 13 వేల ఎకరాల్లో వేయాల్సిన పొద్దుతిరుగుడు పంట కేవలం ఏడున్నర వేల ఎకరాల్లో సాగైంది. రబీలో 25 వేల ఎకరాల్లో వేయాల్సిన పొద్దుతిరుగుడు 5 వేల ఎకరాల్లోనే సాగైంది. ఈ ఏడాది సాగు, ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. దేశవ్యాప్త డిమాండ్ దృష్ట్యా దుకాణాల్లో లీటర్ సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.200పైనే పలుకుతోంది. కానీ రాష్ట్రంలో పొద్దుతిరుగుడు విత్తనాలకు కనీస మద్దతు ధర కూడా ఇవ్వడం లేదు. దీంతో గిట్టుబాటుకావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కనీస మద్దతు ధర కంటే తక్కువకు రైతులు అమ్ముకోవాల్సి వచ్చినప్పుడు... మార్కెట్ జోక్యంతో రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేసి, ధరల స్థిరీకరణ నిధి కింద రైతులకు చెల్లింపులు జరుపుతామని జగన్ సర్కార్ ప్రగల్భాలు పలికింది. కానీ పొద్దుతిరుగు పంట విషయంలో ప్రభుత్వం చోద్యం చూస్తోందని రైతులు మండిపడుతున్నారు.

ఓఎంఆర్ షీట్లతో సీయూఈటీ-యూజీ!

పరీక్ష విధానంలో ఎన్‌టీఏ కీలక మార్పులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: దేశ వ్యాప్తంగా యూనివర్సిటీల్లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఉమ్మడి విశ్వవిద్యాలయ ప్రవేశ పరీక్ష(సీయూఈటీ)-యూజీలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) కీలక మార్పులు చేసే అవకాశం ఉంది. కంప్యూటర్ ఆధారిత విధానం నుంచి ఈ ఏడాది హైబ్రిడ్ విధానానికి మారడంతో పాటు విద్యార్థి ఎంచుకొనే సబ్జెక్టుల సంఖ్యను 10 నుంచి 6కు పరిమితం చేయాలని నిర్ణయించింది. అధిక సంఖ్యలో రిజిస్ట్రేషన్లు వచ్చిన సబ్జెక్టులకు నీట్ తరహాలో ఓఎంఆర్ షీట్లు ఉపయోగించి పెన్, పేపర్ విధానంలో పరీక్షలు నిర్వహించనుంది. తద్వారా దేశ వ్యాప్తంగా అన్ని ప్రధాన సబ్జెక్టులకు ఒకేరోజు పరీక్షలు పూర్తవుతాయని యూజీసీ ఛైర్మన్ ఎం. జగదీశ్ కుమార్ వెల్లడించారు. తక్కువగా రిజిస్ట్రేషన్లు నమోదైన సబ్జెక్టులకు యథావిధిగా కంప్యూటర్ ఫార్మాట్‌లోనే పరీక్ష ఉంటుందని తెలిపారు. ఈ నిర్ణయంతో అభ్యర్థులు దూరప్రాంతాలకు వెళ్లకుండా తమకు సమీపంలో ఉండే విద్యాసంస్థల్లోనే పరీక్ష కేంద్రాన్ని ఎంచుకోవచ్చని పేర్కొన్నారు. ప్రధాన సబ్జెక్టుల జాబితాలో ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ, మేథమేటిక్స్, ఫిజిక్స్, బయాలజీ, కెమిస్ట్రీ, హిస్టరీ, పొలిటికల్ సైన్స్ ఉన్నాయి. గతేడాది సీయూఈటీ-యూజీకి 14లక్షల మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకోగా, వీటిలో అత్యధిక దరఖాస్తులు ఇంగ్లీష్‌కు వచ్చాయి. ఆ తర్వాత స్థానాల్లో హిందీ, ఉర్దూ ఉన్నాయి. సీయూఈటీ-యూజీ రెండో ఎడిషన్ మే 15 నుంచి 31 వరకూ జరగనుంది. ఈ పరీక్షకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వచ్చేవారం ప్రారంభిస్తారు. పరీక్ష పేపర్ల ఫార్మాట్, మార్కింగ్ విధానంలో ఎలాంటి మార్పులు ఉండవు.

బీజేపీలోకి వెళ్తే.. చెప్తాగా!

- మధ్యప్రదేశ్ మాజీ సీఎం కమల్‌నాథ్ పునరుద్ఘాటన
- తాను ఎవ్వరితోనూ మాట్లాడలేదని వెల్లడి

న్యూఢిల్లీ, భోపాల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): తాను బీజేపీలో చేరేటట్లయితే.. మీడియాకు తెలియజేస్తానని కాంగ్రెస్ సీనియర్ నేత, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ పునరుద్ఘాటించారు. తాను, తన కుమారుడు, చింద్వారా ఎంపీ నకుల్‌నాథ్ బీజేపీలో చేరనున్నట్టు వస్తున్న వార్తలపై ఆయన శనివారం కూడా పైవిధంగానే స్పందించారు. 'అలాంటిది ఏమైనా ఉంటే మీ అందరికీ తెలియజేస్తానని నిన్ననే చెప్పాను. నేను ఎవరితోనూ మాట్లాడలేదు' అన్నారు. నకుల్‌నాథ్ తన ఎక్స్ ఖాతా ప్రొఫైల్ నుంచి 'కాంగ్రెస్'ను తొలగించిన విషయం తెలిసిందే. కాగా, కమల్‌నాథ్‌ను రాజ్యసభకు పంపకపోవడంపై ఆయన అసంతృప్తితో ఉన్నట్టు సమాచారం. అలాగే, గతేడాది మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమి పాలైనప్పటి నుంచి రాహుల్‌గాంధీ కూడా కమల్‌నాథ్ పట్ల అసంతృప్తితో ఉన్నట్టు తెలిసింది. మరోవైపు కమల్‌నాథ్ వర్గం ఎమ్మెల్యేలు ఆరుగురు ఆదివారం ఢిల్లీకి చేరుకొన్నారు. వారిలో చింద్వారా పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని ముగ్గురు ఎమ్మెల్యేలు ఉన్నారు. వారెవరూ ప్రస్తుతం ఫోన్‌కాల్స్‌కు స్పందించడం లేదు. మాజీ మంత్రి లఖన్ గంగోరియా కూడా వారితోపాటే ఢిల్లీలో మకాం వేసినట్టు కాంగ్రెస్‌లోని కొందరు చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమి అనంతరం పీసీసీ అధ్యక్ష పదవి నుంచి తొలగించిన తీరు కమల్‌నాథ్‌ను బాధించిందని, ఆయనకు తగిన గౌరవం దక్కాలని మాజీ మంత్రి దీపక్ సక్సేనా పేర్కొన్నారు. కమల్‌నాథ్ అనుచరుడైన మరో మాజీ మంత్రి విక్రం వర్మ తన ఎక్స్ ఖాతా ప్రొఫైల్‌లో 'జై శ్రీరామ్' అని రాశారు. బీజేపీ అధికార ప్రతినిధి నరేంద్ర సలూజా కూడా సోషల్ మీడియాలో కమల్‌నాథ్, నకుల్‌నాథ్‌ల ఫొటోను ఉంచి, క్యాప్షన్‌గా 'జై శ్రీరామ్' అని రాశారు. కాగా, అనర్హత వేటు నుంచి తప్పించుకునేందుకు కనీసం 23 మంది ఎమ్మెల్యేలను సమీకరించాలని కమల్‌నాథ్ వర్గం భావిస్తున్నట్టు కొందరు చెబుతున్నారు. అసెంబ్లీలో మొత్తం 230 సీట్లు ఉండగా, కాంగ్రెస్‌కు 66 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. మూడో వంతు ఎమ్మెల్యేలు పార్టీ మారితే, వారికి ఫిరాయింపుల నిరోధక చట్టం వర్తించబోదని మధ్యప్రదేశ్ హైకోర్టు లాయర్ రాకేశ్ పాండే తెలిపారు.

అంతా మీడియా సృష్టే: దిగ్విజయ్!

కమల్‌నాథ్ బీజేపీలోకి వెళ్తున్న విషయాన్ని 'మీడియా సృష్టి' అంటూ మధ్యప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడు జీతు పట్వారీ, మాజీ సీఎం దిగ్విజయ్ సింగ్ తోసిపుచ్చారు. కమల్‌నాథ్ రాజకీయ జీవితాన్ని నెహ్రూ-గాంధీ కుటుంబంతోనే ప్రారంభించారని, ఆయన పార్టీని వీడబోరని దిగ్విజయ్ సింగ్ చెప్పారు. కమల్‌నాథ్‌కు కాంగ్రెస్‌తో దశాబ్దాల అనుబంధం ఉందని జీతు పట్వారీ తెలిపారు.

ఫోన్, నంబరు మార్చేసినా..
సైబర్ నేరగాళ్ల గుప్పిట్లోనే ఖాతా!

- 3నెలల క్రితం ఓ రిటైర్డ్ ఉద్యోగి ఫోన్‌కు మేసేజ్
- లింక్ క్లిక్ చేసి.. కేవైసీ అప్‌డేట్ చేసుకోవాలని సారాంశం
- పాన్ నంబరు, ఓటీపీ చెప్పడంతో 9.38 లక్షలు గాయబ్
- మిగిలిన డబ్బును కాపాడేందుకు బాధితుడి ఖాతా ఫ్రీజ్
- కొత్త ఫోన్, కొత్త నంబరు తీసుకొని లింక్ చేశాకే అన్‌ఫ్రీజ్
- రెండ్రోజులకు ఖాతాల్లోంచి 6.38 లక్షలు కొల్లగొట్టిన నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): అప్పటికే ఆ పెద్దాయన్ను బురిడీ కొట్టించిన సైబర్ నేరగాళ్లు క్షణాల్లో లక్షల్లో డబ్బు కొట్టేశారు. కొంత విగిలివుండటంతో ఆ డబ్బునైనా కాపాడేందుకు వెంటనే ఖాతాను స్తంభింపజేశారు! ఇది జరిగి మూడు నెలలైంది! బ్యాంకు సిబ్బంది, పోలీసుల సూచన మేరకు ఆ పెద్దాయన తన ఫోన్‌ను మార్చారు. పాత నంబరును పక్కన పడేసి కొత్త నంబరుతో కూడిన సిమ్ తీసుకున్నాడు. ఆ తర్వాతే ఖాతాను అన్ ఫ్రీజ్ చేశారు! చిత్రం ఏమిటంటే.. ఇది జరిగిన రెండ్రోజుల్లోనే ఆ పెద్దాయన ఖాతాలోంచి మిగిలిన డబ్బూ పోయింది! మొత్తంగా మూడు నెలల్లో రూ.15.76 లక్షలు సైబర్ నేరగాళ్ల పాలయ్యాయి. మూడు నెలల క్రితం కేవైసీ అప్‌డేట్ చేసుకోవాలనే లింక్‌ను పంపితే దాన్ని క్లిక్ చేసి.. ఓటీపీ షేర్ చేస్తే డబ్బు పోతే.. తాజాగా ఇలాంటివేవీ జరక్కపోయినా లక్షల్లో డబ్బు పోవడంపై సైబర్ క్రైం పోలీసులే ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. బాధితుడు నగరంలో ఉంటున్న కేంద్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగి. భార్యతో కలిసి ఉంటున్నాడు. నెల నెలా వచ్చే పింఛను డబ్బు యూనియన్ బ్యాంకు ఖాతాలో పడుతోంది. మూడు నెలల క్రితం ఆయన ఫోన్‌కు ఒక ఎస్సెమ్మెస్ వచ్చింది. 'కింద ఉన్న లింక్‌ను క్లిక్ చేసి మీ బ్యాంకు ఖాతా కేవైసీ అప్‌డేట్ చేసుకోండి లేదంటే మీ ఖాతా బ్లాక్ అవుతుంది' అనేది దాని సారాంశం. బ్యాంకు నుంచి వచ్చినట్లుగానే మెసేజ్ ఉండటంతో చూసిన ఆయన భార్య.. లింక్ ఓపెన్ చేసింది. అక్కడ వారు అడిగిన వివరాలతో పాటు.. పాన్‌కార్డు అప్‌డేట్ చేసింది. ఓటీపీలు ఎంటర్ చేసింది. కొద్దిసేపటి తర్వాత విడతలవారీగా ఆ పెద్దాయన ఖాతాలోంచి 9.38లక్షలు కట్ అయ్యాయి. కంగుతిన్న వృద్ధ దంపతులు వెంటనే బ్యాంకుకు వెళ్లి ఆరా తీశారు. అది సైబర్ నేరగాళ్ల పని అని, బురిడీ కొట్టించి మోసపూరితమైన లింకులు పంపి, అది ఓపెన్ చేయగానే ఖాతాను హ్యాక్ చేసి డబ్బులు దోచేశారని వారికి సిబ్బంది చెప్పారు. తాము బ్యాంకు నుంచి ఎలాంటి మెసేజ్‌లు పంపలేదని స్పష్టం చేశారు. అక్కడి నుంచి ఆ దంపతులు.. సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. పోలీసులు 1930కు కాల్ చేసి సైబర్ నేరగాళ్ల డబ్బులు బదిలీ చేసుకున్న ఖాతాలను ఫ్రీజ్ చేయించారు. అవసరాలకు డబ్బు అవసరం పడటంతో.. ఇటీవల బాధితులు పోలీసుల వద్దకు వెళ్లి ఫ్రీజ్ చేసిన తమ బ్యాంకు ఖాతాను అన్ ఫ్రీజ్ చేయాలని కోరారు. సైబర్ నేరగాళ్లు మళ్లీ డబ్బు దోచేయకుండా ఉండాలంటే కొత్త ఫోన్ తీసుకోవాలని, పాత సిమ్‌ను మార్చేసి.. కొత్త ఫోన్ నంబరును తీసుకోవాలని చెప్పడంతో బాధితులు అలాగే చేశారు. కొత్త నంబరును బ్యాంక్ ఖాతాకు లింక్ చేసిన తర్వాతే పోలీసుల అనుమతితో బ్యాంకు ఖాతాను అన్‌ఫ్రీజ్ చేయించారు. అయితే బ్యాంకు ఖాతా తిరిగి ఓపెన్ చేసిన రెండు రోజుల్లోనే సైబర్ నేరగాళ్లు బాధితులతో ఎలాంటి సంబంధం లేకుండానే ఎలాంటి మెసేజ్‌లు, ఓటీపీలు రాకుండానే ఖాతాలో ఉన్న మరో 6.38లక్షలు నాలుగు విడతల్లో సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టారు. వృద్ధ దంపతులు అప్రమత్తమయ్యేలోపే ఆ డబ్బంతా సైబర్ నేరగాళ్లు పదుల సంఖ్యలో వివిధ ఖాతాలకు మళ్లించారు. ఫలితంగా సైబర్ క్రైమ్ సిబ్బందికి ఫ్రీజ్ చేసే అవకాశం లేకుండా చేశారు. అయితే ఫోన్ నంబర్ మార్చినా, సిమ్ మార్చినా, ఫోన్ మార్చినా ఖాతాలో డబ్బులు సైబర్ నేరగాళ్లు ఎలా కొల్లగొట్టారో అంతు చిక్కడంలేదని పోలీసులు అంటున్నారు. అయితే తమ ప్రమేయం లేకుండా ఖాతా నుంచి పోయిన డబ్బుకు బ్యాంకు అధికారులు బాధ్యత వహించి తిరిగి రీ ఫండ్ చేయాల్సిన అవసరం ఉంటుందని వృద్ధ దంపతులు అంటున్నారు. మూడు నెలల క్రితం ఫిర్యాదు ఇచ్చినా ఇప్పటి వరకు సైబర్ నేరగాళ్లపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, కనీసం వారిని కనిపెట్టే ప్రయత్నం చేయకపోవడంపై బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మేడారానికి హెలికాప్టర్ సేవలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మేడారం మహా జాతరకు వెళ్లాలనుకునే భక్తుల కోసం హెలికాప్టర్ సేవలూ అందుబాటులోకొచ్చాయి. హెలిటాక్సీ సంస్థ తెలంగాణ ప్రభుత్వం, బెంగళూరుకు చెందిన తుంబీ ఏవియేషన్ సహకారంతో హెలికాప్టర్ సేవలను అందించేందుకు సిద్ధమైంది. జాతర మొదలయ్యే ఈనెల 21 నుంచి 25వ తేదీ దాకా హెలికాప్టర్ సేవలు అందించనుంది. హన్మకొండ నుంచే రోడ్డు మార్గం ద్వారా మేడారానికి వెళ్లేందుకు 4-5 గంటలు పడుతుండటంతో జాతరకు త్వరగా వెళ్లి రావాలనుకునే భక్తులు హైదరాబాద్, హన్మకొండ నుంచి ఈ హెలికాప్టర్ సేవలు వినియోగించుకోవచ్చు. ఈ రెండు చోట్ల నుంచి మేడారానికి హెలికాప్టర్‌లో వెళ్లడమే కాకుండా అక్కడ 7 నిమిషాల పాటు ఆకాశం నుంచి జాతరను వీక్షేందుకు 'జాయ్‌రైడ్'ను కూడా హెలిటాక్సీ ఏర్పాటు చేసింది. టికెట్ల వివరాలను ఆ సంస్థ ఆదివారం వెల్లడించింది. హన్మకొండ- మేడారం-హన్మకొండ షటిల్ సర్వీసుల్లో ఒక్కరికి రూ.28,999 టికెట్ ధర ఉంది. ఈ ప్రయాణంలో భక్తులు హన్మకొండ నుంచి బయలుదేరి మేడారానికి హెలికాప్టర్‌లో దిగొచ్చు. అక్కడ వీఐపీ దర్శనం అనంతరం తిరిగి హన్మకొండలో దింపుతారు. అలాగే మేడారంలో ఏరియల్ వ్యూ (జాయ్‌రైడ్) కింద 7 నిమిషాలపాటు గాలిలో తిప్పేందుకు ఒక్కొక్కరికి రూ.4,300 తీసుకుంటారు. హైదరాబాద్ నుంచి మేడారానికి కూడా ప్యాకేజీని ప్రకటించారు. ఆరు సీట్ల సామర్థ్యం కలిగిన చాపర్‌లో ఒక్కరికి రూ.95,833 టికెట్ ధర ఉందని సంస్థ వెల్లడించింది. బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి హెలికాప్టర్‌ను నడిపించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు చెప్పారు. ఈమేరకు WW-W.HELITAXII.COM వెబ్‌సైట్‌లోకి వెళ్లి టికెట్లను బుకింగ్ చేసుకోవచ్చునని, వివరాల కోసం 74834-32752, 94003-99999 నంబర్లలో సంప్రదించవచ్చుని సంస్థ తెలిపింది.



సముద్రంలో బాంబుల పేలుడు

నేటి నుంచి మిలాన్-2024

విశాఖ తీరానికి చేరుకున్న విదేశీ నౌకలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మిత్ర దేశాలతో సంబంధాలు మెరుగుపరుచుకోవడానికి, సహాయ సహకారాలు ఇచ్చిపుచ్చుకోవడానికి రెండేళ్లకోసారి భారత నౌకాదళం నిర్వహిస్తున్న మిలాన్‌కు సర్వం సిద్ధమైంది. విశాఖపట్నం వేదికగా సోమవారం 'మిలాన్-2024' ప్రారంభం కానుంది. ఈ నెల 27 వరకు కొనసాగే ఈ విన్యాసాల కోసం 50 దేశాల నుంచి ప్రతినిధులు, 20కి పైగా యుద్ధనౌకలు, విమానాలు వస్తున్నాయి. వీటిలో కొన్ని ఇప్పటికే విశాఖపట్నం హార్బర్‌కు చేరుకున్నాయి. మిలాన్ తొలి దశ (హార్బర్ ఫేజ్)లో భాగంగా అన్ని దేశాల నౌకా దళాలు కలసి ఆర్‌కే బీచ్‌లో ఇంటర్నేషనల్ సిటీ పెరేడ్ నిర్వహిస్తాయి. మిలాన్ పేరుతో ఒక గ్రామాన్ని కూడా ఏర్పాటుచేస్తున్నారు. అందులో నేవీకి సంబంధించిన అనేక అంశాలు ప్రదర్శిస్తారు. ఆ తర్వాత వరుసగా ఇంటర్నేషనల్ మేరీటైమ్ సదస్సు, మిలాన్ ప్రదర్శన ఉంటాయి. రెండో దశ (సీ ఫేజ్)లో వివిధ దేశాల నేవీ దళాలు సముద్రంలో, గగనతలంలో విన్యాసాలు ప్రదర్శిస్తాయి. సబ్‌మెరైన్లపై పోరాటం, ఆకాశంలో లక్ష్యాలను ఛేదించడం వంటివి ఉంటాయి. ఈ కార్యక్రమాలకు ఉపరాష్ట్రపతి, గవర్నర్‌ను అతిథులుగా ఆహ్వానించారు. రక్షణ శాఖ మంత్రి కూడా హాజరవుతారు.

మిలాన్ రిహార్సల్స్

మిలాన్-2024కి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పలు దేశాల నుంచి నేవీ సిబ్బంది, అతిథులు వచ్చేశారు. ఇంటర్నేషనల్ సిటీ పెరేడ్‌లో భాగంగా నేవీ శక్తి సామర్థ్యాలు తెలియజేసే సాహస ప్రదర్శనల కోసం ఆదివారం ఆర్‌కే బీచ్‌లో రిహార్సల్స్ చేశారు. సముద్రంలో చిక్కుకున్న వారిని హెలికాప్టర్‌లో వచ్చి రక్షించడం, తీరాన పొంచి ఉన్న శత్రు మూకలపై జెమినీ బోట్లపై వెళ్లి దాడిచేసి మట్టుబెట్టడం వంటి ప్రదర్శనలు చేశారు. సీహాక్ హెలికాప్టర్లు, సీకింగ్‌లు, నిఘా విమానాలు ఆకాశంలో చక్కర్లు కొట్టాయి. ఆర్‌కే బీచ్ రోడ్డులో వివిధ దేశాల నౌకాదళాలతో పెరేడ్ నిర్వహించారు.



హెలికాప్టర్ నుంచి తాడు సాయంతో బోటులోకి దిగుతున్న సిబ్బంది